సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 16+20 వెల: ₹5.00
సంపుటి: 11
సంచిక: 287

సోమవారం 7-1-2019

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


'సంక్షేమ పథకాలతో ఎప్పటికీ ప్రజల మనస్సుల్లో ఉండిపోతాం'


ఏడాది మారింది... మరి మీరు?
కాలానికి అనుగుణంగా పెట్టుబడులు. స్టాక్ మార్కెట్లలో పెరిగిన అస్థిరతలు -బిజినెస్‌లో


గెలుపు ఘడియ వచ్చేసింది
ఆసీస్‌పై సిరీస్ విజయానికి చేరువగా భారత్ -స్పోర్ట్స్‌లో

నాలుగున్నరేళ్లలో సీఎం చంద్రబాబు అండ్ కో అక్రమాలపై 'అవినీతి చక్రవర్తి' పుస్తకం విడుదల చేస్తున్న ప్రతిపక్ష నేత వైఎస్ జగన్. చిత్రంలో పార్టీ నేతలు భూమన తదితరులు



బాబు అవినీతిపై విచారణ

- టీవీ9 ప్రత్యేక ఇంటర్వ్యూలో వైఎస్ జగన్
- నాలుగున్నరేళ్ల అవినీతిపై ఆధారాలెన్నో ఉన్నాయి
- అధికారంలోకి రాగానే దర్యాప్తు సంస్థలకు అప్పగిస్తాం
- వచ్చే ఎన్నికల్లో ఒంటరిగానే పోటీచేస్తాం
- ఎవరో ఒకరి భుజాలపై ఎక్కాలని అనుకోను..
- చంద్రబాబు, పవన్ ముసుగు తొలగించి పోటీచేయాలి
- బాబు అండ్ కోకు ప్రజలు బుద్ధిచెప్పబోతున్నారు..
- కేసీఆర్‌ను ఎప్పుడూ కలవలేదు..
- మొన్న ఎన్నికల్లో గెలిచాక ఫోన్‌లో అభినందించా..
- ఎల్లో మీడియా సాయంతో బాబు గోబెల్స్ ప్రచారం
- హోదాపై అందరూ మోసం చేశారు..
- కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ, పవన్ అందరూ దోషులే..

సీఎం చంద్రబాబు నాలుగున్నరేళ్లుగా అంతులేని అవినీతికి పాల్పడ్డారని, తాము అధికారంలోకి రాగానే ఆ కుంభకోణాలన్నిటిపైనా సమగ్రమైన విచారణ జరిపిస్తామని ప్రతిపక్షనేత, వైఎస్సార్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైఎస్ జగన్ సంచలన ప్రకటన చేశారు. టీవీ 9 చానెల్‌కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబు అవినీతికి చాలా ఆధారాలే ఉన్నాయని, వాటన్నిటినీ దర్యాప్తు సంస్థలకు అప్పగిస్తామని జగన్ స్పష్టం చేశారు. అనితర సాధ్యమైన రీతిలో ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకు ప్రజాసంకల్పం పేరుతో జగన్ చేస్తున్న పాదయాత్ర ముగింపు దశకు వచ్చిన నేపథ్యంలో ఆయనను టీవీ 9 ఇంటర్వ్యూ చేసింది. తనపై వచ్చిన అనేక ఆరోపణల గురించి మాట్లాడుతూ అవి ఎల్లో మీడియా సాయంతో చంద్రబాబు అండ్ కో చేస్తున్న గోబెల్స్ ప్రచారమే తప్ప మరొకటి కాదని తిప్పి కొట్టారు. తానేమిటో తన స్వభావం ఎలాంటిదో తనతో పనిచేస్తున్న తమ పార్టీ నాయకులకు, తమ పార్టీ కార్యకర్తలకు తెలుసునని జగన్ పేర్కొన్నారు. ఇంకా అనేక అంశాలపై జగన్ తన అభిప్రాయాలను, ఆలోచనలను విస్పష్టంగా వివరించారు.

ఇంటర్వ్యూ పూర్తి పాఠం 10, 11 పేజీల్లో..

నాలుగున్నరేళ్లలో చంద్రబాబు దోపిడీ

6.17 లక్షల కోట్లు

అవినీతి చక్రవర్తి పుస్తకాన్ని విడుదల చేసిన ప్రతిపక్ష నేత వైఎస్ జగన్

- రాజధాని ముసుగులో 'రియల్' దందా
- అంతులేని భూ దోపిడీలు..
- సాగునీటి ప్రాజెక్టుల్లో కమీషన్ల వరద
- సహజ వనరులు సైతం అడ్డగోలుగా ఆక్రమణలు
- నీరు - చెట్టు పేరుతో అస్మదీయులకు వేల కోట్ల బిల్లులు
- బినామీలకే పోలవరం పనులు
- అగ్రిగోల్డ్ ఆస్తులను కొట్టేసేందుకు పక్కా స్కెచ్
- చంద్రబాబు దోపిడీ పాలనను పుస్తక రూపంలో ఎండగట్టిన వైఎస్సార్‌సీపీ

గణాంకాలు, జీవోలు, నోట్‌ఫైళ్లు సహా పలు ఆధారాలతో పుస్తకం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో సీఎం చంద్రబాబు పాలనలో సాగించిన అక్రమాల విలువ మొత్తం రూ.6.17 లక్షల కోట్లు దాటిపోయిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కుండబద్దలు కొట్టింది. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ జరగనంత దోపిడీ బాబు గత నాలుగున్నరేళ్ల ఏలుబడిలో సాగిందని ఎండగట్టింది. వివిధ రంగాల్లో సాగిన అక్రమాలను గణాంకాలతో వివరిస్తూ జీవోలు, నోట్ ఫైళ్లను కూడా ఆధారాలుగా చూపించింది. ఈ భాగోతాలన్నింటినీ ప్రజల దృష్టికి తీసుకెళ్లేందుకు వైఎస్సార్‌సీపీ రూపొందించిన 'అవినీతి చక్రవర్తి' పుస్తకాన్ని ప్రతిపక్ష నేత, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదివారం ఉదయం శ్రీకాకుళం జిల్లా లక్కవరం క్రాస్ వద్ద పాదయాత్ర శిబిరంలో విడుదల చేశారు. వివిధ రంగాల్లో బాబు బ్యాచ్ సాగించిన అక్రమాలపై వైఎస్సార్‌సీపీ శోధించి వెలికితీసిన అంశాలతో రంగాల వారీగా ఈ పుస్తకాన్ని ప్రచురించింది. విశాఖపట్నం భూకుంభకోణంతో సహా రాష్ట్రంలో జరిగిన భూదందాలన్నీ పాలకుల కనుసన్నల్లోనే జరిగాయని ఎండగట్టింది. విశాఖపట్నంలో లక్ష కోట్ల రూపాయల భూకుంభకోణంలో సూత్రధారులైన మంత్రులు, ఇతర కీలక నేతల పేర్లు బయటకు రాకుండా కప్పేసిన వైనాన్ని తప్పుబట్టింది. అవినీతిలో ఏపీ నంబర్ వన్ అంటూ ఎన్‌సీఏఈఆర్ సంస్థ వెల్లడించిన సర్వే నివేదికతోపాటు రాష్ట్రంలో అవినీతి పెచ్చుమీరిన తీరుపై రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శులు (సీఎస్‌లు) ఐవైఆర్ కృష్ణారావు, అజేయ కల్లం పలు సందర్భాల్లో చేసిన వ్యాఖ్యలను వైఎస్సార్‌సీపీ ప్రస్తావించింది. ఏపీలో చెత్త పాలన సాగుతోందంటూ జపాన్‌కు చెందిన ప్రపంచ ప్రఖ్యాత ఆర్కిటెక్ట్ కంపెనీ 'మాకి' చైర్మన్ ఫుమిహికో 'ఆర్కిటెక్చురల్ డైజెస్ట్'కు ఇచ్చిన ఇంటర్వ్యూను ఇందులో ప్రచురించింది. అంతేకాక.. సాగునీటి శాఖలో లంచాలు, వాటాలు, కమీషన్లను ఎత్తిచూపింది. రాజధాని విషయంలో ఇన్‌సైడర్ ట్రేడింగ్ ద్వారా

మిగతా 4వ పేజీలో ▶

ఎన్‌ఐఏను ఎలా అడ్డుకుందాం?

ప్రతిపక్ష నేత జగన్‌పై హత్యాయత్నం కేసులో కుట్రకోణం బయటకు రాకుండా అడ్డుకునేందుకు చంద్రబాబు యత్నాలు


2లో

- ఎన్‌ఐఏకు ఏపీ పోలీసులు సహకరించవద్దని లోపాయికారీగా ఆదేశాలు
- డీజీపీ, పోలీస్ అధికారులతో చంద్రబాబు మంతనాలు
- ఎన్‌ఐఏ దర్యాప్తును సవాల్ చేస్తూ కోర్టును ఆశ్రయించాలని నిర్ణయం
- ఎన్‌ఐఏ దర్యాప్తుపై రాష్ట్ర సర్కారు ద్వంద్వ వైఖరి
- ఫిరాయింపు ఎమ్మెల్యే కిడారి హత్య కేసును ఎన్‌ఐఏకు ఇస్తే నోరెత్తని సీఎం
- జగన్‌పై హత్యాయత్నం కేసు దర్యాప్తుపై మాత్రం గగ్గోలు

ఎన్టీఆర్‌కు రెండోసారి చంద్రబాబు వెన్నుపోటు!

కొడుకుకు ఉషోదయం.. ఏపీకి సూర్యాస్తమయం



- కాంగ్రెస్ పాదాల ముందు బాబు శిరస్సు ఉంచారు
- ఆత్మగౌరవమంటే ఒక్క కుటుంబ ప్రయోజనాలేనా?
- ఓటమి భయంతో ఉన్నవారే అసహనం ప్రదర్శిస్తారు
- ఖర్చులకు సంబంధించిన యూసీలు రాష్ట్రం పంపలేదు
- సీఎం చంద్రబాబుపై ప్రధాని నరేంద్ర మోదీ విమర్శలు
- 5 లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోని బీజేపీ కార్యకర్తలతో మోదీ వీడియో కాన్ఫరెన్స్

సాక్షి, అమరావతి: ''అధికారం కోసం ఎన్టీఆర్‌కు చంద్రబాబు వెన్నుపోటు జగమెరిగిన సత్యం. అయితే ఎన్టీఆర్ జీవిత కాలం పాటు పోరాడిన కాంగ్రెస్ పార్టీతో కలవడం ద్వారా ఆయనకు రెండో సారి వెన్నుపోటు పొడిచారు.'' అని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్రంగా మండిపడ్డారు. ఎన్టీఆర్ 'కాంగ్రెస్ ముక్త్ భారత్' కోసం అలుపెరగని పోరాటం చేస్తే.. ఆయన అల్లుడు (చంద్రబాబు) మాత్రం తన అధికారాన్ని కాపాడుకునేందుకు కాంగ్రెస్ పార్టీ పాదాల ముందు తన శిరస్సు ఉంచారని విమర్శించారు. తెలుగువారి ఆత్మగౌరవానికి నిజమైన ప్రతీక ఎన్టీ రామారావు అని, అయితే ఆయన ఆశయాలకు తిలోదకాలిచ్చిన వ్యక్తి తెలుగు ప్రజల ఆత్మగౌరవం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని ప్రధాని ఎద్దేవా చేశారు. అలాగే చంద్రబాబు తన కొడుకు జీవితంలో వెలుగులు నింపడం కోసం.. ఏపీని అంధకారంలోకి నెట్టేస్తున్నారని ఆరోపించారు. తన కుటుంబానికి

మిగతా 2వ పేజీలో ▶





నిజమేనట!.. పొత్తు లేకుంటే వాళ్లకు ఎక్కువ సీట్లు వచ్చేవట, చంద్రబాబు ఫోన్

తమిళనాడులోని రామేశ్వరం పుదుకోట్టై రాష్ట్ర రహదారిలో జరిగిన ప్రమాదంలో నుజ్జు నుజ్జు అయిన వ్యాన్


తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం

10 మంది అయ్యప్ప భక్తుల దుర్మరణం

మృతులంతా తెలంగాణ వాసులే • ఐదుగురికి తీవ్ర గాయాలు

రామేశ్వరం నుంచి వస్తుండగా ఘటన.. ఎదురుగా వచ్చి ఢీకొన్న ట్రాలీ లారీ
క్షతగాత్రులకు పుదుకోట్టై మెడికల్ కాలేజీలో చికిత్స

- వివరాలు 5లో

రాష్ట్ర హక్కుల్ని కేంద్రం నేరుగా హరిస్తోంది

- అధికార దుర్వినియోగానికి పాల్పడుతోంది
- కృష్ణా జిల్లా పునాదిపాడు 'జన్మభూమి'లో సీఎం చంద్రబాబు ఆరోపణ
- జగన్‌పై ఎవరో అభిమాని దాడి చేస్తే మాపై బురద చల్లుతున్నారు
- బీజేపీ, వైఎస్సార్‌సీపీ ఒక్కటే.. అందువల్లే జగన్‌పై దాడి కేసును ఎన్‌ఐఏకు ఇచ్చారు
- రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించాలని మోదీ, అమిత్‌షా చూస్తున్నారు
- పెట్టుబడుల కోసం దావోస్ వెళ్తుంటే ఆంక్షలు పెట్టారు

2లో

15-20 నిమిషాల ముందే రైల్వే స్టేషన్‌లోకి...

విమానాశ్రయాల తరహాలో రైల్వేస్టేషన్లలో భద్రతను కట్టుదిట్టం చేసేందుకు రైల్వేశాఖ సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా ప్రయాణికులు రైలు బయలుదేరేందుకు 15–20 నిమిషాల ముందుగా స్టేషన్లకు చేరుకోవాల్సి ఉంటుంది. ఉత్తర ప్రదేశ్‌లోని అలహాబాద్, కర్ణాటకలోని హుబ్లీ రైల్వే స్టేషన్లలో దీన్ని ఇప్పటికే ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నారు.


12లో

రేపటి నుంచి జేఈఈ మెయిన్స్

- నాలుగు రోజులపాటు ఆన్‌లైన్‌లో పరీక్షలు
- గంట ముందే పరీక్షా కేంద్రాల్లోకి వెళ్లాలి
- ఈనెల 31న ఫలితాలు వెల్లడి



సాక్షి, అమరావతి : ఎన్‌ఐటీ, ట్రిపుల్ ఐటీ, ఐఐటీ, ఇతర ప్రభుత్వ నిధులతో నడిచే సాంకేతిక విద్యాసంస్థ (జీఎఫ్‌టీఐ)ల్లో ప్రవేశాల కోసం ఈ నెల 8 నుంచి 12 వరకు జేఈఈ మెయిన్ ప్రవేశపరీక్ష నిర్వహించేందుకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఏర్పాట్లు చేసింది. నాలుగు రోజులపాటు జరిగే ఈ పరీక్షలను ఆన్‌లైన్‌లో ప్రతీరోజూ రెండు విడతలుగా నిర్వహించనుంది. దేశవ్యాప్తంగా 263 పట్టణాల్లో నిర్వహించే ఈ పరీక్షకు 9.65 లక్షల మంది హాజరుకానుండగా అందులో రాష్ట్రం నుంచి దాదాపు 65 వేల మంది విద్యార్థులు హాజరుకానున్నారు. రాష్ట్రంలోని విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం, తిరుపతి, అనంతపురం, బాపట్ల, భీమవరం, చీరాల, చిత్తూరు, ఏలూరు, కడప, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, ఒంగోలు, రాజమండ్రి, శ్రీకాకుళం, తాడేపల్లిగూడెం, విజయనగరం పట్టణాల్లో పరీక్ష కేంద్రాలను ఎన్‌టీఏ ఏర్పాటుచేసింది. ఇప్పటివరకు ఏటా ఒకసారి చొప్పున జేఈఈ మెయిన్ పరీక్షను సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) నిర్వహిస్తుండగా.. 2019–20 విద్యా సంవత్సరంలో ప్రవేశాల కోసం ఎన్‌టీఏ ఏటా రెండుసార్లు పరీక్ష నిర్వహించేలా షెడ్యూల్ జారీచేసింది. ఇందులో భాగంగా ఈ నెలలో మొదటి విడత పరీక్షను నిర్వహిస్తోంది. రెండో విడత పరీక్షను ఏప్రిల్‌లో నిర్వహించేలా చర్యలు చేపట్టింది.

పరీక్షా కేంద్రాల మార్పు ఉండదు

విద్యార్థులు తమకు కేటాయించిన కేంద్రంలోనే పరీక్ష రాయాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ పరీక్ష కేంద్రం మార్పు ఉండబోదని ఎన్‌టీఏ స్పష్టంచేసింది. విద్యార్థులు తప్పుడు సమాచారం ఇచ్చినా, ఒక షిఫ్ట్‌కు బదులు రెండో షిఫ్ట్‌లో లేదా వేర్వేరు రోజుల్లో రెండుస్లారు పరీక్ష రాసినా వారి దరఖాస్తులను తిరస్కరిస్తామని.. వారి ఫలితాలను పరిగణనలోకి తీసుకోబోమని తేల్చిచెప్పింది. విద్యార్థులు గంట ముందే పరీక్ష కేంద్రాల్లోకి వెళ్లాల్సిందేనని, ఆ తర్వాత వచ్చే విద్యార్థులను అనుమతించబోమని ఎన్‌టీఏ పేర్కొంది. పరీక్ష ఫలితాలను ఈ నెల 31న వెల్లడించనున్నట్లు తెలిపింది.

8న రాష్ట్ర వ్యాప్తంగా విద్యా సంస్థల బంద్

గాంధీనగర్ (విజయవాడసెంట్రల్): ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేయలేని ఎన్డీఏ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈ నెల 8న రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కు విద్యార్థి, యువజన సంఘాలు పిలుపునిచ్చాయి. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.రంగన్న, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రమేష్, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్‌బాబు, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి సూర్యారావు, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.రామకృష్ణ ఆదివారం సంయుక్తంగా ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల ముందు ఎన్డీఏ ప్రభుత్వం ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చి మాట తప్పిందని పేర్కొన్నారు. యూనివర్సిటీలను నిర్వీర్యం చేస్తూ ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలను ప్రోత్సహిస్తూ విద్యారంగాన్ని ఎన్డీఏ ప్రభుత్వం వ్యాపారంగా మార్చేసిందని మండిపడ్డారు. వీటన్నింటికి నిరసనగా ఈ నెల 8న విద్యాసంస్థల బంద్ నిర్వహిస్తున్నామని ఇందులో విద్యార్థులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

బలహీనవర్గాలకు భూమి లేకుండా చేసే కుట్ర!

ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఐవైఆర్ కృష్ణారావు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని బడుగు, బలహీనవర్గాలకు అసైన్డ్ భూముల్లేకుండా చేసే కుట్ర జరుగుతోందని ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి, బీజేపీ నేత ఐవైఆర్ కృష్ణారావు ఆందోళన వ్యక్తం చేశారు. ఇందు కోసం నిబంధనలను సైతం నీరుగార్చాలని నిర్ణయించారని పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన ట్వీట్ చేశారు. 'ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు చూస్తుంటే.. 1954కు పూర్వం కేటాయించిన ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణ లాగా లేదు. బలహీన వర్గాల నుంచి భూములు తీసుకున్న భూ స్వాముల ప్రయోజనాల పరిరక్షణలా ఉంది. ఈ విషయమై వివరణ ఇవ్వడానికి ప్రయత్నించిన అధికారుల నోళ్లను ప్రభుత్వ పెద్దలు మూయించారు. 1954కు ముందు కేటాయించిన అసైన్డ్ భూముల క్రమబద్ధీకరణకు కలెక్టర్ల కమిటీ వేయాలన్న రాష్ట్ర భూ పరిపాలన ప్రధాన కమిషనర్ కార్యదర్శి సూచనను కూడా పక్కనపెట్టారు. అన్నిటినీ తమకు అనుకూలంగా మలిచే మంత్రుల కమిటీని వేశారు. ప్రభుత్వ భూములను బలహీనవర్గాలకు కేటాయించేటప్పుడు.. ఆ భూములు అమ్మడానికి వీలులేదనే నిబంధనను అప్పట్లో పెట్టారు. దానిని తొలగిస్తే పేదలకు భూమి మిగలదు' అని ఐవైఆర్ ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

క్యాట్ ఫలితాల్లో జగ్గయ్యపేట విద్యార్థి ఘనత

99.55 పర్సంటైల్ సాధించి జాతీయ స్థాయిలో ప్రతిభ



జగ్గయ్యపేట అర్బన్: ఆలిండియా స్థాయిలో ఐఐఎం, ఇతర ప్రముఖ విద్యాసంస్థల్లో ప్రవేశాలకు వీలు కల్పించే క్యాట్ పరీక్షా ఫలితాల్లో కృష్ణా జిల్లా జగ్గయ్యపేట విద్యార్థి జాతీయ స్థాయిలో ర్యాంకు సాధించాడు. మారెడ్డి సిద్ధార్థరెడ్డి 99.55 పర్సంటైల్ సాధించి జాతీయస్థాయిలో ప్రతిభ కనపరిచాడు. జగ్గయ్యపేటలో ఎల్ఐసీలో పనిచేస్తున్న మారెడ్డి ప్రభాకరరెడ్డి కుమారుడైన సిద్ధార్థరెడ్డి ప్రస్తుతం ప్రైస్ వాటర్ హౌజ్ కూపర్స్ వంటి దిగ్గజ ఆర్థిక సంస్థలో డేటా అనలిస్ట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. క్యాట్ ఫలితాల్లో జాతీయ స్థాయిలో ర్యాంకు సాధించిన సిద్ధార్థరెడ్డిని పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు అభినందించారు.

కొనసాగుతున్న తూర్పు, ఈశాన్య గాలులు

సాక్షి, విశాఖపట్నం : కోస్తాంధ్రపై తూర్పు, ఈశాన్య గాలులు కొనసాగుతున్నాయి. ఇవి కనిష్ట (రాత్రి) ఉష్ణోగ్రతలు మరింతగా క్షీణించకుండా అడ్డుకట్ట వేస్తున్నాయి. ఫలితంగా అతిశీతల ప్రభావం అంతగా కనిపించడంలేదు. అదే సమయంలో మధ్య, ఉత్తర భారతదేశంలోనూ కనిష్ట ఉష్ణోగ్రతలు మునుపటికంటే కొంచెం పెరుగుతున్నాయి. దీంతో అక్కడ చలి తీవ్రత తగ్గుతోంది. అక్కడ నుంచి రాష్ట్రం వైపు ఉత్తర గాలులు తాత్కాలికంగా తగ్గుముఖం పట్టాయి. వాటి స్థానంలో ఇప్పుడు తూర్పు, ఈశాన్య గాలులు వీస్తున్నాయి. ఈ గాలుల ప్రభావంవల్ల ప్రస్తుతం కోస్తాంధ్ర, రాయలసీమల్లో సాధారణం కంటే 2–3 డిగ్రీలు తక్కువగా నమోదవుతున్నాయి. ఇదే పరిస్థితి మరికొద్ది రోజులు ఉంటుందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. కాగా, శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు రాష్ట్రంలోకెల్లా అత్యల్పంగా ఆరోగ్యవరంలో 13 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. ఇది సాధారణం కంటే 2 డిగ్రీలు తక్కువ. మచిలీపట్నం, నందిగామ, విజయవాడ, కర్నూలుల్లో సాధారణ ఉష్ణోగ్రతలే నమోదయ్యాయి. ఇదిలా ఉంటే.. అండమాన్ సముద్రంలో కొనసాగుతున్న పబక్ తుపాను ఆదివారం సాయంత్రం తీవ్ర వాయుగుండంగా బలహీనపడింది. అనంతరం రాత్రి అండమాన్‌ను దాటింది.

రాష్ట్రంలో నమోదైన కనిష్ట ఉష్ణోగ్రతలు

ప్రాంతం	ఉష్ణోగ్రత
ఆరోగ్యవరం	13
అనంతపురం	15
నంద్యాల	15
విశాఖపట్నం	15
అమరావతి	15
కళింగపట్నం	15
బాపట్ల	16
నందిగామ	17
తుని	17
కడప	17
కర్నూలు	17
తిరుపతి	17
కాకినాడ	19
కావలి	19
నర్సాపురం	19
విజయవాడ	19

సగానికి మించని రబీ విస్తీర్ణం



'దాళ్వా'పై తటపటాయింపు | ముగిసిన ఈశాన్య రుతుపవనాల కాలం | పంటలు ఎండుతున్నాయ్

అధికారిక లెక్కల ప్రకారమే 2.78 లక్షల హెక్టార్లలో పంట నష్టం

సాక్షి, అమరావతి : గోదావరి, కృష్ణా డెల్టాలలో దాళ్వా పంట వేయాలో, వద్దో తేల్చుకోలేక రైతులు సంకటస్థితిలో పడ్డారు. వర్షాభావం కారణంగా..రబీ పంట సాగు విస్తీర్ణం మాత్రం సగానికి మించకపోగా.. వేసిన పంటలు వేసినట్టే ఎండిపోతుండడమే ఇందుకు కారణం. ఇప్పటికే ఈశాన్య రుతు పవనాల కాలం ముగిసింది. వర్షపాతం లోటు ఈ సీజన్‌లో జనవరి 2 నాటికి సరిగ్గా 58 శాతానికి చేరింది. 7 జిల్లాలు లోటు వర్షపాతాన్ని ఎదుర్కొంటున్నాయి. మరో 6 జిల్లాలు లోటుకు దగ్గర్లో ఉన్నాయి. పంట రుణాలు లేవు. రాష్ట్రంలో 347 మండలాలు కరవు ప్రాంతాలుగా మిగిలాయి. ఇప్పటికే 142 మండలాల్లో పంటలు నష్టపోయినట్టు అధికారికంగా లెక్కతేల్చారు. తాగడానికి నీరులేక జనం వలస బాట పట్టారు. నోరు లేని మూగజీవాలు కబేళాలకు తరలుతున్నాయి. తిత్లీ తుపాను మిగిల్చిన పెను విధ్వంసంతో శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలు అల్లకల్లోలమయ్యాయి. పెథాయ్ తుపానుతో కోస్తా జిల్లాలు నష్టపోయాయి. ఇంకొకపక్క, రబీ పంటల్ని తెగుళ్లు చుట్టుముట్టాయి. స్థూలంగా రబీ పరిస్థితి ఇది.

వదలని తెగుళ్ల బెడద..

రబీలో వేసిన వివిధ రకాల పంటలను తెగుళ్లు ఆశించాయి. వీటి నివారణకు ఆయా ప్రాంతాల్లోని వ్యవసాయాధికారులు సూచనలు సలహాలు ఇస్తున్నట్టు చెబుతున్నా.. తెగుళ్ల అదుపులోకి రావడం లేదు. వీటి నివారణకు రైతులు వేలాది రూపాయలు వ్యయం చేసి క్రిమిసంహారక మందుల్ని వాడుతున్నా అదుపులోకి రావడం లేదు.

9 లక్షల హెక్టార్లు ఇంకా మిగిలే ఉంది..

రబీలో మొత్తం సాగు విస్తీర్ణం 23.43 లక్షల హెక్టార్లు కాగా ఈశాన్య రుతుపవనాల కాలం ముగిసే సమయానికి 15 లక్షల హెక్టార్లలో పంటలు వేసినట్టు వ్యవసాయ శాఖ చెబుతున్నా.. వాస్తవ సాగు 11, 12 లక్షల హెక్టార్లకు మించలేదని రైతు సంఘాల వాదన. మరోపక్క వేసిన పంటలు ఎండిపోతున్నాయి. గత నెల మూడో వారానికే 4 జిల్లాలలోని 142 మండలాల్లో 2.78 లక్షల హెక్టార్లలో పంటలు వాడిపోతున్నట్టు వ్యవసాయ శాఖ అంచనా వేసి సీఎంకు నివేదిక అందజేసింది. వాస్తవానికి ఈ విస్తీర్ణానికి రెట్టింపు శాతం భూమిలో పంటలు ఎండిపోయాయి. డిసెంబర్‌లో వచ్చిన పెథాయ్ తుపాన్‌కు 88,812 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి. అత్యధికంగా 52,674.65 హెక్టార్లలో వరి దెబ్బతింది. నష్టపోయిన పంటలకు 3 రోజుల్లో పరిహారం అందిస్తామని సీఎం ప్రకటించినా ఇంత వరకు అందకపోవడాన్ని రైతు సంఘాలు ప్రశ్నిస్తున్నాయి.

7 జిల్లాల్లో లోటు వర్షపాతం..

ఈశాన్య రుతుపవనాలు ప్రారంభమైన అక్టోబర్ ఒకటి నుంచి సీజన్ ముగిసిన డిసెంబర్ 31 వరకు రాష్ట్రంలో కురవాల్సిన వర్షపాతం 296 మిల్లీ మీటర్లయితే 124.1 మిల్లీమీటర్లు మాత్రమే నమోదయింది. గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, వైఎస్సార్ కడప, అనంతపురం, కర్నూలు జిల్లాలు మైనస్ 20 నుంచి మైనస్ 59 శాతం మధ్య లోటులో పడిపోయాయి. మిగతా ఆరు జిల్లాలు లోటు వర్షపాతానికి దగ్గర్లో ఉన్నాయి. తిత్లీ తుపానుతో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. రిజర్వాయర్లలో నీటి మట్టాలు తగ్గుతున్నాయి. గత ఏడాది జనవరి 2 నాటికి 533.01 టీఎంసీల నీరు ఉంటే ప్రస్తుతం 405.49 టీఎంసీలు మాత్రమే ఉన్నాయి.

పశువులు కబేళాలకు..

వేసవి రాకముందే నీటి ఎద్దడి ఏర్పడడంతో వందలాది గ్రామాలు అల్లాడిపోతున్నాయి. రాయలసీమ, పల్నాడు ప్రాంతాల్లో రైతులు, వ్యవసాయ కూలీలు పెద్దఎత్తున వలస పోతున్నారు. పశుగ్రాసం కొరత, నీటి ఎద్దడితో రైతులు మూగ జీవాలను కబేళాలకు తరలిస్తున్నారు. కరవు మండలాల్లో ఇంతవరకు ఎటువంటి సహాయక చర్యలు చేపట్టకపోవడంతో గ్రామాలు ఈడ్చుకుపోయినట్టు కనిపిస్తున్నాయి. కరవు ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టాలని ఇటీవల 'కరవు బంద్' జరిగినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం గమనార్హం.

ఎన్‌ఐఏను ఎలా అడ్డుకుందాం?

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌పై విశాఖ ఎయిర్‌పోర్టులో జరిగిన హత్యాయత్నం కేసులో దర్యాప్తు చేపట్టేందుకు జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్‌ఐఏ) రంగంలోకి దిగడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఉలిక్కిపడుతున్నారు. ప్రతిపక్ష నేతను భౌతికంగా అంతం చేసేందుకు సాగించిన కుట్ర బయట పడుతుందనే భయం చంద్రబాబు ప్రభుత్వాన్ని వెంటాడుతోందన్న విషయం తాజా పరిణామాలను బట్టి స్పష్టమవుతోంది. ఎన్‌ఐఏకు ఏపీ పోలీసుల సహాయ నిరాకరణతోపాటు దర్యాప్తును అడ్డుకునేందుకు రాష్ట్ర సర్కారు 2 రోజులుగా మల్లగుల్లాలు పడుతున్న తీరు చూసి రాష్ట్ర ప్రజలు విస్తుపోతున్నారు. గతేడాది అక్టోబర్ 25న జగన్‌పై కత్తితో హత్యాయత్నం చేయడాన్ని ఖండించకుండా సీఎం చేసిన వ్యాఖ్యలు, డీజీపీ ఠాకూర్ చేసిన ప్రకటన ఈ కేసు దర్యాప్తును తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని వైఎస్సార్‌సీపీ శ్రేణులు పేర్కొన్న సంగతి తెలిసిందే. ఈ కేసులో అప్పటి నుంచి చోటుచేసుకున్న పరిణామాలను నిశితంగా గమనిస్తే కుట్రకోణాన్ని మరుగున పరిచేందుకు ప్రభుత్వ యంత్రాంగం సర్వశక్తులూ ఒడ్డిందని తేటతెల్లమవుతోంది. జగన్‌పై జరిగిన హత్యాయత్నం కేసులో అసలు కుట్రను ఛేదించేలా ఏపీ పోలీసులు ఒక్క ప్రయత్నమూ చేయకపోవడం గమనార్హం. ప్రభుత్వం హడావుడిగా ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) సైతం నిందితుడు శ్రీనివాసరావు చుట్టూనే దర్యాప్తును తిప్పి, కేవలం అతడిపైనే కేసును పరిమితం చేసి, అసలు కుట్రదారులను తప్పించేందుకు ముందస్తు స్క్రిప్ట్ ప్రకారమే నడుచుకుందనే ఆరోపణలున్నాయి. ప్రతిపక్ష నేతపై హత్యాయత్నం కేసును నీరుగార్చేందుకు తిలాపాపం తలా పిడికెడు అన్నట్టుగానే ప్రభుత్వ యంత్రాంగంలో పై నుంచి కింది వరకూ ప్రతి ఒక్కరూ శక్తివంచన లేకుండా కృషి చేశారన్నది బహిరంగ రహస్యమే.

ఆధారాలు దొరక్కుండా పన్నాగాలు

జగన్‌పై హత్యాయత్నం జరిగిన రోజున చంద్రబాబు మాట్లాడుతూ.. విశాఖ విమానాశ్రయం భద్రత కేంద్రం పరిధిలోనిదని, ప్రతిపక్ష నేతపై హత్యాయత్నంతో తమకు సంబంధం లేదన్నారు. మరి కేంద్రం పరిధిలోని విమానాశ్రయంలో జరిగిన హత్యాయత్నం ఘటన దర్యాప్తును ఎన్‌ఐఏకు అప్పగిస్తే రాష్ట్రప్రభుత్వం ఎందుకు బెంబేలెత్తిపోతోందో అర్థం కావడం లేదని పలువురు పేర్కొంటున్నారు. ఈ కేసులో ఎన్‌ఐఏకు సహకరించవద్దంటూ మౌఖిక ఆదేశాలు అందినట్టు ఓ పోలీసు అధికారి చెప్పారు. ఈ నేపథ్యంలోనే ఈ నెల 1న ఎన్‌ఐఏ కేసు నమోదు చేస్తే హడావుడిగా 2న విశాఖ సిటీ పోలీస్ కమిషనర్ లడ్డా మీడియా సమావేశం నిర్వహించి పాతపాటే పాడటం వెనుక పెద్దల డైరెక్షన్ ఉందంటున్నారు. ఎన్‌ఐఏ దర్యాప్తునకు సహకరించకపోవడంతోపాటు ఆధారాలు దొరక్కుండా గట్టి ప్రయత్నాలు చేస్తున్నారనే విమర్శలున్నాయి.

ఎన్‌ఐఏపై ఎందుకీ ద్విముఖ వైఖరి?

ఎన్‌ఐఏపై చంద్రబాబు సర్కారు అవలంభిస్తున్న ద్విముఖ వైఖరిని సాక్షాత్తూ సీనియర్ పోలీసు అధికారులే తప్పుబడుతున్నారు. కీలక కేసుల్లో ఎన్‌ఐఏ జోక్యం చేసుకోవడం సర్వసాధారణం. కానీ, ఈ విషయంలో చంద్రబాబు ఎందుకు ఇలా రెండు నాల్కల ధోరణి అవలంభిస్తున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు. విశాఖ జిల్లా కేంద్రంగా జరిగిన 2 ప్రధాన ఘటనల్లో ఎన్‌ఐఏ చేపట్టిన దర్యాప్తుపై చంద్రబాబు పరస్పరం భిన్నంగా వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది. విశాఖ జిల్లా అరకు అసెంబ్లీ నియోకవర్గానికి చెందిన ఫిరాయింపు ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు, టీడీపీ మాజీ ఎమ్మెల్యే సివేరి సోమలను మావోయిస్టులు హత్య చేసిన సంగతి తెల్సిందే. ఈ కేసును విశాఖ జిల్లా డుంబ్రిగూడ పోలీసులు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఎమ్మెల్యేను మావోయిస్టులు హత్య చేసిన ఈ కేసు దర్యాప్తును డిసెంబర్‌లో ఎన్‌ఐఏ తన చేతుల్లోకి తీసుకుంది. వాస్తవానికి మావోయిస్టులు ప్రజాకోర్టు నిర్వహించి, స్థానికుల ఎదుటే కిడారి, సోమలను కాల్చి చంపారు. వారిని తామే హత్య చేసినట్లు మావోయిస్టులూ ప్రకటించారు. అయినా ఆ కేసును ఎన్‌ఐఏ తీసుకుంది. అలాంటప్పుడు ప్రతిపక్ష నేతను మట్టుబెట్టాలనే లక్ష్యంతో జరిగిన కుట్ర కేసులో ఎన్‌ఐఏ దర్యాప్తు చేపడితే చంద్రబాబు సర్కారు ఎందుకు కలవరపడుతోందని పలువురు ప్రశ్నిస్తున్నారు. జగన్‌పై హత్యాయత్నం కేసులో నిందితుడిని పట్టుకోవడం తప్ప ఇంకేమీ జరగలేదు. సీఎం, డీజీపీ చేసిన వ్యాఖ్యలు ఈ కేసు దర్యాప్తును ప్రభావితం చేసేలా ఉన్నాయని, కుట్రకోణం వదిలి నిందితుడికే కేసును పరిమితం చేయడం సరికాదని, థర్డ్‌పార్టీతో దర్యాప్తు చేయించాలని వైఎస్సార్‌సీపీ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. కిడారి హత్య కేసును ఎన్‌ఐఏ చేపడితే తప్పుబట్టని చంద్రబాబు ప్రతిపక్ష నేతపై జరిగిన హత్యాయత్నం కేసును జాతీయ దర్యాప్తు సంస్థ దర్యాప్తు చేపడితే గగ్గోలు పెడుతుండడం గమనార్హం.

కోర్టును ఆశ్రయించాలని నిర్ణయం

ప్రతిపక్ష నేతపై హత్యాయత్నం కేసును ఎన్‌ఐఏ చేపట్టిందని తెలియగానే అధికార పక్షంలో కలవరపాటు మొదలైంది. ఎన్‌ఐఏ దర్యాప్తునకు అడ్డుపడేలా ఎలా వ్యవహరించాలనే దానిపై చంద్రబాబు 2 రోజులుగా మల్లగుల్లాలు పడుతున్నారు. డీజీపీతోపాటు పోలీసు ఉన్నతాధికారులు, అడ్వకేట్ జనరల్, ఆంతరంగికులతో సీఎం ఆదివారం నిర్వహించిన సమావేశంలోనూ ఎన్‌ఐఏ దర్యాప్తును సవాలు చేస్తూ కోర్టును ఆశ్రయించాలని నిర్ణయించినట్లు సమాచారం. దీంతోపాటు ఎన్‌ఐఏ అధికారులు ఏం అడిగిన ఏపీ పోలీసులు నోరు మెదపవద్దని, సహాయ నిరాకరణ చేయాలని లోపాయికారీగా ఆదేశాలు ఇచ్చినట్టు తెలిసింది.

రాష్ట్ర హక్కుల్ని కేంద్రం హరిస్తోంది

కృష్ణా జిల్లా పునాదిపాడు 'జన్మభూమి'లో సీఎం చంద్రబాబు ఆరోపణ

సాక్షి, అమరావతి బ్యూరో/సాక్షి, అమరావతి: ''ఎవరో ఒక అభిమాని సానుభూతికోసం జగన్‌పై కత్తితో దాడి చేస్తే.. దానికి, నాకు సంబంధం ఉందంటూ మాపై బురద చల్లే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. బీజేపీ, వైఎస్సార్‌సీపీ ఒక్కటే. కాబట్టే జగన్‌పై దాడి కేసును కేంద్ర దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ)కు ఇచ్చారు. రాష్ట్రంలో శాంతిభద్రతలను పరిరక్షించే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిది. ఆ హక్కులను నేరుగా కేంద్రం హరిస్తోంది. లేనిదాన్ని సృష్టించడానికి.. లేనిపోని అపోహలు తేవడానికి అధికార దుర్వినియోగానికి పాల్పడుతోంది..'' అని సీఎం చంద్రబాబు నాయుడు ఆరోపించారు. కృష్ణా జిల్లా పెనమలూరు నియోజకవర్గం కంకిపాడు మండలం పునాదిపాడులో ఆదివారం నిర్వహించిన 'జన్మభూమి–మాఊరు' గ్రామసభలో సీఎం మాట్లాడుతూ.. రాష్ట్రాభివృద్ధికి కేంద్రం సహకరించకుండా మోసం చేసిందని మండిపడ్డారు. చెప్పింది వినకపోతే అణగదొక్కాలని చూస్తున్నారని, హక్కులకోసం పోరాటానికి దిగితే టీడీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, పారిశ్రామికవేత్తలపై ఐటీ దాడులు చేయించిందని ఆరోపించారు. రాజకీయంకోసం కేరళలాంటి మంచి రాష్ట్రాన్ని బీజేపీ అతలాకుతలం చేసిందన్నారు. యూపీలో అఖిలేష్, మాయావతిలు వచ్చే ఎన్నికలకోసం సీట్లు సర్దుబాటు చేసుకుంటే వెంటనే అఖిలేష్‌పై ఉన్న పాత కేసుల మీద సీబీఐ దర్యాప్తుకు ఆదేశించారని ధ్వజమెత్తారు. రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించేందుకు మనపై కేంద్రం ఎదురుదాడి చేస్తోందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ అన్ని రంగాల్లో విఫలమయ్యారని విమర్శించారు. దేశాన్ని భ్రష్టు పట్టించినట్లుగానే రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించాలని ప్రధాని మోదీ, అమిత్‌షా ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అభివృద్ధిలో గుజరాత్‌ను మించిపోతామనే భయం మోదీలో ఉందన్నారు. ఏపీకి ఏమీ ఇవ్వకపోగా చేస్తున్న అభివృద్ధికి అడ్డంకులు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రాభివృద్ధి కోసం పెట్టుబడులను ఆహ్వానించేందుకు దావోస్ వెళ్తుంటే వీల్లేదంటూ ఆంక్షలు పెట్టడం దారుణమని, రాష్ట్రంపై కేంద్ర పెత్తనాన్ని సహించేది లేదన్నారు. త్వరలో స్మార్ట్‌ఫోన్ పథకానికి రాష్ట్రంలో శ్రీకారం చుట్టబోతున్నామని చెప్పారు. కాగా, జన్మభూమి కార్యక్రమం జరుగుతున్న తీరుపై జిల్లా కలెక్టర్లు, నోడల్ అధికారులు, ప్రజాప్రతినిధులతో సీఎం ఆదివారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రపంచానికే నమూనాగా రాష్ట్రాన్ని మారుస్తున్నామని చెప్పారు. కేంద్రంలో బీజేపీ నేతలు పనిచేయరని, పని చేయమంటే కేసులతో బెదిరిస్తున్నారని మండిపడ్డారు.



జన్మభూమి సభలో ప్రసంగిస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రులు, కృష్ణా జిల్లా కలెక్టర్

ఎన్టీఆర్‌కు రెండోసారి బాబు వెన్నుపోటు!

▶ మొదటి పేజీ తరువాయి

ప్రయోజనం కలిగితే తెలుగువారి ఆత్మగౌరవం నిలబడినట్టు, తన కుటుంబ ప్రయోజనాలకు విఘాతం కలిగే పరిస్థితులు ఉత్పన్నమైతే మాత్రం తెలుగువారి ఆత్మగౌరవానికి భంగం కలుగుతున్నట్లు చంద్రబాబు మాట్లాడుతున్నారని విమర్శించారు. తెలుగువారి ఆత్మగౌరవమంటే ఆ ఒక్క కుటుంబ ప్రయోజనాలేనా అని దుయ్యబట్టారు. ఆదివారం ప్రధాని మోదీ రాష్ట్రంలోని అనంతపురం, కడప, కర్నూలు, నరసరావుపేట, తిరుపతి లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోని పార్టీ బూత్ కమిటీ కార్యకర్తలతో ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. అనంతపురం నుంచి పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మురళీధరన్, నరసరావుపేట నుంచి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ, కర్నూలు నుంచి పార్టీ ఎన్నికల కమిటీ చైర్మన్ సోము వీర్రాజు తదితరులు పాల్గొన్నారు. ''రాష్ట్రంలో అధికారాన్ని నిలబెట్టుకోవడానికి ఓ కుటుంబం చేసే ప్రయత్నాలన్నీ తెలుగువారి ఆత్మగౌరవం కోసం చేస్తున్నట్లు ఎలా అవుతాయి? రాష్ట్ర ప్రజలందరిని నిర్లక్ష్యం చేసి తమ అధికారాన్ని కాపాడుకోవడమే లక్ష్యంగా పనిచేయడమంటే.. అది తెలుగువారి ఆత్మగౌరవమా? ప్రతి రోజూ అసత్యాలతో, అసభ్య పదజాలంతో మోదీని తిడితే అది తెలుగువారి ఆత్మగౌరవమా? సీఎంగా ఫెయిల్ అయి ప్రధాని కావాలని కలలు కనడం తెలుగువారి ఆత్మగౌరవం కిందకే వస్తుందా?'' అని మోదీ విమర్శలు గుప్పించారు. తన కుమారుడికి బంగారు భవిష్యత్ ఇచ్చేందుకు శ్రద్ధ చూపుతున్న చంద్రబాబు.. రాష్ట్రంలో మిగిలిన వారి కుమారులు, కూతుర్ల ప్రయోజనాలను పరిరక్షించడం మరిచిపోయారని ఎద్దేవా చేశారు. అనంతపురం, వైఎస్సార్ కడప వంటి వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి కేంద్రం నిధులిచ్చినా, వాటి ఖర్చుకు సంబంధించిన యూసీలు రాష్ట్ర ప్రభుత్వానికి అందజేయలేదని మోదీ ఆరోపించారు. వైఎస్సార్ జిల్లాలో వివిధ గనుల ద్వారా ప్రభుత్వానికి వచ్చే ఆదాయం ఆ జిల్లా అభివృద్ధికి ఖర్చు పెట్టాల్సి ఉన్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం ఆ నిధులను జిల్లా అభివృద్ధికి ఖర్చు చేయడం లేదన్నారు. 'కేంద్రం నుంచి డబ్బులు నేరుగా జిల్లాలకే వస్తున్నాయి. కాని ఏపీ ప్రభుత్వం ఏం చేస్తుందో తెలియడం లేదు. వెనుకబడిన జిల్లాలకు కేంద్రం నుంచి అధిక నిధులు ఇచ్చాం. వేరేగా ఖర్చు పెట్టినవాటికి బిల్లులు పంపితే వాటికి కూడా నిధులు చెల్లిస్తున్నాం'' అని మోదీ చెప్పారు.



వీడియా కాన్ఫరెన్స్ ద్వారా అనంతపురంలోని కార్యకర్తలతో మాట్లాడుతున్న ప్రధాని మోదీ


బాబులో కనిపించే అసహనమే ఓటమికి సంకేతం

కాకినాడలో మహిళా కార్పొరేటర్‌ను 'ఫినిష్' చేస్తానంటూ సీఎం వ్యాఖ్యానించడాన్ని కన్నా ప్రధాని దృష్టికి తీసుకొచ్చారు. ''రాజకీయ ప్రత్యర్థులపై అసహనంతో బెదిరింపులకు దిగి మాట్లాడుతున్నారంటే.. ఆ నాయకుడికి ఓటమి భయం పట్టుకుందని తేటతెల్లమవుతోంది. అధికారం ఉండీ, అంత యంత్రాంగం ఉన్న వ్యక్తి అలా మాట్లాడారంటే .. అది బీజేపీ కార్యకర్తలు సాధించిన విజయంగా పరిగణించాలి. ప్రజల పక్షాన ఉంటూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీజేపీ పోరాడుతున్నట్టు, అందుకు అభినందిస్తున్నా'' అని మోదీ వ్యాఖ్యానించారు.

338వ రోజు

06–01–2019, ఆదివారం

తలతంపర, శ్రీకాకుళం జిల్లా



దళారీల రాజ్యంలో రైతన్నలకు ధరలెలా గిట్టుబాటు అవుతాయి?

పాదయాత్ర ప్రారంభించి నేటికి సరిగ్గా 14 నెలలు గడిచిపోయాయి. ఉదయం పాదయాత్ర ప్రారంభంలోనే చంద్రబాబుపై ప్రచురించిన 'అవినీతి చక్రవర్తి' పుస్తకాన్ని నాతో ఆవిష్కరింపజేశారు.

శ్రీకాకుళం జిల్లాలో అడుగడుగునా వలసల కథలు కదిలించాయి. వలసల్లో అగ్రస్థానం ఇచ్ఛాపురం నియోజకవర్గానిదే. ఈ పాలనలో వ్యవసాయం కష్టమైంది. చేపల వేట భారమైంది. పరిశ్రమలు లేవు.. ఉపాధి కరువైంది. ఉపాధి పనులూ లేవాయే. వలసలు తప్ప మరో మార్గం లేని దుర్భర పరిస్థితి. ఎక్కడో దూరాన చెన్నైలో, కోల్‌కతాలో బిల్డింగులు కూలినా, పాకిస్థాన్ సముద్ర జలాల్లో అక్కడి సైన్యానికి బందీలుగా చిక్కినా, విదేశాలకు పంపే బ్రోకర్ల చేతుల్లో మోసపోయినా, అండమాన్ దీవుల్లో, గల్ఫ్ దేశాల్లో విషాద గాథలు బయటపడ్డా.. బాధితుల్లో శ్రీకాకుళం జిల్లా వాసుల పేర్లే ఎక్కువగా వినిపిస్తూ ఉంటాయి. వేలాదిమంది కాలే కడుపులతో వలస వెళ్లడం ప్రభుత్వ వైఫల్యమే. వలస కూలీల కష్టాలు వింటుంటే మనసంతా బరువెక్కిపోయింది. కురేష్, మహాలక్ష్మిల కుమారుడు దుంపరాజు అలా వలస వెళ్లిపోయి రెండేళ్లవుతున్నా ఆచూకీ లేదట. అలాంటి కథే రాజేశ్వరిది. ఆమె భర్త బైరాగి మూడేళ్లయినా ఇంటికి తిరిగిరాలేదట. చాలా బాధనిపించింది. ప్రజలకు ఉపాధి కల్పించడానికి కనీస ప్రయత్నమే చేయని ప్రభుత్వాన్ని ఏమనాలి? దళారీ వ్యవస్థలతో రైతాంగాన్ని, మత్స్యకారులను దెబ్బతీస్తున్న ఈ పాలకులే వలసలకు బాధ్యులు కారా?

జింకిబద్ర వద్ద టమాటా రైతులు కలిశారు. ఆరుగాలం కష్టించే వీరు అద్భుతమైన దేశవాళీ టమాటాలు పండించడంలో చేయితిరిగినవారు. నాణ్యమైన టమాటాల అధిక దిగుబడి సాధిస్తూనే ఉంటారు. 'అదేం మాయో కానీ.. అంతవరకు బాగా ఉన్న టమాటా ధర తీరా పంట చేతికొచ్చే సమయానికి ఒక్కసారిగా పతనమైపోతుంది' అంటూ బావురుమన్నారు. పెట్టుబడి కూడా రాక నష్టపోతున్నా ప్రభుత్వం ఆదుకునే ప్రయత్నమే చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దళారీల రాజ్యంలో రైతన్నలకు ధరలెలా గిట్టుబాటు అవుతాయి? రాత్రికి రాత్రే ధరలు పతనమయ్యే మాయలు, మోసాలు లేకపోతే అది బాబుగారి పాలన ఎలా అవుతుంది?

సోంపేటలో అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్డు విస్తరణ పనులు, అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థ గురించి ప్రజలు ఫిర్యాదులు చేశారు. కవిటి జూనియర్ కళాశాల విద్యార్థినులది పైకి చెప్పుకోలేని కష్టం. ఈ కాలేజీలో దాదాపు 300 మంది విద్యార్థినులు ఉన్నారట. ఎలాంటి టాయ్‌లెట్ సౌకర్యాలు లేవు. అవసరం పడితే ఆరుబయట బహిరంగ ప్రదేశాలకు వెళ్లాల్సి వస్తుందట. సిగ్గుతో చితికిపోతున్నామని.. ఎదిగిన ఆ ఆడబిడ్డలు చెబుతుంటే చాలా బాధనిపించింది.

ముఖ్యమంత్రిగారికి నాదో ప్రశ్న.. ఇక్కడ బతకలేని పరిస్థితుల్లో అయినవారిని, ఉన్నవారిని వదులుకుని, పొట్టచేత పట్టుకుని వలస వెళ్లిపోతుంటే.. అధిక ఆదాయం కోసం అలవాటుగా వలస వెళ్తున్నారని వ్యాఖ్యానించడం మానవత్వమేనా?

వై.యస్. జగన్.

శ్రీవారిని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి

తిరుమల: ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గంగారావు ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయాధికారులు ఆయనకు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామివారి దర్శనానంతరం ఆలయంలోని రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. జస్టిస్‌కు టీటీడీ అధికారులు తీర్థప్రసాదాలు, శ్రీవారి చిత్రపటాన్ని అందజేశారు.


ఆలయం వద్ద న్యాయమూర్తి గంగారావు

ఆగిన ఆరోగ్యశ్రీ.. రోగుల ఇబ్బందులు



- ఆరు రోజులుగా ప్రైవేటు ఆస్పత్రుల్లో సేవలు నిలిపివేత
- ఏ మాత్రం పట్టించుకోని ప్రభుత్వం
- సర్కారు రూ. 600 కోట్ల బకాయిలు చెల్లించాల్సిందే
- మంగళవారం నుంచి ఎమర్జెన్సీ సేవలూ ఆపేస్తాం
- ప్రైవేటు ఆస్పత్రుల సంఘం స్పష్టీకరణ
- నేడు ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ స్టీరింగ్ కమిటీ సమావేశం

సాక్షి, అమరావతి:

➥ కృష్ణా జిల్లా తోట్లవల్లూరుకు చెందిన షేక్ రంతు అహ్మద్ గుండెపోటు రావడంతో ఆరోగ్యశ్రీ కింద చికిత్స కోసం గురువారం విజయవాడలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రికి వచ్చారు. సర్కారు బకాయిలు చెల్లించని కారణంగా ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేశామని ఆసుపత్రి వారు చెప్పారు. బందరు రోడ్డులోని మరో ఆస్పత్రికి వెళితే అక్కడా ఇదే పరిస్థితి. దీంతో బతుకు జీవుడా అంటూ విజయవాడలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేరారు. అక్కడ కార్డియాలజీ సేవలు లేవు. ప్రాథమిక చికిత్స జరిగినా.. చేతులో డబ్బులు లేకపోవడంతో గుండె వైద్యం ఎక్కడ చేయించుకోవాలో అని భయపడుతూనే ఉన్నారు.

➥ విశాఖలోని మద్దిలపాలెంకు చెందిన కస్తూరి లక్ష్మీ తీవ్ర అస్వస్థతతో ఓ కార్పొరేట్ ఆస్పత్రికి 108 అంబులెన్సులో వెళ్లింది. ఆరోగ్యశ్రీ కార్డు ఉంది కదా అనే భరోసాతో వెళ్లిన అమెకు అక్కడ తీవ్ర నిరాశ ఎదురైంది. రెండ్రోజులుగా ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేశామని, వేరే ఆస్పత్రికి వెళ్లి వైద్యం చేయించుకోవాలని చెప్పారు. ఇలా రెండు మూడు ప్రైవేటు ఆస్పత్రులకు వెళితే అక్కడా ఇదే సమాధానమిచ్చారు. దీంతో విధిలేని పరిస్థితిల్లో కింగ్‌జార్జి ఆస్పత్రిలో చేరగా.. పడకలు లేవని వెయిటింగ్ హాలులో ఉంచారు. ఎప్పుడు వైద్యమందుతుందో తెలియని పరిస్థితి.

రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ. 600 కోట్లు బకాయిలు చెల్లించకపోవడంతో గత ఆరు రోజులుగా రాష్ట్రంలో ఉన్న ప్రైవేటు ఆస్పత్రులన్నీ ఎమర్జెన్సీ సేవలు మినహా ఇతర ఆరోగ్యశ్రీ సేవలన్నీ నిలిపేశాయి. ప్రభుత్వాస్పత్రుల్లో సరైన వైద్యం లభించకపోవడం, ప్రైవేటు ఆస్పత్రులకు వెళితే ఆరోగ్యశ్రీ ఆపేశామని చెప్పడం, చేతిలో డబ్బులు లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 435 ప్రైవేటు ఆస్పత్రులు ఆరోగ్యశ్రీ జాబితాలో ఉండగా 350కి పైగా ఆస్పత్రుల్లో వైద్యసేవలు నిలిచిపోయాయి. తమకు బకాయిలు చెల్లించే వరకూ సేవలు పునరుద్ధరించలేమని కుండబద్ధలు కొట్టినట్టు చెప్పేశాయి. దీనిపై ఇప్పటివరకూ ప్రభుత్వం కూడా స్పందించలేదు. దీంతో రోగులు పెద్ద జబ్బుల చికిత్సకు ఎక్కడకు వెళ్లాలో తెలియక సతమతమవుతున్నారు. రోజూ రెండువేల మందికి పైగా ప్రీ ఆథరైజేషన్ (ఆరోగ్యశ్రీ వైద్యానికి అనుమతులు) ఇస్తుండగా, ఇప్పుడా సంఖ్య 200కు పడిపోయింది. కొన్ని చిన్న చిన్న నర్సింగ్‌హోంలు మినహా 50 పడకలు దాటిన ఆస్పత్రులన్నీ ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేశాయి. ఉద్యోగులు, పెన్షనర్లకు అందించాల్సిన నగదు రహిత వైద్యాన్ని కూడా నిలిపివేశామని ఏపీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల సంఘం ప్రతినిధులు స్పష్టం చేశారు. బకాయిలు చెల్లించే వరకూ సేవలు పునరుద్ధరించలేమని ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు చెప్పేశాయి. అయితే అసలు సమ్మె లేదని, అన్ని ఆస్పత్రులు సేవలు అందిస్తున్నాయని, కావాలని కొందరు అలా చెబుతున్నారని ఆరోగ్యశ్రీ సీఈఓ చెబుతుండటం గమనార్హం.

ఎమర్జెన్సీ సేవలూ నిలిపివేస్తాం..

నెల రోజుల కిందటే బకాయిలు చెల్లించాలని నోటీసు ఇచ్చాం. అయినా ప్రభుత్వం స్పందించలేదు. సోమవారం ఆరోగ్యశ్రీ ట్రస్ట్ స్టీరింగ్ కమిటీ సమావేశం జరుగుతోంది. ఇక్కడ స్పష్టమైన హామీ రాకపోతే మంగళవారం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల సంఘం అత్యవసర సమావేశమై ఎమర్జెన్సీ సేవలు నిలిపివేసేందుకు పూనుకుంటాం. డయాలసిస్, కీమో థెరపీ వంటి సేవలను కూడా నిలిపివేసే విషయమై చర్యలు తీసుకుంటాం. ఏవో కొన్ని ఆస్పత్రులు పనిచేస్తుంటే అంతా బాగుంది అని ప్రభుత్వం చెప్పుకుంటోంది.

– ఏపీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల సంఘం(ఆశా)

జైళ్ల శాఖ మినిస్ట్రీరియల్ సర్వీస్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): జైళ్ల శాఖ మినిస్ట్రీరియల్ సర్వీస్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. విజయవాడలోని ఎన్జీవో హోంలో అసోసియేషన్ అడహక్ కమిటీ ఎన్నిక ఆదివారం జరిగింది. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షునిగా ఇ.డి.డి.రవి వర్మ, అసోసియేట్ అధ్యక్షునిగా ఎ.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శులుగా కిరణ్, టి.రవి, ఎం.సుబ్రహ్మణ్యం, కె.మైథిలి, సురేష్‌రాజు, కిషోర్ కుమార్, బలరాంలను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని ఏపీజేఏసీ చైర్మన్ పి.అశోక్‌బాబు, చంద్రశేఖరరెడ్డి అభినందించారు.

'యాదవులకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి'

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): యాదవుల అభ్యున్నతికి తక్షణమే యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు మేకల రాములు యాదవ్ డిమాండ్ చేశారు. విజయవాడ ధర్నాచౌక్‌లో సమితి ఆధ్వర్యంలో ఆదివారం న్యాయపోరాట దీక్ష జరిగింది. ఈ దీక్షలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ బడ్జెట్ కేటాయింపుల్లో యాదవులకు అన్యాయం జరుగుతోందన్నారు. విశాఖ జిల్లా చోడవరంలో యాదవ కులానికి చెందిన మైనర్ బాలిక హత్య ఘటనపై సీబీఐ దర్యాప్తు చేయించాలని కోరారు.

'సగరులను బీసీ-ఏలో చేర్చాలి'

కోలవెన్ను (కంకిపాడు): సగరులను బీసీ–డీ నుంచి బీసీ–ఏలో చేర్చాలని ఆంధ్రప్రదేశ్ సగర సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నక్కా శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం కృష్ణా జిల్లా కోలవెన్నులో ఆదివారం జరిగింది. శ్రీనివాసరావు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలోనూ ఈ అంశాన్ని చేర్చిందన్నారు. హామీని విస్మరించకుండా బీసీ–డీ నుంచి బీసీ–ఏగా మార్పు చేస్తూ సగరుల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్టీగా మార్పు చేసేందుకు కేంద్రానికి సిఫార్సు చేయాలన్నారు. సగర కోఆపరేటివ్ ఫెడరేషన్‌ను సగర కార్పొరేషన్‌గా మార్చాలని, సగరుల సంక్షేమానికి రూ.500 కోట్లు కేటాయించాలని కోరారు. 20న అన్నవరంలో బహిరంగ సభ, రాష్ట్ర కార్యవర్గ ప్రమాణ స్వీకారం నిర్వహిస్తామన్నారు.

జెమ్స్ స్కూలు విద్యార్థులకు ఊరట

పరీక్షలు నిర్వహించాలని కోర్టు ఆదేశాలు

మంగళగిరి: లింగమనేని ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా మంగళగిరి మండలంలోని కాజ గ్రామంలో నిర్వహిస్తున్న జెమ్స్ స్కూలులో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఎట్టకేలకు ఊరట కలిగింది. సీబీఎస్ఈ అనుమతి లేకున్నా ఉందని నమ్మించి లక్షల రూపాయల ఫీజులు వసూలు చేసిన స్కూలు యాజమాన్యం పదో తరగతి పరీక్షలకు గడువు ముగిసిన అనంతరం తమ పాఠశాలకు అనుమతి లేదని చెప్పి విద్యార్థులను మోసగించిన వైనం విదితమే. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు గత రెండు నెలలుగా పలు రకాలుగా పోరాటాలు చేసినా ప్రభుత్వంతో పాటు అధికారుల్లోనూ చలనం లేకపోవడంతో దిక్కుతోచని స్థితిలో తల్లిదండ్రులు కోర్టును ఆశ్రయించారు. పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన కోర్టు.. విద్యార్థులకు సీబీఎస్ఈ సిలబస్‌లోనే తప్పనిసరిగా పరీక్షలు నిర్వహించాలంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు విద్యాశాఖ ఉన్నతాధికారులు, స్కూలు యాజమాన్యానికి ఈ నెల నాలుగో తేదీన ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ఉత్తర్వుల కాపీ తమకు ఆదివారం అందిందని విద్యార్థుల తల్లిదండ్రులు వెల్లడించారు.

ఎన్ఐఏ దర్యాప్తుతో దోషులు బయటకొస్తారు

- వైఎస్సార్‌సీపీ మాజీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి
- కోడికత్తితో పొడిపించుకుంటే ప్రాణం విలువ తెలుస్తుంది
- డీజీపీ, చంద్రబాబు ప్రోద్బలంతోనే జగన్‌పై హత్యాయత్నం



ఏలూరు టౌన్: ప్రతిపక్ష నేత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై హత్యాయత్నం కేసును ఎన్ఐఏకు అప్పగించడం శుభపరిణామమని, ఆ సంస్థ దర్యాప్తులో అసలు దోషులెవరో బయటకు వస్తారని వైఎస్సార్ సీపీ ఉభయగోదావరి జిల్లాల సమన్వయకర్త, మాజీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి చెప్పారు. ఏలూరు నియోజకవర్గ బూత్ కమిటీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, ఎన్ఐఏకు ఏపీ పోలీసులు సహకరించకపోవడం అత్యంత దారుణమన్నారు. కోడికత్తి దాడి అంటూ హేళనగా మాట్లాడడం సిగ్గుచేటని, ఒకసారి అదే కోడికత్తితో పొడిపించుకుంటే ప్రాణాలు పోతాయో లేదో తెలుస్తుందని సూచించారు. సీఎం చంద్రబాబు, డీజీపీ ప్రోద్బలంతోనే జగన్‌పై హత్యాయత్నం జరిగిందని సుబ్బారెడ్డి ఆరోపించారు. అందుకే అప్పటికప్పుడు డీజీపీ మీడియా సమావేశం నిర్వహించారని తెలిపారు. రాష్ట్రంలో సీఎం చంద్రబాబు కేవలం దోచుకోవడానికే తన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలకు ట్రైనింగ్ ఇస్తున్నారని, ప్రజాపాలన వదిలేశారని ఆరోపించారు. ప్రజలు రాబోయే ఎన్నికల్లో ఆ పార్టీకి గట్టిగా బుద్ధిచెబుతారని హెచ్చరించారు. రాష్ట్రంలో చంద్రబాబు అరాచకపాలన సాగిస్తున్నారని, ప్రజల జీవితాలతో చెలగాటమాడే ఈ ప్రభుత్వానికి చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. దేశంలోనే ఏ నాయకుడూ చేయలేని విధంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 15 నెలలుగా రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్ర చేస్తూ 3,600 కిలోమీటర్లు పూర్తి చేసుకుంటున్నారని, దేశంలోనే చరిత్ర సృష్టించబోతున్నారని తెలిపారు. కష్టాల్లో, సమస్యల్లో, ఇబ్బందుల్లో ఉన్న ప్రజలకు భరోసా కల్పిస్తూ వారిలో మనోధైర్యాన్ని నింపుతూ టీడీపీపై పోరాటం చేస్తున్నారని, ప్రజలంతా వైఎస్ జగన్‌ను ఆశీర్వదించాలని కోరారు. ప్రత్యేక హోదా విషయంలో కేంద్రంలోని బీజేపీతో నాలుగున్నరేళ్లు కలిసి కాపురం చేసి మరోసారి ఎన్నికలు సమీపిస్తున్న వేళ తన తప్పులను కప్పిపుచ్చుకోవడానికి చంద్రబాబు కుటిల రాజకీయాలు, కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు నిర్మాణాల్లో భారీస్థాయిలో అవినీతికి పాల్పడిన చంద్రబాబు ప్రభుత్వాన్ని ప్రజలు క్షమించరని, తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. సమావేశంలో ఏలూరు సమన్వయకర్త, ఎమ్మెల్సీ ఆళ్లనాని, ఏలూరు పార్లమెంట్ సమన్వయకర్త కోటగిరి శ్రీధర్ ఉన్నారు.

ఎన్నికల్లో ధన ప్రభావాన్ని నియంత్రించాలి

ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణంరాజు

గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): ఎన్నికల్లో ధన ప్రభావం తగ్గించకపోతే ప్రజాస్వామ్యానికి ముప్పు వాటిల్లుతుందని ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.వి.ఆర్.కృష్ణంరాజు ఆందోళన వ్యక్తం చేశారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో బెటర్ ఆంధ్రప్రదేశ్ (బాప్) ఆధ్వర్యంలో ఓటర్లను ప్రలోభపెట్టే చర్యలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపరిచేందుకు రూపొందించిన వాల్‌పోస్టర్‌ను ఆదివారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 2004 ఎన్నికల్లో గెలిచిన వారిలో 30 శాతం మంది కోటీశ్వరులు కాగా.. 2014 నాటికి వారి సంఖ్య 82 శాతానికి పెరిగిందన్నారు. అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ అంచనా ప్రకారం 2014 లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో ఆయా పార్టీలు అనధికారికంగా రూ.35 వేల కోట్లు ఖర్చు చేశాయని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ఈ వ్యయం రూ.50 వేల కోట్లు దాటే అవకాశం ఉందన్నారు. అధిక భాగాన్ని ఓట్ల కొనుగోలుకే వెచ్చిస్తున్నారని చెప్పారు. ధన ప్రభావం వల్ల చట్టసభల్లోకి మేధావులు, ప్రజా సంఘాల నాయకులు అడుగుపెట్టలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

బ్రాహ్మణ సేవా సంఘ అధ్యక్షునిగా శ్రీకాంత్



సత్తెనపల్లి: బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షునిగా జ్వాలాపరపు శ్రీకాంత్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గుంటూరు జిల్లా సత్తెనపల్లిలోని సత్యధ్యాన మందిరంలో ఆదివారం నిర్వహించిన సమాఖ్య రాష్ట్ర సర్వసభ్య సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. అనంతపురానికి చెందిన శ్రీకాంత్ వరుసగా మూడోసారి రాష్ట్ర అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ రాష్ట్రంలో బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్న బ్రాహ్మణులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘ నాయకులు, తదితరులు ఉన్నారు.

ఇక పెట్రోల్ బంకుల్లోనూ ఫాస్ట్ ట్యాగ్ కార్డులు

సాక్షి, అమరావతి: జాతీయ రహదారుల్లోని టోల్‌ప్లాజాల వద్ద వేచి చూసే అవసరం లేకుండా వాహనాలు నేరుగా వెళ్లేందుకు వీలుగా తీసుకొచ్చిన ఫాస్ట్ ట్యాగ్ కార్డులు ఇకపై పెట్రోల్ బంకుల్లో కూడా లభించనున్నాయి. ఈ మేరకు చమురు సంస్థలతో నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్ఏఐ) ఒప్పందం చేసుకుంది. ఇప్పటివరకు బ్యాంకుల్లోనే ఈ కార్డులను విక్రయిస్తున్నారు. ఇప్పుడు ఎన్‌హెచ్ఏఐ తీసుకున్న నిర్ణయంతో పెట్రోల్ బంకుల్లో కూడా ఫాస్ట్ ట్యాగ్‌లను కొనవచ్చు. సాధారణంగా పండగ సీజన్‌లలో, రద్దీ సమయాల్లో టోల్ ప్లాజాల వద్ద కిలోమీటర్ల మేర వాహనాలు బారులు తీరుతున్నాయి. దీంతో ప్రయాణ సమయం అధికమవుతోంది. పెట్రోల్ బంకుల్లోనూ ఫాస్ట్ ట్యాగ్‌లను అందుబాటులోకి తేవడం వల్ల హైవేలపై ప్రయాణ సమయం తగ్గనుంది. కాగా, యాప్‌ల ద్వారా కూడా ఫాస్ట్ ట్యాగ్‌లను అందుబాటులోకి తెచ్చేందుకు ఎన్‌హెచ్ఏఐ ఏర్పాట్లు చేస్తోంది.

చంద్రన్న బెల్లంలో సెల్‌ఫోన్ సర్క్యూట్ బోర్డు



పుల్లలచెరువు: ప్రభుత్వం సంక్రాంతి కానుకల్లో భాగంగా బెల్లం, శనగపప్పు, నూనె, నెయ్యి, గోధుమపిండి వంటి వస్తువులను రేషన్‌కార్డు వినియోగదారులకు సరఫరా చేసింది. ప్రకాశం జిల్లా పుల్లలచెరువు మండలం కవలకుంట్లకు చెందిన రేషన్‌కార్డుదారుడు బ్రహ్మారెడ్డికి డీలర్ ఇచ్చిన బెల్లంలో సెల్‌ఫోన్ సర్క్యూట్ బోర్డు వచ్చింది. ఇదేమి ఇలా ఉందని డీలర్‌ను ప్రశ్నిస్తే, వచ్చింది అదే అనే సమాధానం ఇచ్చాడని, నాణ్యత లేని వస్తువులను ఇవ్వడం ఎందుకని బ్రహ్మారెడ్డి ప్రశ్నించారు.

'వారికి పదవీకాలం పెంచే యోచన తగదు'

అవనిగడ్డ: రాష్ట్ర, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు ఏడాది పాటు పదవీకాలాన్ని పెంచే ఆలోచన సరికాదని, దీన్ని విరమించుకోవాలని పీఆర్‌టీయూ ఏపీ వర్కింగ్ ప్రెసిడెంట్ దేవరపల్లి సురేష్‌బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కృష్ణా జిల్లా అవనిగడ్డలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వృత్తే దైవంగా భావించి, విద్యార్థుల అభ్యున్నతికి పాటుపడుతున్న ఉపాధ్యాయులు ఎందరో ఉన్నారని చెప్పారు. పదవీ కాలం పెంపు నిర్ణయాన్ని పీఆర్‌టీయూ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని చెప్పారు. చిత్తశుద్ధితో పనిచేసే ఉపాధ్యాయులను అవార్డులకు ఎంపిక చేస్తే తప్పులేదని, పైరవీలు, ప్రచారం కోసం పనిచేసే ఉపాధ్యాయులకు ప్రయోజనం చేకూర్చేలా చర్యలు చేపడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

పోలవరం మెయిన్ కాంట్రాక్టర్ చంద్రబాబే



- డాక్టర్ రాజశేఖరరెడ్డి పూర్తి చేసిన ప్రాజెక్టులకు లస్కర్‌లా గేట్లు ఎత్తిన చంద్రబాబు
- తానే పనులు పూర్తి చేసినట్లు బిల్డప్ ఇస్తూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు
- వైఎస్సార్‌సీపీ నేత వల్లభనేని బాలశౌరి

విజయవాడ సిటీ: ఆరోగ్యశ్రీ, 108, ఫీజు రీయింబర్స్‌మెంట్, పులిచింతల, సాగునీటి ప్రాజెక్టులు ఇలా అన్నీ చూస్తే గుర్తుకువచ్చే వ్యక్తి మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అని, కానీ రోడ్డు మీద యూటర్న్ బోర్డు చూసినా... ఊసరవెల్లిని చూసినా గుర్తొచ్చే వ్యక్తి చంద్రబాబునాయుడు అని వైఎస్సార్ సీపీ నేత, మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గ సమన్వయకర్త వల్లభనేని బాలశౌరి ధ్వజమెత్తారు. విజయవాడలోని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టు మెయిన్ కాంట్రాక్టర్ చంద్రబాబు అని, అక్కడ పనులు చేస్తున్నది సబ్ క్రాంటాక్టర్లేనన్నారు. ప్రధాని మోదీకి దండాలు పెట్టి పోలవరం ప్రాజెక్టును లాక్కొని బిల్డప్‌లు ఇస్తున్నారని ఆరోపించారు. డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న హయాంలో పోలవరం ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి, అన్ని అనుమతులు తీసుకుని భూ సేకరణ చేశారని గుర్తు చేశారు. దాదాపు రూ.వేల కోట్లు రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించి కాల్వలు తవ్వించారని తెలిపారు. చంద్రబాబు వచ్చి వాటికి మోటార్లు పెట్టి స్విచ్ఛ్ ఆన్ చేసి గొప్పలు చెప్పుకుంటున్నారన్నారు. గేట్లు ఎత్తడం, స్విచ్ ఆన్ చేయడం అనేది లస్కర్లు చేసే పని అని, ఆ పని చేసి గొప్పలు చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ''పోలవరం అవార్డ్స్, అక్కడ భారీగా పనులు జరుగుతున్నట్లు రాస్తున్న వార్తలన్నీ పెయిడ్ ఆర్టికల్స్‌గా ఆయన అభివర్ణించారు.

ఎప్పుడు ఏం మాట్లాడతాడో?

చంద్రబాబు ఏం మాట్లాడతాడో ప్రజలకు అర్థంకాదని తెలిపారు. 2014లో సోనియాగాంధీని దెయ్యం అన్న చంద్రబాబే 2018లో దేవత అంటాడు. 2014లో మోదీ ఈ దేశానికి ప్రధాని కావడం చాలా అవసరమన్న ఆయనే నేడు మోదీ ఓ మోసగాడు అని ప్రచారం చేస్తున్నాడు. చంద్రబాబు ఎవరిని ఎప్పుడు తిడతారో, ఎప్పడు పొగుడుతారో రాష్ట్ర ప్రజానీకానికి అర్థంకాని పరిస్థితి అని అన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై హత్యాయత్నం జరిగితే హేళన చేస్తూ మాట్లాడిన సీఎం తన బాధ్యతను మరిచారన్నారు.

99 లక్షల దరఖాస్తులు

- జన్మభూమి–మా ఊరు కార్యక్రమంలో పేదల నుంచి దరఖాస్తుల వెల్లువ
- ఇళ్ల కోసం ఏకంగా 30.86 లక్షల దరఖాస్తులు.. స్థలాలకు మరో 19 లక్షలు
- పింఛన్ల కోసం 15 లక్షలు, రేషన్ కార్డుల కోసం 21 లక్షల దరఖాస్తులు
- ఆంక్షలతో 32 లక్షల దరఖాస్తులు తిరస్కరణ
- అర్హులని తేల్చి కూడా 20.81 లక్షల దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టిన ప్రభుత్వం
- దీంతో 'జన్మభూమి'లో నిలదీతలు.. అధికార నేతలకు చేదు అనుభవాలు

సాక్షి, అమరావతి



అర్హులందరికీ పింఛన్లు, రేషన్‌కార్డులు, ఇళ్లు, ఇంటి జాగాలు ఇచ్చేశామని రాష్ట్ర ప్రభుత్వం చెబుతుండగా.. మరోవైపు 'జన్మభూమి–మా ఊరు' కార్యక్రమాన్ని లక్షలాది దరఖాస్తులు ముంచెత్తుతున్నాయి. ఇళ్లు మంజూరు చేయలేదంటూ, స్థలాలు కేటాయించలేదంటూ, పింఛన్లు, రేషన్ కార్డులు తదితరాల కోసం పేదల నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి లక్షలాది దరఖాస్తులు అందుతున్నాయి. నవంబర్ నెలాఖరున రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన జిల్లా కలెక్టర్ల సదస్సులోనే ఆర్టీజీఎస్ ఇచ్చిన ప్రజెంటేషన్‌లో 99 లక్షలకు పైగా పేదల నుంచి దరఖాస్తులు వచ్చినట్లు తేల్చారు. ఐదు విడతల జన్మభూమి కార్యక్రమంలో ఇంత పెద్దఎత్తున దరఖాస్తులు వచ్చినా కూడా వాటిని పరిష్కరించకుండా పెండింగ్‌లో పెట్టేశారు. ఈ నేపథ్యంలో జరుగుతున్న ఆరో విడత జన్మభూమి కార్యక్రమంలో ప్రజలు తమ ఆవేదనను వెళ్లగక్కుతున్నారు. ఐదేళ్లయిపోతున్నా పింఛన్లు, ఇళ్లు ఇవ్వరా అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబునే నిలదీస్తున్నారు. మంత్రులు, ఇతర అధికార నేతలకు సైతం ప్రజల నుంచి చేదు అనుభవం తప్పడం లేదు. అయినా కూడా పేదలందరికీ అన్నీ ఇచ్చేశామంటూ ముఖ్యమంత్రి ప్రచారం చేసుకోవడం గమనార్హం. కేవలం పది శాఖలకు చెందిన పథకాల కోసమే ఏకంగా 99,08,297 మంది పేదలు దరఖాస్తు చేసుకున్నట్లు తేలింది. ఇందులో ఏకంగా 32,11,595 దరఖాస్తులను రాష్ట్ర ప్రభుత్వం తిరస్కరించింది. మరోవైపు అర్హుల్లోని 20.81 లక్షల మందినేమో పెండింగ్‌లో పెట్టేశారు. ఆర్టీజీఎస్ పేరుతో రకరకాల ఆంక్షలు విధిస్తూ.. పేదలకు పథకాలు అందకుండా చేస్తున్నారు. ప్రాసెస్ చేయలేదని, మ్యాపింగ్ కాలేదంటూ కొన్ని లక్షల దరఖాస్తులను మూలన పడేశారు.

పది శాఖలకు చెందిన పథకాల కోసం వచ్చిన దరఖాస్తులు

రంగం	దరఖాస్తులు	తిరస్కరణ	మంజూరు చేయకుండా పెండింగ్‌లో పెట్టినవి
గృహాలు	30,86,259	11,23,291	6,40969
ఇళ్ల స్థలాలు	19,85,956	12,68,779	3,63,832
పెన్షన్లు	15,23,020	4,25,823	2,98,136
రేషన్ కార్డులు	21,04,914	82,429	22,352
మౌలిక వసతులు	2,79,603	56,924	2,05,502
మంచినీటి సరఫరా	2,39,983	79,675	1,41,546
రహదారులు	2,39,816	84,647	1,30,202
లేఅవుట్స్	1,98,093	53,873	1,32,704
గ్రామీణ నీటి సరఫరా	1,48,146	19,871	92,570
వ్యవసాయ రుణమాఫీ	1,02,507	16,283	53,959
మొత్తం	*99,08,297*	*32,11,595*	*20,81,772*

ప్రజా సంకల్ప యాత్ర

338వ రోజు

ఇప్పటి వరకు నడిచిన దూరం

3,618 కిలో మీటర్లు

338వ రోజు నడిచిన దూరం

10.8 కిలో మీటర్లు

ప్రారంభం: ఉదయం 7.30 గంటలకు లక్కవరం క్రాస్

ముగింపు: తలతంపర

ముఖ్యాంశాలు

- శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నియోజకవర్గం సోంపేట మండలంలోని లక్కవరం క్రాస్, పలాసపురం, జింకిబద్ర క్రాస్, సోంపేట పట్టణం, కంచిలి మండలంలోని ఇసుకలపాలెం, మండపల్లి క్రాస్, తలతంపర గ్రామాల ప్రజలతో మమేకం.

నేటి పాదయాత్ర షెడ్యూల్

ప్రారంభం: ఉ. 7.30 గంటలకు తలతంపర

ముఖ్యాంశాలు

- ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని తలతంపర, బల్లిపుట్టుగ, కుసుంపురం, బొరివంక, బెజ్జిపుట్టుగ, జగతి గ్రామాల ప్రజలతో మమేకం

మా భూములను మింగేశారయ్యా..

- టీడీపీ నేతల దాష్టీకాలపై వైఎస్ జగన్‌కు మత్స్యకారుల ఫిర్యాదు
- పార్టీ వివక్షతో సంక్షేమ పథకాలు అందకుండా చేస్తున్నారని పలువురి ఆవేదన
- అందరి సమస్యలు విని ధైర్యం చెప్పిన ప్రతిపక్ష నేత
- పోటెత్తిన సోంపేట
- అడుగడుగునా జగన్‌కు ఘనస్వాగతం

ప్రజా సంకల్ప యాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి



వెలమలకు ప్రత్యేక కార్పొరేషన్‌ను ప్రకటించిన జగన్‌కు ఇసుకలపాలెంక్రాస్‌లో కృతజ్ఞతలు చెబుతున్న ఆ సంఘం నేతలు

తమ భూములను టీడీపీ నేతలు ఆక్రమించేస్తున్నారంటూ మత్స్యకారులు, తిత్లీ తుపానుకు తీవ్రంగా నష్టపోయినా ఇంతవరకూ పరిహారం ఇవ్వలేదంటూ బాధితులు, డయాలసిస్ వసతి సామర్థ్యాన్ని పెంచాలంటూ కిడ్నీ వ్యాధిగ్రస్తులు.. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులమని సంక్షేమ పథకాలు అందకుండా చేస్తున్నారని పలువురు బాధితులు.. ఇలా వివిధ వర్గాల ప్రజలు వైఎస్ జగన్ ఎదుట తమ కష్టాలు ఏకరవు పెట్టారు. టీడీపీ పాలనలో అష్టకష్టాలు పడుతున్నామని, మీరొస్తేనే మాకు మంచి జరుగుతుందంటూ ఆశాభావం వ్యక్తం చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రజా సంకల్ప యాత్ర 338వ రోజు ఆదివారం శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నియోజకవర్గం సోంపేట, కంచిలి మండలాల్లోని లక్కవరం, జింకిబద్ర, బంజరునారాయణపురం, ఇసుకలపాలెం, తలతంపర, మజ్జిపుట్టిగ గ్రామాల్లో సాగింది. ఈ సందర్భంగా పలు వర్గాల ప్రజలు తమ కష్టాలను వైఎస్ జగన్ ఎదుట ఏకరవుపెట్టారు.

ప్రతిపక్ష నేతకు సమస్యల నివేదన

బారువ కొత్తూరు గ్రామంలో మత్స్యకారులకు చెందిన 40 ఎకరాలను టీడీపీ నేతలు ఆక్రమించారంటూ ఆ ప్రాంత మత్స్యకారులు వైఎస్ జగన్ దృష్టికి తెచ్చారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాగానే తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. మొన్నటి తిత్లీ తుపానుకు తీవ్రంగా నష్టపోయిన బాధితులు వైఎస్ జగన్‌ను కలిసి.. తమకు ఇంత వరకు పరిహారం ఇవ్వలేదని ఫిర్యాదు చేశారు. పార్టీ వివక్ష చూపుతూ ఈ టీడీపీ ప్రభుత్వం దివ్యాంగులకు కూడా పింఛన్‌లు ఇవ్వడం లేదంటూ బారువ కొత్తూరుకు చెందిన భాగ్యలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులు ఎక్కువగా ఉన్న ఈ ప్రాంతంలో అందుబాటులో ఉన్న డయాలసిస్ వసతి సామర్థ్యాన్ని పెంచాలని ప్రతిపక్ష నేతకు విజ్ఞప్తి చేశారు. ఇంకా పలువురు బాధితులు తమ సమస్యలపై వినతిపత్రాలు, ఫిర్యాదులు అందించారు. అందరి సమస్యలు సావధానంగా విన్న జగన్.. మనందరి ప్రభుత్వం రాగానే అందరి కష్టాలు తీరతాయని హామీ ఇచ్చారు. దళిత మహానాడు ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో మహిళలు, యువకులు తరలివచ్చి వైఎస్ జగన్‌కు మద్దతు ప్రకటించారు. ఆయన అధికారంలోకి వస్తేనే బడుగు, బలహీన వర్గాలకు సంక్షేమ కార్యక్రమాలు పెద్దఎత్తున అమలవుతాయన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.



మండపల్లి క్రాస్‌రోడ్డులో వైఎస్ జగన్‌తో అడుగులేస్తున్న ఓ అన్న



దివ్యాంగుడు ఇచ్చిన వినతిపత్రాన్ని పరిశీలిస్తున్న ప్రతిపక్ష నేత



సోంపేట రోడ్డులో వైఎస్ జగన్ అడుగులో అడుగులేస్తున్న జనవాహిని



మండపల్లి క్రాస్ రోడ్డులో ప్రతిపక్ష నేతతో కరచాలనం చేసేందుకు పోటీపడుతున్న ఆర్టీసీ ప్రయాణికులు



చిన్నారితో ఆప్యాయంగా..

కిక్కిరిసిన సోంపేట

వైఎస్ జగన్ పాదయాత్ర సోంపేట మండల కేంద్రానికి చేరుకున్నప్పుడు జనం పోటెత్తారు. వీధులన్నీ కిక్కిరిసి పోయాయి. పొరుగునే ఉన్న పలాస అసెంబ్లీ నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న గౌతు శ్యాంసుందరశివాజీ సొంత మండలం అయిన ఈ మండల కేంద్రంలో.. జగన్ రాకకు కొన్ని గంటల ముందు నుంచే ఆయన కోసం ఎదురు చూశారు. వైఎస్ జగన్ వారి సమీపానికి రాగానే.. ప్రజలు మరింత ముందుకొచ్చి ఆయనను కలిసేందుకు ఉత్సాహం చూపారు. యువత, అక్కచెల్లెమ్మలు ప్రతిపక్ష నేతతో సెల్ఫీలు దిగి తమ సంతోషాన్ని, సంఘీభావాన్ని వ్యక్తం చేశారు. టీడీపీకి పట్టున్న ఈ ప్రాంతంలో జగన్‌పై ప్రజాభిమానం కట్టలు తెంచుకుంది. ఆ ప్రాంతంలో ఎటుచూసినా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బెలూన్లే.. ఎక్కడ చూసినా పండుగ వాతావరణమే. యువత ఉత్సాహంగా కేరింతలు కొడుతూ జై జగన్.. నినాదాలతో హోరెత్తించారు.



అవ్వతో ఆత్మీయంగా..



లక్కవరం క్రాస్ వద్ద ఓ తాత కష్టాలు విని ధైర్యం చెపుతున్న జగన్

ప్రజాసంకల్ప యాత్ర మరిన్ని చిత్రాల కోసం QR code స్కాన్ చేయండి

ప్రజా సంకల్ప యాత్ర మరిన్ని చిత్రాలు టాబ్లాయిడ్‌లో

ఖాతాలేని బ్యాంకులో తిత్లీ పరిహారాన్ని వేశారట



నాకు ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంక్‌లో ఖాతా లేదు. యాప్ కూడా డౌన్‌లోడ్ చేసుకోలేదు. నెట్ బ్యాంకింగ్‌పై అవగాహన లేదు. తిత్లీ తుపానుకు నాలుగెకరాల కొబ్బరితోట దెబ్బతింది. నష్ట పరిహారం రూ.1.24 లక్షలు మంజూరైంది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో నా ఖాతా నంబర్ ఇచ్చాను. నా ఎయిర్‌టెల్ నెట్‌వర్క్ ఆధారంగా పేమెంట్ బ్యాంక్‌లో నష్టపరిహారం జమచేసినట్లు అధికారులు చెబుతున్నారు. పేమెంట్ బ్యాంక్ ఖాతా లేకుండా ఎలా జమ చేశారో అర్థ కావడం లేదు. అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా స్పందించడం లేదు. *– నలియా నారాయణ, బంజిరి నారాయణపురం, కంచిలి మండలం*

టీడీపీ హయాంలో ఉద్యోగాల భర్తీ లేదు..



అన్నా.. టీడీపీ హయాంలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడం లేదు. బీఎస్సీ నర్సింగ్ హోం, విశాఖపట్నంలో ఎంపీహెచ్‌డబ్ల్యూ విభాగంలో శిక్షణ పూర్తిచేశాను. ఇంతవరకూ ఉద్యోగం రాలేదు. ఆరోగ్యశాఖలో ఖాళీలను భర్తీచేసి నిరుద్యోగులను ఆదుకోవాలి. *– తమరాన శిరీష, పలాసపురం, సోంపేట మండలం*

దౌర్జన్యం చేసి భూములను ఆక్రమిస్తున్నారు



అన్నా.. టీడీపీ నాయకులు దౌర్జన్యం చేసి మత్స్యకారులకు చెందిన భూములను ఆక్రమించుకుంటున్నారు. మా గ్రామంలో 40 ఎకరాలను ఆక్రమించారు. దివ్యాంగురాలినైన నేను వైఎస్సార్‌సీపీ అభిమానులమని పింఛన్ కూడా రానివ్వకుండా చేస్తున్నారు. మీ నాన్నగారు వైఎస్సార్ హయాంలో పింఛన్ మంజూరైంది. తర్వాత టీడీపీ హయాంలో తొలగించారు. *– అమర భాగ్యలక్ష్మి, బారువ కొత్తూరు, సోంపేట మండలం*

▶ మొదటి పేజీ తరువాయి

వేల కోట్లు దోచుకున్నట్లు అందులో వివరించింది. వాటాల కోసం అత్యంత విలువైన భూములు ఫప్పుబెల్లాల్లా ధారాదత్తం చేసిన విషయాన్ని.. విపత్తులవల్ల నష్టపోయిన రైతులకు నిధులలేమి పేరుతో రూ.2,350 కోట్ల పెట్టుబడి రాయితీ, బకాయిలు ఎగవేసి కాగితాలకే పరిమితమైన పరిశ్రమలకు పారిశ్రామిక ప్రోత్సాహకాల పేరుతో కోట్లకొద్దీ నిధులు విడుదల చేయడాన్ని ఆ పుస్తకంలో పార్టీ ప్రస్తావించింది. అందులోని ముఖ్యాంశాలు..

నాలుగున్నరేళ్లలో చంద్రబాబు దోపిడీ 6.17 లక్షల కోట్లు


'జలవనరు'ల్లో జలగలు



జలవనరుల శాఖలో అంతులేని దోపిడీ సాగింది. గత నాలుగన్నరేళ్లలో ఈ శాఖలో రూ.1,01,422.42 కోట్లు అక్రమాలు సాగాయి. 2014లో చంద్రబాబు అధికారంలోకి రాగానే పాత కాంట్రాక్టర్లను తొలగించారు. ధరలు తగ్గినా పనుల అంచనాలను భారీగా పెంచేశారు. కమీషన్లు ఇచ్చే అస్మదీయ సంస్థలకే పనులు కట్టబెట్టారు. అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు ఐవైఆర్ కృష్ణారావు, సత్యప్రకాష్ ఠక్కర్ వ్యతిరేకించినా వారిని ఖాతరు చేయకుండా ధరల సర్దుబాటు కింద కాంట్రాక్టర్లకు అదనపు నిధులు ఇచ్చేందుకు జీవో–22 జారీచేశారు. ఆ తర్వాత అదనపు చెల్లింపుల కోసం జీవో 63 జారీచేశారు. ఇలా గత నాలుగన్నరేళ్లలో రూ.62,132 కోట్లు ఖర్చుచేస్తే ఇందులో సగం రూ.32,000 కోట్లు కమీషన్ల రూపంలో కొట్టేశారు. మరోవైపు.. 23 ప్రాజెక్టుల తొలి అంచనా వ్యయం గత నాలుగన్నరేళ్లలో రూ.37,952.92 కోట్ల నుంచి రూ.96,060.78 కోట్లకు పెరిగింది.

బినామీలకే పోల'వరం'..: పోలవరం ప్రాజెక్టును 2018 ఖరీఫ్ నాటికి పూర్తిచేస్తామని, ఆయకట్టుకు గ్రావిటీ ద్వారా నీరందిస్తామని 2014 జూన్ 8న సీఎంగా ప్రమాణస్వీకారం సందర్భంగా చంద్రబాబు ప్రకటించారు. 2018 ఖరీఫ్ ముగిసినా ఈ ప్రాజెక్టు పనుల్లో సరైన పురోగతిలేదు. కానీ, దీని అంచనా వ్యయాన్ని మాత్రం రూ.16,010.45 కోట్ల నుంచి రూ. 57,940.86 కోట్లకు పెంచడం ద్వారా రూ.25 వేల కోట్ల దోపిడీకి స్కెచ్ వేశారు. పోలవరం హెడ్ వర్క్స్‌లో పనులన్నీ సబ్ కాంట్రాక్టర్లకు అప్పగించడం ద్వారా సీఎం, మరో కీలకమంత్రి భారీ కమీషన్లు పొందారు. బాబు బినామీ అయిన సీఎం రమేష్ చెప్పిన మాట వేదవాక్కులా నడుస్తోంది.

అంతులేని భూకబ్జాలు



రాష్ట్రంలో భూకబ్జాలకు అడ్డూ అదుపూలేదు. ఒక్క విశాఖపట్నం జిల్లాలోనే లక్ష కోట్ల రూపాయల భూకుంభకోణం జరిగింది. ఏకంగా లక్ష ఎకరాల భూ రికార్డులను మాయంచేసి ప్రభుత్వ పెద్దల పేర్లతో రాయించుకున్నారు. ఉదా..

- మంత్రి గంటా శ్రీనివాసరావు బంధువు భాస్కరరావు, ఇతరుల పేరుతో వాటిని బ్యాంకుల్లో తాకట్టు పెట్టి రుణం కూడా తెచ్చుకున్నారు. పలు మండలాల్లో 533 ఎకరాల పేదల భూములను మంత్రి గంటా శ్రీనివాసరావు తదితరులు కొట్టేశారు.
- విశాఖ జిల్లా పెందుర్తి మండలం ముదపాలకలోని 955 ఎకరాల అసైన్డ్ భూములను కూడా నేతలు మింగేశారు.
- 1,993 ఎకరాల వక్ఫ్ భూములను కూడా కైవసం చేసుకున్నారు. ఈ కుంభకోణంలో మంత్రుల పాత్ర ఉందని సాక్షాత్తూ ఆ జిల్లా మంత్రి అయ్యన్నపాత్రుడే ఆధారాలతో సహా ప్రకటించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన తనయుడు నారా లోకేష్ పాత్ర ఉన్నందున 'సిట్' అంటూ మూసేశారు.
- విశాఖ జిల్లా రుషికొండలో రూ.వెయ్యి కోట్ల విలువైన భూములను సీఎం బంధువు ఎంవీవీఎస్ మూర్తి కుటుంబీకులు కబ్జా చేశారు. దేవదాయ, ఈనాం, వక్ఫ్ భూములనూ మింగేశారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ ఇదే తంతు.

వాటాల కోసం అస్మదీయులకు ధారాదత్తం



పరిశ్రమలు ఏర్పాటుచేయకపోయినా అత్యంత విలువైన భూములను పప్పుబెల్లాల మాదిరిగా కట్టబెట్టి సీఎం చంద్రబాబు వాటాలు పొందుతున్నారు. అందుకు ఉదాహరణలు..

- విశాఖలో రూ.400 కోట్ల విలువైన 25 ఎకరాలను ఫ్రాంక్లిన్ టెంపుల్టన్‌కు రూ.13 కోట్లకే ధారాదత్తం చేశారు.
- ఇదే జిల్లాలో ఫైవ్‌స్టార్ హోటల్, షాపింగ్ మాల్ కోసమంటూ రూ.905 కోట్ల విలువైన 12.52 ఎకరాల స్థలాన్ని నామమాత్రపు లీజుకు కట్టబెట్టారు.
- కృష్ణాజిల్లా గన్నవరంలో రూ.250 కోట్ల విలువైన ఆర్టీసీ స్థలాన్ని హెచ్‌సీఎల్‌కు సంతర్పణ చేశారు.
- మంత్రి లోకేష్ మిత్రుడికి చెందిన ఈ–సెంట్రిక్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు రూ.338 కోట్ల విలువైన భూమిని రూ.25 కోట్లకే కట్టబెట్టారు. – విశాఖ జిల్లాలో పేదల ఇళ్ల నిర్మాణం, ప్రభుత్వ సంస్థలకు ఇచ్చిన భూములను లాక్కుని సీఎం సమీప బంధువు ఎంవీవీఎస్ మూర్తి కుటుంబానికి చెందిన 'గీతం' యూనివర్సిటీకి, కృష్ణాజిల్లా జగ్గయ్యపేటలో రూ.498 కోట్ల విలువైన భూములను 4.98 కోట్లకే ఇదే కుటుంబానికి చెందిన విశాఖపట్నం బాట్లింగ్ కంపెనీ (వీబీసీ) కెమికల్ అండ్ ఫెర్టిలైజర్స్ కంపెనీకి, తిరుపతిలో 'గల్లా'కు చెందిన మంగళ్ ఇండస్ట్రీస్‌కు కారుచౌకగా భూములు కట్టబెట్టారు. తూర్పు గోదావరి, వైఎస్సార్, శ్రీకాకుళం జిల్లాల్లో ఎన్టీఆర్ ట్రస్టుకు రూ.133.5 కోట్ల విలువైన భూములను కేటాయించారు.

రాజధాని కుంభకోణం



రాజధాని అమరావతిని చంద్రబాబు అంతర్జాతీయ కుంభకోణంగా మార్చేశారు. రాజధానికి 5 వేల ఎకరాలు చాలని నిపుణులు చెబుతున్నప్పటికీ 34 వేల ఎకరాలు సమీకరించారు. ప్రభుత్వ భూమి దీనికి అదనం. ఇక్కడ ఎకరా రూ.4 కోట్లు విలువైన స్థలాలను అస్మదీయులకు రూ.50 లక్షలు.. కొందరికి ఇంకా తక్కువకే కేటాయించారు.

అస్మదీయులకు రూ.లక్ష కోట్లు



అమరావతి ప్రాంతంలో రాజధాని ఏర్పాటుపై లీకులతో బాబు బినామీలు, అస్మదీయులు ఆ ప్రాంతంలో 25 వేల ఎకరాలకుపైగా కొనుగోలు చేశారు. అనంతరం రాజధాని అక్కడే ఏర్పాటుకావడంతో లక్ష కోట్ల వరకూ లబ్ధిపొందారు. అసైన్డ్ భూముల రైతుల్లోనూ భయాందోళన రేకెత్తించి చౌకగా వాటిని కొనుగోలు చేశారు. మంత్రులు నారాయణ, లోకేష్, ప్రత్తిపాటి పుల్లారావు, ఎంపీ మాగంటి మురళీమోహన్, స్పీకర్ కోడెల తనయుడు కోడెల శివరామకృష్ణ, ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రచౌదరి, ఎమ్మెల్సీ పయ్యావుల కేశవ్‌తోపాటు బాబు బినామీలెందరో ఇక్కడ ముందుగానే భూములు కొన్నారు. మంత్రి నారాయణ రూ.14,400 కోట్ల విలువైన 3,129 ఎకరాలను రూ.432 కోట్లకే కొన్నారు. ప్రత్తిపాటి పుల్లారావు రూ.784 కోట్ల విలువైన 196 ఎకరాలను రూ.39 కోట్లకే కొనుగోలు చేశారు.



చంద్రబాబు అవినీతిపై రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరించిన ప్రతిపక్ష నేత వైఎస్ జగన్, భూమన తదితర నేతలు

చంద్రబాబు దోపిడీని జాతీయ స్థాయిలో చాటుతాం

'అవినీతి చక్రవర్తి' పుస్తకావిష్కరణ సందర్భంగా వైఎస్ జగన్

ప్రజాసంకల్ప యాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి: అవినీతి చక్రవర్తి అయిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని దోచేశారని, ఆయన గత నాలుగున్నరేళ్ల తన పాలనలో రూ 6,17,585 కోట్ల మేరకు అవినీతికి పాల్పడ్డారని ఏపీ ప్రతిపక్ష నేత, వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఎండగట్టారు. 'అవినీతి చక్రవర్తి' (ఎంపరర్ ఆఫ్ కరప్షన్) పేరుతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి అవినీతిపై రూపొందించిన పుస్తకాన్ని జగన్ ఆదివారం పాదయాత్ర శిబిరం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ... ''చంద్రబాబు ఈ నాలుగున్నరేళ్ల పాలనలో రూ 6,17,585 కోట్ల మేరకు అవినీతికి పాల్పడ్డారు. చంద్రబాబు చేసిన అవినీతిని, అన్యాయాలను సాక్ష్యాధారాలు, ప్రభుత్వం జీవో నెంబర్లతో సహా ఈ పుస్తకం రూపంలో ముద్రించాం. ఆయన అవినీతికి పాల్పడిన ప్రతి అంశాన్నీ వివరంగా పుస్తకంలో పొందుపర్చాం. ఈ పుస్తకాన్ని అన్ని దర్యాప్తు సంస్థలకు అందజేస్తాం. దేశంలోని రాజ్యసభ, లోక్‌సభ ఎంపీలకు, ప్రధానమంత్రి, రాష్ట్రపతి, గవర్నర్‌లకు, ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులకు అందరికీ దీనిని పంపిస్తాం. చంద్రబాబు ఎంత అవినీతిపరుడో... ఈ నాలుగున్నరేళ్లలో ఆంధ్రప్రదేశ్‌ను ఎంత దారుణంగా దోచుకున్నాడో అందరికీ తెలిసేలా చేస్తాం'' అన్నారు. కార్యక్రమంలో పార్టీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ప్రధాన కార్యదర్శులు భూమన కరుణాకర్‌రెడ్డి, తలశిల రఘురామ్ పాల్గొన్నారు.

స్విస్ ఛాలెంజ్ ఓ దోపిడీ పథకం

స్టార్టప్ ఏరియా అభివృద్ధి ప్రాజెక్టును సింగపూర్ కన్సార్టియంకు అప్పగించేందుకు అనుసరించిన స్విస్ ఛాలెంజ్ విధానం మొత్తం దోపిడీ పథకమే. ఈ నోటిఫికేషన్‌ను కోర్టు కూడా తప్పుబట్టడంతో దానిని రద్దుచేసి మరో నోటిషికేషన్ జారీచేశారు. గ్లోబల్ టెండర్లు పిలవకుండా స్విస్ ఛాలెంజ్ పేరుతో సింగపూర్ కన్సార్టియంకు రాజధాని స్టార్టప్ ఏరియా ప్రాజెక్టు పనులను కట్టబెట్టారు. ఖజానాకు రూ.6,623 కోట్ల నష్టం కలిగించే ఈ ప్రాజెక్టు కుంభకోణం ఖరీదు రూ.66,000 కోట్లు.

రూ.35,000కోట్ల అగ్రిగోల్డ్ కుంభకోణం



40 లక్షల మంది డిపాజిటర్లు, ఏజెంట్లను ముంచి అగ్రిగోల్డ్ ఆస్తులను కొట్టేసేందుకు చంద్రబాబు పక్కా స్కెచ్ వేశారు. పేదల నుంచి డిపాజిట్లు సేకరించి బోర్డు తిప్పేసిన అగ్రిగోల్డ్‌కు చెందిన హాయ్‌ల్యాండ్, ఇతర ఆస్తులను హైకోర్టు వేలంవేసి ఆ మొత్తాన్ని డిపాజిటర్లకు ఇవ్వాలని ఆదేశించింది. అయితే, ఈ ఆస్తులను కొనేందుకు ముందుకు వచ్చిన ఎస్సెల్ గ్రూపు సంస్థ ప్రతినిధులను ఢిల్లీలో అర్ధరాత్రి కలిసిన బాబు వారిని వెనక్కు వెళ్లేలా చేశారు.

నీరు–చెట్టుతో రూ.34,399 కోట్లు..



రాష్ట్రంలో నీరు–చెట్టు ద్వారా అస్మదీయ కాంట్రాక్టర్లకు రూ.12,866 కోట్ల బిల్లులు చెల్లించారు. వారు చేసిన పనుల విలువ మాత్రం రూ. 3,216.5 కోట్లు అయితే.. దోచుకున్న మొత్తం రూ.9,649.5 కోట్లు. కుంటలు, వాగుల్లో తవ్విన పూడిక మట్టి, ఇసుక అమ్మకం ద్వారా మింగిన మొత్తం రూ.24,750 కోట్లు. ఈ పథకం ద్వారా టీడీపీ నేతల మేత మొత్తం రూ.34,399 కోట్లు. ఇవి కాకుండా విద్యుత్ కొనుగోలులో మరో 21,000 కోట్లు మింగేశారు. పవన విద్యుత్ పేరుతో రూ.11,625 కోట్లు దండుకున్నారు.

ఆక్టోపస్‌లా విస్తరించిన అవినీతి



రాష్ట్రంలో గత నాలుగన్నరేళ్లలో చంద్రబాబు అండ్ కో అవినీతి ఆకాశమే హద్దుగా సాగుతోంది. కమీషన్లు, ముడుపులు, వాటాలు, దందాల ద్వారా ఏకంగా రూ.3 లక్షల కోట్లకు పైగా అక్రమంగా ఆర్జించారు. రాష్ట్రంలో అధికార పార్టీ ఎమ్మెల్యేలదే ఇష్టారాజ్యంగా మారింది. ఉచితం పేరుతో ఇసుక దోపిడీకి తెరలేపారు. రాజధాని ముసుగులో రియల్ ఎస్టేట్ ద్వారా దోచుకున్నారు. సాగునీటి ప్రాజెక్టులన్నీ అస్మదీయ సంస్థలకే అప్పగించారు. ప్రాజెక్టుల అంచనా వ్యయం పెంపు ద్వారా నేరుగా చంద్రబాబుకే ముడుపులందాయి. అసెంబ్లీని ఎమ్మెల్యేల ఆక్షన్ హాల్‌గా మార్చేశారు. వైఎస్సార్‌సీపీకి చెందిన 23 మంది ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి వారిలో నలుగురికి మంత్రి పదవులు కూడా కట్టబెట్టారు. అయినా, స్పీకరు వారిపై అనర్హత వేటు వేయకుండా అసెంబ్లీ వ్యవస్థను అపహాస్యం చేశారు. రాష్ట్రంలో దోచుకున్న సొమ్ములో కొంత మొత్తాన్ని తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలకు కూడా పంపించారు. *– మాజీ సీఎస్ అజేయ కల్లం*

గత నాలుగున్నరేళ్లలో రంగాల వారీగా అవినీతి (రూ. కోట్లలో)

జలవనరుల శాఖ	: 1,01,422.42
భూకబ్జాల పర్వం	: 1,74,757.17
రాజధాని భూముల మాయాజాలం	: 1,66,000
కుంభకోణాల్లో కాజేసిన మొత్తం	: 1,60,903.6
గనుల శాఖలో దందా	: 14,502
మొత్తం	: 6,17.585.19

తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం..

- 10 మంది అయ్యప్ప భక్తుల దుర్మరణం
- మృతులంతా తెలంగాణలోని మెదక్ జిల్లా వాసులే



మృతి చెందిన అయ్యప్ప భక్తులు

సాక్షి, చెన్నై: తమిళనాడులోని పుదుకొట్టై జిల్లా తిరుమయం వద్ద ఆదివారం కంటైనర్ లారీ రూపంలో మృత్యువు 10 మంది అయ్యప్ప భక్తుల్ని కబళించింది. శబరిమలై అయ్యప్పను దర్శించి, రామేశ్వరంలో పవిత్ర స్నానాలు ముగించుకుని తిరుగు పయనంలో ఉన్న ఆ భక్తులు ప్రయాణిస్తున్న వ్యానును కంటైనర్ లారీ ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో మరో ఐదుగురు తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. తెలంగాణలోని మెదక్ జిల్లా నర్సాపూర్ మండలంలోని ఖాజీపేట, మంతూర్, రెడ్డిపల్లి, చిన్న చింతకుంట, సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం మంగాపూర్‌లకు చెందిన 14 మంది అయ్యప్ప భక్తుల బృందం నాలుగు రోజుల క్రితం శబరిమలైకి వ్యాన్‌లో వెళ్లింది. అయ్యప్ప దర్శనానంతరం ఈ భక్తులు రామేశ్వరానికి వెళ్లారు. అక్కడ దర్శనం చేసుకుని రామేశ్వరం–పుదుకొట్టై రాష్ట్ర రహదారిలో తిరుగు ప్రయాణమయ్యారు. ఆదివారం మధ్యాహ్నం మూడున్నర గంటల సమయంలో వీరు ప్రయాణిస్తున్న వ్యాన్ తిరుమయం సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న ఓ కంటైనర్ అతి వేగంగా దూసుకొచ్చి వ్యాన్‌ను ఢీకొంది.

లారీ వేగమే ప్రమాదానికి కారణం: లారీ ఢీకొన్న వేగంతో వ్యాన్ ముందు భాగం నుజ్జునుజ్జయింది. ఆ శకలాలను తొలగించి సహాయక చర్యలు చేపట్టారు. అప్పటికే డ్రైవర్ సహా 8 మంది ఘటనాస్థలంలోనే విగత జీవులయ్యారు. వారి మృతదేహాల్ని బయటకు తీసి, క్షతగాత్రులను పుదుకొట్టై మెడికల్ కళాశాల ఆస్పత్రికి తరలించారు. ఏడుగురిని ఆసుపత్రికి తరలించగా.. మార్గం మధ్యలో మరో ఇద్దరు మరణించారు. ప్రమాద సమాచారాన్ని స్థానిక అధికారులు తెలంగాణ పోలీసులకు తెలియజేశారు. మృతదేహాల్ని పోస్టుమార్టం తర్వాత స్వస్థలాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. లారీ డ్రైవర్ నిద్ర మత్తులో వాహనాన్ని అతి వేగంగా నడపడమే ఈ ప్రమాదానికి కారణంగా పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనలతో మెదక్ జిల్లా నర్సాపూర్, సంగారెడ్డి జిల్లా హత్నూర మండలాల్లోని మృతుల గ్రామాల్లో తీవ్ర విషాదం నెలకొంది. దుర్ఘటనపై సీఎం కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

9న ఏయూ స్నాతకోత్సవం

546 మందికి డాక్టరేట్‌లు

ఏయూ క్యాంపస్ (విశాఖ తూర్పు): ఆంధ్ర విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం ఈ నెల 9వ తేదీన జరగనుంది. స్నాతకోత్సవానికి గవర్నర్ నరసింహన్ హాజరుకానున్నారు. ముఖ్య అతిథిగా విచ్చేయనున్న ఐఐటీ ఢిల్లీ సంచాలకులు ఆచార్య వి.రామ్‌గోపాలరావుకు వర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేయనుంది. ఈ ఏడాది కళాప్రపూర్ణ, క్రీడా ప్రపూర్ణ అవార్డులు ఎవ్వరికీ ప్రకటించలేదు. స్నాతకోత్సవంలో 546 మంది డాక్టరేట్‌లు, ఆరుగురు ఎంఫిల్ పట్టాలు అందుకోనున్నారు.

శాసనాల లోగిలి ఓజిలి

ఓజిలిలో క్రీస్తుశకం 9వ శతాబ్దికి చెందిన శాసనం లభ్యం



వెంకటగిరి: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఓజిలి గ్రామంలో క్రీస్తుశకం తొమ్మిదో శతాబ్దానికి చెందిన రాచరిక వీరగల్లు శాసనం లభ్యమైనట్లు వెంకటగిరికి చెందిన చరిత్రకారుడు షేక్ రసూల్ అహ్మద్ తెలిపారు. ఆదివారం ఆయన సాక్షితో మాట్లాడుతూ గ్రామానికి దక్షిణం వైపు ఉన్న పురాతన శివాలయంలో ఆలయం మండపం పై భాగంలో అమర్చిన క్రీస్తుశకం 9వ శతాబ్దానికి చెందిన శాసనాన్ని గుర్తించినట్లు తెలిపారు. ఈ శాసనంలో వీరుడు ఏనుగుపై కూర్చుని కుడిచేతిలో కత్తి పట్టుకుని ఎడమచేయి పైకెత్తి దారి చూపుతున్నట్లు ఉందని తెలిపారు.

చంద్రబాబును కలిసిన సినీనటుడు అలీ

సాక్షి, అమరావతి: సినీ నటుడు అలీ ముఖ్యమంత్రి చంద్రబాబును ఆదివారం కలిశారు. ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసానికి వచ్చిన అలీ ఆయనతో 15 నిమిషాలు మాట్లాడారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో అలీ చేరుతున్నట్లు కొద్దిరోజులుగా ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఆయన చంద్రబాబును కలవడం చర్చనీయాంశమైంది. చంద్రబాబు ఆయన్ను పిలిపించుకుని మాట్లాడినట్లు తెలుస్తోంది. చంద్రబాబును కల్సిన తర్వాత ఆయన జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను కలిశారు.

ముగిసిన సైనిక పాఠశాల ప్రవేశ పరీక్ష

కలికిరి: అఖిల భారత సైనిక పాఠశాల ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగినట్లు కలికిరి సైనిక పాఠశాల ప్రధాన అధ్యాపకులు కెప్టెన్ విక్రాంత్ కిషోర్ తెలిపారు. రాష్ట్రంలోని ఒంగోలు, కర్నూలు, తిరుపతి, అనంతపురం, కడప, నెల్లూరు, కలికిరి పట్టణాల్లో మొత్తం 12 కేంద్రాల్లో 4,285 మందికి గాను 3,700 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు ఆయన తెలిపారు.

పారదర్శకం కాదు.. అంతా రహస్యమే



నాలుగున్నరేళ్లలో 1,588 రహస్య ఉత్తర్వులు జారీ

'దేశంలో ఎక్కడా లేని రీతిలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకున్నాం. రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్‌టీజీఎస్) ఏర్పాటు చేశాం. పరిపాలనకు సంబంధించిన అన్ని అంశాలను డ్యాష్ బోర్డులో పెట్టాం. అవినీతి, అక్రమాలకు అడ్డుకట్ట వేశాం. నలభై ఏళ్ల అనుభవంతో పారదర్శక పాలనను ప్రజలకు అందిస్తున్నాం'.. ఇవీ నాలుగున్నరేళ్లుగా సీఎం చంద్రబాబు పదే పదే చెబుతోన్న మాటలు..

అయితే..

నాలుగున్నరేళ్లలో ఒకటి.. రెండు కాదు ఏకంగా 1,588 రహస్య ఉత్తర్వుల (కాన్ఫిడెన్షియల్ జీవోలు)ను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. వీటిలో సీఎం చంద్రబాబు నిర్వహిస్తున్న సాధారణ పరిపాలన విభాగం నుంచే 486 జీవోలు జారీ చేయడం గమనార్హం. దీంతో చంద్రబాబు మాటలకు, చేతలకూ ఏమాత్రం పొంతన లేదని స్పష్టమవుతోంది.

పారదర్శక పాలన ముసుగులో.. అడ్డగోలుగా రహస్య ఉత్తర్వులు జారీ చేస్తూ వేలాది కోట్ల రూపాయల ప్రజాధనాన్ని బినామీలకు దోచిపెడుతున్నారు. అక్రమాల బాగోతంపై సీబీఐ దర్యాప్తు చేస్తుందేమో అనే భయంతో దానికి విచారణ చేయడానికి సాధారణ అనుమతిని నిరాకరిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను సైతం గోప్యంగా ఉంచడం దీనికి పరాకాష్ట..

- ఇందులో సీఎం నేతృత్వంలోని సాధారణ పరిపాలన విభాగం నుంచే 486 జీవోలు
- రాయితీల పేరుతో బినామీలకు రూ.వేల కోట్ల ప్రజాధనాన్ని దోచిపెడుతూ గోప్యంగా ఉత్తర్వులు
- టీడీపీ ప్రజాప్రతినిధులు, కీలక నేతలపై క్రిమినల్ కేసులు ఎత్తివేత
- వ్యవస్థలను నిర్వీర్యం చేయడంతో పాలన గాడితప్పిందని సీనియర్ ఐఏఎస్ అధికారుల ఆందోళన

సాక్షి, అమరావతి: పారదర్శక పరిపాలన అంటే.. అవినీతి, అక్రమాలు, ఆశ్రిత పక్షపాతం లేకుండా ప్రజలకు సేవలు అందించడం.. ప్రభుత్వం చేసే ప్రతి పనిని ప్రజలకు తెలియజేయడం. కానీ.. రాష్ట్రంలో పరిస్థితి తద్భిన్నంగా ఉంది. అక్రమాలే ఆలంబనగా.. ఆశ్రిత పక్షపాతమే ఊపిరిగా పాలిస్తూ.. దేశంలో ఎక్కడా లేని రీతిలో పారదర్శక పాలన అందిస్తున్నామని సీఎం చంద్రబాబు ప్రకటనలు చేస్తుండటంపై సీనియర్ ఐఏఎస్ అధికారులే విస్తుపోతున్నారు. ఆర్‌టీజీఎస్, డ్యాష్ బోర్డుల పేరుతో వ్యవస్థలను నిర్వీర్యం చేసి అక్రమార్జనకు బాటలు వేసుకున్నారని విమర్శిస్తున్నారు. దేశంలో ఎన్నో పోరాటాలు.. ఉద్యమాల ఫలితంగా 2005లో కేంద్రం సమాచార హక్కు చట్టాన్ని అమల్లోకి తెచ్చింది. ఈ చట్టం అవినీతి, అక్రమాలకు అడ్డుకట్ట వేస్తుందని ఉద్యమకారులు భావించారు. ప్రజలు ప్రభుత్వం నుంచి తమకు కావాల్సిన సమాచారాన్ని తెలుసుకోవచ్చని అనుకున్నారు. కానీ.. రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం ప్రజాధనాన్ని అడ్డూఅదుపూ లేకుండా దోచేసి.. వాటిని గోప్యంగా ఉంచేందుకు రహస్య ఉత్తర్వులు జారీ చేస్తుండటం గమనార్హం. 2014లో ఎన్నికల ప్రచారం సందర్భంగా దేశంలో తానే అత్యంత సీనియర్ నాయకుడినని.. తనకు ఉన్న అనుభవంతో.. పారదర్శక పాలన ద్వారా సంక్షోభంలో ఉన్న రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానంటూ చంద్రబాబు పలు వాగ్దానాలు చేశారు. అంతేకాకుండా పంట రుణాల మాఫీ, డ్వాక్రా రుణాల మాఫీ వంటి 600లకుపైగా హామీలు ఇచ్చారు. వీటిని నమ్మి ఓటర్లు టీడీపీకి అధికారాన్ని అప్పగించారు. అప్పటి నుంచి ప్రభుత్వం ఇచ్చిన హామీలను, చేసిన వాగ్దానాలను అటకెక్కించేసింది.

ఇంత దాపరికం దేనికి?

ప్రభుత్వ పెద్దలు పరిశ్రమల ఏర్పాటు ముసుగులో బినామీలకు అత్యంత విలువైన భూములను కారుచౌకగా కట్టబెట్టారు. పరిశ్రమల యాజమాన్యాలు పెట్టే పెట్టుబడులకు నాలుగింతలు అధికంగా రాయితీలు ఇచ్చేశారు. విదేశీ పర్యటనలు, పెట్టుబడి భాగస్వామ్య సదస్సులు, రాజధాని శంకుస్థాపనల పేరుతో వేలాది కోట్ల రూపాయలను దుర్వినియోగం చేశారు. టీడీపీ ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కీలక నేతలపై నమోదైన క్రిమినల్ కేసులపై విచారణను ఉపసంహరించారు. దీనికి సంబంధించిన ఉత్తర్వులను జారీ చేస్తే అక్రమాలు బహిర్గతమవుతాయని భావించారు. దీంతో విశేషాధికారాలను అడ్డుపెట్టుకుని ఈ అక్రమాల పర్వాన్ని దాచిపెడుతూ రహస్య ఉత్తర్వుల జారీకి శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో సీఎం చంద్రబాబు నేతృత్వంలోని సాధారణ పరిపాలన విభాగం నుంచే 486 రహస్య ఉత్తర్వులు జారీ చేశారు. అదేవిధంగా డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి నిర్వహిస్తున్న రెవెన్యూ శాఖ ద్వారా 409 జీవోలు, మరో డిప్యూటీ సీఎం చినరాజప్ప సారథ్యంలోని హోం శాఖ నుంచి 132 జీవోలు, మంత్రి యనమల రామకృష్ణుడు నిర్వహిస్తున్న ఆర్థిక శాఖ నుంచి 101 ఉత్తర్వులను జారీ చేసి గోప్యంగా ఉంచారు. ఈ నాలుగున్నరేళ్లలో మొత్తం 1,588 రహస్య ఉత్తర్వులు జారీ కావడాన్ని గమనిస్తే ప్రభుత్వం ఎంత గోప్యతను పాటిస్తుందో అర్థమవుతోంది. పారదర్శక పాలన అందిస్తున్నామని చంద్రబాబు చెబుతోన్న మాటల్లో వాస్తవముంటే.. ఈ ఉత్తర్వులను రహస్యంగా జారీ చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రజాసంఘాల నేతలు ప్రశ్నిస్తున్నారు.

కేసుల నుంచి తప్పించుకోవడానికే..

దేశంలో ఏదైనా రాష్ట్రంలో సీబీఐ ప్రవేశించాలంటే ఆ రాష్ట్ర ప్రభుత్వాల సాధారణ అనుమతి అవసరం. దీన్ని ప్రతి ఆర్నెళ్లకు ఒకసారి రాష్ట్ర ప్రభుత్వం పొడిగించడం సాధారణం. ఇదే రీతిలో అనుమతిని పొడిగిస్తూ గతేడాది ఆగస్టు 3న జీవో 109ని జారీ చేశారు. ఇంతలోనే కేంద్ర దర్యాప్తు సంస్థలు రంగంలోకి దిగితే రాష్ట్రంలో తాను, తన అనుయాయులు సాగించిన అక్రమాల బాగోతం బయటపడిపోతుందని సీఎం చంద్రబాబు ఆందోళన చెందారు. దీంతో సీబీఐకి రాష్ట్రంలో ప్రవేశాన్ని నిరాకరిస్తూ నవంబర్ 8న ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులనూ రహస్యంగా ఉంచడం గమనార్హం. ప్రభుత్వం ఇలా చేయడాన్ని సీనియర్ ఐఏఎస్ అధికారులు సైతం తీవ్రంగా తప్పుపడుతున్నారు. ప్రభుత్వం ఎలాంటి తప్పులు, అవినీతి చేయకపోతే రహస్య ఉత్తర్వులు ఎందుకు జారీ చేశారని ప్రశ్నిస్తున్నారు. అక్రమాలను కప్పిపుచ్చుకోవడానికే సీబీఐకి రాష్ట్రంలో ప్రవేశించేందుకు అనుమతిని నిరాకరిస్తూ ఉత్తర్వులు జారీ చేశారని అంటున్నారు. రియల్ టైమ్ గవర్నెన్స్ అంటే.. దోచుకున్న సొమ్మును దాచుకోవడమేనని సీనియర్ ఐఏఎస్ అధికారి ఒకరు బాహాటంగా వ్యాఖ్యానించడం కొసమెరుపు.

రాజ్యాంగాన్ని అవమానిస్తున్నారు

- జగన్‌పై హత్యాయత్నం కేసు ఎన్ఐఏకు అప్పగించమన్న కోర్టు ఆదేశాలు అవహేళన చేస్తున్నారు
- శాసనమండలి ప్రతిపక్ష నేత ఉమ్మారెడ్డి



సాక్షి, గుంటూరు: రాజ్యాంగానికి అతీతంగా నిర్ణయాలు తీసుకునే హక్కు తమకు ఉందన్నట్టు సీఎం చంద్రబాబు వ్యవహరిస్తున్నారని శాసనమండలి ప్రతిపక్ష నేత ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు విమర్శించారు. గుంటూరులోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విశాఖ ఎయిర్‌పోర్టులో రాష్ట్ర ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై జరిగిన హత్యాయత్నంపై డీజీపీ, సీఎం ప్రవర్తన తీరు చాలా అభ్యంతరకరమన్నారు. హత్యాయత్నం జరిగిన గంటలో డీజీపీ స్పందిస్తూ.. జగన్‌మోహన్‌రెడ్డి అభిమాని పబ్లిసిటీ కోసం చేశారని పేర్కొన్నారని, విలేకరుల సమావేశం ఏర్పాటు చేసిన సీఎం చాలా చులకనగా నవ్వుతూ హేళనగా మాట్లాడారని గుర్తుచేశారు. ఈ హత్యాయత్నం కుట్ర వెనుక సూత్రధారులు ఎవరో వెలికితీయాలనే ఉద్దేశంతోనే ఎయిర్‌పోర్ట్‌లో జరిగిన ఈ సంఘటనపై కేంద్ర ప్రభుత్వ పరిధిలోని సంస్థతో దర్యాప్తు నిర్వహించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కేంద్ర హోంమంత్రిని కలిసి కోరామని ఉమ్మారెడ్డి చెప్పారు. తమ వినతులు, నిబంధనలను పరిశీలించి ఎన్ఐఏకు కేసు అప్పగించాలని కేంద్రం నిర్ణయించిందని, హైకోర్టు కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని సమ్మతిస్తూ కేసును ఎన్ఐఏకు అప్పగించాలని ఆదేశించిందని వివరించారు.

హైకోర్టు ఆదేశాలు బేఖాతరు...

హైకోర్టు ఆదేశాల మేరకు రాజ్యాంగబద్ధంగా ఏర్పడ్డ ఎన్ఐఏకు కేసు అప్పగించమని చెప్పినా రాష్ట్ర ప్రభుత్వం బేఖాతరు చేసిందని ఉమ్మారెడ్డి వివరించారు. శనివారం హైకోర్టు ఆదేశాల మేరకు ఎన్ఐఏ అధికారులు విశాఖకు వెళ్లి కేసుకు సంబంధించిన రికార్డులు అప్పగించమని కోరగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి తమకు ఉత్తర్వులు, కోర్టు నుంచి డైరెక్షన్ లేదని సిట్ అధికారులు సమాధానం చెప్పి ఎన్ఐఏ అధికారులను వెనక్కి పంపడం హేయమైన చర్యన్నారు. ఇది ముమ్మాటికీ రాజ్యాంగబద్ధమైన సంస్థను అవమానపరచడమేనన్నారు.

నీతి, నిజాయతీ లేని ప్రభుత్వమిది: పార్టీ గుంటూరు పార్లమెంటు నియోజకవర్గ సమన్వయకర్త కిలారి రోశయ్య మాట్లాడుతూ ఈ ప్రభుత్వానికి ఎక్కడా నీతి నిజాయితీ లేదని మండిపడ్డారు. ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా కేసు దర్యాప్తులో ఎన్ఐఏకు పూర్తి స్థాయిలో సహకరించాలన్నారు. రాష్ట్ర ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో గట్టిగా బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

బ్రాహ్మణుల సంక్షేమానికి రూ.1,000 కోట్లు

- వైఎస్సార్‌సీపీ విజయవాడ సెంట్రల్ సమన్వయకర్త మల్లాది విష్ణు
- సత్తెనపల్లిలో బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న మల్లాది విష్ణు, పక్కన బ్రాహ్మణ సంఘ నాయకులు

సత్తెనపల్లి: రాష్ట్రంలో బ్రాహ్మణుల సంక్షేమం కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రానున్న ఎన్నికల మేనిఫెస్టోలో రూ.వెయ్యి కోట్ల నిధులు వెచ్చించేందుకు రూపకల్పన జరుగుతోందని వైఎస్సార్‌సీపీ విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త మల్లాది విష్ణు చెప్పారు. గుంటూరు జిల్లా సత్తెనపల్లిలోని సత్యధ్యాన మందిరంలో ఆదివారం బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా బ్రాహ్మణులు సంతోషంగా ఉండాలని, నిరుపేద బ్రాహ్మణులను గుర్తించి పేదరిక నిర్మూలనకు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి కృషి చేశారని, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కూడా కృషి చేస్తుందన్నారు. సంక్షేమం బోర్డు పెట్టామని తెలుగుదేశం ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోందని, నిధులు మాత్రం కేటాయించడం లేదన్నారు. బ్రాహ్మణుల స్థితిగతులను తెలుసుకునేందుకు ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యయన కమిటీని ఏర్పాటు చేశారని, 13 జిల్లాల్లో బ్రాహ్మణుల స్థితిగతులను తెలుసుకుని అధ్యయనం చేస్తున్నామన్నారు. సమావేశంలో మాజీ ఎంపీ సముద్రాల వేణుగోపాలచారి, బ్రాహ్మణ సేవా సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోనూరు సతీష్‌శర్మ తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా మల్లాది విష్ణును పూలమాలలు, దుశ్శాలువలు, మెమొంటోలతో సత్కరించారు.

'కత్తి' శ్రీనుతో వెన్నుపోటు రామాయణం రాయించండి

ఐక్య దళిత మహానాడు జాతీయ అధ్యక్షుడు చెంగయ్య ఎద్దేవా

నిడదవోలు: ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌పై హత్యాయత్నం చేసిన నిందితుడు కత్తి శ్రీనుతో రాయిస్తున్న పుస్తకానికి 'వెన్నుపోటు రామాయణం.. కోడి కత్తి భారతం' అని పేరు పెట్టాలని ఐక్య దళిత మహానాడు జాతీయ అధ్యక్షుడు కల్లూరి చెంగయ్య ఎద్దేవా చేశారు. ఆ క్రిమినల్ ఏమన్నా మహాకవా.. లేకుంటే రచయితనా పుస్తకాలు రాయడానికని ప్రశ్నించారు. పశ్చిమగోదావరి జిల్లా నిడదవోలులో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌కు లభిస్తున్న ప్రజాదారణను చూసి ప్రభుత్వ పెద్దలు ఓర్వలేకపోతున్నారని ధ్వజమెత్తారు. నిందితుడు శ్రీనివాసరావుతో చచ్చురాతలు రాయించి అవే సమాజానికి సందేశం అన్నట్టుగా ప్రచారం చేయడం శోచనీయమన్నారు. జగన్‌పై హత్యాయత్నం కేసును ఎన్ఐఏకు అప్పగిస్తే ప్రభుత్వానికి ఉలుకెందుకని ప్రశ్నించారు. నిందితుడికి ఏ శిక్షపడితే ప్రభుత్వ పెద్దలకు ఏమిటని నిలదీశారు. హైకోర్టు ఆదేశాలను గౌరవించాలని ప్రభుత్వానికి సూచించారు. సమావేశంలో తొర్లపాటి విజయ్‌కుమార్, ఉసురుమర్తి సూరి, ఉసురుమర్తి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

స్వార్థం తప్ప దేశ ప్రయోజనాల్లేవు

చంద్రబాబు, కేసీఆర్‌ల ఫ్రంట్‌లపై జేపీ వ్యాఖ్య

సాక్షి, అమరావతి: ఏపీ సీఎం చంద్రబాబు కాంగ్రెస్ ఫ్రంట్ గురించి చెప్పినా.. తెలంగాణ సీఎం కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్ గురించి మాట్లాడినా అందులో వారి రాజకీయ స్వార్థం తప్ప దేశ ప్రయోజనాలు లేవని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ వ్యాఖ్యానించారు. రెండు రోజులపాటు కొనసాగే పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు ఆదివారం విజయవాడలో మొదలయ్యాయి. తొలిరోజు సమావేశానంతరం జేపీ విలేకరులతో మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తోంది కాబట్టి ప్రజాస్వామ్య పరిరక్షణకోసం కాంగ్రెస్ పార్టీతో కలసినట్టు చంద్రబాబు చెప్పుకోవడంపై ఆయన పరోక్ష వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా కాంగ్రెస్ పార్టీనే ఉండుంటే చంద్రబాబు ఈ సమయంలోనూ కాంగ్రెస్ పార్టీ ఫ్రంట్‌లో చేరేవారా? అని ప్రశ్నించారు.

నాణ్యత లేని పనుల్లో 'రికార్డు'

- పోలవరం హెడ్ వర్క్స్ కాంక్రీట్ పనుల్లో 'గిన్నీస్ రికార్డ్' పేరుతో సర్కారు మరో నాటకం
- పూర్తి చేయడంలో వైఫల్యం.. వేల కోట్ల అవినీతి, నాణ్యతా లోపాలను కప్పిపుచ్చుకునే ఎత్తుగడ
- స్పిల్ వే కాంక్రీట్ పనుల్లో ఏమాత్రం నాణ్యత లేదంటూ తేల్చేసిన వైకే శర్మ కమిటీ


సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టు పనులను సకాలంలో పూర్తి చేయడంలో వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడం.. రూ.వేల కోట్ల దోపిడీ నుంచి ప్రజల దృష్టిని మళ్లించడం.. ఏమాత్రం నాణ్యత ప్రమాణాలు పాటించకుండా, నత్తనడకన సాగుతున్న ప్రాజెక్టు పనులు పరుగులు పెడుతున్నాయని భ్రమింపజేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మరో డ్రామాకు తెరతీశారు. హెడ్ వర్క్స్‌లో(జలాశయం) స్పిల్ వే పనుల్లో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి సోమవారం ఉదయం 8 గంటల్లోపు.. అంటే 24 గంటల్లో 28 వేల నుంచి 30 వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులు చేసి 'గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లో స్థానం దక్కించుకునే ప్రయత్నాలు చేపట్టారు. దీనిపై అమిత ప్రచారం చేసుకోవడానికి జాతీయ, అంతర్జాతీయ మీడియాను పోలవరానికి రప్పించారు.

ఒకే అధికారి రెండు పదవుల్లో..

పోలవరం స్పిల్ వే పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని 2018 సెప్టెంబరు 6న కేంద్ర జలసంఘం(సీడబ్ల్యూసీ) సభ్యులు వైకే శర్మ నేతృత్వంలోని నిపుణుల కమిటీ తేల్చిచెప్పింది. ఇకపై కాంక్రీట్ మిశ్రమంలో వినియోగించే స్టీలు, సిమెంటు, కంకర, ఇసుక వంటి వాటి నాణ్యతను సెంట్రల్ సాయిల్, మెటీరియల్ రీసెర్చ్ స్టేషన్(సీఎస్ఎంఆర్ఎస్) నిర్ధారించిన తర్వాతే పనులు చేయాలని షరతు విధించింది. కానీ, ఆదివారం సీఎస్ఎంఆర్ఎస్‌తో నిమిత్తం లేకుండానే గిన్నీస్ రికార్డుల్లో స్థానం దక్కించుకోవాలన్న ఆరాటంతో కాంక్రీట్ పనులు చేపట్టడం గమనార్హం. రాష్ట్ర క్వాలిటీ కంట్రోల్ విభాగం ఎప్పటికప్పుడు పనుల నాణ్యతను పరిశీలించిందని పోలవరం సీఈ శ్రీధర్ చెప్పారు. కానీ, ఆ పనులను పర్యవేక్షించే సీఈతోపాటు క్వాలిటీ కంట్రోల్ విభాగం సీఈ పదవిని కూడా ఆయనే నిర్వర్తిస్తుండడం గమనార్హం. అంటే, పనులు నాసిరకంగా చేసినా నాణ్యంగా ఉన్నట్లు ధ్రువీకరింపజేసి, భారీ ఎత్తున ప్రజాధనాన్ని దోచుకోవడానికి ఒకే అధికారిని రెండు పదవుల్లో నియమించినట్లు స్పష్టమవుతోంది.




పోలవరం పనుల్లో అక్రమాలు జరిగాయని పీపీఏ, కాగ్‌లు తేల్చాయని రాజ్యసభలో రాతపూర్వకంగా సమాధానం ఇచ్చిన కేంద్ర జలవనరులశాఖ సహాయ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్


On the visit to the dam construction site, it was noted by the Committee that the structures especially the spillway portions of certain blocks have some signs of bulging in concreting due to displacement of shuttering. Therefore, the Chairman directed CSMRS to carry out non-destructive test on the certain blocks of spillway portions and also tensile strength test on the

పోలవరం స్పిల్‌వే కాంక్రీట్ పనుల్లో నాణ్యతాలోపాలను ఎత్తి చూపిన కేంద్ర నిపుణుల కమిటీ



డిసెంబర్ 31న నిర్వహించిన వర్చ్యువల్ రివ్యూలో లక్ష క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనుల్లో వెనుకపడ్డారని అంగీకరించిన సీఎం చంద్రబాబు



గిన్నీస్ బుక్ రికార్డు కోసం స్పిల్‌వేలో కొన్ని బ్లాక్‌లను కాంట్రాక్టర్ ముందుగానే సిద్ధం చేసుకున్నారని తెలిపిన అధికారులు

ప్రాథమిక స్థాయి కూడా దాటని పనులు



రాష్ట్ర విభజన చట్టం ప్రకారం కేంద్రమే చేపట్టాల్సిన పోలవరం ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతలను దక్కించుకున్న తర్వాత 2018 జూన్ నాటికే పనులు పూర్తి చేసి, గ్రావిటీపై ఆయకట్టుకు సాగునీరందిస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆ తర్వాత మాట మార్చేశారు. 2019 మే నాటికి పోలవరం ప్రాజెక్టును పాక్షికంగా పూర్తి చేసి ఆయకట్టుకు నీళ్లు అందిస్తామని పదే పదే చెబుతున్నారు. ఒకవేళ మే నాటికి కాఫర్ డ్యామ్ పనులు పూర్తి చేసినా.. అప్పటికి గోదావరిలో వరద ప్రవాహం ఉండదు. ఒకవేళ వరద ప్రవాహం ఉన్నా జలాశయం నుంచి కుడి, ఎడమ కాలువలకు నీటిని సరఫరా చేయలేని పరిస్థితి. ఎందుకంటే 2009 నుంచి కాలువలకు నీటిని సరఫరా చేసే కనెక్టివిటీస్ పనులు ఆగిపోయాయి. ఆయకట్టుకు నీళ్లు అందించేందుకు వీలుగా పిల్ల కాలువలు తవ్వడం కాదు కదా కనీసం వాటిని తవ్వేందుకు సర్వే పనులు కూడా ప్రారంభించలేదు. ఇకపోతే కాఫర్ డ్యామ్‌లో 41.15 మీటర్ల ఎత్తులో నీళ్లు నిల్వ చేయాలంటే ముంపు గ్రామాల్లోని 14,196 నిర్వాసిత కుటుంబాల్లోని దాదాపు 50 వేల మందికిపైగా పునరావాసం కల్పించాలి. ఇక నీటిని నిల్వ చేస్తామని చెబుతున్న కాఫర్ డ్యామ్ పనులు ఇప్పుడిప్పుడే ప్రారంభించారు. మేలోగా 73.11 లక్షల క్యూబిక్ మీటర్ల పనులు చేయాలి. ఆలోగా పూర్తి చేయకుంటే జూన్‌లో వచ్చే వరదలకు.. అప్పటివరకూ చేసిన పనులు కూడా కొట్టుకుపోతాయని అధికారులు అంగీకరిస్తున్నారు. వీటిని పరిశీలిస్తే పోలవరం ప్రాజెక్టు పనులు కనీసం ప్రాథమిక స్థాయిని కూడా దాటలేదని తేటతెల్లమవుతోంది.

దోపిడీని కప్పిపుచ్చుకోవడానికే..


పోలవరం ప్రాజెక్టులో సీఎం చంద్రబాబు రూ.10,572 కోట్ల విలువైన పనులను నామినేషన్ విధానంలో తన కోటరీ కాంట్రాక్టర్లకు కట్టబెట్టి, భారీ ఎత్తున కమీషన్‌లు వసూలు చేసుకున్నారు. ఇప్పటివరకూ కాంట్రాక్టర్లతో కలిసి రూ.1796.58 కోట్లు దోచుకున్నారని కాగ్ నివేదిక తేల్చింది. పోలవరం పనుల్లో భారీగా అవినీతి జరిగినట్లు పోలవరం ప్రాజెక్టు అథారిటీ(పీపీఏ), కాగ్‌లు గుర్తించాయని ఇటీవల రాజ్యసభలో కేంద్ర జలవనరులశాఖ సహాయ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్ రాతపూర్వకంగా అంగీకరిస్తూ సమాధానం చెప్పారు. భూసేకరణ, సహాయ పునరావాస ప్యాకేజీ అమల్లో ఇప్పటివరకూ ఖర్చు చేసిన రూ.6,037.76 కోట్లలో రూ.1,000 కోట్లకుపైగా ప్రభుత్వ పెద్దలు దోచుకున్నారు. తాజాగా కాంక్రీట్ పనుల్లో గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించే ప్రయత్నాలను కాంట్రాక్టర్‌తో చేయించారు. కానీ, గత నెల 31న నిర్వహించిన వర్చువల్ రివ్యూలో కాంక్రీట్ పనుల్లో నిర్దేశించిన లక్ష్యంలో లక్ష క్యూబిక్ మీటర్ల పనులు చేయలేకపోయినట్లు సాక్షాత్తూ సీఎం చంద్రబాబే అంగీకరించారు. ఇదే సందర్భంలో గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించడం కోసం స్పిల్ వేలో కొన్ని బ్లాక్‌ల్లో షట్టరింగ్ వంటి పనులు ముందస్తుగా సిద్ధం చేశామని.. కాంక్రీట్ వేసే పనులు ఆదివారం చేపట్టి రికార్డు సాధించే ప్రయత్నం చేస్తామని అధికారులు వివరించారు. అంటే.. రికార్డు సాధించడం కోసం పనులు జాప్యం చేసినట్లు స్పష్టమవుతోంది.

'అగ్రిగోల్డ్'పై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు

బాధితుల బాసట కమిటీ రాష్ట్ర కన్వీనర్ లేళ్ళ అప్పిరెడ్డి




నెహ్రూనగర్(గుంటూరు): అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, చివరికి న్యాయస్థానాలకు సైతం తప్పుడు సమాచారం ఇస్తూ పక్కదారి పట్టిస్తోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అగ్రిగోల్డ్ బాధితుల బాసట కమిటీ రాష్ట్ర కన్వీనర్ లేళ్ళ అప్పిరెడ్డి విమర్శించారు. గుంటూరు పట్టాభిపురంలోని జిల్లా కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్లానింగ్ కమిటీ ఉపాధ్యక్షుడు కుటుంబరావు చేస్తున్న వ్యాఖ్యలు అగ్రిగోల్డ్ బాధితుల్లో ఆందోళన కలిగిస్తున్నాయని చెప్పారు. అగ్రిగోల్డ్ ఆస్తుల వేలం పాటలు నిర్వహిస్తున్నప్పుడు ఎక్కడ వైసీపీ అడ్డుకుందో చెప్పాలని, నగదు పంపిణీ చేస్తే అడ్డుకుందా అని ప్రశ్నించారు. అగ్రిగోల్డ్ సమస్యను పరిష్కరించడానికి ముఖ్యమంత్రి ముగ్గురు మంత్రులతో నియమించిన కమిటీ నివేదిక ఏమైందో చెప్పాలని డిమాండ్ చేశారు. 2015లో అగ్రిగోల్డ్ సమస్యపై సీఐడీ తొమ్మిది నెలల కాలపరిమితిలోనే ఆస్తులన్నింటినీ అటాచ్‌మెంట్ చేసిందని కుటుంబరావు ఆర్భాటంగా ప్రకటించారని.. అటాచ్‌మెంట్ చేస్తే కోర్టులో వీటిని ఎందుకు చూపించలేదో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం కోర్టుకు చూపించని రూ.300 కోట్ల ఆస్తులను స్వాధీనం చేసుకుని బాధితులకు పంపిణీ చేస్తామని ప్రకటించారని.. దీని వెనుక దాగి ఉన్న కుట్రపై సమాధానం చెప్పాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కోర్టుకు చూపించని ఆస్తులను బహిర్గతం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు.



చెప్పుదెబ్బకు కుక్క కాటు

కథాసారం



కేవల ప్రదర్శితాదర్శాల మీద విశ్వనాథ సత్యనారాయణ (1895–1976) ఎత్తిన కథాఖడ్గం 'మాక్లీదుర్గంలో కుక్క'. రచనాకాలం 1936. సంక్షిప్తం: సాహిత్యం డెస్క్.



ఒకసారి ఒక పెద్దమనిషి ఆడ సీమ కుక్కను స్టేషనులోకి తెచ్చాడు. వాటి రెంటికీ ప్రథమ దర్శనంలోనే ప్రణయం ఏర్పడ్డది. ఆ పెద్దమనిషి చేతిలో కర్ర ఉంది. దాన్ని చూచి మన కుక్క తన ప్రియురాలి దగ్గరికి వెళ్లింది కాదు.

మాక్లీదుర్గం రైలుస్టేషను గుంటకలు నుంచి బెంగళూరు పోయే త్రోవలో నాల్గు స్టేషనుల కివతల నున్నది. ప్లాటు ఫారం కన్న రైలు స్టేషను పదిగజాలు ఎక్కి వెళ్లాలి. రైలురోడ్డు ప్రక్కనే పెద్దకొండ ఉన్నది. దాని నిండా చెట్లూ చేమలూ, రాళ్లూ రప్పలూ ఉన్నవి. అప్పుడప్పుడు వేగోలాలు సివంగులు రాత్రిళ్లు స్టేషనులోకి వస్తూ ఉంటవి. స్టేషనుకి వెనుక పెద్దలోయ ఉన్నది. లోయ కవతలతట్టు ఉన్న కొండ మీద నెవరిదో భాగ్యవంతులది పెద్ద సౌధం ఉన్నది.

మాక్లీదుర్గం స్టేషను చిన్నది. అందులో చిన్న అంగడి ఉంది. రైళ్లు వచ్చేవేళకూ పోయేవేళకూ అంగడి తెరచి ఉంటుంది. ఒక కుక్క అంగడి తెరచినప్పుడల్లా అక్కడ తయారు. అంగడి ఎత్తుగా ఉంటుంది. కుక్క తన చూపు అంగడిలోని పళ్లికలలో ఉన్న మిఠాయి మీద పడే అంత సమరేఖలో నుంచుకొని ఊర్ధ్వ దృష్టితో తపస్సు చేస్తుంది. వాడంగడి సర్దేటప్పుడైనా, యెవడైనా కొనుక్కునేటప్పుడైనా చిన్న ముక్క జారిపడుతుందేమో అని యెదురు చూస్తూ ఉంటుంది. వారానికో పదిరోజులకో అట్లా యెప్పుడూ పడదుగాని, పది రోజుల క్రింద చేసిన పకోడీ కొనుక్కున్నవాడు చద్దివాసన వేసి పారేస్తే కుక్క దాన్ని నోటితో అగావుగా పట్టుకుని ముందు పళ్లతో నొక్కి రెండు గతుకులు మ్రింగి దగ్గు వచ్చి మళ్లీ కక్కుతుంది. రైలు వెళ్లిపోవటం తోటే అంగడి వాడు మూస్తాడు. కుక్క పోయి సెలయేట్లో నీళ్లు తాగుతుంది. ముందు కాళ్లు చాచి గడ్డిమీద పడుకుని, లేత గరికపోచలు కొరుకుతుంది. ఆ కుక్క మంచి మిడతల వేటగాడు. అప్పుడప్పుడు పొలము పిచ్చుకలను గూడా పట్టుకుంటుంది. సెలయేటి నీళ్లూ, మంచి గాలీ, లోయలోకి దిగటం, ఎక్కటం– కుక్క మంచి దేహపటుత్వంలో ఉన్నది. కుక్క చెదరియైనా స్టేషనెదురుగా ఉన్న కొండమీదికి పోదు.

ఒకసారి ఒక పెద్దమనిషి ఆడ సీమకుక్కను స్టేషనులోకి తెచ్చాడు. వాటి రెంటికీ ప్రథమ దర్శనంలోనే ప్రణయం ఏర్పడ్డది. ఆ పెద్దమనిషి చేతిలో కర్ర ఉంది. దాన్ని చూచి మన కుక్క తన ప్రియురాలి దగ్గరికి వెళ్లింది కాదు. పుట్టింట ఉన్న ఆడపిల్ల వలె సీమ కుక్క మాత్రం నిర్భయంగా తన వలపుకాణ్ణి చూడటం మొదలెట్టింది. పెద్ద మనుష్యులు తన్ను పోకిరీ అనుకుంటారేమో నని దుర్గపు కుక్క దాని వంక చూచీ చూడకుండా చూడటం మొదలెట్టింది. పెద్దమనిషి తన కుక్కను కటకటాలకు కట్టివేసి సామానులు తూయించుకోటానికో దేనికో వెళ్లాడు. రెండు కుక్కలూ కలసికొన్నవి.

స్టేషను మాస్టరు కొంచెము చదువుకొన్నవాడు. పెద్దమనిషికీ, ఆయనకీ ఆధునిక సిద్ధాంత రాద్ధాంతాల చర్చ జరుగుతోంది.

స్టే. మా.: కాదండీ! వర్ణ వ్యవస్థ ఉండాలి. మన పూర్వులు ఏ ప్రయోజనం కోసం దాన్ని నేర్పరచారో ఆ ప్రయోజనాలు తెలియకుండా మనం వాటిని తీసివేయరాదు.

పె.మ.: మనవాళ్లు ఏర్పరచారు కదా అని గ్రుడ్డి ఎద్దు చేలో పడ్డట్లు పోరాదు. ప్రతిదీ వాదానికి నిలవాలి.

స్టే. మా.: అయితే మీరు వర్ణ వ్యవస్థ తీసి పారవెయ్యాలి అంటారా?

పె.మ.: ఈ వ్యవస్థ మూలంగా అనేక భేదాలేర్పడుతున్నవి. వర్ణాంతర భోజనములూ, వివాహములూ జరుగవలె. అప్పుడే దేశానికి ముక్తి.

పెద్దమనిషి బయటకు వచ్చాడు. తన కుక్క వంక చూచాడు. రెండు కుక్కలూ తమ వర్ణభేదం మరచిపోయి కలసికొంటున్నవి. పెద్దమనిషి పరుగెత్తుకొనిపోయి దుర్గపు కుక్కను పదిపదకొండు దెబ్బలు కొట్టినాడు. 'జ్ఞాతాస్వాద'మైన ఆ కుక్క వెంటనే వదిలిపెట్టుటకు సమర్థము కాక చివరకు వదిలించుకొని పోయింది. స్టేషను బయటకు పోవు వరకు కుక్కకు తెలిసింది, తన ఒక తొంటి విరిగినదని. ఆ పెద్దమనిషి తన కుక్కను కూడా నాలుగు మోదినాడు.

స్టేషను మాస్టరీ గందరగోళం విని బయటకు వచ్చాడు. 'అయ్యా, ఎందుకు కుక్కనట్లా కొట్టారు?'

పె.మ.: ఇది జాతిగల కుక్క. దీనికి ఋతువు వచ్చింది. బెంగళూరు తీసుకుపోతున్నాను. ఈ జాతి మగకుక్కతో కలపవలెనని.

స్టేషను మాస్టరు కొంచెము నవ్వాడు. పెద్దమనిషి కనుబొమల మీద కొంచెం నల్లనిరేఖ యేర్పడ్డది. ఆయనా నవ్వాడు.

స్టేషను మాస్టరు సీమకుక్క మొగాన మచ్చకూ, తోకకుచ్చుకూ, గోధుమవన్నె రంగునకూ మెచ్చుకొని ముద్దాడాడు. దీనికి పిల్లలు పుడితే నాకో పిల్లను తప్పకుండా ఇవ్వాలని వాగ్దానం చేయించుకొన్నాడు.

ఊరకుక్క సంసర్గం చేత సీమకుక్క ఒళ్లంతా మన్నయింది. పెద్దమనిషి తన తోలుపెట్టె తెరచి రెండుతికిన తువాళ్లూ సబ్బుబిళ్లా తీసి పడిలో కుక్కను అభ్యంగము చేయించి చక్కగా తుడిచాడు. ఇంతలో రైలు వచ్చింది. చంకను పెట్టుకొని రైల్లో ఎక్కాడు. 'లీలా! అల్లా చేయవచ్చునా?' అని దాని నోట్లో నోరుపెట్టి ముద్దు పెట్టుకొన్నాడు. ఇందాకటి కుక్క యీ పనే చేస్తే అంత హృదయంగమంగా ఊరుకున్న ఆ కుక్క పరపురుష చుంబనం పరిహరించినట్లుగా అతని చుంబనం పరిహరించింది.

2

దుర్గములో కుక్క తన తొంటి గాడిదగడపాకునకూ, అడ్డసరపాకులకూ వేసి రుద్దుకొని సెలయేటి ఒడ్డున ఒండ్రుమట్టితో అద్దుకొని పదిహేను రోజులకు కాలు సరిచేసుకుంది. మళ్లీ స్టేషనులోకి వస్తున్నది. మిఠాయి దుకాణం వంక చూస్తున్నది.

ఒకనాడు ఇద్దరు విద్యార్థులు అక్కడికి వచ్చి దుకాణంలో యేదో కొనుక్కుని తింటూ బల్లమీద కూర్చున్నారు.

ఒకడు: మనదేశంలో భూతదయ అన్నది లేదు. నేను బీఏ ప్యాసైనాను. ఉద్యోగమిచ్చే దిక్కు లేదు. పేదవాళ్లు మలమల మాడిపోతున్నారు. గొప్పవాళ్లు సోఫాల మీదగాని ఒరగరు.

రెం: మనవాళ్లు పిడికెడు బిచ్చం పెట్టరు. చివరకు కుక్కకు వేసినట్లన్నా పేదవాళ్లకింత వెయ్యరు.

కుక్క వాళ్ల చేతిలో పొట్లం వంక చూసింది. వాళ్లిద్దరూ ఇంగ్లీషులో మాట్లాడుకుంటున్నారు. అందులో ఒకతని కాళ్లకు బూట్లు ఉన్నవి. ఆ బూటు కాలితో కుక్కను డొక్కలో తన్నాడు. దానికి రెండు మూడు రోజుల నుంచీ తిండి లేదు. ఆ దెబ్బ పొట్టలో యే నరానికి తగిలిందో అది మెలికలు తిరిగిపోయింది.

ఆ రోజు సాయంత్రం కొండ మీద నుంచి ఒక వేగోలం దిగి రాత్రిపూట స్టేషనులోకి వచ్చింది. కుక్క భయపడి దుకాణం క్రింద గూడుగా ఉంటే దానిలో దాక్కుంది. స్టేషనంతా నిర్జనంగా ఉంది. వేగోలం పసిగట్టి మూతి గూట్లోకి పెడితే కుక్క దాని నోరంతా కరచింది. మూడు నాలుగు గంటలు దాగుడు మూతల యుద్ధం చేసిన ఒక ఒడుపులో వేగోలం పీక పట్టుకుని దాని ఊపిరి ఆగేదాకా కుక్క వదలలేదు.

ఏడాది రెండేండ్లుగా మర్యాద లేని కుక్కకు ఆనాటితో మర్యాద యెక్కువైంది. అంగడివాడికి మహాదయ కలిగింది. సంవత్సరము బట్టీ పరిశిష్టపు నూనెతో పరిశిష్టంగా వస్తున్న మిఠాయి జంగిలీ దాని ముందర పెట్టాడు. అది తిన్నది. తెల్లవార్లూ ఏడవటం మొదలుపెట్టింది. దానికేదో మహావాతం పుట్టింది. కనపడ్డ ఆకల్లా కొరికింది. ఏ ఆకూ పని చెయ్యలేదు. వేగోలాన్ని చంపిన కుక్క వారము అయ్యేటప్పటికి చిక్కి శల్యమయింది. బీడకుక్క, పేలకుక్క అని దాన్ని కొట్టడం మొదలుపెట్టారు.

3

ఆరు నెలలైంది. కుక్క చావదు, బతకదు. ఒక రోజు ఆ పెద్దమనిషి వచ్చాడు. స్టేషన్ మాస్టరు 'కుక్క పిల్లలను పెట్టిందా?' అని అడిగాడు. పెద్దమనిషి ఇట్లా అన్నాడు: 'మీ పాడుకుక్క పాడు చేసింది. కుక్క రెండు పిల్లలను పెట్టింది. ఊరకుక్కల్ని పెట్టింది'. మాస్టరు 'అది మంచి పౌరుషశాలి' అన్నాడు. పెద్దమనిషి 'పోనిద్దురూ! వెధవకుక్క. దాన్ని నరికిపోతా'నన్నాడు.

ఇంతలో ఆ కుక్క యీడ్చుకుంటూ వచ్చింది. పెద్దమనిషి కోపం పట్టలేక పేము బెత్తంతో ఒకటి వేశాడు.

ఆనాటి రాత్రి ఆ కుక్క రైలు క్రింద పడ్డది. అరగంట తన్నుకుని చనిపోయింది.

4

తరువాత నాల్గు నెలలకు ఆ పెద్దమనిషి తన రెండు కుక్కపిల్లలలో ఒకటి చచ్చిపోయినదని చెప్పి రెండవ దానిని స్టేషను మాస్టరు కిచ్చాడు. అది ఆరు నెలల్లో యెదిగి తన తండ్రి వలె నైనది. దానికి భయము లేదు. కొండమీదికి షికారు పోయి వస్తుంది. ఎన్ని ఆడకుక్కలు వచ్చినా వాటి వంకకు చూడదు. విద్యార్థులు భూతదయోపన్యాసములు చేస్తుంటే తిరస్కారముగా చూస్తుంది. ఆ పెద్దమనిషి ముద్దుగా ముట్టుకోబోతాడు. కోపంగా పళ్లు చూపి(స్తుంది).

మిఠాయి దుకాణమువా డొకనాడు చద్ది మిఠాయి వేయబోయినాడు. వాడి పిక్క కండలు లాగింది. అది వేగోలం గాని కుక్క కాదన్నారందరూ. కొన్నాళ్లకు అడవుల్లోనే ఉంటూ వచ్చింది. నిత్యగహన సంచారం వల్లనో, తల్లి పోలికో తోకకుచ్చు బలిసింది. కోరలు వచ్చినై. మనుష్యుని గాలి తగిలితే బృహస్పతి తమ్ముడు సంవర్త మహర్షి వలె సీదరించుకుని తొలగిపోతుంది.

మూడు పదాలు– మూడు కావ్యాలు

సాహిత్య మరమరాలు



కాళిదాసు అఆలు కూడా తెలియని అమాయకుడనీ, అతని భార్య పండితురాలనీ కథలు ప్రచారంలో ఉన్నై కదా! ఆ ముచ్చట ఇది.

కాళిదాసు శోభనం గదిలో పందిరి మంచం మీద కూర్చొని ఉన్నాడు. భార్య పాలపాత్రతో గదిలోపలికి వచ్చింది. 'అస్తి కశ్చిత్ వాగ్విశేషః?'(విశేషా లేమిటండీ) అంది. సంస్కృతంలో అఇఉణ్‌లు కూడా రాని కాళిదాసు తెల్లమొగం వేసి 'నువ్వడిగింది ఏమిటి?' అన్నాడు. సంగతి తెలుసుకొన్న భార్య పరిహాసంగా మాట్లాడింది.

దాని నాయన అవమానంగా భావించి, ఆ అర్ధ రాత్రి సమయంలోనే కాళికాదేవి ఆలయానికి వెళ్లాడు. ఆమె అనుగ్రహంతో అద్భుతమైన కవనశక్తిని పొందాడు. ఇంటికి తిరిగి వచ్చాడు. తాను మహాకవి కావటానికి కారణమైన ఆ ప్రశ్నలోని అస్తి, కశ్చిత్, వాక్... మూడు పదాలు ముందు వచ్చేట్లుగా కుమార సంభవం, మేఘ సందేశం, రఘువంశం రచించాడు. 'అస్త్యుత్తరస్యాం దిశి దేవతాత్మా హిమాలయో నామ నగాధిరాజః'– భారతదేశానికి ఉత్తర దిగ్భాగంలో హిమాలయమనే పర్వతరాజ మున్నది అంటూ కుమార సంభవం ప్రారంభ మవుతుంది. 'కశ్చిత్కాంతా విరహగురుణా స్వాధికారాత్ ప్రమత్తః'– ఒకానొక యక్షుడు తన కర్తవ్యాన్ని సరిగా నిర్వహించకపోవటం వలన శపించబడి భార్యకు దూరమై విరహంతో వేగిపోతున్నాడు అంటూ మేఘసందేశం ప్రారంభ మవుతుంది. 'వాగర్థా వివ సంపృక్తౌ, వాగర్థ ప్రతిపత్తయే'– శబ్దార్థాల జ్ఞానం కోసం శబ్దం అర్థం లాగా కలిసి ఉన్నటువంటి జగన్మాతాపితరులైన పార్వతీ పరమేశ్వరులకు నమస్కరిస్తున్నాను అంటూ రఘువంశం ప్రారంభమవుతుంది.

◆ డాక్టర్ పోలేపెద్ది రాధాకృష్ణమూర్తి

కోకిల లోకంలో అతిథి కవిత్వం

ప్రతిధ్వనించే పుస్తకం



నీటిరంగుల చిత్రం కవితల గుచ్ఛంలో కవి వాడ్రేవు చినవీరభద్రుడు జీవితానందం, సత్యం, సౌందర్యం మొదలైన వాటికోసం చేస్తున్న అన్వేషణ కనిపిస్తుంది. ఒక ప్రత్యేకమైన సొగసు, ఒక అపురూప అనుభవం తాలూకు సౌకుమార్యం ప్రతి పదంలో పొంగిపొరలుతూ ఉంటాయి. ప్రతి కవితా కొన్ని అద్భుత చిత్రాల గది. ఒక్కో గదిలో ఎంతసేపైనా ఉండిపోవచ్చు.

ఈ కవి, కవితను రాయడం కాదు దర్శించాలంటారు. వాక్కును గోవులా సేవించాలంటారు. జీవితానుభవాన్ని క్షీరంగా మార్చుకుంటూ ఆవు వెనకే నడుస్తూ ఆ క్షణాలను గుక్కగా నొల్లుకుని ఇంటికొచ్చి నెమరువేసుకోవాలట. అనుభవాలు బాధించేవైనా, బోధించేవైనా రక్తాస్థిగతమయిన తర్వాత ఎవరెక్కడ గిల్లినా ఒళ్ళంతా పాలు కారతాయట. కవి ఋషి అయిపోయాక, అంతే కదా మరి!

కవి దారి పక్కన నిలబడి యాత్రికుడికి దోసిళ్లకొద్దీ కవితలు అందిస్తాడట. ఏ ఒక్క పండు కొరికినా మొత్తం అడవినే రుచి చూసినట్టు ఉండాలట. కవి, మొత్తం తన కవిత్వాన్ని పండ్లుగా మలిచిన తీరు మనల్ని చకితుల్ని చేస్తుంది. నిండుగా పూచిన చెట్టు ఎదుట ఈ ప్రపంచాన్ని క్షణం విస్మరించాను అని కవి అంటుంటే ఈ పుస్తకం చదువుతుంటే మనకి అలానే అనిపిస్తుంది. మనల్ని మనం మరిచిపోయి ఒక ఆనందసంద్రంలో ఈదుతుంటాం.

నాకు పద్యం రాయడం రాదు, కవిత నిర్మించడం ద్వారా వచ్చిందల్లా నా హృదయాన్ని కాగితంపై పరిచెయ్యడమే అంటారు. ఈ కవితల్ని చదువుతుంటే అందమైన పడవెక్కి సరస్సులోకి షికారు కెళ్ళి ఆనందిస్తున్న భావన! పడవ దిగడం ఎంత కష్టమో ఈ పుస్తకం చదవడం పూర్తిచేసిన వారికి తెలుస్తుంది.

కోకిల కూత వినబడుతుంటే పూజ మొదలైనట్టుంటుందట. ఆ కూత అతని హృదయాన్నొక బాజా చేసి ఏదో పండుగ మొదలైన సందడి చేస్తుందట. చదువుతుంటే మన మదిలో కూడా ఒక సంతోషకరమైన ఊరేగింపు మొదలౌతుంది. ఇంకా ఆ కోకిల పంటలు బాగా పండిన రోజుల్లో రాత్రి నామ సప్తాహం చేసినట్టు కరువు తీరా (రైతుల కరువు తీర్చి) కూసిందట. ఇన్నాళ్లూ కోకిల నా లోకానికి అతిథి అనుకున్నాను, కానీ ఇప్పుడే తెలిసింది కోకిలల ప్రపంచంలో తానే కొన్నాళ్ళు అతిథిని అంటారు. కవి తాదాత్మ్యత అది.

బతుకు ఫలప్రదం కావడం అంటే ఎక్కడుంటే అక్కడ ప్రపంచాన్ని సుసంపన్నం చేయడం, తాను నిశ్శేషం కావడం అంటూ మానవుడి అంతిమ లక్ష్యం ఏమిటో తాత్వికంగా ముగించారు భద్రుడు. అందుకే ఈ పుస్తకం ఒక సంపూర్ణత్వాన్ని సంతరించుకుంది.

◆ అల్లూరి గౌరీలక్ష్మి

గ్రహం అనుగ్రహం


శ్రీవిళంబినామ సంవత్సరం. దక్షిణాయనం, హేమంత ఋతువు. పుష్య మాసం. తిథి శు.పాడ్యమి ఉ.7.43 వరకు, తదుపరి విదియ. నక్షత్రం ఉత్తరాషాఢ రా.7.27 వరకు, తదుపరి శ్రవణం. వర్జ్యం రా.11.53 నుంచి 1.38 వరకు. దుర్ముహూర్తం ప.12.28 నుంచి 1.12 వరకు, తదుపరి ప.2.40 నుంచి 3.24 వరకు. అమృత ఘడియలు ప.12.25 నుంచి 2.10 వరకు

సూర్యోదయం : 6.37
సూర్యాస్తమయం : 5.37
రాహుకాలం : ఉ.7.30 నుంచి 9.00 వరకు
యమగండం : ఉ.10.30 నుంచి 12.00 వరకు

నమాజ్ వేళలు
ఫజర్ : 5.31
జొహర్ : 12.22
అసర్ : 4.21
మగ్రీబ్ : 5.57
ఇషా : 7.13

పుట్టిన చోటును వెతికే సింహం

కొత్త బంగారం





సరూ బ్రియర్లీ

1986. ఐదేళ్ళ సరూ, పక్క ఊరి రైల్వే స్టేషన్లో తప్పిపోయి, పొరపాటున కలకత్తా వెళ్ళే రైలెక్కుతాడు. తన ఊరు 'గినెస్తలే' అనీ, తల్లి 'అమ్మీ' రాళ్ళు మోస్తూ, తమ నలుగురు పిల్లల్నీ పోషిస్తుందనీ తప్ప మరేదీ తెలియదు. హిందీ తప్ప మరే భాషా రాదు. సరూ కలకత్తా రోడ్లమీదతిరుగుతూ మూడు వారాలు గడిపిన తరువాత, పిల్లాడిని వొక అనాథాశ్రమంలో పెడుతుంది ప్రభుత్వం. ఆస్ట్రేలియా జంటయిన సూ, జాన్ బ్రియర్లీ– కుర్రాడిని దత్తు తీసుకుంటారు. సరూ నిజ జీవిత కథ అయిన, 'ఎ లాంగ్ వే హోమ్' నవలకి కథకుడు– తన అసలు పేరైన 'షేరూ' (సింహం) పలకడానికి నోరు తిరగని సరూయే.

ఆ తరువాత, బ్రియర్లీ దంపతులు మానసిక సంతులనం లేని మాంతోష్‌ని దత్తు తీసుకుంటారు కానీ అతని ప్రస్తావన ఎక్కువ ఉండదు. సరూకి మాతృదేశం గుర్తుండేలా, సూ– కొడుకు గదిలో అనాథాశ్రమంలో తీసిన అబ్బాయి ఫొటోతో పాటు ఇండియా మ్యాప్ కూడా పెడుతుంది. సరూ తన గత జీవితపు అస్పష్టమైన జ్ఞాపకాలను సజీవంగా ఉంచుకుంటాడు. 'మరొక దేశానికి, సంస్కృతికి మారడం అంత కష్టం కాలేదు నాకు. ఇండియాలో నా జీవితంతో పోలిస్తే ఆస్ట్రేలియాలోనే చక్కగా గడిపాను. కాకపోతే, అమ్మీ ఎలా ఉందో తెలుసుకోవాలని ఉండేది. అది అసాధ్యం అని తెలిసిన తరువాత, బతకాలంటే దొరికిన ప్రతీ అవకాశాన్నీ అందిపుచ్చుకోవాలని అర్థం అయింది' అంటాడు.

అతను హాస్పిటాలిటీ మానేజ్మెంట్ చదువుతున్నప్పుడు, గూగుల్ ఎర్త్ రిలీజ్ అవుతుంది. జ్ఞాపకం ఉన్న కొండగుర్తులతోనూ, తన ఇండియన్ క్లాస్మేట్స్ సహాయంతోనూ– ఇండియన్ రైల్వే లైన్ల పద్మవ్యూహాన్ని ఛేదిస్తూ, శాటిలైట్ ఇమేజెస్ వెతుకుతాడు. మధ్యప్రదేశ్‌లో ఉన్న ఖాండ్వా పక్కనున్న గణేష్ తలై తన పల్లె అని కనుక్కోడానికి ఆరేళ్ళు పడుతుంది. 2012లో సరూ తన ఊరు వస్తాడు. షేరూ తిరిగి వస్తాడన్న ఆశతో అమ్మీ ఊరు మారదు.

సరూ అమ్మీకి ఇల్లు కొనిస్తాడు. ఇంటివారితో వీడియో చాట్లు చేస్తూ అనేకసార్లు ఇండియా వస్తూ పోతాడు. ఆఖరికి, అతని ఇద్దరు తల్లులూ కలుసుకుంటారు. సరూ నవల చివర్న చెప్తాడు: ''నా ఊరిని, కుటుంబాన్ని కనుక్కోడానికి ఎన్నో ప్రయత్నాలు చేశాను. అయితే, అది నా పాత జీవితానికి తిరిగి వెళ్ళడం కోసం కాదు. జీవితమంతా ఆస్ట్రేలియాలోనే గడిపాను. ఇక్కడ నాకు తెంచుకోలేని కుటుంబ బంధాలున్నాయి... నేనెవరో, 'ఇల్లు' అని దేన్ని పిలవాలో అన్నదాని గురించి నాకే అయోమయమూ లేదు. ఒక్క కుటుంబమూ లేని తప్పిపోయిన కుర్రాడిని. ఇప్పుడు నాకు రెండు కుటుంబాలు ఉన్నాయి, రెండు గుర్తింపులు కావు. నేను సరూ బ్రియర్లీని.''

సరూ జ్ఞాపకాలనీ, అతని వెతుకులాటనీ చూపిస్తూ, కథనం వెనక్కీ ముందుకీ మారుతుంటుంది. రచయిత సరూ బ్రియర్లీ కథ– సగం ప్రపంచాన్ని చుట్టివచ్చి, తన గతాన్ని తిరిగి చేజిక్కించుకుని, రెండు భిన్నమైన సంస్కృతులని తనవిగా చేసుకున్న అతని దృఢచిత్తం గురించినది. ఉద్విగ్నభరితంగా ఉండే పుస్తకం –పట్టుదల, ప్రయత్నాల కొదవ లేకపోయినప్పుడు దేన్నైనా సాధించవచ్చన్న ఆశ లేవనెత్తుతుంది. కథనం స్పష్టంగా, సరళంగా ఉంటుంది. 'కుటుంబం అంటే ఏమిటి!' అన్న ప్రశ్న పుస్తకమంతటా కనిపిస్తుంది. స్ఫూర్తిదాయకమైన బ్రియర్లీ ప్రయాణపు పుస్తకం, కట్టుకథకున్నంత ఆశ్చర్యాన్ని కనపరుస్తుంది. నవలని వైకింగ్ 2014లో పబ్లిష్ చేసింది. దీని ఆధారంగా తీసిన 'లయన్' సినిమా 2016లో వచ్చింది.

◆ కృష్ణ వేణి

నవల రాయడం పెళ్లి లాంటిది

గ్రేట్ రైటర్



ఏమస్ ఓజ్

హీబ్రూ నుంచి అత్యధికంగా అనువాదమైన రచయితల్లో మొదట చెప్పగలిగే పేరు ఏమస్ ఓజ్. ఇజ్రాయెల్‌కు వలస వచ్చిన లేదా మూలాలను వెతుక్కుంటూ తిరిగి వచ్చిన యూదు తల్లిదండ్రులకు 1939లో జన్మించాడు. అతడి పన్నెండో ఏట తల్లి డిప్రెషన్‌తో ఆత్మహత్య చేసుకుంది. తండ్రి మీద ఒక తిరుగుబాటుగా సామూహిక వ్యవసాయ క్షేత్రాలైన కిబుట్స్‌కు వెళ్లిపోయాడు. అక్కడే జీవితంలో చాలా భాగం గడిపాడు. ఓజ్ అంటే స్ట్రెంత్. తన బలం రాయడంలో ఉందని గ్రహించిన తర్వాత రాయడాన్ని సీరియస్‌గా తీసుకున్నాడు. నవలలు, కథలు, వ్యాసాలు విరివిగా రాశాడు.

కవిత రాయడమంటే ఎఫైర్– వన్ నైట్ స్టాండ్ లాంటిదనీ, కథ రాయడం రొమాన్స్– ఒక బంధం, కానీ నవల రాయడమంటే పెళ్లి చేసుకోవడం– దానికోసం త్యాగాలు చేయాలి, రాజీ పడాలీ అంటాడు. తనతో తాను నూటికి నూరు శాతం ఏకీభవించే అంశాలైతే, అలా అరుదుగా జరిగినప్పటికీ, వాటిని వ్యాసాలుగా రాస్తాననీ; ఒక అంశం మీద భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేయదలిచినప్పుడు కథకుగానీ నవలకుగానీ పూనుకుంటాననీ చెబుతాడు. అలాగని రచయితేమీ దేవుడు కాదు, ఎలాగైనా పాత్రల్ని ఇష్టం వచ్చినట్టు మార్చుకుంటూ పోవడానికి; ఒకసారంటూ వాటికి ప్రాణం పోశాక వాటిని రచయితైనా నిలువరించలేడని చెబుతాడు. ఇజ్రాయెల్‌లో జన్మించినవాడిగా వాస్తవం నుంచి పారిపోలేననీ, ఒక అన్యాయం పట్ల తిరుగుబాటుగా తాను రాస్తాననీ అంటాడు. తక్కువ విస్తృతి ఉన్నప్పటికీ హీబ్రూలోనే రాయడానికి కారణం, అది తాను నవ్వే, శపించే, కలలుగనే భాష కాబట్టి, అంటాడు. ఒకవేళ దేశం వదిలి పెట్టాల్సివచ్చినా భాషను వదులుకోనని చెబుతాడు.

ఇజ్రాయెల్, పాలస్తీనా సంఘర్షణను న్యాయానికి వ్యతిరేకంగా జరుగుతున్న న్యాయ పోరాటంగా చూస్తాడు. అదే ట్రాజెడీ అనీ, ఇద్దరూ భూమిని పంచుకుని పరస్పరం సహకరించుకోవడం మినహా మార్గం లేదనీ చెబుతాడు. పీస్ నౌ మూవ్‌మెంట్ ఆద్యుల్లో ఒకడైన ఏమస్ ఓజ్ మొన్న 2018 డిసెంబర్ 28న మరణించాడు.


ఈవారం పుస్తకాలు

వెంట వచ్చునది (కథలు)



రచన: ఎమ్వీ రామిరెడ్డి; పేజీలు: 240; వెల: 160; ప్రతులకు: ఎ.వి.రాజ్యలక్ష్మి, 102, శ్రీ కోట రెసిడెన్సీ, మియాపూర్, హైదరాబాద్–49. ఫోన్: 9866777870

మాయాబజార్ మధురస్మృతులు




రచన: పులగం చిన్నారాయణ; పేజీలు: 148 (గట్టి అట్ట); వెల: 300 (డీవీడీతో కలిపి); ప్రచురణ: విజయా పబ్లికేషన్స్, విజయా గార్డెన్స్, 317, ఎన్.ఎస్.కె. శాలై, వడపళని, చెన్నై– 600026. ఫోన్: 044–23652007

ఒక భార్గవి




రచన: డాక్టర్ భార్గవి; పేజీలు: 268; వెల: 320; ప్రతులకు: రచయిత్రి, భార్గవి నర్సింగ్ హోమ్, పామర్రు, కృష్ణా జిల్లా. ఫోన్: 08674–253210

బి.ఎస్.రాములు సాహిత్యం సమగ్ర పరిశీలన



రచన: డాక్టర్ కర్రె సదాశివ్; పేజీలు: 296; వెల: 250; ప్రతులకు: కె.గౌతమి, 3–11–1/ఎ, బుద్ధభవన్ రోడ్, కుమార్‌పల్లి, హన్మకొండ, వరంగల్(అర్బన్)–506001. ఫోన్: 9949424726

అతిలోకసుందరి శ్రీదేవి కథ



రచన: పసుపులేటి రామారావు; పేజీలు: 250; వెల: 300; ప్రతులకు: పసుపులేటి వెంకటలక్ష్మి, 8–2–293/82/24ఎ, జవహర్ కాలనీ, ఇందిరా నగర్, బంజారాహిల్స్, హైదరాబాద్–34. ఫోన్: 9392364031



అంటే ఈ మధ్య గొలుసు కథ ఒకటి రాద్దామని తెగ ఆలోచిస్తున్నారులే!

పదం పలికింది - పాట నిలిచింది

చిలిపితనాల చెలిమే మరచితివో

అంతా భ్రాంతియేనా జీవితానా వెలుగింతేనా
ఆశా నిరాశేనా మిగిలేది చింతేనా

చిలిపితనాల చెలిమే మరచితివో
తలిదండ్రుల మాటే దాటా వెరచితివో
పేదరికమ్ము ప్రేమపథమ్ము మూసివేసినదా నా ఆశే దోచినదా

మనసున లేని వారి సేవలతో
మనసీయగ లేని నీపై మమతలతో
వంతలపాలై చింతింతే నా వంతా దేవదా నా వంతా దేవదా



నిండా ఎనిమిది లైన్ల పాట. గుండెను శోకంతో నింపే పాట. దేవదాసులోని ఈ పాటలో కవి సీనియర్ సముద్రాల గొప్పతనం నాయికా నాయకుల స్థితిని సమర్థవంతంగా ప్రతిబింబించడం. నాయకుడి స్వభావమే అతడి సంకెల. తల్లిదండ్రుల మాటను కాదనలేడు. అంతేనా? మరో లోతూవుంది. పేదరికమ్ము ప్రేమపథమ్ము మూసివేసినదా అంటూ నిందకూడా వేస్తోంది. అదొక నిరసన. దాని పర్యవసానం? ఇష్టమైన వారికి మనసు ఇవ్వలేని స్థితిలో, తనకు ఇష్టంలేని వారి సేవలో పడాల్సిరావడం కన్నా ఇంక చింత ఏముంది!

ఈ పాట గొప్పగా పాడినవారు గతేడాది జూలైలో మరణించిన కె.రాణి. సంగీతం అందించిన వారు 38 ఏళ్లకే అనారోగ్యంతో చనిపోయిన సి.ఆర్.సుబ్బరామన్. పాటలో నటించింది ఎవర్‌గ్రీన్ సావిత్రి. వినోదా బ్యానర్‌లో 1953లో విడుదలైన ఈ చిత్రానికి దర్శకుడు వేదాంతం రాఘవయ్య.

రారండోయ్

- విజయవాడ బుక్ ఫెయిర్‌లో విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ వారి మూడు పుస్తకాలు– శతావతారాలు (ముక్కామల నాగభూషణం), గులాబి మేఘాలు(చట్టి శ్రీనివాసరావు), ఆహారంపై ఆంక్షలా?(డాక్టర్ తెన్నేటి జయరాజు) జనవరి 8న సాయంత్రం 7 గంటలకు ఆవిష్కరణ కానున్నాయి. వక్తలు: నల్లూరి వెంకటేశ్వర్లు, రెంటాల శ్రీవెంకటేశ్వరరావు, కాకుమాని శ్రీనివాసరావు.
- తెలంగాణ సాహిత్య అకాడమి నెలనెలా 'కావ్య పరిమళం' పరంపరలో భాగంగా జనవరి 11న సాయంత్రం 6 గం.కు రవీంద్ర భారతి సమావేశ మందిరంలో దాశరథి కృష్ణమాచార్య 'అగ్నిధార' కావ్యంపై దేశపతి శ్రీనివాస్ ప్రసంగిస్తారు.
- అలిశెట్టి ప్రభాకర్ స్మారక కవి సమ్మేళనం జనవరి 12న సా. 5:30కు సుందరయ్య విజ్ఞానకేంద్రంలో తెలంగాణ సాహితి ఆధ్వర్యంలో జరగనుంది.
- వడ్డె ముద్దంగుల ఎల్లన్న 'నా పల్లెతీరు' ఆవిష్కరణ రవీంద్రభారతి సమావేశ మందిరంలో జనవరి 7న సాయంత్రం 6 గంటలకు జరగనుంది. ఆవిష్కర్త: నందిని సిధారెడ్డి.
- రావులపాటి నారాయణ, మాణిక్యం పేరిట ఇస్తున్న 'సాహితీ మాణిక్యం' అవార్డును 2018కిగాను కోట్ల వెంకటేశ్వర్ రెడ్డి, ప్రసాదమూర్తికి ఇస్తున్నట్లు వారి కుటుంబ సభ్యులు సీతారాం, ఆర్.వెంకటేశ్వర్లు, ఆర్.శ్రీనివాసరావు తెలియజేస్తున్నారు. ప్రదానం జనవరి 12న ఖమ్మంలో.
- 'చం.స్పందన' ఆత్మీయ సాహితీ పురస్కార ప్రదాన సభ జనవరి 13న ఉదయం 10 గంటలకు అనంతపురం, ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో జరగనుంది. గ్రహీత: సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి. ముఖ్య అతిథి: సింగమనేని నారాయణ. నిర్వహణ: అనంత కవులు వేదిక.
- నాగభైరవ ప్రతిభా పురస్కారానికి 2014–18 మధ్య ప్రచురించిన సాహితీ విమర్శ గ్రంథాలను ఆహ్వానిస్తున్నారు. బహుమతి విలువ రూ.5,000. ప్రదానం ఫిబ్రవరి 24న. 4 ప్రతులను జనవరి 31 లోపు 'చిన్ని నారాయణరావు, ప్రధాన కార్యదర్శి, డాక్టర్ నాగభైరవ అవార్డు కమిటీ, 27–1–171, శ్రీకేతనమ్, ఆదిత్యనగర్, నెల్లూరు–524002. ఫోన్: 9440202942' చిరునామాకు పంపాలి.
- భారతీయ జీవన విధానం, విలువలు ఇతివృత్తంగా జాగృతి వారపత్రిక ఎం.డి.వై.రామ్మూర్తి స్మారక నవలల పోటీ నిర్వహిస్తోంది. ప్రథమ, ద్వితీయ బహుమతులు వరుసగా రూ.25 వేలు, 20 వేలు. 150 ఎ4 పుటలు మించకుండా డీటీపీ చేసి మార్చ్ 30 లోగా jagriticompetition@gmail.comకు మెయిల్ చేయగలరు. మరిన్ని వివరాలకు: 9959997204

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ ॥ సోమవారం
7-1-2019

ధిక్కారం

పీరియాడిక్

సమానత్వాన్ని మూటకట్టుకుని ఇరుముడిలా నెత్తి పైనేమీ పెట్టుకోవడం లేదు మహిళలు. ఇరుముడిలోని అసమానత్వాన్ని దేవుడి దగ్గర విడిపించుకోవాలని అనుకుంటున్నారంతే.

● మాధవ్ శింగరాజు

బిందు, కనకదుర్గే అనుకున్నాం. అంతకుముందు జనవరి ఒకటిన తమిళ సంతతి మలేసియా మహిళలు ముగ్గురు, వాళ్లు కాకుండా మరో నలుగురు కూడా గర్భగుడిలోకి వెళ్లొచ్చినట్లు బయటపడింది. బిందు, కనకదుర్గ వెళ్లొచ్చిన మర్నాడు కూడా శ్రీలంక మహిళొకరు దర్శనం చేసుకుని వచ్చారు. అయితే ఈ పది మందిలో బిందు, కనకదుర్గ తప్ప మిగతా వారెవరూ తాము గుడిలోకి ప్రవేశించినట్లు ఒప్పుకోవడం లేదు. బిందు, దుర్గ యాక్టివిస్టులు కనుక సుప్రీం కోర్టే అనుమతి ఇస్తే అడ్డుకోడానికి మీరెవరు అన్నట్లు చొచ్చుకుని వెళ్లొచ్చారు. ఒకవేళ సుప్రీంకోర్టు అనుమతి ఇవ్వకపోయినా వాళ్లు ఇదే పని చేసి ఉండేవారు. స్త్రీ, పురుషులు సమానమన్నది కోర్టు మాత్రమే చెప్పగలిగిన విషయం కాదు. 'తమరి దగ్గర తక్కెడ ఉంది కదండీ, కాస్త తూచి చెప్పండి.. అటువైపు ఆడ మనిషి, ఇటు వైపు మగ మనిషి.. ఎవరి బరువు


మహిళ ప్రవేశానికి నిరసనగా కోళికోడ్‌లో విధ్వంసం సృష్టిస్తున్న ఓ కార్యకర్తను అడ్డుకుంటున్న పోలీసులు

ఎక్కువుందో' అని మనమే వెళ్లి అడిగాం. 'ఎవరి బరువు ఎంతున్నా, దేవుడి దగ్గర అందరి బరువూ ఒకటే' అని కోర్టు తీర్పు చెప్పేసింది. చెప్పి, ఊరుకోలేదు. తీర్పుకు విరుద్ధంగా ఏమైనా జరిగితే శిక్ష ఉంటుంది అని కూడా హెచ్చరించింది. తీర్పు కోసం వెళ్లి శిక్షను తూయించుకొచ్చాం! వేరే గ్రహాల్లో మనిషికి బరువుండదు. దైవం దగ్గరా అంతే. స్వర్గం అనేది కూడా ఒక గ్రహమే అని మనం అనుకుంటే.

తీర్పు ఒకటుండబట్టి, ఆ తీర్పును గాఢ భక్తులు వ్యతిరేకిస్తున్నారు కాబట్టి.. ఒకటి.. రెండు.. మూడూ.. అని దర్శనం చేసుకున్న యాభై ఏళ్ల లోపు మహిళా భక్తుల్ని లెక్కిస్తున్నాం కానీ, తీర్పుకు ముందు సంవత్సరాల్లో మహిళలు అయ్యప్పను దర్శనం చేసుకుని ఉండరా?! ఇంతకంటే ఎక్కువమందే ఉండి ఉంటారు. పట్టింపు కోసమే దర్శనానికి వచ్చేవాళ్లెవరూ ఉండరు. ఆ ఒకరిద్దరు పంతం కోసమే వచ్చారనుకున్నా.. తీర్పు తర్వాత అయ్యప్ప దర్శనం కోసం ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకున్న యాభై ఏళ్ల లోపు వయసున్న మహిళల సంఖ్య నాలుగు వేలకు పైగానే ఉంది! అంటే, అయ్యప్ప దర్శనభాగ్యం కోసం ఏళ్లుగా మహిళలు ఎదురు చూస్తున్నారనే కదా.

'ఘనకార్యమా ఇది! వీళ్లేమైనా చంద్రమండలం మీద కాలు మోపారా?' ఎందుకింత రాస్తున్నారు, ఎందుకింత చూపిస్తున్నారు?'.. అనే ఆగ్రహాలు, ఆవేశాలు శరణు ఘోషలా ప్రకంపిస్తున్నాయి. ఘనకార్యమే. చంద్రమండలంపైకి వెళ్లడం కన్నా, మండలపూజా దర్శనానికి వెళ్లి రావడం ఘనకార్యమే. చంద్రుడి పైకి వెళ్లడానికి తోడుగా భూలోకపు పంచభూతాలను తీసుకెళతారు. భూలోకంలో ఉన్న ఈ 'నిషిద్ధ' భక్తి మండలాన్ని చేరుకోడానికి మహిళలకు అరచేతుల్లో పెట్టుకుని వెళ్లే ప్రాణాలు తప్ప వేరే తోడు ఉండదు. మరి ఊరుకోవచ్చుగా. దర్శనాన్ని కోరుకుంటున్న మనసు ఊరుకోనిస్తుందా? ఇష్టంలేని పనిని చేయవలసి వచ్చినప్పుడు మనసెంత బాధపడుతుందో, ఇష్టమున్న పనిని చేయకుండా ఉండాల్సి వచ్చినప్పుడూ అంతే బాధపడుతుంది. ఇష్టంలేని పనిని 'చెయ్యి' అనడం, ఇష్టమున్న పనిని 'చెయ్యొద్దు' అనడం.. 'నేను నీ కన్నా ఎక్కువ' అనే భావనలోంచి వచ్చే ఆజ్ఞాపనే. స్త్రీ విషయంలో.. 'నీ ఇష్టం' అనే మాట మనకింకా రాలేదు. ఇంత భాషొచ్చి, ఇంత కవిత్వం రాసీ.. ఆమె దగ్గర 'నీ ఇష్టం' అనే మాట మనకు నోరు తిరగడం లేదు.

శబరిమల వెళ్లొచ్చిన మహిళల్ని అభినందిస్తూ.. 'విక్టరీ కాదు. పీరియడ్ ఇది'.. అన్నారు శోభా డే. చరిత్రలో ఇదొక 'ఎర్ర' గుర్తు అని. కచ్చితంగా. బిందు, దుర్గ సాధించిన విజయాన్ని హిస్టారిక్ విక్టరీ అంటే తక్కువ చేసినట్లే అవుతుంది. 'పీరియాడిక్' హిస్టరీ ఇది. శోభా డే స్త్రీవాద రచయిత్రి. స్త్రీ జీవితంలో అనివార్యమైన ఎరుపు రంగు గురించి కదా మన అభ్యంతరాలు. వాటిని నవ్వుతూ తవ్వుతారు ఆవిడ. మగవాళ్ల గుండె జారిపోతుంది. మానవ సంతతికి ఎరుపు, తెలుపు రెండూ అవసరమైనప్పుడు తెలుపు కూడా బ్లీడింగే కదా.. అది మాత్రం పవిత్రమై, రెండోది కాకుండా పోతుందా అని శోభా డే సందేహం. సందేహం కాదు. క్లారిటీ అది.

సమానత్వ ప్రదర్శనకు దేవుడి గుడే దొరికిందా అనే మాటలో న్యాయం లేదనలేం. అయితే సమానత్వాన్ని మూటకట్టుకుని ఇరుముడిలా నెత్తి పైనేమీ పెట్టుకోవడం లేదు మహిళలు. ఇరుముడిలోని అసమానత్వాన్ని దేవుడి దగ్గర విడిపించుకోవాలని అనుకుంటున్నారంతే. ఆలయాలకు పద్ధతులుంటాయి నిజమే. ఏ ఇంటికి ఆ పద్ధతి ఉన్నప్పుడు, ఏ ఆలయానికి ఆ పద్ధతి ఉండదా! ఇళ్లల్లో కూడా తమ ఇష్టాలను ఇంటి పద్ధతులకు భిన్నంగా నెరవేర్చుకోకుండా ఏమీ లేరు అమ్మాయిలు. స్వేచ్ఛ, సమానత్వాల కోసం పోరాటం కాదది. గుండె నిండా ఊపిరి తీసుకునే ప్రయత్నం. స్పేస్ సరిపోవడం లేదనిపిస్తే పద్ధతుల్ని పక్కకు తోసేయడం సహజంగా జరిగే పనే. ●

పాశుర ప్రభాతం 22వ రోజు

నిశ్చల, నిర్మల, నిరామయ స్వరూపమే అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుని నిత్యనిజ రూపంగా విరాజిల్లుతుంది. అత్యంత తేజస్సుతో సదా భాసిల్లే తన రూపం వెనుక గంభీర తత్త్వం దాగుంది.

"మారిమలై మళైఙ్జిల్ మన్నిక్కిడన్దురఙ్గుమ్
శీరీయ శిఙ్గ మరివిత్తుత్తీ విళిత్తు
వేరి మయిర్ పొఙ్గ వెప్పాడుమ్ పేర్న్దుదరి
మూరి నిమిర్న్దు ముళఙ్గిప్పరప్పట్టు
పోదరు మాపోలే, నీ పూలైప్పూవణ్ణా! ఉన్
కోయిల్ నిన్రిఙ్గనే పోన్దురుళి, కోప్పుడైయ
శీరియ శిఙ్గాసనత్తిరున్దు, యామ్ వన్ద
కారయ మారాయ్న్దురుళేలో రెమ్బావాయ్"



భావం: ప్రకృతిలో జరిగే విశేషాలన్నీ జీవిత అనుభవాలకు సరితూగే విషయాలే. గంభీరమైన సింహం వర్షాకాలంలో కదలకుండా పర్వత గుహలలోనే ఉంటూ, తర్వాత శౌర్యమనే గుణంతో తీక్షణమైన చూపులతో ఒకసారి చుట్టూ పరికించి, తన జూలును విదిల్చి ఘనగర్జన చేస్తూ గుహనుండి బయటకు వచ్చేస్తుంది. అలాగే శ్రీ కృష్ణ పరంధామా! నీ సౌధంలోంచి మాయానిద్రను వదిలి లేచి వచ్చి అందమైన లోకాన్ని చూడు, ఉత్తమమైన సింహాసనంపై కూర్చుని మా కార్యములను అడిగి తెలుసుకో అంటూ గోపకాంతలు ప్రార్థిస్తున్నారు.

మౌంట్ ఎస్పీ

రెండేళ్ల క్రితం రెండు శిఖరాలు, రెండువేల పదిహేడులో మూడు, రెండువేల పద్దెనిమిదిలో రెండు శిఖరాలు.. పద్ధతిగా పాఠాలు విని పరీక్షలు రాసినట్లు, ఒద్దిగ్గా దేశ పతాకాన్ని ఆరుచోట్ల ఆవిష్కరించారు ఆక్టోపస్ ఎస్పీ రాధిక. శిఖరాలను అధిరోహించిన రికార్డులతోపాటు ఆక్టోపస్ ఉద్యోగమూ ఓ రికార్డే. ఆక్టోపస్ విభాగంలో తొలి మహిళా పోలీస్ అధికారి ఆమె. పర్వతారోహణల్లోనూ కొన్ని తొలి రికార్డులు సాధించిన రాధిక... ఈ శిఖరాలన్నింటికంటే తండ్రి కోరుకున్న శిఖరాన్ని చేరుకున్నప్పుడే ఎక్కువ సంతోషాన్ని పొందానంటారు!



ఎస్పీ జి. ఆర్. రాధిక ఉద్యోగ ప్రస్థానం
- గ్రేహౌండ్స్ అసాల్ట్ కమాండర్
- టౌన్ డీఎస్పీ, నెల్లూరు
- డీఎస్పీ పోలీస్ ట్రైనింగ్ కాలేజ్, కరీంనగర్
- అడిషనల్ ఎస్పీ, ఆదిలాబాద్
- అడిషనల్ ఎస్పీ, వనపర్తి
- ప్రిన్సిపల్, పోలీస్ ట్రైనింగ్ కాలేజ్, హైదరాబాద్
- అడిషనల్ ఎస్పీ, చిత్తూరు
- ఎస్పీ, చిత్తూరు
- 'ఉమన్ ఐకాన్ ఆఫ్ ఇండియా' అవార్డు అందుకున్న జి.ఆర్.రాధిక ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ఆక్టోపస్ విభాగంలో సేవలందిస్తున్నారు.

ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించిన తొలి భారతీయ మహిళా పోలీస్ అధికారి, 'అస్సీ టెన్ పీక్ చాలెంజ్'ను పూర్తి చేసిన తొలి భారతీయ పోలీస్ అధికారి **జి.ఆర్. రాధిక**

ఏపీ 'ఆక్టోపస్' సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ రాధిక పుట్టింది అనంతపూర్, పెరిగింది కడప. పోస్ట్ గ్రాడ్యుయేషన్ తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో. తండ్రి కోరిక ప్రకారం ఎం.ఎ. ఇంగ్లిష్ లిటరేచర్ చదివారు. ఐదున్నరేళ్లు లెక్చరర్‌గా ఉద్యోగం చేశారు. తండ్రి కోరిక ప్రకారమే గ్రూప్ వన్ అధికారి కావాలనుకున్నారు, పోలీసు అధికారి అయ్యారు. బంగారం లాంటి లెక్చరర్ ఉద్యోగం వదులుకుని పోలీసు ఉద్యోగానికి వెళ్తానంటావా!, ఆడపిల్లకు అంత రిస్క్ ఎందుకు, పైగా మంచి ఉద్యోగం వదులుకుని మరీ రిస్క్ ఎక్కువగా ఉండే ప్రొఫెషన్‌లోకి పోతారా ఎవరైనా!.. బంధువులు, శ్రేయోభిలాషుల నుంచి వచ్చిన సూచనలు, సలహాలు ఇవన్నీ. ''నాన్నకు నేను గ్రూప్ వన్ ఆఫీసర్‌ని కావడం ఇష్టం. లైఫ్ చాలెంజింగ్‌గా ఉండటం నాకిష్టం. పోలీస్ ఉద్యోగంతో ఇద్దరి ఇష్టాలు నెరవేరుతాయి' ఇదీ రాధిక సమాధానం. మౌంటనియరింగ్ ఎక్స్‌పీరియన్స్ గుర్తు చేసుకుంటూ.. 'ఎన్ని శిఖరాగ్రాలు చేరినా నేలకు దిగాల్సిందే, ఎంత ఎత్తుకి ఎదిగినా ఒదిగి ఉండాల్సిందే' అన్నారు రాధిక. అన్నింటికంటే నాన్న కోరుకున్నట్లు గ్రూప్ వన్‌కి సెలెక్ట్ అయినప్పుడు నిజంగా శిఖరాన్నధిరోహించిన సంతోషాన్ని పొందాను. నాన్నయితే తాను ఎవరెస్టు ఎక్కినంతగా సంతోషపడ్డారు. ఆయనకు అంత సంతోషాన్నిచ్చిన దేవుడు.. నన్ను యూనిఫామ్‌లో చూసే వరకు ఆయన్ని ఉంచలేదు. నా అచీవ్‌మెంట్స్‌ను చూస్తున్న అమ్మ... తాను సంతోషపడుతూ నాన్న చూడలేకపోయాడని బాధ పడుతుంటుంది'' అని ఉద్వేగంగా చెప్పారు రాధిక.

భక్తిగా తొలి పర్వతం

రాధిక తొలి పర్వతారోహణ హిమాలయాల్లో మానస సరోవర్ యాత్ర. హిమాలయాల మీద ఇష్టంతో ఒక భక్తురాలిగా మాత్రమే మానస సరోవర్ పరిక్రమ చేశానన్నారు. ఆ పరిక్రమకు చాలా మంది పోనీ (పొట్టి గుర్రాలు), పోర్టర్ల సహాయం తీసుకుంటారు. రాధిక తన సామాను తానే మోసుకుంటూ కాలి నడకన పరిక్రమ పూర్తి చేయడం చూసిన తోటి ప్రయాణికురాలు దీప్తి (ముంబయిలో అడ్వొకేట్) 'ఫిట్‌నెస్ బాగుంది, మౌంటనియరింగ్ కోర్సు చేయవచ్చు కదా' అన్న మాటలే రాధికను పర్వతాల బాట పట్టించాయి. మానస సరోవర్ యాత్ర పూర్తి చేసుకుని డ్యూటీకి వచ్చిన తర్వాత రాధిక తన పై అధికారులను పర్వతారోహణకు అనుమతి అడిగినప్పుడు వాళ్లు సంతోషంగా అంగీకరించారు. 'డిపార్ట్‌మెంట్ నుంచి స్పోర్ట్స్ పర్సన్స్‌ను ఎంకరేజ్ చేస్తుంటాం. అడ్వెంచర్ స్పోర్ట్ అయిన మౌంటనియరింగ్‌లోనూ రాణించే అవకాశం ఉన్నప్పుడు ఎందుకు నో అంటాం' అని తెలంగాణ హోమ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ రాజీవ్ త్రివేది ప్రోత్సహించారు. అలా 2013లో కశ్మీర్ రాష్ట్రం, పెహల్గామ్‌లో మౌంటనియరింగ్ కోర్సులు చేశారు రాధిక. శిక్షణలో భాగంగా గోలెప్ కాంగ్రి శిఖరాన్నీ అధిరోహించారు. ఎవరెస్టు అధిరోహణకు ముందు ఐఎమ్‌ఎఫ్ ఆల్ ఉమెన్ ఎక్స్‌పెడిషన్‌లో మౌంట్ మెంటోసా శిఖరాన్ని చేరుకున్నారు. ఆ శిఖారోహణ చేసిన తొలి దక్షిణ భారత మహిళ రాధిక. తర్వాత కార్గిల్‌లో మౌంట్ కున్ శిఖరాన్ని చేరారు. ఈ శిఖరాన్ని అధిరోహించిన తొలి భారతీయ మహిళ ఆమె. ఇవన్నీ ఎవరెస్టు అధిరోహణ ఆకాంక్షను నెరవేర్చుకోవడానికి తనకు తాను పెట్టుకున్న పరీక్షలు. ఇక నెక్స్ట్ గోల్ ఎవరెస్టే! హిమాలయాల్లో తరచూ మారే వాతావరణానికి అనుగుణంగా బాడీ తట్టుకోవడం కోసం స్కీయింగ్ కోర్సు కూడా చేశారామె. ''మూడు దశల కోర్సు(బేసిక్, ఇంటర్మీడియెట్, అడ్వాన్స్‌డ్) కోసం ఆరు వారాల పాటు గడ్డ కట్టే చలిలో ఉదయం ఆరున్నర నుంచి సాయంత్రం ఆరున్నర వరకు ప్రాక్టీస్ చేయడంతో ఎవరెస్టును ఎక్కగలననే ఆత్మవిశ్వాసం కలిగింది'' అన్నారు రాధిక.

అమ్మా.. నీ కేదయినా అయితే!

''ఎవరెస్టు అధిరోహణకు అవసరమైన ఫైనాన్షియల్ సపోర్టు తెలంగాణ ప్రభుత్వం ఇచ్చింది. ప్రయాణానికి అంతా సిద్ధం చేసుకుంటున్నప్పుడు మా చిన్నవాడు నా దగ్గరగా వచ్చి ''అమ్మా! నీకేదైనా అయితే'' అన్నాడు. అప్పటికేదో సర్ది చెప్పాను. ఎవరెస్టు ఎక్కే వరకు కూడా ఆ మాట గుర్తు రాలేదు. దిగి వచ్చేటప్పుడు మృతదేహాలు కనిపిస్తాయి. అప్పుడు మా చిన్నవాడి మాటలు గుర్తొచ్చాయి. నిజానికి యుద్ధం ఎలాంటిదో మౌంటనియరింగ్ కూడా అలాంటిదే. యుద్ధరంగంలో అడుగు పెట్టే వరకే ఆలోచించాల్సింది. ఆ తర్వాత యుద్ధం చేయడం ఒక్కటే మన ముందుండే ఆప్షన్. చిన్నప్పటి నుంచి ఆటలు, సైక్లింగ్, రన్నింగ్ ప్రాక్టీస్ చేయడం ఇష్టం. ప్రతి రోజూ చాలెంజింగ్‌గానే ఉండాలి. అందుకే పోలీస్ డిపార్ట్‌మెంట్‌ని, మౌంటనియరింగ్‌నీ అంతగా ఎంజాయ్ చేయగలుగుతున్నాను.

ఏడు శిఖరాల కోరిక

ఆదిలాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నప్పుడు జిల్లా కలెక్టర్‌సూచనతో మౌంట్ కిలిమంజారోకి వెళ్లాను. అది పూర్తయిన తర్వాత ఏడు ఖండాలు, ఏడు శిఖరాలను అధిరోహించాలనే కోరిక కలిగింది. ఆస్ట్రేలియాలో ఎత్తైన శిఖరం కోసియోస్కోతో కలిపి 'టెన్ అస్సీ పీక్ చాలెంజ్'కి తెలంగాణ పోలీస్ డిపార్ట్‌మెంట్ ఫండింగ్ ఇచ్చింది. తర్వాత విభజన క్రమంలో ఏపీకి మారాను. చిత్తూరు అడిషనల్ ఎస్పీగా ఉన్నప్పుడు ఓఎన్‌జీసీ సహకారంతో యూరప్‌లోని ఎల్‌బ్రస్, దక్షిణ అమెరికాలోని అంకాకాగువాకి వెళ్లాను. మిగిలిన రెండింటికీ ఏపీ ప్రభుత్వం సహకరించింది.

> ప్రకృతి పెట్టే పరీక్షలకు ఓర్చి పర్వతాలెక్కి సాధించేదేమిటంటే... మనలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. భూమ్మీద ఎదురయ్యే కష్టాలు చాలా చిన్నవిగా కనిపిస్తాయి.
>
> **పెద్ద గీత ముందు అన్నీ చిన్న గీతలే**
>
> ఇంకా ముఖ్యంగా జీవితం ఎంత విలువైనదో తెలుస్తుంది. స్మార్ట్ ఫోన్ కొనివ్వలేదని, చీర కొనివ్వలేదని, లవ్ బ్రేకప్ అయిందని ఆత్మహత్యకు పాల్పడే వాళ్లకు, అది ఎంత అవివేకమైన పనో తెలియజెప్పాలనిపిస్తుంది. జీవితాన్ని ఉపయుక్తంగా మలచుకోవాలి. సాధించగలిగిన గోల్స్‌ను నిర్దేశించుకోవాలి, వాటిని నెరవేర్చుకోవడానికి ఎంత శ్రమ అవసరమో అంతగా శ్రమించాలని అనుభవపూర్వకంగా చెప్పగలుగుతాం. ఇంకా ముఖ్యంగా అమ్మాయిలకు పరిధులు గీయవద్దని తల్లిదండ్రులకు నచ్చ చెప్పడానికి నన్ను నేను ఉదాహరణగా చూపించుకోగలుగుతున్నాను.
>
> **- జి.ఆర్. రాధిక, ఎస్.పి, ఆక్టోపస్ విభాగం, ఆంధ్రప్రదేశ్**

ప్రకృతిదే పై చేయి

అలాస్కాలో మౌంట్ దేనాలి పర్వతాన్ని ఎక్కుతున్నప్పుడు ప్రకృతి విషమ పరీక్ష పెట్టింది. ఇరవై రోజుల పాటు పాతిక కేజీల బ్యాగ్ మోసుకుంటూ, తాడు పట్టుకుని అరవై డిగ్రీల కోణంలో పర్వతాన్ని ఎక్కిన తర్వాత, ఇక కేవలం 338 మీటర్లు ఎక్కితే సమ్మిట్ పూర్తవుతుందనగా విధి లేక ఆపేయాల్సి వచ్చింది. రాళ్లతో చాచి ముఖం మీద కొట్టినట్లు చిమ్ముతోంది మంచు. వాతావరణం సహకరించే వరకు ఆగక తప్పని స్థితి అది. అప్పుడు కలిగింది మాటల్లో చెప్పలేనంత బాధ. రెండున్నర గంటలు వెదర్ సహకరిస్తే ఆరోహణ పూర్తయ్యేది. మేము విరామం తీసుకున్నప్పుడు మంచు తుపాను రాలేదు. మళ్లీ కదిలిన రోజు వెదర్ వికటించింది. రెండు రోజులు ఉండి ప్రయత్నిద్దామా అంటే... మమ్మల్ని పికప్ చేసుకోవాల్సిన ఫ్లయిట్ వచ్చేసింది. ప్రైవేట్ ఎక్స్‌పెడిషన్ అయితే మరొక చాన్స్ కోసం ఎదురు చూడవచ్చు. కానీ అది చాలా ఖరీదవుతుంది. మాకున్న ఫండింగ్ సరిపోదు. ప్రకృతి నిర్ణయానికి తలవంచాల్సిన పరిస్థితి అది. అప్పుడు వెళ్లిన టీమ్‌లన్నీ వెనక్కి వచ్చేయాల్సి వచ్చింది.

మనమెంత చిన్నవాళ్లమో

'మౌంటనియరింగ్ వల్ల ఏం సాధిస్తారు' అనే ప్రాథమిక ప్రశ్న దాదాపుగా ప్రతి మౌంటనియర్‌కీ ఎదురవుతుంది. పర్వతాన్ని అధిరోహించినప్పుడు మనం ఎంత చిన్న వాళ్లమో తెలుస్తుంది. ఇంత పెద్ద చరాచర జగత్తులో మనం పిపీలికంతో సమానమనే వాస్తవాన్ని తెలుసుకుంటాం. అన్నింటికంటే ప్రధానంగా మనలోని ఇగో తొలగిపోతుంది. మనం ఎందులోనూ అధికులం కాదని తెలుసుకుంటాం. ఇది సమ్మిట్ విఫలమైనప్పుడు కలిగే భావన కాదు, సక్సెస్ అయినప్పుడు కూడా నేర్చుకునే పాఠం ఇదే. ఇలాంటి ప్రతికూల పరిస్థితి గత నెలలో చేసిన ఆరవ ఎక్స్‌పెడిషన్ అంటార్కిటికా విన్‌సన్‌లోనూ జరిగింది. అయితే పీక్‌ను చేరుకుని తిరిగి బేస్ క్యాంపుకి వచ్చిన తర్వాత వాతావరణం సహకరించకపోవడంతో ఫ్లయిట్ రాలేదు. మైనస్ 20 డిగ్రీల ఉష్ణోగ్రతలో పది రోజులు ఎదురుచూశాం. మాతో తీసుకెళ్లిన రేషన్.. మరో రెండు మూడు రోజులకే వస్తుంది. పది రోజులు రావాలంటే ఉన్నదే సర్దుకుంటూ తిన్నాం. నీటి కోసం మంచు కరిగించుకున్నాం. ఆ ఫ్యూయెల్ కూడా మరీ ఎక్కువేమీ ఉండదు. రోజుకు ఒకటిన్నర- రెండు లీటర్ల నీటితో సరిపెట్టుకున్నాం.

వయసు అడ్డంకి కాదు

నాతోపాటు అంటార్కిటికాలో విన్‌సన్ పర్వతారోహణకు వచ్చిన వారిలో నార్వే నుంచి వచ్చిన లీస్‌జెత్‌కి 61 ఏళ్లు. కెనడా సిల్వీకి 54, మొరాకో బుష్రాకు 48. మా టీమ్‌లో నేనే చిన్నదాన్ని. నన్ను నలభై దాటాక, ఈ వయసులో పర్వతాలెక్కడానికి వెళ్లడమా అన్న వాళ్లున్నారు. తీరా దేశం బయట అడుగు పెడితే నేను పెద్దదాన్ని కాదు చిన్నదాన్ని అనిపించింది. ఫిట్‌నెస్ మెయింటెయిన్ చేసుకోవడం చాలా అవసరం. 'ఎ సౌండ్ మైండ్ ఈజ్ ఇన్ సౌండ్ బాడీ' అనేది అన్ని కాలాలకూ అన్ని ప్రదేశాలకూ వర్తిస్తుంది. మనిషి ఆరోగ్యంగా ఉంటే ఆలోచనలు ఆరోగ్యకరంగా ఉంటాయి, జీవితం ఆరోగ్యకరంగా ఉంటుందని నమ్ముతాను. ఇక నా ఫ్యామిలీ అంటారా.. మాది లవ్ కమ్ ఇంటర్ క్యాస్ట్ మ్యారేజ్. కాబట్టి మా వారు (వేణుగోపాల్‌రెడ్డి) దేనికీ అడ్డు చెప్పరు. అన్నింటిలోనూ మంచి సపోర్టును ఇస్తారు''

– ఇంటర్వ్యూ: **వాకా మంజులారెడ్డి**
ఫొటో : **వి. రూబిన్ బెసాలియల్**

సప్త పర్వత ఆరోహణ

మౌంట్ ఎవరెస్ట్ 2016 మే 20
మౌంట్ కిలిమంజారో 2016 ఆగస్టు 14
మౌంట్ కోసియోస్కో 2017 మార్చి 17
మౌంట్ ఎల్‌బ్రస్ 2017 సెప్టెంబర్ 8
మౌంట్ అకాంకాగువా 2017 డిసెంబర్ 30
మౌంట్ దేనాలి 2018 జూలై 4
(వాతావరణం సహకరించక శిఖరాన్ని చేరలేదు)
మౌంట్ విన్‌సన్ 2018 డిసెంబర్ 16


మౌంట్ విన్‌సన్ శిఖరం మీద జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తూ...

ఆత్మీయం

నేనూ.. మృణాల్‌దా

ప్రపంచ ప్రఖ్యాతి చెందిన భారతీయ సినీదర్శకులు మృణాల్ సేన్ డిసెంబర్ 30న తొంభై ఐదేళ్ల వయసులో కన్నుమూశారు. అప్పటికి కొన్నాళ్లుగా ఆయన నడవలేని స్థితిలో ఉన్నారు. సేన్ చివరి శ్వాసకు కొన్ని రోజుల ముందు నటి నందితాదాస్ ఆయన్ని ఇంటికి వెళ్లి కలిశారు. ఈ సంగతిని ఆయన మరణానంతరం.. నివాళిలో రాస్తూ, 'నిశ్శబ్ద ఆత్మీయత' అంటూ ఆయనతో తనకున్న ఇరవై ఏళ్ల అనుబంధం గురించి నందిత వెల్లడించారు. ఆ నివాళిలోని విశేషాంశాలివి.

> **నిరాడంబర జీవితం...** మృణాళ్‌దా చాలా సామాన్య జీవితం గడిపారు. మరణంలోను అదే ఎంచుకున్నారు. తనకు అభిమాన సంఘాలు వద్దని తన కుటుంబికులకు స్పష్టంగా చెప్పారు. ఆయన స్థాయికి ఎంతో గౌరవం పొందవచ్చు. గన్ శాల్యూట్, లక్షలాది మంది అభిమానుల ప్రేమ, బొకేలు, ప్రణామాలు అన్నీ అందుకోవచ్చు. ఆయన అవేవీ వద్దనుకున్నారు. ఆయనను ప్రేమించేవారంతా ఆయన కోర్కెను నెరవేర్చారు. ఆయన అంతిమయాత్రలో పాల్గొన్న వారంతా నిశ్శబ్దంగా ఆయన వెంట నడిచారు. ఒక సామాన్య వ్యక్తిలాగే ఆయన అంతిమయాత్ర ముగిసింది.

''మృణాల్‌సేన్‌ని కలవకపోతే నా కోల్‌కతా ట్రిప్ పూర్తి అయినట్లు అనిపించదు నాకు. చివరిసారిగా ఆయనను నేను 2018 నవంబరు 11 న ఇంటికి వెళ్లి కలిశాను. అది కూడా మా అబ్బాయిని వెంట తీసుకుని వెళ్లాను. అప్పుడు కోల్‌కతాలో ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ జరుగుతోంది. నన్ను చూసిన ఆయన నా వైపు వచ్చి ఆప్యాయంగా నా చేతిని గట్టిగా పట్టుకున్నారు. ఆ రోజంతా ఆయన సమక్షంలోనే గడిపాను. ఇప్పుడిక ఇటువంటి ఆప్యాయతతో కూడిన నిశ్శబ్దాలు లేవు. ఆ రోజున నన్ను.. నేను నటించిన 'మంటో' సినిమా గురించి అడిగారు. మా అబ్బాయి చదువు గురించి తెలుసుకున్నారు. ఆయన దగ్గర సెలవు పుచ్చుకుని బయలుదేరడానికి ముందు, ఆయనతో ఫొటోలు తీయించుకున్నాను. అవే ఆయనతో గడిపే ఆఖరి క్షణాలు అవుతాయని నేనెలా ఊహించగలను? ఆయన మౌనంగా నిశీధిలోకి వెళ్లిపోయారని తెలిసి నా మనసు మూగబోయింది.

ప్రేమ మీద నమ్మకం కలిగేది

మృణాల్‌దాతో 20 సంవత్సరాలుగా నా హృదయం ఆప్యాయతను పెనవేసుకుని ఉంది. ఆయన జీవిత భాగస్వామి 'గీతాదీ' నిజంగానే ఆయన జీవితంలో భాగస్వామ్యం వహించారు. ఆయనకు బలమైన సహచరిగా నిలిచారు. ఆయన మౌనంగా ఉంటే, ఆవిడ ఆ నిశ్శబ్దాన్ని తన చిరునవ్వుతో కళకళలాడించేవారు. వారి ప్రేమానురాగాలు, ఒకరిని ఒకరు గౌరవించుకోవడం చూస్తుంటే, నాకు నిజమైన ప్రేమ మీద నమ్మకం కలిగేది. రెండు సంవత్సరాల క్రితం గీతాదీ మమ్మల్ని వదిలేసి, మృణాల్‌దాని ఒంటరిని చేశారు. అప్పుడే ఆయన మనసు, ఆత్మ ఆవిడతో వెళ్లిపోయాయి. ఆవిడ నిష్క్రమణతో నిత్యం తనను వెన్నంటి ఉన్న ఆత్మవిశ్వాసం కూడా నిష్క్రమించిపోయింది.

పారితోషికం ఇవ్వలేనన్నారు

నాకు మృణాళ్‌దా పరిచయం అయిన రోజు నుంచి ఆయన నాతో ''నేను నీతో ఒక సినిమా తీయబోతున్నాను. నువ్వు నాకు స్మితాజీని గుర్తు చేస్తున్నావ్. ఒక నటిగా కాదు, ఒక వ్యక్తిగా ఆవిడ నాకు గుర్తుకు వస్తుంది'' అనేవారు. 2002లో ఎట్టకేలకు ఆయన నాతో చిత్రం చేశారు, ఆమార్ భువన్. అదే ఆయన చివరి సినిమా. బెంగాల్‌లోని ఒక చిన్న


● చివరి క్షణాలలో చేరువగా : మృణాల్‌సేన్‌తో నందితాదాస్, ఆమె కుమారుడు

గ్రామంలో నివసించే ఒక ముస్లిం కుటుంబానికి చెందిన కథ ఇది. ఇదొక లవ్ ట్రయాంగిల్ కథ. అందులో నేను సకినా పాత్ర ధరించాను. ఇద్దరు అన్నదమ్ములకి, సకినాకి మధ్య జరిగిన సంఘర్షణ ఈ కథ. షూటింగ్ ప్రారంభం కావడానికి పదిహేను రోజుల ముందు, మృణాళ్‌దా నాకు ఫోన్ చేశారు, నిర్మాతలు ముస్లిం కుటుంబానికి చెందిన కథకు డబ్బులు పెట్టడానికి అంగీకరించట్లేదన్నారు. నాకు చాలా బాధ వేసింది. ఆ కథ గుజరాత్ అల్లర్లు జరిగిన రోజులు కావడంతో, మత విద్వేషాలు బయలుదేరతాయని భావించి ఉంటారు. ముస్లిం సెట్టింగ్ వేసినంత మాత్రాన గొడవలేమీ జరిగిపోవని నేను అన్నాను. ఆయన నా మాటలకు స్పందిస్తారని అనుకోలేదు. ''మనం మన దగ్గర ఉన్న డబ్బుతోనే ఈ సినిమా తీసేద్దాం. నేను నీకు పారితోషికం ఇచ్చుకోలేను'' అన్నారు.

ఇచ్ఛామతి నది ఒడ్డున

టాకీ అనే గ్రామంలో షూటింగ్ ప్రారంభించాం. ఉదయం ఆరు నుంచి సాయంత్రం ఆరు వరకు షూటింగ్ పూర్తయ్యాక, రిలాక్సేషన్ కోసం ఎవరో ఒకరి ఇంటికి వెళ్లేదాన్ని. ఆ రోజు నేను టాకీ గ్రామానికి చేరుకునేసరికి, గ్రామమంతా ఈ షూటింగ్‌లో ఇన్‌వాల్వ్ అయ్యారని అర్థం చేసుకున్నాను. మాలో ఐదుగురు.. మృణాళ్‌దా, ప్రధాన తారాగణం.. ఒక గెస్ట్ హౌస్‌లో ఉన్నాం. దీనికి ఎదురుగా ఇచ్ఛామతి నది పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తూ ఉంటుంది. నదికి ఆవలి ఒడ్డున బంగ్లాదేశ్ ఉంది. మృణాల్‌దా బంగ్లాదేశ్‌లో సూర్యోదయం, భారతదేశంలో సూర్యాస్తమయం చూశారు. ఇందుకు ప్రత్యేక కారణం ఉంది. మృణాల్‌దా ఫరీద్‌పూర్ (బంగ్లాదేశ్)లో జన్మించారు. అప్పుడప్పుడు మృణాల్‌దా తన జీవితానికి సంబంధించిన ఎన్నో కథలు చెప్పేవారు. ఆయనకు ప్రతి విషయం మీద ఆసక్తి ఎక్కువ. డిన్నర్‌లో మేం తినే చేప గురించి కూడా తెలుసుకునేవారు. తన మనసుకు నచ్చిన ప్రతి విషయాన్ని నాతో పంచుకునేవారు, కళాకారులంటే ప్రత్యేకమైన వారు కాదు, వారు కూడా నిత్య జీవితంలో భాగమే అని ఆయన నమ్మకం.

ఆయన పెట్టిన జ్ఞానభిక్షే


నేను ఆయన ఇంటికి చేరేసరికి, ఆ ఇల్లు గీతాదీ, మృణాళ్‌దా లేకుండా నిర్జీవంగా కనిపించింది. కాని నేను అక్కడకు వెళ్లాను. ఆయనను కడసారి చూడటానికి మాత్రమే కాదు, ఆయన ఏకైక కుమారుడు కునాల్ సేన్‌ను కలవడానికి. తండ్రి ఔన్నత్యాన్ని, తల్లి శక్తిని తనలో ఇముడ్చుకున్నాడు కునాల్‌సేన్. కునాల్ తన తండ్రిని బొంధు (స్నేహితుడు) అని పిలిచేవాడు. ఆయన కునాల్‌కి మాత్రమే కాదు ఎంతో మందికి బొంధు. అందరికీ కాకపోవచ్చు. నాకు మాత్రం ఆయన అసలుసిసలైన స్నేహితుడు, మార్గదర్శకుడు, గురువు.. ఇంకా ఎన్నో. సామాన్యులకు సంబంధించిన కథలను చిత్రాలుగా తీయడమే మనం ఆయనకు సమర్పించే నిజమైన నివాళి. మృణాల్‌దా మహాభినిష్క్రమణంతో ఒక శకం ముగిసింది. నేను ఆయనను తరచుగా కలిసి ఉండకపోతే, ఎంతో పరిజ్ఞానాన్ని సంపాదించుకోలేకపోయి ఉండేదాన్ని. ఆయన ఎప్పటికీ జీవించి ఉండాలనేదే నా స్వార్థమైన కోర్కె. ఆయనను, ఆయన పనులను మనం సెలబ్రేట్ చేసుకోవాలి. ఆయన ఆత్మకు శాంతి కలగాలని మనస్ఫూర్తిగా ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నాను.

– స్వేచ్ఛానువాదం: **వైజయంతి పురాణపండ**


● షూటింగ్‌లో : మృణాల్ సేన్, నందితా దాస్

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ ॥ సోమవారం
7-1-2019

లవ్ డాక్టర్ | నన్నడగొద్దు ప్లీజ్


ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ అన్నా! నన్ను ఒక అబ్బాయి లవ్ చేస్తున్నా అని చెప్పాడు. వెంటపడ్డాడు. చాలా రిక్వెస్ట్ చేశాడు. మంచి వాడు కావడంతో ఓకే చెప్పాను. కొన్ని నెలలు బాగానే ఉన్నాం. తను నన్ను చాలా లవ్ చేసేవాడు. నేను కూడా తనని అంతే ప్రేమించాను. మా నేపథ్యాలు వేరు. పైగా వాళ్లు బాగా రిచ్. మా విషయం ఒక రోజు వాళ్ల ఇంట్లో తెలిసింది. దాంతో తనని వాళ్ల ఊరు తీసుకెళ్లి నన్ను మరిచి పోవడానికి తనకి బ్లాక్ మ్యాజిక్ చేయించారు. బట్ తను మారకపోయేసరికి నాపైన వాళ్ల తమ్ముడు బ్యాడ్‌గా రూమర్స్ సృష్టించాడు. మొదట్లో తను నమ్మలేదు. కానీ వాళ్ల ఇంట్లో వాళ్లు తనకి ఏదో చెప్పి పూర్తిగా మార్చేశారు. నేను తప్పు చెయ్యలేదని తనకి కూడా తెలుసు. కానీ చాలా మారిపోయాడు. ఒకప్పుడు నువ్వు మాట్లాడితే చాలు అనేవాడు. కానీ ఇప్పుడు కాల్ కూడా లిఫ్ట్ చెయ్యట్లేదు. అందుకే గుడ్‌బై చెప్పాను. నా వల్ల తను బ్లాక్ మ్యాజిక్‌తో బాధపడుతున్నాడు. తనకి నేనంటే చాలా ఇష్టమన్నా. తనని మర్చిపోలేకపోతున్నాను. హ్యాండ్ కోసుకున్నాను. పచ్చబొట్టు వేయించుకున్నాను. వాళ్ల ఫ్యామిలీ చాలా డేంజర్ అన్నా. మేము కలిస్తే చంపేస్తారు. ఇప్పుడు నేనేం చెయ్యాలి సలహా ఇవ్వండి.

– లక్కీ

పోలీస్ స్టేషన్‌కి వెళ్లు తల్లీ!!

'బాగా డబ్బు ఉన్న వాళ్లు సార్...! వాళ్లకు పరపతి కూడా ఉండొచ్చు. పోలీస్ స్టేషన్‌ని కూడా భయపెట్టి దారికి తెచ్చుకునే పవర్ ఉండొచ్చు. అమ్మాయి అనవసరంగా చాలా ట్రబుల్‌లో పడుతుందేమో సార్!?'

భలే చెబుతావు! కనిపించని నాలుగో సింహమే పో...లీ..లీ..లీ..లీ..లీ..స్! నమ్మాలి. ప్రేమను నమ్మాలి. ఖాకీ గొప్పతనాన్ని నమ్మాలి. సమాజాన్ని నమ్మాలి. పోరాడాలి... ప్రేమద్రోహులతో పోరాడాలి.. మోసాన్ని పోరాడాలి. కుటిలత్వాన్ని పోరాడాలి. ఓడిపోకూడదు.. చెయ్యి కోసుకుని ఓడిపోకూడదు.. మనసు చిన్నగా చేసుకుని ఓడిపోకూడదు.. నమ్మకాన్ని ఒమ్ము చేసుకుని ఓడిపోకూడదు. ఫైట్ ఫర్ యువర్ రైట్!

ప్రేమ, ఆకర్షణ, టీనేజ్ అనుబంధాల్లోని అయోమయం మిమ్మల్ని గందరగోళ పరుస్తుంటే ప్లీజ్ ఈ అడ్రస్‌కు మాత్రం అస్సలు రాయకండి.
లవ్ డాక్టర్, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నంబరు 1, బంజారాహిల్స్, హైదరాబాద్-34.
lovedoctorram@sakshi.com

కాసుకో సుడోకు

		9	6			2		
8				1	2	7		5
	2	5	7	9		4	3	
			4		9	8	5	
		2				9		
	5	3	1		7			
	1	4		7	6	3	8	
2		7	8	4				9
		8			1	5		

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా,నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరంలోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

2	3	4	8	1	5	7	9	6
9	5	1	2	7	6	3	8	4
7	6	8	9	3	4	1	5	2
4	2	3	5	8	1	9	6	7
5	1	7	3	6	9	4	2	8
6	8	9	7	4	2	5	1	3
8	4	5	1	2	3	6	7	9
3	9	2	6	5	7	8	4	1
1	7	6	4	9	8	2	3	5


సమంత, నాగ చైతన్య

హాలిడే ఇంకా అవ్వలేదు





టాలీవుడ్ లవ్లీ కపుల్ నాగ చైతన్య, సమంతల న్యూ ఇయర్ హాలిడే ఇంకా ముగిసినట్టుగా లేదు. ఆమ్‌స్టర్డమ్ అందాలను ఇంకా చూస్తూ గడిపేస్తున్నారు. న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ కోసం నాగచైతన్య, మరి కొంత మంది స్నేహితులతో కలసి హాలిడేకి వెళ్లారు సమంత. అక్కడ తాము చేస్తున్న అల్లరంతా ఎప్పటికప్పుడు తన సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారామె. తాజాగా ఈ ట్రిప్‌లో పలు ఫొటోలను పంచుకున్నారు. సినిమాల విషయానికి వస్తే సమంత, నాగచైతన్య ప్రస్తుతం 'మజిలీ' అనే చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమాలో భార్యాభర్తలుగానే నటిస్తున్నారు.

క్వాలిటీ ముఖ్యం!


కాజల్ అగర్వాల్

ఇండస్ట్రీలో పదేళ్లకుపైగా ఉంటూ అగ్ర కథానాయికల లిస్ట్‌లో తన పేరు తప్పిపోకుండా కష్టపడుతూనే ఉన్నారు కాజల్ అగర్వాల్. ఇటు టాలీవుడ్, అటు కోలీవుడ్‌లో వరుస ఆఫర్లు అందుకుంటూ కెరీర్‌లో స్పీడ్ పెంచారీ బ్యూటీ. మీ సక్సెస్ మంత్ర ఏంటి? అని కాజల్‌ని అడిగితే...''నాకు సూట్ అయ్యే పాత్రలనే ఎంపిక చేసుకుంటాను. సినిమా సినిమాకి నా పాత్రల మధ్య వైవిధ్యం ఉండేలా జాగ్రత్త పడతా. నా పాత్రకు ఆడియన్స్ ఎంత కనెక్ట్ అవుతారనే విషయం కూడా మైండ్‌లో ఉంచుకుంటా. క్వాలిటీ ఆఫ్ పెర్ఫార్మెన్స్ ముఖ్యం. రోల్ మోడల్ అంటూ నాకు ప్రత్యేకంగా ఎవరూ లేరు. ప్రముఖ నటీనటుల నుంచి ఒక్కో డిఫరెంట్ క్వాలిటీని తీసుకుంటాను'' అని పేర్కొన్నారు. ప్రస్తుతం తేజ దర్శకత్వంలో రూపొందుతున్న 'సీత' అనే సినిమాలో టైటిల్ రోల్ చేస్తున్నారు కాజల్. బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరో. ఈ సినిమాలో కాజల్ క్యారెక్టర్‌లో నెగటివ్ షేడ్స్ ఉంటాయట. కమల్‌హాసన్–శంకర్ కాంబినేషన్‌లో రాబోతున్న 'ఇండియన్ 2' చిత్రంలో కాజల్ కథానాయికగా నటిస్తారు. తమిళంలో ఆమె నటించిన 'ప్యారిస్ ప్యారిస్' చిత్రం విడుదలకు సిద్ధంగా ఉంది.

టైటిల్ బాగుంది - త్రివిక్రమ్


త్రివిక్రమ్, నవీన్‌రాజ్

నవీన్‌రాజ్ శంకరాపు, శశికాంత్ హీరోలుగా, బందెల కరుణశ్రావ్య, శృతి హీరోయిన్లుగా పరిచయం అవుతున్న చిత్రం 'వనవాసం'. భరత్ కుమార్.పి నరేంద్ర దర్శకత్వంలో సంజయ్ కుమార్ బి. నిర్మించిన ఈ చిత్రం నిర్మాణానంతర కార్యక్రమాలు పూర్తి చేసుకొంది. ఈ చిత్రం పోస్టర్, టైటిల్‌ని ప్రముఖ డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ– ''వనవాసం' టైటిల్ బాగా నచ్చింది. ఈ టైటిల్‌లానే సినిమా కూడా బాగుంటుందని ఆశిస్తున్నా. టీమ్‌కి అభినందనలు'' అన్నారు. ''కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ సినిమా తీశాం. ప్రేక్షకులు మెచ్చే విధంగా ఉంటుంది'' అన్నారు భరత్. '' భరత్ చాలా బాగా తీశారు. త్వరలోనే సినిమా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం'' అని సంజయ్ కుమార్. బి అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: ఎం.ఎం.కుమార్, కెమెరా: ప్రేమ్ జై. విన్సెంట్.

థియేటర్ల మాఫియా ఉంది

-టి. ప్రసన్నకుమార్


ప్రసన్న కుమార్

''**సి**నిమా కళకి కులం, మతం, జాతి, ప్రాంతం.. ఉండవని నిరూపించారు రజనీగారు. స్వయంకృషితో వరల్డ్ సూపర్‌స్టార్‌గా ఎదిగారంటే అది రజనీగారొక్కరే. మన ఎన్టీ రామారావుగారు కూడా చరిత్ర సృష్టించారు. శ్రీకాంత్‌కూడా స్వయంశక్తితో ఈ స్థాయికి ఎదిగాడు'' అని నిర్మాత టి.ప్రసన్న కుమార్ అన్నారు. రజనీకాంత్ హీరోగా, త్రిష, సిమ్రాన్ హీరోయిన్లుగా కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో తెరకెక్కిన తమిళ చిత్రం 'పేట్టా'. ఈ చిత్రాన్ని 'పేట' పేరుతో వల్లభనేని అశోక్ ఈ నెల 10న తెలుగులో విడుదల చేస్తున్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో ప్రసన్నకుమార్ మాట్లాడుతూ– ''సినిమా బావుంటే ఎవ్వడూ ఆపలేడు. ఈరోజు థియేటర్స్ మాఫియా ఎలా ఉందంటే మాఫియా డాన్స్ కంటే దారుణాతి దారుణంగా ఉంది. కేవలం ముగ్గురు నలుగురు చేస్తున్న సినిమాలకి మొత్తం థియేటర్స్ పెట్టుకుంటున్నారు. సాంకేతిక నిపుణులను బతకనిచ్చే పరిస్థితిగానీ, కొత్తవాళ్లు వచ్చే పరిస్థితిగానీ లేకుండా చాలా నీచాతి నీచంగా చేస్తున్నారు. సంక్రాంతి అంటే ఆరేడు సినిమాలు రిలీజ్ అయినా చూడగలిగే ప్రేక్షకులున్నారు. కానీ, చూడ్డానికి ఒకటి లేదా రెండు సినిమాలు తప్పితే మిగతా సినిమాలకు అవకాశం లేకుండా చేస్తున్న మాఫియా ఉంది. ఈ మాఫియా ఎండ్ అయ్యే పరిస్థితి వస్తుంది. ఈ విషయాన్ని ముఖ్యమంత్రులు కేసీఆర్, చంద్రబాబునాయుడుగార్లకు చెబుతాం. వాళ్ల సినిమాలే ఆడాలని చూస్తున్నారు. మిగతా వాళ్లందర్నీ తొక్కి పారేస్తున్నారు. మా సినిమాలే ఉండాలి అనే ధోరణిలో వెళుతున్నారు. ఇది మంచిది కాదు. దయచేసి ఇది మీకు విజ్ఞప్తి అనుకోండి.. కాదంటే వార్నింగ్ అనుకోండి.. అయిపోతారు... చాలా మందిని చూశాం. విర్రవీగినోళ్లంతా ఆకాశంలోకి వెళ్లిపోయారు.. మీరు కూడా పోతారు. కొంచెం తెలుసుకుని కరెక్టుగా ఉండండి'' అన్నారు.

హీరో శ్రీకాంత్ మాట్లాడుతూ– ''ఈ సంక్రాంతి బరిలో పెద్ద సినిమాల మధ్య.. 'పేట' కూడా పెద్ద సినిమానే. వాటి మధ్య ఈ సినిమా విడుదల చేస్తున్నాడు అశోక్. ఆ సినిమాలతో పాటు 'పేట' కూడా ఆడాలని కోరుకుంటున్నా. రజనీకాంత్‌గారి సినిమాలు చూస్తూ పెరిగాం. చిరంజీవిగారు, రజనీగారు నటీనటులకు స్ఫూర్తి'' అన్నారు.

చిత్ర నిర్మాత వల్లభనేని అశోక్ మాట్లాడుతూ– ''ఎందరో మహానుభావులు.. ఇక్కడికి వచ్చిన వారందరికీ వందనాలు. పిలిచినా వస్తానని రాకుండా మమ్మల్ని ఆనందపెట్టిన ఇంకొందరు మహానుభావులకు నా రెండేసి వందనాలు. ఈ సంక్రాంతికి మూడు పెద్ద సినిమాలు రిలీజ్ అవుతున్నాయి. వాటి మధ్య మన సినిమా 'పేట' కి థియేటర్స్ తక్కువైనా, బిజినెస్ జరిగినా, జరక్కపోయినా సొంతంగా రిలీజ్ చేద్దామని రిస్క్ తీసుకుని విడుదల చేస్తున్నా'' అన్నారు.

ఏపీ ఎఫ్‌డీసీ చైర్మన్ అంబికా కృష్ణ మాట్లాడుతూ– ''రజనీగారు సౌత్ ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీలోనే ఓ చరిత్ర. అలాంటివాళ్లు అక్కడక్కడా వస్తుంటారు. మనకి మన ఎన్టీ రామారావుగారు. ఆయన ఓ చరిత్ర. సౌత్ ఇండియన్ ఇండస్ట్రీలో జపాన్‌లో ఫ్యాన్స్‌ని సంపాదించుకున్న మొదటి వ్యక్తి రజనీ. సౌత్ ఇండియాలోనూ హీరోలు ఉన్నారని ప్రపంచానికి చాటిన మొదటి హీరో రజనీ ''అన్నారు.

కార్తీక్ సుబ్బరాజ్ మాట్లాడుతూ– ''పేట' చిత్రం మా అందరి డ్రీమ్ ప్రాజెక్ట్. రజనీసార్ అభిమానులకే కాదు, ప్రేక్షకులందరికీ ఈ సినిమా నచ్చుతుంది. మంచి కథ. ఈ పండక్కి చాలా పెద్ద సినిమాల మధ్య మా సినిమా విడుదలవుతోంది. ఆ సినిమాలతో పాటు మా 'పేట' కూడా మంచి విజయం సాధించాలి'' అన్నారు. దర్శక–నిర్మాత వైవీఎస్ చౌదరి, నిర్మాత కిరణ్, సంగీత దర్శకుడు అనిరుధ్, నటీనటులు బాబీ సింహా, మేఘా ఆకాశ్, మాళవికా మోహన్, పాటల రచయితలు భాస్కరభట్ల, రామజోగయ్య శాస్త్రి, సాయి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.


మేఘా ఆకాశ్, మాళవిక, బాబీ సింహా, కార్తీక్ సుబ్బరాజ్, అనిరుధ్, భాస్కరభట్ల, శ్రీకాంత్, అశోక్

చరిత్ర పాఠాలు చదువుకున్నట్టుంది

- సుమంత్


సుమంత్

''చిన్నప్పటి నుంచి నాలో తాతగారి పోలికలున్నాయని చాలా మంది చెప్పేవారు. కానీ తాతగారిలా నటించే అవకాశం దొరకలేదు. 'యన్.టి.ఆర్ కథానాయకుడు' చిత్రంలో 25నుంచి 60 సంవత్సరాల వరకూ తాతగారిలా ఐదు డిఫరెంట్ లుక్స్‌లో కనిపిస్తాను. నా ఫస్ట్ లుక్‌కి మంచి స్పందన వచ్చింది'' అని సుమంత్ అన్నారు. క్రిష్ దర్శకత్వంలో బాలకృష్ణ టైటిల్ రోల్ పోషించి, నిర్మించిన చిత్రం 'యన్.టి.ఆర్'. దివంగత ముఖ్యమంత్రి, నటుడు యన్టీ రామారావు జీవితం ఆధారంగా రూపొందించిన 'యన్.టి.ఆర్ కథానాయకుడు' ఈ నెల 9న రిలీజ్ కానుంది. ఇందులో అక్కినేని నాగేశ్వరరావు పాత్రని ఆయన మనవడు సుమంత్ పోషించారు. ఈ సందర్భంగా సుమంత్ మాట్లాడుతూ...

● ఎన్టీఆర్‌గారి బయోపిక్ తీస్తున్నారు అని విన్నాను కానీ అందులో తాతగారి పాత్ర ఉంటుంది, అది నా వరకూ వస్తుంది అనే ఆలోచన కూడా చేయలేదు. క్రిష్ కలిసి సీన్స్ అన్నీ వివరించాడు. తను కేవలం దర్శకుడు మాత్రమే కాదు తెలుగు ఇండస్ట్రీకి విద్యార్థి కూడా. క్రిష్ న్యాయం చేయగలడని నాకు గట్టి నమ్మకం ఉంది. అతనికి కమర్షియాలిటీ, ఆర్ట్‌కి బ్యాలెన్స్ కుదర్చడం బాగా తెలుసు. ఒకవేళ క్రిష్, బాలకృష్ణగారు లేకుంటే ఈ సినిమా చేసేవాణ్ని కాదేమో? ● ఫ్యాన్స్ ఎలా రిసీవ్ చేసుకుంటారో అనే ఆలోచన లేదు. క్రిష్ చెప్పిన స్క్రిప్ట్ ప్రకారం తాతగారి క్యారెక్టర్ చాలా హానెస్ట్‌గా, డిగ్నిఫైడ్‌గా చూపించాను. నాకు ఆ డౌట్ లేదు. ఇది కేవలం సపోర్టింగ్ రోల్ అని యాక్సెప్ట్ చేయాలి. ● తాతగారి పాత్ర చేస్తున్నాను అని తాతగారిని అనుకరించడమో, మిమిక్రీ చేయడమో చేయలేదు. యూ ట్యూబ్‌లో ఒకే ఒక్క ఇంటర్వ్యూ చూశా. అదే ఈ సినిమాకు నా హోమ్ వర్క్. ఈ పాత్ర చేయగలను అనే నమ్మకం నాలో మొదటి నుంచీ ఉంది. చిన్నప్పటి నుంచి ఆయనతో పెరిగాను కాబట్టి ఆయన అలవాట్లు నాకు కొన్ని వచ్చేశాయి. ఆయన చాలా గొప్ప పరిశీలకుడు. నాకు కూడా అదే వచ్చింది. సినిమాలో ఏదీ కావాలని ప్రత్యేకంగా చేయలేదు. సహజంగా ఉండటానికి ప్రయత్నించాను. ● ఎప్పుడో 'యువకుడు' సినిమా టైమ్‌లో క్లీన్ షేవ్ చేశాను. మళ్లీ వేరే సినిమాల్లో ట్రై చేయలేదు. 'యన్.టి.ఆర్' చిత్రానికి ఫస్ట్ డే మేకప్‌లో చిన్న చిన్న ఇబ్బందులున్నా తర్వాత అంతా సాఫీగా సాగిపోయింది. యాక్టింగ్ పరంగా ఏ దశలోనూ కష్టంగా అనిపించలేదు. మేకప్ పరంగా 60 ఏళ్ల వయసు పాత్రప్పుడు కొంచెం ఎక్కువ కష్టపడాల్సి వచ్చింది. ● యన్టీఆర్‌గారితో తాతగారు పంచుకున్న అనుబంధం గురించి చెబుతూనే ఉండేవారు. కానీ నేను విన్నది ఏదీ స్క్రిప్ట్‌లో లేవు. నాకు తెలియని చాలా విషయాలు ఈ సినిమా ద్వారా తెలుసుకున్నాను. అది కొత్తగా, ఎగ్జైటింగ్‌గా అనిపించాయి. హిస్టరీ క్లాసులకు వెళ్లినట్టు అనిపించింది. ● తాతగారి బయోపిక్ గురించి ఏం ఆలోచించలేదు. మా చిన్నమావయ్య (నాగార్జున)గారు నిర్ణయం తీసుకోవాలి. అప్పుడు చూద్దాం. నా లాస్ట్ సినిమా 'ఇదంజగత్' నిరాశ పరిచింది. రిలీజ్ కూడా సరిగ్గా జరగలేదు. 'మళ్ళీరావా' కంటే ముందే ఒప్పుకున్న సినిమా అది. 'యన్.టి.ఆర్' తర్వాత రాబోతున్న సినిమాపై కూడా పూర్తి నమ్మకంతోఉన్నాను.


కార్తీ

పండగ సెలవులు

తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి పండుగను ఘనంగా నిర్వహిస్తారని తెలిసిందే. సంక్రాంతిని తమిళనాడులో పొంగల్ పేరుతో సెలబ్రేట్ చేసుకుంటారని తెలిసిందే. ఈ పెద్ద పండక్కి కుటుంబ సభ్యులతో కలిసి జాలీగా గడపటానికి ఇష్టపడతారు సినీ తారలు. ఈ లిస్ట్‌లో కార్తీ కూడా ఉన్నారు. ఈ ఏడాది పొంగల్‌కి ఆయన రెండు రోజులు సెలవు తీసుకుని తిరగి షూట్‌లో జాయిన్ అవుతారు. ప్రస్తుతం 'మా నగరం' ఫేమ్ లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో కార్తీ హీరోగా ఓ యాక్షన్ సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. రీసెంట్‌గా చెన్నైలో స్టార్ట్ అయిన ఈ సినిమా షూటింగ్ తాజాగా టెన్‌కాశీలో జరుగుతోంది. పొంగల్‌కి బ్రేక్ తీసుకుని మరలా అదే లోకేషన్‌లో షూట్ స్టార్ట్ చేస్తారు టీమ్. ఈ సినిమాలో హీరోయిన్ పాత్రే లేకపోవడం విశేషం.


కత్రినా కైఫ్

సోషల్ మీడియాకు దూరంగా ఉంచుతా

సోషల్ మీడియా యాప్స్‌తో ఎక్కువ టైమ్ గడిపితే యూత్ రియల్ లైఫ్‌కు దూరమై డిప్రెషన్‌కు గురయ్యే ప్రమాదముందని చెబుతున్నారు బాలీవుడ్ బ్యూటీ కత్రినా కైఫ్. ''చాలా మంది యూత్ సోషల్ మీడియాకు ఎడిక్ట్ అవుతున్నారు. ఈ ప్రభావం వారి మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. అలా అని వారి సోషల్‌మీడియా అకౌంట్స్‌ను డిలీట్ చేయమని చెప్పడం లేదు. సోషల్ మీడియాకు తక్కువ టైమ్ కేటాయించమని చెబుతున్నాను. మిగిలిన టైమ్‌ను వారి లక్ష్యసాధన కోసం వినియోగిస్తే వారి జీవితం బాగుంటుందని నా అభిప్రాయం. భవిష్యత్‌లో నా పిల్లలను తప్పకుండా సోషల్ మీడియాకు దూరంగా ఉంచుతాను. ఫిజికల్ యాక్టివిటీస్‌కు దగ్గర చేస్తాను'' అని చెప్పుకొచ్చారు కత్రినా కైఫ్.


ఫాతిమా

సెల్యూట్‌కి సెలక్టేనా?

'దంగల్' సినిమాతో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపును సంపాదించుకున్నారు ఫాతిమా సనా షేక్. ఇటీవల ఆమె నటించిన 'థగ్స్ ఆఫ్ హిందుస్తాన్' చిత్రం విడుదలై బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టినప్పటికీ నటిగా ఆమె కష్టాన్ని గురించారు బాలీవుడ్ దర్శకులు. ఇప్పుడు ఆ కష్టాన్నే గుర్తించి షారుక్ అండ్ టీమ్ 'సెల్యూట్' సినిమాలో ఫాతిమాను హీరోయిన్‌గా తీసుకోవాలని ఆలోచిస్తున్నారని బాలీవుడ్ సమాచారం. మరి..ఫైనల్‌గా ఆమె హీరోయిన్ ప్లేస్‌ను కన్ఫార్మ్ చేసుకుంటారా? లేక వేరే ఎవరైనా దక్కించుకుంటారా? అనేది వేచి చూడాలి. ఆస్ట్రోనాట్ రాకేశ్ శర్మ జీవితం ఆధారంగా షారుక్ ఖాన్ టైటిల్ రోల్‌లో 'సెల్యూట్' అనే చిత్రం తెరకెక్కనుంది. ఫిబ్రవరిలో ఈ సినిమా సెట్స్‌పైకి వెళ్తుందని బాలీవుడ్ టాక్.



సాక్షి ఫ్యామిలీ
విజయవాడ ॥ సోమవారం ॥ 7-1-2019

రాష్ట్రంలోని మొత్తం స్కూళ్లు	ఇందులో ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లు	కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లలో చదువుతున్న విద్యార్థులు	మొత్తం టీచర్లు	ఇందులో ప్రైవేట్ టీచర్లు
61,714	16,684	32,02,619	2,90,367	1,02,038

ఎంతెంత దూరం.. చాలా చాలా దూరం..

‘ఎంతెంత దూరం.. చాలా చాలా దూరం..’ అని గతంలో గ్రామీణ ప్రాంతాల్లో పాట పాడుకుంటూ పిల్లలు ఆడుకునే వారు. ఓ చిన్నారి కళ్లు కనిపించకుండా గంతలు కడితే.. మరొకరు ఒక వస్తువును ఆ చుట్టు పక్కల దాచేస్తారు. ఆ తర్వాత కళ్లకు కట్టిన గంతలు విప్పుతారు. ఆ చిన్నారి ఈ పాట పాడుకుంటూ దాచిన వస్తువును కనుక్కోవడానికి వెతుక్కుంటూ బయలు దేరుతుంది. ఇవాళ గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాల పరిస్థితీ అలాగే మారింది. అది ఎక్కడుందో వెతుక్కోవాల్సిన దుస్థితి.

– సాక్షి, అమరావతి /సాక్షి నెట్‌వర్క్

- చంద్రబాబు హయాంలో భారంగా మారిన పాఠశాల విద్య
- రేషనలైజేషన్ పేరిట పెద్ద సంఖ్యలో పాఠశాలల మూత
- కార్పొరేట్ విద్యా సంస్థల కోసం ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేస్తున్న సర్కారు
- వేలకు వేలు ఫీజులు భరించలేక చదువులకు దూరమవుతున్న పేద పిల్లలు
- నవరత్నాల్లోని ‘అమ్మ ఒడి’తో పిల్లల చదువులకు వైఎస్ జగన్ భరోసా
- పిల్లల్ని బడికి పంపించే ప్రతి తల్లికీ ఏడాదికి రూ.15 వేలు
- తమ చిన్నారుల చదువుకు ఆసరాగా ఉంటుందంటున్న తల్లిదండ్రులు

రాష్ట్రంలో పాఠశాల విద్య సామాన్య, మధ్య తరగతి కుటుంబాల వారికి దూరం అవుతోంది. పిల్లలకు చదువు చెప్పించాలంటేనే తల్లిదండ్రులు బెంబేలెత్తుతున్నారు. ఎల్‌కేజీ, యూకేజీల్లో చేర్పించాలన్నా వేలకు వేలు ఫీజులు కట్టాల్సిందే. ప్రయివేటు, కార్పొరేట్ సంస్థలను ప్రోత్సహించేలా చంద్రబాబు ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేస్తూ వస్తోంది. రేషనలైజేషన్ పేరిట మూసేయడమేగాక.. సరపడా టీచర్లను నియమించకుండా, మౌలిక సదుపాయాలు కల్పించకుండా ప్రభుత్వ పాఠశాలలను అధ్వానంగా మార్చింది. ఇక్కడ చదువుతున్న పేద పిల్లలకు సరైన విద్య అందించకుండా వారిని ప్రయివేటు వైపు వెళ్లేలా చేస్తోంది. క్రమేణా ప్రభుత్వ పాఠశాలలను మూత వేయించి వాటి స్థానే కార్పొరేట్ సంస్థలకు పెద్దపీట వేసేలా కార్యక్రమాలు చేస్తోంది.

రేషనలైజేషన్ పేరిట స్కూళ్ల మూత

నాలుగున్నరేళ్లుగా తెలుగుదేశం ప్రభుత్వం రేషనలైజేషన్ పేరిట దాదాపు ఐదు వేల పాఠశాలలను మూత వేయించింది. ఇందులో అత్యధికం ప్రాథమిక పాఠశాలలే. ప్రతి కిలోమీటర్‌కు ఒక ప్రాథమిక పాఠశాల, ప్రతి మూడు కిలోమీటర్లకు ఒక ప్రాథమికోన్నత పాఠశాల, ఐదు కిలోమీటర్లకు ఒక ఉన్నత పాఠశాల ఉండాలన్నది ప్రభుత్వ నిబంధన. ఒకటో తరగతిలో చేరే బాలబాలికలకు వయసు ఐదేళ్లు మాత్రమే ఉంటాయి కాబట్టి వారికి సమీపంలోనే స్కూలు ఉండాలి. కానీ చంద్రబాబు అధికారంలోకి రాగానే మూడు కిలోమీటర్లలో ఉన్న ప్రాథమిక పాఠశాలలన్నింటినీ విలీనం పేరిట ఒక్కటిగా చేసి.. మిగతా స్కూళ్లను మూసేయించారు. ఆయా స్కూళ్లలో తగినంత మంది విద్యార్థులు లేరన్న సాకుతో వాటిని మూయించారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ కుటుంబాలున్న ప్రాంతాలు, గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లోని స్కూళ్లు మూత పడటంతో అక్కడ చదువుతున్న వేలాది మంది పిల్లలకు పాఠశాలలు దూరమయ్యాయి. దగ్గరలోని ప్రయివేటు పాఠశాలలకు వెళ్లి చదువుకోవడానికి తగినంత ఆర్థిక స్తోమత లేక తల్లిదండ్రులు వారిని స్కూళ్లకు పంపడం మాన్పిస్తున్నారు. అంతే కాకుండా దాదాపు ఐదు వేలకు పైగా ప్రాథమికోన్నత పాఠశాలలను ప్రాథమిక పాఠశాలలుగా డీగ్రేడ్ చేశారు. అక్కడి 6, 7, 8 తరగతుల్లోని విద్యార్థులు దూరంలోని ఇతర స్కూళ్లకు వెళ్లలేక.. దగ్గరలోని ప్రయివేటు స్కూళ్లను ఆశ్రయించాల్సి వస్తోంది. 98 హైస్కూళ్లనూ రేషనలైజేషన్ పేరిట యూపీ స్కూళ్లుగా డీగ్రేడ్ చేశారు. తమ పిల్లలను చదువులు మాన్పించడం సరికాదని భావించే తల్లిదండ్రులు అప్పులు చేసి మరీ ప్రయివేటు స్కూళ్లకు పంపిస్తున్నారు. ఆయా స్కూళ్లలో ఫీజుల భారం మోయలేక, అప్పులు కూడా దొరకని వారి పిల్లలు మధ్యలోనే చదువులకు స్వస్తి చెబుతున్నారు.

ఒలింపిక్స్ నిర్వహిస్తారట..

పాఠశాలల్లో క్రీడా వసతులను మెరుగు పరచడం లేదు గానీ, అమరావతిలో ఒలింపిక్స్ నిర్వహిస్తామని సీఎం ప్రకటించడం ఆశ్చర్యపరిచింది. తిరుపతిలో నిర్వహించిన ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ సమావేశాల్లో.. రాష్ట్రానికి చెందిన వారు నోబుల్ బహుమతి తెచ్చుకుంటే రూ.100 కోట్లు ఇస్తామని చంద్రబాబు ప్రకటించి అందరినీ విస్మయపరిచారు. పాఠశాలల్లో కనీస సదుపాయాలు కల్పించకుండా, ఉన్నత విద్యాసంస్థల్లో పరిశోధనలకు వీలుగా ల్యాబ్‌లు ఇతర సౌకర్యాలు కల్పించకుండా, బోధన, బోధనేతర సిబ్బందిని నియమించకుండా చంద్రబాబు ఇలా ప్రకటించడం ఆశ్చర్యపరిచింది.

కార్పొరేట్‌లో ఫీజుల మోత

కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజులపై నియంత్రణ లేకపోవడంతో ఆయా యాజమాన్యాలు ఇష్టానుసారం ఫీజులు పెంచేస్తున్నాయి. నగర, పట్టణ ప్రాంతాల్లోని స్కూళ్లే కాకుండా మండల స్థాయి స్కూళ్లలోనూ ఫీజులు భారంగా మారాయి. ఎల్‌కేజీ, యూకేజీ నుంచే వేలల్లో ఫీజులు వసూలు చేస్తున్నారు. విశాఖపట్నం, తిరుపతి, విజయవాడ, గుంటూరు, రాజమండ్రి, కర్నూలు ఇలా పలు నగరాల్లోని కార్పొరేట్ స్కూళ్లు 30 వేల నుంచి లక్ష వరకు ఫీజుల కింద విద్యార్థుల నుంచి వసూలు చేస్తున్నాయి. ఇవి కాకుండా పుస్తకాలు, యూనిఫాంలు.. తదితరాల పేరిట వేలకొద్దీ డబ్బు వసూలు చేస్తున్నాయి. పుస్తకాలకు రూ.15 వేలు, యూనిఫాంకు రూ.7 వేలు, ఇతర సామగ్రి అంటూ మరో 2 వేలు దండుకుంటున్నాయి. ఈ ఫీజులు భరించలేని విద్యార్థుల తల్లిదండ్రులు ఆస్తులు అమ్ముకుంటూ, అప్పులు చేస్తున్నారు.

చంద్రబాబు 2014 ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న అంశాలు



- టీడీపీ అధికారంలోకొస్తే పేద పిల్లలకు కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందిస్తాం
- కాలేజీ విద్యార్థులకు ఐపాడ్‌లు, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యా విధానంలో మార్పులు చేస్తాం.
- ప్రతి కిలోమీటర్‌కు ఒక ఎలిమెంటరీ స్కూలు, మూడు కిలో మీటర్లకు ఒక యూపీ స్కూలు, ఐదు కిలోమీటర్లకో హైస్కూలు పెడతతాం (వాస్తవానికి ఉన్న స్కూళ్లను మూయించారు).
- ఏటా విద్యాసంవత్సరానికి మూడు నెలల ముందే డీఎస్సీని నిర్వహించి టీచర్లను నియమిస్తాం.

ఇదీ బాబు ప్రభుత్వ నిర్వాకం

- పాఠశాలల్లో సదుపాయాల కల్పన పేరిట నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం విద్యాభివృద్ధి నిధులను తెలుగుదేశం నేతలకు పప్పు బెల్లాల కింద పంచిపెట్టింది.
- స్కూళ్లలో బయోమెట్రిక్ యంత్రాలు, హెచ్‌ఎంల నుంచి పైస్థాయి అధికారులకు ట్యాబ్‌ల పంపిణీ, పాఠశాలలకు ఫర్నీచర్ సరఫరా, మరుగుదొడ్ల నిర్మాణం.. ఇలా అన్ని వ్యవహారాల్లో భారీగా నిధులు దండుకున్నారు.
- నాలుగున్నరేళ్లలో సర్వశిక్ష అభియాన్ నిధులతో పాటు ఇటు బడ్జెట్ నిధులనూ ఇష్టానుసారంగా తమ వారికి కాంట్రాక్టుల పేరిట కట్టబెట్టిన ప్రభుత్వం.. తాజాగా హైబ్రిడ్‌యాన్యుటీ అంటూ కొత్త కమీషన్ల వ్యవహారానికి తెరలేపింది. రూ.4,800 కోట్లతో మౌలిక సదుపాయాల పేరిట కాంట్రాక్టులు ఇచ్చేందుకు రంగం సిద్ధం చేసింది.
- ప్రభుత్వ స్కూళ్లను ప్రయివేటు, స్వచ్ఛంద, ఆధ్యాత్మిక సంస్థలకు అప్పగించి వారికి కోట్లాది రూపాయలు దోచిపెడుతోంది. ఈషా ఫౌండేషన్, రిషివేలీ, ప్రథమ్ తదితర సంస్థలకూ పాఠశాలలను అప్పగించింది. ఎవరి మార్గంలో బోధన చేయాలో అర్థంకాక టీచర్లు, ఏది నేర్చుకోవాలో తెలియక విద్యార్థులు తలలు పట్టుకుంటున్నారు.
- మధ్యాహ్న భోజన పథకంలో వివిధ సరకుల కొనుగోలు కాంట్రాక్టులను కేంద్రీకృతం చేసి.. కందిపప్పు తదితరాల కొనుగోలులో కోట్ల కొద్దీ నిధులను పక్కదారి పట్టిస్తున్నారు. కోడిగుడ్ల సరఫరాలో తెలుగుదేశం నేతలు కాంట్రాక్టర్లుగా మారి పిల్లల కడుపుకొడుతున్నారు.
- పాఠ్యపుస్తకాలు, యూనిఫాంల పంపిణీలో అక్రమాలకు అంతే లేదు. ఆప్కో మాటున దుస్తుల పంపిణీలో టీడీపీ నేతలు అక్రమాలకు పాల్పడుతున్నారు.
- వాస్తవ పరిస్థితికి భిన్నంగా గణాంకాలు చూపిస్తూ విద్యాభివృద్ధిలో రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో ఉందంటూ అబద్ధాలు చెబుతోంది.
- విద్యాభివృద్ధిలో ముందంజలో ఉన్నామని చెప్పి.. రాష్ట్రానికి రావాల్సిన సర్వశిక్ష అభియాన్‌తో పాటు ఇతర నిధులకూ కేంద్రం కోతపెట్టడానికి కారణమయ్యారు.

కొత్త చట్టాలతో మరింత ప్రమాదం

కార్పొరేట్, ప్రయివేట్ సంస్థలను ప్రోత్సహించడానికి ప్రభుత్వం ఏకంగా ఒక ప్రత్యేక చట్టాన్ని తెస్తోంది. సెల్ఫ్ ఫైనాన్స్‌డ్ ఇండిపెండెంట్ స్కూల్స్ పేరిట తెస్తున్న ఈ చట్టంతో ఇక చదువులు మరింత భారంగా మారనున్నాయి. పెద్దపెద్ద కార్పొరేట్ సంస్థలు మాత్రమే పాఠశాలలు స్థాపించేలా నిబంధనలు పెట్టింది. ప్రభుత్వ పాఠశాలలను మూసేసి.. వాటి ఆస్తులను ప్రయివేటుకు అప్పగించేలా ప్రభుత్వం పావులు కదుపుతోంది. ఇప్పటికే రేషనలైజేషన్ పేరిట మూతవేసిన స్కూళ్లలో 200 పాఠశాలలను బ్రిడ్జి ఇంటర్నేషనల్ సంస్థకు అప్పగించేందుకు ప్రభుత్వం ఒప్పందం కూడా చేసుకుంది.



ఆ ధైర్యంతోనే పిల్లల్ని చదివిస్తున్నా..

నాకు ఇద్దరు పిల్లలు. పెద్దోడు కొండేటి సాయి 5వ తరగతి, చిన్నోడు కొండేటి నవీన్ 3వ తరగతి చదువుతున్నారు. నా భర్త నాలుగేళ్ల కిందట ఇల్లు వదిలి వెళ్లిపోయాడు. నేను కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. కుటుంబ పోషణే కష్టంగా ఉన్న నాకు.. పిల్లల చదువులు పెనుభారంగా మారాయి. వారిని కూడా చదువు మాన్పించి పనులకు పంపితే తప్ప ఇల్లు గడవని పరిస్థితి. కానీ అమ్మ ఒడి పథకం ద్వారా జగనన్న ఆర్థికంగా చేయూతనిస్తే పిల్లల చదువులు ముందుకు సాగుతాయి. ఆ ఆశతోనే వారి చదువులను కొనసాగిస్తున్నాను. లేదంటే ఇప్పటికి మాన్పించేదాన్ని.

– కొండేటి కనక మహాలక్ష్మి, గుర్ల గ్రామం, విజయనగరం జిల్లా.



జగనన్నపై నమ్మకం ఉంది

మా గ్రామంలో ఎక్కువ మంది ఉపాధి కూలీలే. నాకు ముగ్గురు ఆడపిల్లలు. ఎంతో కష్టపడి వారిని చదివిస్తున్నా. జగనన్న ప్రకటించిన నవరత్నాలలోని అమ్మ ఒడి పథకం గురించి విన్నాక చాలా ధైర్యం వచ్చింది. ఎన్ని కష్టాలొచ్చినా పిల్లల చదువులను మాన్పించలేదు. అమ్మ ఒడి పథకంతో నా చిన్నారుల చదువులకు భరోసా దొరికిందని ధైర్యంగా వారిని బడికి పంపుతున్నాను. అన్న రాగానే వారి చదువుల బాధ్యతను తీసుకుంటాడన్న నమ్మకం ఉంది.

– జి.సరస్వతి, చెల్లెంపేట, విజయనగరం జిల్లా.

నేను మళ్లీ చదువుకుంటాను..

మాది చాలా పేద కుటుంబం కావడంతో మా అమ్మానాన్న నన్ను చదివించలేకపోయారు. ఏడో తరగతిలోనే బడి మానేసి.. వారికి చేదోడువాదోడుగా ఉంటున్నా. నాన్న అప్పలరాజు రోజూ ఇటుకల పనులకు, అమ్మ అప్పమ్మ కూలి పనులకు వెళుతూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. నాకు చదువుకుందామన్న కోరిక ఉన్నా ఆర్థిక పరిస్థితులు ఆ కోరికను తీర్చుకోనివ్వడం లేదు. జగనన్న ప్రకటించిన నవరత్నాల్లోని అమ్మ ఒడి పథకంతో ఎటువంటి ఆర్థిక ఇబ్బందుల్లేకుండా పిల్లల్ని చదివించుకోవచ్చని చెబుతున్నారు. పిల్లల్ని బడికి పంపితే ఏటా రూ.15,000 ఇస్తారని తెలిసి చాలా సంతోషం వేసింది. జగనన్న త్వరగా ముఖ్యమంత్రి అయ్యి.. నాలాంటి పేద పిల్లలను చదివించాలని కోరుకుంటున్నా.



– కర్రి ఆదిలక్ష్మి, రామభద్రపురం, విజయనగరం జిల్లా



మాలాంటి పేదలకు ‘అమ్మ ఒడి’ వరం

మేం నిరుపేద గిరిజనులం.. రెక్కాడితేగానీ డొక్కాడని బతుకులు మావి. మాకు ముగ్గురు కుమార్తెలు. పెద్ద కుమార్తె డిప్పల అప్పలమ్మను పేదరికం కారణంగా బడికి పంపలేకపోయాము. పనుల్లో మాకు చేదోడు వాదోడుగా ఉంటోంది. పారమ్మ ఒకటో తరగతి, అనిత రెండో తరగతి చదువుతున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన నవరత్నాలులోని ‘అమ్మ ఒడి’ పథకం అమలైతే.. మా పెద్ద బిడ్డను కూడా బడికి పంపిస్తాం. పిల్లలను బడికి పంపితే ఆర్థిక సాయం అందిస్తానని జగన్ చెబుతున్నారు. అదే జరిగితే కూలికెళితే తప్ప పూట గడవని మాలాంటి నిరుపేదలందరూ ఎంతో సంతోషిస్తారు.

– డిప్పల పొట్టయ్య, చిన్నమ్మ.. ఇటుకవలస, పాచిపెంట మండలం.


మీ పిల్లల చదువుకు నాదీ భరోసా

తెలుగుదేశం ప్రభుత్వం గత నాలుగున్నరేళ్ల పాలనలో ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేయడమే కాకుండా పాఠశాల విద్యను భారంగా మార్చింది. ఆ భారం మోయలేక చదువులు మాన్పిస్తున్న నిరుపేద, మధ్యతరగతి కుటుంబీకులు ఎంతో మంది నాకు కష్టాలు చెప్పకున్నారు. అందుకే ప్రతి తల్లి తన పిల్లలను బడికి పంపితే చాలు. ఏ బడికి అయినా ఫరవాలేదు. ఏడాదికి రూ.15 వేలు ఇస్తాను. ‘అమ్మ ఒడి’ పథకం కింద ఆ తల్లి ఖాతాలో జమ చేస్తాం. పేదింటి పిల్లల చదువులకు ఏ తల్లిదండ్రులూ భయపడాల్సిన అవసరం లేదు. - వైఎస్ జగన్





సంవత్సరానికి రూ.15,000



చంద్రబాబును నేను వ్యక్తిగతంగా ఎప్పుడూ ఏమీ అనలేదు. ఆయనే ఒక్కోసారి బీపీ వచ్చి ఇష్టమొచ్చినట్లు మాట్లాడతాడు. ఆయన ఎంపీల చేత, మంత్రుల చేత కూడా మాట్లాడిస్తాడు. వాళ్లు.. ఆ నా కొడుకు, ఈ నా కొడుకంటూ తిడతా ఉంటారు. అలా తిడతా ఉన్నా కూడా ఈయన ఖండించకపోగా వికటాట్టహాసంతో ఆనందం పొందుతాడు. ఈయనకున్న దిగజారుడు గుణం అది.

జీఎస్టీలో తప్పులు జరిగితే రిపేరు చెయ్యాల్సింది జీఎస్టీ కౌన్సిల్. ఆ జీఎస్టీ కౌన్సిల్‌లో మెంబరు ఎవరండి? ఇదే చంద్రబాబు పార్టీకి చెందిన ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు. ఆయనేమైనా గాడిదలు కాస్తున్నారా?

బాబు అవినీతిపై విచారణ

టీవీ9 ప్రత్యేక ఇంటర్వ్యూలో వైఎస్ జగన్

సాక్షి, అమరావతి

ప్రశ్న: పాదయాత్ర ద్వారా మీరు తెలుసుకున్న కొత్త విషయాలు ఏంటి? పాదయాత్ర మొదలు పెట్టి ఒక సంవత్సరం రెండు నెలలు అవుతుంది. ఈ 14 నెలల కాలంలో మీరు తెలుసుకున్న కొత్త విషయాలేంటి?

జగన్: ప్రజల తరుపున పోరాటంలో పాదయాత్ర అన్నది అత్యంత బ్రహ్మాస్త్రంలాంటిది. ప్రజల కష్టాలు తెలుసుకోవడమే కాకుండా, పాదయాత్ర చేసిన నియోజకవర్గం దాటే లోపు ప్రతి మూడు, నాలుగు రోజులకు బహిరంగ సభ కూడా జరుపుతున్నాం. విషయాలను బహిరంగ సభలో చెబుతూ, ఆ విషయాలను రాష్ట్ర వ్యాప్తంగా చర్చ జరిగేలా చేస్తున్నాం.

ప్రశ్న: మీరు ప్రజల మధ్య ఉండడం కొత్త కాదు కదా.. ఇంతకు ముందు ఓదార్పు యాత్ర చేశారు. అనేక సభలు, ధర్నాలు చేశారు. వాటికీ, దీనికి తేడా ఏంటంటే ఏం చెప్పగలుగుతారు?

జగన్: పాదయాత్ర సమయంలో నేను ప్రజల్లో ఉంటూ.. ఫలానా చోట నేను ఉంటాను, ఫలానా చోట నేను పడుకుంటానని తెలిసిన పరిస్థితి ఉంది. కాబట్టి ఆ దారి గుండా పోయే సమయంలో ప్రజలు వచ్చి వారి సమస్యలు చెప్పుకోగలుగుతున్నారు. వినే మనిషి ఒకరు ఉన్నారు.. రేప్పొద్దున ఆ మనిషి మంచి పొజిషన్‌లోకి వస్తే ఏదైనా చేస్తారన్న భరోసా ఆ ప్రజల్లో కలుగుతోంది.

ప్రశ్న: మీ పాదయాత్ర 3,600 కిలోమీటర్లు పూర్తయిందంటే, కొన్ని వేల సమస్యలు, కొన్ని వేల వినతులు విని ఉండొచ్చు. రేపు అధికారం వస్తే అవన్నీ పరిష్కారించడానికి మీ దగ్గర ఏదన్నా మార్గం ఉందా?

జగన్: మెజార్టీ సమస్యలు పరిష్కరించదగ్గవే. 99.99 శాతం సమస్యలు సమాజంలో ఈ రోజు పడుతున్న అగచాట్లే. ఇవన్నీ ప్రభుత్వం స్వయంగా చేసిన తప్పిదం వల్ల వచ్చిన సమస్యలే. ఉదాహరణకు పింఛను ఇవ్వడం.. ప్రభుత్వం స్వయంగా దగ్గర ఉండి చేసిన పాపమే. జన్మభూమి కమిటీల ద్వారా లంచాలు అడగడం. మరుగుదొడ్లకు సైతం లంచాలు తీసుకునే పరిస్థితి. మోడల్ స్కూళ్లలో పని చేస్తున్న వారికి నాలుగు నెలల నుంచి జీతాలు ఇవ్వకపోవడం, ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పెట్టే వారికి నెలల తరబడి సరుకుల బిల్లులు ఇవ్వకపోవడం.. ఆరు నెలలకు పైగా వారికి ఇచ్చే గౌరవ వేతనం ఎగరగొట్టడం.. ఇలాగైతే వారు పిల్లలకు భోజనం ఎలా పెడతారు? మేం శాచ్యురేషన్ మోడ్‌లో మా నాన్న ఇంతకు ముందు చేసిన పద్ధతిలో ఈ సమస్యను అధిగమిస్తాం. మేం అధికారంలోకి రాగానే జన్మభూమి కమిటీలను రద్దు చేస్తాం. అదీగాక గ్రామ సచివాలయం ఏర్పాటు చేస్తాం. అదే గ్రామంలో పది మందికి ఉద్యోగాలిస్తాం. గ్రామ సచివాలయం ఆ గ్రామంలోనే ఉంటుంది. ఆ గ్రామంలో పది మంది ఉద్యోగం చేస్తా ఉంటారు. ప్రభుత్వ పథకమేదైనా కావాలన్నా, ఆ గ్రామానికి చెందిన ఏ సమస్య అయినా గ్రామ సచివాలయంలోనే పరిష్కారమవుతుంది. 72 గంటలలోనే లంచాలు లేకుండా పని జరుగుతుంది.

ప్రశ్న: 2014కు ముందు చంద్రబాబు కూడా ఇలానే చెప్పారు. వినడానికి చాలా బాగున్నాయి. అప్పుడు చంద్రబాబుకు ఓటు వేశారు. ఇప్పుడు కూడా మీరు చెబుతున్నారు. వినడానికి బాగున్నాయి. ఇప్పుడు మీకున్న ఆలోచనలను ఇదే తరహాలో చేరవేయగలిగే పరిస్థితి ఉంటుందా?

జగన్: చంద్రబాబును ఇంకొక నాయకుడితో పోల్చకూడదు. ఒక పిల్లవాడి వద్దకు వెళ్లి చంద్రబాబు గురించి చెప్పమని మీ టీవీ ఇంటర్వ్యూలో ఎవరినన్నా అడగండి. ఒక్కసారి మైక్ పెట్టి చంద్రబాబుపై మీ అభిప్రాయం ఏంటని అడగండి. వారి నోట్లో నుంచి వచ్చే మొదటి మాట ఏంటో తెలుసా? చంద్రబాబు లాంటి మోసగాడు ఉండరు నాయనా అనే అక్క అయితే, పొదుపు సంఘాల రుణాలు మాఫీ చేస్తానన్నాడయ్యా, మాఫీ కాలేదు, మా సున్నా వడ్డీ డబ్బులు కూడా పోయాయయ్యా అంటోంది. రైతును అడిగితే.. మా వ్యవసాయ రుణాలన్నీ మాఫీ చేస్తానన్నాడయ్యా. బ్యాంకులో పెట్టిన బంగారం ఇంటికి రావాలంటే బాబు సీఎం కావాలన్నాడయ్యా. బ్యాంకులో పెట్టిన బంగారం ఇంటికి రాలేదు కానీ, వేలం నోటీసులు ఇంటికి వస్తున్నాయి. ఆయన చేసిన రుణమాఫీ మా వడ్డీలకు కూడా చాలడం లేదు. ఇంతకు ముందు ప్రభుత్వాలు మాకు వడ్డీ లేకుండా సున్నా వడ్డీకి డబ్బులన్నా ఇచ్చేవి. ఈయన వచ్చాక అదీ రావడం లేదయ్యా. ఆ డబ్బులు కట్టడం మానేశాడయ్యా. అన్యాయం చేశాడయ్యా.. అంటారు. చదువు అయిపోయి ఉద్యోగం వెతుక్కుంటున్న పిల్లవాడు అనేది ఏమిటో తెలుసా? ఉపాధి గానీ ఉద్యోగం గానీ ఇవ్వకపోతే నిరుద్యోగ భృతి ఇస్తానన్నాడు. ఈ రోజు ఉద్యోగం లేదు, రూ.2 వేల నిరుద్యోగ భృతి లేదు, అడ్డగోలుగా మోసం చేశాడన్నా.. అంటాడు. చదువుకుంటున్న పిల్లవాడ్ని అడిగితే, ఈ రోజు ఇంజనీరింగ్ చదవాలంటే లక్ష రూపాయలు ఫీజు కట్టాలి.. ఇచ్చే ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.30 వేలన్నా.. అది కూడా ఇవ్వక రెండేళ్లవుతోంది. మిగతా రూ.70 వేలు సంవత్సరం సంవత్సరం మా తల్లిదండ్రులు ఎక్కడ నుంచి తేవాలన్నా.. నాలుగేళ్లలో మూడు లక్షల రూపాయలు ఎక్కడి నుంచి తేవాలి.. అప్పుల పాలవుతూ, చదువుకునే పరిస్థితి ఈ రోజు లేదన్నా.. బీసీలపై ప్రేమ అని ఆ పెద్ద మనిషి అంటాడు.. ఇక్కడ చదువే లేక మేం ఉంటే ఏ రకమైన ప్రేమన్నా ఆయనది.. బీసీలపై ప్రేమ అంటే నాలుగు కత్తెరలు, నాలుగు ఇస్త్రీ పెట్టెలు ఇవ్వడం కాదన్నా.. పిల్లలను అప్పుల పాలు కాకుండా చదివించాలి.. చదివి ఉద్యోగం చేయాలి.. కాస్తో కూస్తో ఇంటికి పంపే పరిస్థితి రావాలి.. అప్పుడే బీసీలపై ప్రేమ అంటారు గానీ, ఇదేమి ప్రేమన్నా.. ఇంత మోసగాడు మరొకరు ఉండరంటారు. ఇంకా కాస్త లోతుకు పోయి అడిగితే, అన్నా.. మమ్మల్ని ఎస్సీల్లో చేర్చుతానన్నారు.. మమ్మల్ని ఎస్టీలుగా చేస్తానన్నాడు.. మమ్మలి బీసీలుగా చేస్తాడని ఇంకొందరు అంటారు. ఏదీ కాదు అని తెలుసు. తొమ్మిదేళ్ల సీఎంగా చేసిన చరిత్ర ఉంది. అనుభవం ఉంది. కానీ, ఓట్ల కోసమని, అడ్డగోలుగా మోసం చేసిన పరిస్థితుల్లో ఆయనంత మోసగాడు ఉండరు. ఆయన ముఖ్యమంత్రి కావడమే తన సొంత మామ ఎన్టీ రామారావును వెన్నుపోటు పొడిచే కదా.. ఇంకా అడిగితే.. తొమ్మిదేళ్ల ఆయన సీఎంగా ఉన్నప్పుడూ ఇదే పరిస్థితి.. ఇంతే గొప్పగా చెప్పాడు.. మా ఖర్మ ఏంటంటే, పదేళ్ల గ్యాప్ వచ్చింది.. ఆయన చేసిన మోసాలు మరిచిపోయాం.. కాబట్టి మా ఖర్మకొద్ది ఆయనకు ఓటు వేశామని చెబుతారు.

ప్రశ్న: 40 ఇయర్స్ ఇండస్ట్రీ అని చంద్రబాబు చెబుతున్నారు.. మీరు 46 ఇయర్స్ యంగ్‌మాన్.. క్లాష్ అవుతున్న తీరు ప్రజలు ఎట్లా రిసీవ్ చేసుకుంటారు.

జగన్: త్వరలోనే ఎన్నికలు జరగబోతున్నాయి. ప్రజలు ఎవరిని ఎలా రిసీవ్ చేసుకోబోతున్నారనేది తెలుస్తుంది కదా.. ఓటు ఎవరికి వేయబోతున్నారు అనేది తెలిసిపోతుంది.

ప్రశ్న: 2014లో మేము అధికారంలోకి రావాల్సిన వాళ్లం అని మీరంటున్నారు. చంద్రబాబు లాస్ట్‌మినిట్‌లో అధికారంలోకి వచ్చారు. ఈసారి మీరు కాన్ఫిడెంట్‌గా ఉన్నారు అధికారంలోకి వస్తానని. చంద్రబాబు నాయుడు పవర్‌ను నిలబెట్టుకోడు అని మీరు ఎందుకు అనుకుంటున్నారు.

జగన్: నిలబెట్టుకునే దానికే కదా రోజుకో డ్రామా వేస్తున్నాడు. మామూలుగా తెలుగు సినిమాలు చూస్తూ ఉంటాం. సంవత్సరానికి ఐదారు రిలీజ్ అవుతూంటాయి. చిరంజీవి, పవన్ కళ్యాణ్, మహేష్‌బాబు ఇలా ఒకటీ లేదా రెండు సినిమాలు రిలీజ్ చేస్తుంటారు. కానీ ఆరు మాసాల్లో ఎన్నికలనే సరికే చంద్రబాబు నాయుడు వారానికో సినిమా. పెన్షన్‌లు రావడం లేదా.. అయ్యో ఇప్పుడే మంజూరు చేస్తా. అయ్యో మీకు ఇళ్లు మంజూరు కాలేదా.. ఇప్పుడే మంజూరు చేస్తున్నా. పోనీ ఇచ్చారా అంటే అదీ లేదు. అంతా డ్రామా. అయ్యో ప్రత్యేక హోదా రాలేదా? నాలుగేళ్లయి పోయింది. ఇంతవరకూ ప్రత్యేక హోదా రాలేదా? నేను ధర్మపోరాట దీక్ష చేస్తా. అదీ ఒక సినిమా. రాజధాని.. అయ్యో ఇంతవరకూ కట్ట లేదా? బాహుబలి సినిమా అయిపోయింది ఇంతవరకూ కట్టడాలు లేవా? అదొక సినిమా అయిపోయింది. గ్రాఫిక్స్ చూపిస్తారు. అయ్యో పోలవరం.. పునాది దాటి ముందుకు పోలేదా.. నా మనవడిని కూడా తీసుకెళ్లి చూపిస్తా. స్పీడు పెంచుతా. 2018 జూన్ కంతా నీళ్లిస్తా. ఇదీ ఒక డ్రామా. ఇన్ని కొత్త సినిమాలు ప్రపంచంలో ఏ హీరో కూడా తీసి ఉండరు. బీజేపీలో కలుస్తాడు కాంగ్రెస్‌ను తిడతాడు. బీజేపీతో నాలుగేళ్ల సంసారం చేశాడు. ఇప్పుడు కాంగ్రెస్‌తో సంసారం చేస్తూ బీజేపీని తిడుతున్నాడు. బీజేపీతో ఉన్నప్పుడు జగన్‌కు ఓటేస్తే కాంగ్రెస్‌కు వేసినట్టే అన్నాడు. ఇప్పుడు కాంగ్రెస్‌తో ఉంటూ.. జగన్‌కు ఓటేస్తే బీజేపీకి ఓటేసినట్టే అంటాడు.అటు బీజేపీతో, ఇటు కాంగ్రెస్‌తో సంసారం చేసింది చంద్రబాబునాయుడు గారే. ఇద్దరితో కాపురం చెయ్యని వ్యక్తి, చెయ్యని పార్టీ ఏదన్నా ఉందంటే జగన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీనే.

ప్రశ్న: మీకు బీజేపీతో సన్నిహిత సంబంధాలున్నాయని పదే పదే చంద్రబాబునాయుడు చెబుతున్నారు. వైసీపీ నాయకులు విజయసాయిరెడ్డి పదే పదే మోడీని కలుస్తున్నారు. అపాయింట్‌మెంట్‌లు ఈజీగా దొరుకుతున్నాయి అంటున్నారు. దాన్ని బ్రేక్ చెయ్యడానికి, ఖండించడానికి మీదగ్గరేమైనా ఆధారాలున్నాయా?

జగన్: విజయసాయిరెడ్డి అనే వ్యక్తి ప్రధాన మంత్రిని ఎన్నిసార్లు కలిశాడో చెప్పమనండి.. ఒకసారి నేను కూడా తెలుసుకుంటా. ప్రధాన మంత్రి ఖాళీగా ఉన్నారు.. ఎప్పుడడిగితే అప్పుడు అప్పాయింట్‌మెంట్ ఇస్తున్నాడు అంటూంటే ఆశ్చర్యంగా ఉంది. ఎన్నిసార్లు కలిశాడో చెబితే.. ఈ టెలికాస్ట్ ద్వారా ప్రజలు తెలుసుకుంటారు. అంత ఖాళీగా ప్రధాని ఉంటున్నాడంటే నేను కూడా తెలుసుకునేందుకు ప్రయత్నం చేస్తా. నాకు తెలిసినంత వరకూ ప్రధానిని ఆయన 4 ఏళ్లలో 3 సార్లు కలిసి ఉంటారు. నాతోపాటు 2 సార్లు వచ్చి ఉంటాడు. అదికాక ఆయనేమన్నా లోకల్ సమస్యలపై ఒకసారో రెండుసార్లో కలిసి ఉంటాడు. అలాంటి అపాయింట్‌మెంట్ ఎవరికైనా ఇస్తారు. ప్రతి ఎంపీకి ఇస్తారు. దాన్ని వక్రీకరించాలనుకున్నప్పుడు అదే చేస్తారు.

ప్రశ్న: ఆంధ్రా పాలిటిక్స్‌లో ఇదే జరుగుతోంది. బీజేపీ విషయంలో మరో క్లారిఫై చెయ్యాలి. మీరు నరేంద్రమోదీని ఎప్పుడూ విమర్శించరు. ఎన్డీఏ పాలసీని వ్యతిరేకించరు. జీఎస్టీ మీద మాట్లాడరు. దీన్ని బట్టి మీకు, వాళ్లకు అండర్ స్టాండింగ్ ఉందని అంటున్నారు.

జగన్: ఎవడండీ అనింది.. నేను నోట్ల రద్దు మీద మాట్లాడలేదని చెప్పింది? ఒక్కసారి రికార్డులు వెనక్కు తియ్యండి. నావల్లే మోదీ నోట్ల రద్దు చేశాడు అన్నది చంద్రబాబు. ఆన్ రికార్డులో అన్నాడు. నోట్ల రద్దు కమిటీకి అధ్యక్షుడు ఎవరో తెలుసా? చంద్రబాబు నాయుడు. ఇంప్లిమెంటేషన్ మెకానిజం లేకుండా నోట్ల రద్దు అనేది తొందర పాటు చర్య అని, దీనివల్ల మంచికన్నా చెడు ఎక్కువ జరుగుతుంది అని మొదటిసారి నేనే చెప్పా. జీఎస్టీకి దేశంలో ప్రతి ఒక్కరూ మద్దతు ఇచ్చారు. జీఎస్టీకి మద్దతు ఇవ్వకపోతే ఎలాంటి ఇంప్రెషన్ ఇచ్చారో తెలుసా? ప్రపంచమంతా జీఎస్టీని ఇంప్లిమెంట్ చేస్తోంది. దాన్ని అనుసరించకపోతే ఏ లెవెల్లో వెనకబడిపోతాం అన్నది మీడియా ఏ లెవెల్లో హైప్ ఇచ్చింది. ఒక్కసారి చూడండి. ఏ మీడియా కూడా జీఎస్టీని వ్యతిరేకించలేదు. ఏ ముఖ్యమంత్రి వ్యతిరేకించలేదు. కొన్ని సెక్టార్లకు అన్యాయం జరిగిందనేదే గ్రీవెన్స్. చేనేతలకు అన్యాయం జరుగుతోంది అని మేము ప్రధానికి లేఖ ఇచ్చాం. మా ఎంపీలు వెళ్లి ప్రధానిని కలిసి వివరించారు. అరుణ్ జైట్లీకి చెప్పారు. టాక్స్‌లు రద్దు చెయ్యండి అన్నారు.

ప్రశ్న: హోదా మీద కూడా బీజేపీని సుతిమెత్తగా కొడుతున్నారట..

జగన్: చంద్రబాబు నాయుడు ఏ వీడియో టేపులు చూపిస్తున్నాడో.. బీజేపీ అన్యాయం చేసిందని ఏమి చూపిస్తున్నాడో.. 14వ ఆర్థిక సంఘం ఏం చెప్పింది, అభిజిత్‌సేన్ ఏం చెప్పారు? ఇవన్నీ ముందు ఎవరు చెప్పారు? వీటన్నిటిపై ఆంధ్రప్రదేశ్ ప్రజలకు అవగాహన కల్పించింది ఎవరు? ఒక్క జగనే. అసలు రాష్ట్రాన్ని కాంగ్రెస్ విడగొట్టి ఒక తప్పు చేస్తే.. ప్రత్యేక హోదాను చట్టంలో చేర్చకపోవడం రెండో తప్పు. ఒక వేళ కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక హోదాను చట్టంలో చేర్చి ఉండుంటే సుప్రీంకోర్టుకై నా వెళ్లి న్యాయం అడిగివుండే వాళ్లం. ఆ హక్కు కాంగ్రెస్ పార్టీ మాకు ఇవ్వలేదు. అది కాంగ్రెస్ పార్టీ చేసిన తప్పు. బీజేపీ చేసిన తప్పు అధికారంలో ఉండి, చేయతగ్గ స్థానంలో ఉండి, మాట ఇచ్చి, పార్లమెంటులో ఉంటూ, ఐదేళ్లు కాదు, పదేళ్లు ఇస్తామని చెప్పి, మేనిఫెస్టోలో పెట్టి, ఆ తర్వాత తిరుపతికి వచ్చి, సభలోనే ప్రత్యేక హోదాను ఇస్తానని మోడీగారే చెప్పి.. ఇప్పుడు ఆయన ఇవ్వకపోవడం మోడీ, బీజేపీ చేసిన తప్పు. మూడో హంతకుడు నారా చంద్రబాబు నాయుడు. పోరాటం చెయ్యాల్సిన వ్యక్తి, అడగాల్సిన వ్యక్తి నాలుగేళ్లు బీజేపీతో సంసారం చేశాడు. ఇద్దరు కేంద్ర మంత్రులుగా ఉన్నారు. ఏం చేశారండి? ప్రత్యేక హోదా సంజీవనా? అన్నాడు. ప్రత్యేక హోదా గురించి అడిగితే జైలులో పెట్టిస్తాను అన్నాడు. ప్రత్యేక హోదాతో మిగతా రాష్ట్రాలు ఏం బాగుపడ్డాయ్ అన్నాడు. ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి అసెంబ్లీలో ఈ మాదిరిగా మాట్లాడితే.. అసలు ప్రత్యేక హోదా అంటే ఏమిటో నీకు తెలుసా ముఖ్యమంత్రీ? ప్రత్యేక హోదా వల్ల కలిగే మేళ్లు ఏమిటో నీకు తెలుసా ముఖ్యమంత్రి గారూ? అని నేను అసెంబ్లీలో చంద్రబాబుకు క్లాస్ పీకాను. కావాలంటే ఆ టేపులు రివైండ్ చేసి ఒక్కసారి వినండి. నాలుగేళ్లు బీజేపీతో సంసారం చేసి, ప్రత్యేక హోదాను ఖూనీ చేసి, ప్రత్యేక హోదా కోసం పోరాడిన మా మీద వీళ్లు మాట్లాడుతా ఉంటే.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీలు రాజీనామా చేసి దేశ వ్యాప్త చర్చకు కారణమయ్యారు. ఈ పెద్ద మనిషి ఇప్పుడు ధర్మ పోరాట దీక్షలు అని చెప్పి మళ్లీ ఇప్పుడు కొత్త సినిమా చూపిస్తున్నాడు.

ప్రశ్న: మీరు హోదా ఎలా తీసుకొస్తారు? కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకున్నాను.. హోదా ఇస్తానని రాహుల్ గాంధీ చెప్పాడని చంద్రబాబు అంటున్నాడు. ఎంపీలు రాజీనామాలు చేశారు.. దేశ వ్యాప్త చర్చ తీసుకొచ్చానని మీరు అంటున్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్నవారి అండ లేకుండా, జాతీయ పార్టీ లేకుండా హోదా రాదు. మీరు ఎవరివైపు ఉంటారు?

జగన్: హోదా విషయంలో ఈ పార్టీలను నమ్మి నమ్మి సాలైపోయింది. కాంగ్రెస్ మోసం చేసింది. బీజేపీ మోసం చేసింది. చంద్రబాబు నాయుడు మోసం చేసాడు. పవన్ కళ్యాణ్ అనే వ్యక్తి కూడా మోసం చేశాడు. అందరూ కలిసే ఈ మోసాలు చేశారు. నేను ఈ ఆంధ్ర రాష్ట్ర ప్రజల తరపున అడిగేది ఒక్కటే. ప్రజలకు సంబంధించిన అంశం కాబట్టి ప్రజలనే మీ ద్వారా కోరుతున్నా. ఎవర్నీ నమ్మొద్దండి. 25కు 25 ఎంపీలు.. మొత్తం వైఎస్సార్ పార్టీకే తెచ్చుకున్న తర్వాత దేశంలో ప్రధాన మంత్రి ఎవరైనా కానీ.. ఐ యామ్ నాట్ బాదర్డ్. బీజేపీ, కాంగ్రెస్ ఎవరైనా కానీ, ఎల్లయ్య కానీ, పుల్లయ్యకానీ, ఫెడరల్ ఫ్రంట్ తరపున రజనీ కానీ ఎవరైనా సరే.. ప్రత్యేక హోదా ఇదిగో నేను సంతకం పెట్టబోతున్నాను. నీ మద్దతు ఇవ్వు అని చెబితే 25 మంది వైఎస్సార్‌సీపీ ఎంపీలతో మద్దతు ఇవ్వడానికి సిద్ధం. మద్దతు ఇచ్చిన రెండు రోజుల్లో ప్రత్యేక హోదా తేవాలి. 25 మంది ఎంపీలు మన చేతిలో ఉంటే మన దగ్గర అధికారం ఉంటుంది. అలా కాకుండా ఎవరితోనో పొత్తు పెట్టుకుని, మళ్లీ అదే పరిస్థితి పునరావృతమై మళ్లీ మోసపోవడం అంటే అంతకంటే మూర్ఖత్వం మరొకటి ఉండదు.

ప్రశ్న: మీకు పక్క రాష్ట్రం కేసీఆర్‌తో బాగా సాన్నిహిత్యం ఉందని ప్రచారం జోరుగా ఉంది. కేసీఆర్ కూడా చంద్రబాబుకు రిటర్న్ గిఫ్ట్ ఇస్తానంటున్నాడు. ఇందులో ఎంత వరకు వాస్తవం ఉంది?

జగన్: వాస్తవమేంటంటే.. కేసీఆర్‌ను ఇంత వరకు నేను ఎప్పుడూ కలవలేదు. మొన్న ఆయన గెలిచిన తర్వాత ఫోన్‌లో మాట్లాడి కంగ్రాచ్యులేట్ చేశా. ఇందులో తప్పేముంది? అంతకన్నా కేసీఆర్‌తో నాకు పరిచయం లేదు.

ప్రశ్న: కానీ కేసీఆర్‌కు మీపై ప్రత్యేకమైన ప్రేమ ఉంది. గత ఎన్నికల్లో మీరే గెలుస్తారని చెప్పారు. ఇప్పుడు కూడా మీరంటే ప్రత్యేకమైన అభిమానం కనబరుస్తున్నారు. కారణం ఏమై ఉంటుందో మీరు అబ్జర్వ్ చేశారా?

జగన్: బేసిక్‌గా ఏంటంటే.. ఒక మనిషి సినిమాకు పోతాడు. అందులో హీరో క్యారెక్టర్ అంటేనే ఇష్ట పడతాడు. విలన్ క్యారెక్టర్ నచ్చదు. సినిమా చూసినంతసేపు హీరోనే గెలవాలని చూస్తాడు. ఎందుకంటే ఆ మనిషి నైజాన్ని, క్యారెక్టర్‌ను బట్టి. చంద్రబాబు నైజం, క్యారెక్టర్ దేశ ప్రజలు, తెలుగు రాష్ట్రాల ప్రజలు ఇంకా దగ్గరగా చూశారు. కేసీఆర్ కూడా దగ్గరగా చూసిన వ్యక్తి కాబట్టి కేసీఆర్ చంద్రబాబుపై అలా మాట్లాడి ఉండచ్చు.

ప్రశ్న: సో.. కేసీఆర్‌ను ఆంధ్ర పాలిటిక్స్‌లోకి ఆహ్వానిస్తారా?

జగన్: ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు మంచి జరగాలంటే ప్రత్యేక హోదా అవసరం. దాని విషయంలో బీజేపీ, కాంగ్రెస్‌లు మోసం చేశాయి. ఆంధ్రప్రదేశ్‌లోని పవన్ కళ్యాణ్ కూడా మోసం చేశాడు. ఇంత మంది మోసం చేసినా కూడా కేసీఆర్‌కు ఆంధ్రప్రదేశ్‌తో సంబంధం లేదు. అయినా కూడా తెలుగు ప్రజల కోసం ఒక అడుగు ముందుకేస్తాను.. అవసరమైతే హోదా ఇవ్వాలని ప్రధానికి కూడా లేఖ రాస్తానని కేసీఆర్ ముందుకొచ్చి నాలుగు మాటలు మాట్లాడాడు. అటువంటి మంచి మాటలు మాట్లాడిన వ్యక్తిని మనం స్వాగతించాలి. కేసీఆర్‌కు, బీజేపీ, కాంగ్రెస్‌కు ఆంధ్ర రాష్ట్రంలో పెద్ద బలమేమీ లేదన్న విషయం అందరికీ తెలిసిందే. కానీ ప్రత్యేక హోదా కోసం ఆంధ్ర రాష్ట్రానికి చెందిన ఎంపీలు 25 మంది స్వరం విన్పించడం ఒక ఎత్తు. వారికి తెలంగాణకు చెందిన ఎంపీలు 17 మంది మద్దతు పలకడం మరొక ఎత్తు. వారంతా జతై 42 మందిమి ఏకమై ఆంధ్ర రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వండి అని అడిగితే అది ఇంకొక ఎత్తు. ఆ స్టేజ్‌కు ఎదిగితే ఆంధ్ర రాష్ట్రానికి జరిగే మేలు అంతకంటే మరొకటి ఉండదు. ఇందులో ఎస్యూరెన్స్ అనేది ఆయనే మీడియా ఛానళ్లలో చెప్పారు. కేసీఆర్ కూతురు, ఎంపీ కవిత పార్లమెంట్‌లోను ఏపీకి హోదా ఇవ్వాలని కోరారు.

ప్రశ్న: తెలంగాణాలో కేసీఆర్‌కు మీ క్యాడర్ సహకరించారు కాబట్టి, ఏపీలో కేసీఆర్ మీకు సహకరిస్తారా? అనే రాజకీయ చర్చ జరుగుతోంది..

జగన్: కేసీఆర్‌కు ఒకరి సపోర్టు అవసరం లేదు. జగన్ సపోర్టుతో ఆయన గెలిచారని చెప్పడం కూడా కేసీఆర్‌ను తగ్గించినట్టు అవుతుంది. తెలంగాణలో ఒక పార్టీకి సపోర్టు చేయమని మేం పిలుపునివ్వలేదు. ఎందుకంటే అక్కడి ప్రజలు ఎవరికి ఓటెయ్యాలనేది, ఎవరి వల్ల మేలు జరుగుతుందో చూసుకుని ఓటేసేలా వారి మనస్సాక్షికి వదిలేశాం. అయితే నేచురల్లీ నాన్నగారిని ప్రేమించే వ్యక్తులు, మా పార్టీని ప్రేమించే వ్యక్తులకు టీడీపీతో కూడిన కాంగ్రెస్ పార్టీకి ఓటెయ్యాలంటే చెయ్యిపోదు. ఎందుకంటే ఇన్ని సంవత్సరాలుగా టీడీపీతో పోరాడిన కాంగ్రెస్.. అదే టీడీపీతో కలిసి పోటీ చేయడం. దీంతో సహజంగా టీఆర్‌ఎస్ పార్టీకి ఓటేసి ఉంటారు.

మిగతా 11వ పేజీలో ▶

బాబు స్కాముల విలువ 6 లక్షల కోట్లు

ప్రశ్న: మళ్లీ ఎన్నికలు జరిగితే...

జగన్ : మీకోటి చెప్పాలి. ఈ ప్రస్తావన వచ్చింది కాబట్టి ఈరోజే ఈ పుస్తకం రిలీజ్ చేశాము. 2018 నవంబర్ 30వ తేదీ వరకు చంద్రబాబు స్కాముల గురించి ఆధారాలతో సహా ఈ పుస్తకంలో ఉన్నాయి. మట్టి, ఇసుక, బొగ్గు, కరెంటు కొనుగోలు, గనులు, రాజధాని భూములు, కాంట్రాక్టర్లు, విశాఖపట్నం భూములు, గుడి భూములు చివరకు దళితుల భూములు కూడా వదిలి పెట్టకుండా ఆయన చేసిన స్కాముల విలువ రూ.6 లక్షల కోట్లు.

ప్రశ్న: జనంలో ఉన్నప్పుడు మీరు స్ట్రాంగ్‌గా ఉంటారు.. పొలిటికల్ ప్లాట్ ఫాం మీదకొచ్చే సరికి డిఫరెంట్‌గా ఉంటారని కొంతమంది అంటుంటారు.. రీజన్ ఏమిటి?

జగన్ : రీజన్ ఒక్కటే. చంద్రబాబు నాయుడుకు ఎల్లో మీడియా ఉంది. రెండు పేపర్లు ఉన్నాయి...అనేక టీవీ చానళ్లు ఉన్నాయి. ఆయన ఏది ప్రాజెక్ట్ చేయాలను కుంటే అదే ప్రాజెక్ట్ చేస్తాడు. గోబెల్స్ మాదిరి వీళ్లంతా ఆయన తాన అంటే తందాన అని చెప్పి నొక్కుతూ ఉంటారు. ఇలాంటి వాడు... జగన్ అని చంద్రబాబు ప్రాజెక్ట్ చేయాలనుకుంటే అదే ప్రక్రియలో రెండు పత్రికలు, దానికి సంబంధించిన ఎల్లో మీడియా చానల్స్ ఇదే తొక్కుతా ఉంటాయి. మాకంటే.. అంతో ఇంతో అభిమానించేది అంటే 'సాక్షి' ఒక్కటే. వాళ్లు పాపం ఒక్కరే అయిపోయారు. వాళ్లు కూడా ఎంత వరకు చేయగలరు.. వాళ్లు కూడా చాలా కష్ట పడుతున్నారు. కానీ ఎంతని చేయగలుగుతారు పాపం. దేవుని దయ వల్ల ఈ మధ్య కాలంలో సోషల్ మీడియా రావడం వల్ల మా కార్యకర్తలంతా వాడకం మొదలు పెట్టారు. అగ్రెసివ్‌గా తిప్పి కొడుతున్నారు. సోషల్ మీడియా బలంగా తయారైంది ఇప్పుడు. దేవుడి ఆశీర్వాదంతో మా కేడర్‌లో కూడా కదలిక వచ్చి కొంతవరకు ప్రాజెక్ట్ చేస్తున్నారు.

అంతర్గత ప్రజాస్వామ్యం గురించి మీరు అడుగుతున్నారు కాబట్టి.. నేను కచ్చితంగా చెప్పాలి. 2014లో ఫస్ట్ బీజేపీ మాతో ఎప్రోచ్ అయ్యింది.. చంద్రబాబు కన్నా ముందు. నేను పార్టీలో ఉన్న 25 మంది సీనియర్‌లను పిలిచాను. సోమయాజులు, మైసూరారెడ్డి, కొణతాల రామకృష్ణ అందరిని పిలిచి అందరికీ పేపర్ ఇచ్చాను. ఏం చేద్దాం అని అడిగాను. 25 మందిలో 23 మంది నో చెప్పారు. అంతకన్నా ప్రజాస్వామ్య బద్ధంగా నిర్ణయం తీసుకునే విధానం బహుశా ఏ పార్టీ చేసి ఉండదు.

ప్రశ్న: మీకు, ఆయనకు ఇంత వ్యక్తిగత వైరమెందుకు? మీరు ఆయన గురించి ఆయన మీ గురించి విమర్శించుకుంటున్నారు. అసలు విషయాలు పక్కదారి పడుతున్నాయి..

జగన్: నేనైతే చంద్రబాబునాయుడు గురించి ఒక్క మాట మాట్లాడలేదు. ఒక్క మాట మాట్లాడి ఉంటే నాకు చెప్పండి. నేను మాట్లాడిన ప్రతి మాటలో ఆయన తప్పును ఎత్తి చూపించాను. అయ్యా చంద్రబాబు గారూ.. ఈ మాటన్నారు, ఇది చేశారు.. ఇది అన్యాయం కాదా.. మీకు సిగ్గుగా అనిపించడం లేదా.. ఇలా చెయ్యడానికి మీకు సిగ్గుందా.. అన్యాయం అనిపించడం లేదా అని అన్నానుగానీ, వ్యక్తిగతంగా ఎప్పుడూ అనలేదు.



ఎలాగైనా లాభం మాకే



ప్రశ్న : మనం ఏపీ పాలిటిక్స్‌ను అబ్జర్వ్ చేస్తే పవన్ కళ్యాణ్ ఒక ఫ్యాక్టర్ అవుతోంది. అది పెద్ద ఫ్యాక్టరా.. చిన్న ఫ్యాక్టరా అనేది ఎన్నికల్లో తెలుస్తుంది. మీతో కలిస్తే బిగ్ ఫ్యాక్టర్ అంటున్నారు. మీతో కలవకుండా విడిగా పోటీ చేస్తే తెలుగుదేశానికి బిగ్ ఫ్యాక్టర్ అంటున్నారు. తెలుగుదేశం, పవన్ కళ్యాణ్ కలిస్తే ఇంకో ఫ్యాక్టర్ అంటున్నారు. మీదాకా వచ్చే సరికి అబ్జర్వేషన్ ఏమిటి? ఏది జరిగినా ఈ ట్రయాంగిల్ పార్టీ సిస్టమే జరుగుతోంది ఆంధ్రప్రదేశ్‌లో. ఏం జరిగే అవకాశం ఉందని మీరు అబ్జర్వ్ చేస్తున్నారా?

జగన్: నేను మీకొక థియరీ చెబుతా.. పవన్ కళ్యాణ్ అనే వ్యక్తి ఇండిపెండెంట్‌గా పోటీ చేశాడే అనుకో.. ఏమౌతుంది? లాస్ట్‌టైం ఇదే చంద్రబాబుతో కలిసి పోటీ చేశాడు. నేను పూచీగా ఉన్నాను.. చంద్రబాబుకు ఓటెయ్యండని ఊరూరా తిరిగారు. ఇదే పవన్ కళ్యాణ్ అనే వ్యక్తి అంతగా తిరిగినందువల్ల ఆయన్ను ప్రేమించే ప్రతి ఒక్కరూ చంద్రబాబుకే ఓటు వేశారు. ఇప్పుడు పవన్ కళ్యాణ్ సపరేట్‌గా పోటీ చేస్తున్నాడంటే ఏం జరుగుతుంది? ఆ రోజు పవన్ కళ్యాణ్‌ను అభిమానించే వ్యక్తులే బహుశా పవన్ కళ్యాణ్‌కు మళ్లీ ఓటు వేసుకుంటారేమో.. అందులో కూడా బహుశా అందరూ వేయరేమో.. మెజార్టీ వాళ్లు వేస్తారేమో.. అప్పుడు ఓటు బ్యాంకు ఎవరిది తగ్గుతుంది? తగ్గేది చంద్రబాబు ఓటు బ్యాంకే తగ్గుతుంది కానీ మా ఓటు బ్యాంకు తగ్గే పరిస్థితి ఉండదు. రెండో సినారియోకొస్తాం.. పవన్ కళ్యాణ్, చంద్రబాబు కలిసి పోటీ చేస్తే ఏమి జరుగుతుంది? ప్రభుత్వ వ్యతిరేక ఓటు ఎవరికి వస్తుంది? వైఎస్సార్‌సీపీకే. ఓటరు దగ్గర ఉన్న ఛాయిస్‌లు రెండే రెండు. అప్పుడు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈ రోజు చంద్రబాబు నాయుడు పాలన మీద ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏ స్థాయిలో వ్యతిరేక ఓటు ఉందంటే.. చంద్రబాబుకు రాబోయే ఎన్నికల్లో డిపాజిట్లు కూడా రాని పరిస్థితి. రాష్ట్ర ప్రజలు ఎప్పుడు బిహేవ్ చేసినా అట్లానే బిహేవ్ చేస్తారు. 1994లో కాంగ్రెస్ పార్టీ ఓడిపోయినప్పుడు 294 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీకి వచ్చింది 26 స్థానాలు మాత్రమే. అంటే లెస్ ద్యాన్ 10 పర్సెంట్. అదే రకంగా 2004లో టీడీపీ ఓడిపోయినప్పుడు టీడీపీకి వచ్చిన స్థానాలు 47. అంటే లెస్ ద్యాన్ 15 పర్సెంట్. ఉన్న స్థానాలకు 15 పర్సెంట్ స్థానాలు కూడా రాలేదు. ప్రభుత్వానికి అనుకూలమైన ఓటు, ప్రభుత్వానికి వ్యతిరేక ఓటు ఇలా రెండే రెండు నిలుస్తాయి. చంద్రబాబు నాయుడు, ఆయన కూటమితో భాగస్వాములుగా ఉన్న వారందరికీ కూడా డిపాజిట్లు కూడా రాని పరిస్థితుల్లోకి వెళ్లిపోతారు.

ప్రశ్న: జగన్ చుట్టూనే రాజకీయం జరుగుతుంది.. జగన్ ఏం చెబితే అదే నిర్ణయం అనే ఇంప్రెషన్ ఇంకా కంటిన్యూ అవుతోంది. అది వాస్తవమా? కాదా? అంతర్గత ప్రజాస్వామ్యంపై మీరు ఏం చెబుతారు?

జగన్: రీజనల్ పార్టీల్లో ఎప్పుడూ కూడా లీడర్‌ను బట్టే ఓట్లు పడతాయి. ఆ పార్టీని లీడ్ చేసే వ్యక్తి గుణగణాలు ఎలాంటివి? ఆ వ్యక్తి వ్యక్తిత్వం ఏమిటి? అనే దానిపై ఆధారపడి ఓట్లు పడతాయనేది వాస్తవం. నేను ఇంకేదో చెబితే తప్పు చెప్పినట్టు అవుతుంది. నేచురల్‌గా నేను తీసుకునే ఏ నిర్ణయానికైనా అన్నింటికంటే ఫస్ట్ ఎఫెక్ట్ అయ్యేది నేనే. అందుకే మంచి నిర్ణయం తీసుకోవాలనే ఎవరైనా అనుకుంటారు. మంచి నిర్ణయం తీసుకునే ప్రక్రియలో నేను ఖచ్చితంగా అందరిని సంప్రదిస్తాను. సలహాలు తీసుకుంటాను. ఆ తర్వాత ఏ నిర్ణయం తీసుకుంటానో అన్నది నా ఇష్టానికి వదిలెయ్యాలి. నాకు శ్రేయోభిలాషులుగా ఉన్నవారు, పార్టీలో ముఖ్యులు, అడగదగ్గ వ్యక్తులు ఎవరైతే ఉన్నారో, వారిని కచ్చితంగా సంప్రదిస్తాను.

పింఛన్లు.. పక్కా ఇళ్లు ఎక్కడ?



చంద్రబాబు ఇచ్చిన హామీని నెరవేర్చాలంటూ అధికారుల వాహనాలు రాకుండా కర్నూలు జిల్లా గూడూరు మండలంలో మునగాల గ్రామ సమీపంలో రోడ్డుపై వేసి ముళ్ల కంచె

మా సమస్యలు పరిష్కారం కావటం లేదు

- జన్మభూమి గ్రామసభల్లో పెల్లుబికిన నిరసనలు
- నిలదీతలు, అడ్డగింతల మధ్య గ్రామసభలు
- విశాఖలో మంత్రి గంటాకు నిరసన సెగ..
- ఇతర ప్రాంతాల్లోనూ అధికారపార్టీ నేతలకు ఇదే పరిస్థితి..

సాక్షి, నెట్‌వర్క్

అర్హులైన వారికి పింఛన్లు లేవు.. పక్కా ఇళ్లు రావడం లేదు.. రేషన్ కార్డులకోసం దరఖాస్తు చేసుకున్నా ప్రయోజనం ఉండటం లేదు. ఇతర సమస్యలేవీ పరిష్కారం కావడం లేదు.. అలాంటప్పుడు మళ్లీ గ్రామసభలు నిర్వహించడం వల్ల ఉపయోగమేంటీ? అంటూ రాష్ట్రవ్యాప్తంగా జన్మభూమి–మాఊరు గ్రామసభల్లో నిరసనలు పెల్లుబుకుతున్నాయి. గత జన్మభూమిలో వివిధ సమస్యలపై వినతులు ఇచ్చినా, ఒక్కటీ పరిష్కారం కాలేదంటూ మంత్రులు, అధికారపార్టీ ఎమ్మెల్యేలు, నేతలను ప్రజలు నిలదీస్తున్నారు. ఆరో విడత జన్మభూమి కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఐదవరోజు రాష్ట్రంలో నిర్వహించిన గ్రామసభల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. గ్రామసభల్లో భారీఎత్తున ఆందోళనలు జరిగాయి. పలుచోట్ల గ్రామసభలను బహిష్కరించారు.

- కర్నూలు జిల్లా ఆస్పరి మండలం జొహరాపురం ప్రజలు జన్మభూమి కార్యక్రమాన్ని బహిష్కరించారు. అధికారులు గ్రామంలోకి రాకుండా బయటనే అడ్డుకున్నారు. ఆదోని మండలం పాండవగల్ గ్రామంలో ఆందోళన చేస్తున్నవారిని పోలీసులు బలవంతంగా దూరంగా పంపారు. గూడూరు–కొత్తకోట రోడ్డులో టీడీపీ అధినేత చంద్రబాబు పాదయాత్ర చేసిన సందర్భంగా రోడ్డును అభివృద్ధి చేస్తానని ఇచ్చిన హామీని ఇంతవరకు నెరవేర్చలేదని, తమకు జన్మభూమి కార్యక్రమం వద్దంటూ మునగాల గ్రామంలో ప్రజలు అడ్డుకున్నారు. అధికారుల వాహనాలు గ్రామాలోకి రాకుండా రోడ్డుపై ముళ్ల కంచె, ఎద్దుల బండ్లను అడ్డంగా ఉంచారు. ఖాళీ టైర్లకు నిప్పుపెట్టి నిరసన తెలిపారు.
- అనంతపురం జిల్లా కుందుర్పి మండలం ఎనుములదొడ్డిలో ప్రభుత్వ పథకాల్లో అవినీతిపై వైఎస్సార్‌సీపీ నాయకులు నిలదీయగా.. టీడీపీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయచౌదరి అసహనానికి గురవుతూ.. ''మీ ప్రభుత్వంలో మీరు దోచుకున్నారు. మా ప్రభుత్వంలో మేము దోచుకుంటే తప్పేంటి'' అంటూ నోరుజారారు. దీంతో సభ రసాభాసగా మారింది. బుక్కరాయసముద్రం మండలం వెంకటాపురంలో ఎమ్మెల్సీ శమంతకమణిని ఎమ్మార్పీఎస్ నాయకులు నిలదీశారు. నాలుగేన్నరేళ్లల్లో ఒక్కసారైనా ఎస్సీ కాలనీకి వచ్చారా, సమస్యలు విన్నారా? అని ప్రశ్నించారు. శెట్టూరు మండలం తిమ్మసముద్రం గ్రామసభలో టీడీపీ నాయకులు, అధికారులు పాఠశాల విద్యార్థినులతో 'పిలగాడొచ్చిండే....వచ్చిండే'... 'ఎన్నాళ్లకు గుర్తొస్తావు వానా...' అంటూ సినిమా పాటలకు స్టెప్పులేయించడంపై స్థానికులు మండిపడ్డారు. గ్రామంలో సమస్యలు పరిష్కరించకుండా ఈ డ్యాన్స్‌లేమిటన్నారు.
- చిత్తూరు జిల్లాలోని వెదురుకుప్పం, కేవీపల్లి మండలాల్లో సమస్యలపై ప్రజలు అధికారులను నిలదీశారు. పుంగనూరులో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అనీషారెడ్డి, ఆమె భర్త వేదికపై కూర్చోవడంపై వైఎస్సార్‌సీపీ నేతలు అభ్యంతరం తెలిపారు. నగరి మండలం బీరకుప్పంలో అధికారులు రాలేదని ప్రజలు గేదెకు వినతిపత్రం అందజేశారు.
- వైఎస్సార్ జిల్లా పోరుమామిళ్ల మండలం రంగసముద్రంలో బద్వేలు టీడీపీ ఎమ్మెల్యే జయరాములును సీపీఐ, సీపీఎం నాయకులు నిలదీశారు. పంచాయతీలో ఏం అభివృద్ధి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. దీంతో అసహనానికి గురైన ఎమ్మెల్యే మైక్ విసిరేశారు. సభలో గందరగోళం నెలకొనడంతో పోలీసులు జోక్యం చేసుకుని సర్దుబాటు చేశారు.
- కృష్ణా జిల్లాలో జరిగిన గ్రామసభల్లో ఇళ్ల స్థలాలు, సమస్యలు పరిష్కరించాలంటూ పలుచోట్ల అధికారులను స్థానికులు నిలదీశారు. అవనిగడ్డలో చుక్కలభూమి సమస్యపై రైతులు ప్రశ్నించారు. రైతుల సమస్యలు పరిష్కరించనప్పుడు ఈ జన్మభూమి ఎందుకంటూ నాగాయలంక మండలం సంగమేశ్వరంలో నిలదీశారు. ఉంగుటూరు మండలం వెల్దిపాడు గ్రామసభలో రంగుమారిన ధాన్యం కొనుగోలు చేయాలని కౌలు రైతులు డిమాండ్ చేశారు. ముదినేపల్లి మండలంలోని సింగరాయపాలెంలో ఎస్సీలు, మహిళలు వేదిక వద్దకు దూసుకొచ్చి ఇళ్లస్థలాలపై నేతల్ని నిలదీశారు. కూచిపూడిలో పామర్రు ఎమ్మెల్యే ఉప్పులేటి కల్పన ప్రసంగిస్తుండగా స్థలాలివ్వాలంటూ పెద్ద ఎత్తున జనం నినాదాలు చేశారు.
- శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా సూళ్లూరుపేట మండలం ఆబాక గ్రామంలో సీజేఎఫ్ఎస్ భూముల్ని దళితులనుంచి తీసుకుని అగ్రవర్ణాలకు కేటాయించారంటూ బాధితులు అధికారులను అడ్డుకున్నారు. జన్మభూమి సభను జరగకుండా అడ్డుకున్నారు. జిల్లాలో జరిగిన జన్మభూమి సభల్లో ఇప్పటివరకు రేషన్‌కార్డులు, ఇళ్లు, పింఛన్లు, భూసమస్యలపై 7వేలకుపైగా అర్జీలొచ్చాయి.
- ప్రకాశం జిల్లా గుడ్లూరు మండలం దారకానిపాడులో జెడ్పీ వైస్ చైర్మన్ నూకసాని బాలాజీని పింఛన్లు, రేషన్‌కార్డులు అందట్లేదని గ్రామస్తులు నిలదీశారు. అర్హులైన 50 మంది పింఛన్లు తొలగించారని, ఉపాధి కూలీలకు బిల్లులు ఇవ్వట్లేదని మండిపడ్డారు. లింగసముద్రం మండలం మాలకొండరాయునిపాలెంలో రేషన్‌కార్డులు, డంపింగ్ యార్డు సమస్యలపై గ్రామస్తులు ప్రశ్నిస్తుండగా.. టీడీపీ నేతలు వారిని అడ్డుకున్నారు.

సెలవురోజూ తప్పని ప్రతిజ్ఞలు

- శ్రీకాకుళం జిల్లా జలుమూరు మండలం రాడ గ్రామసభకు హాజరైన టీడీపీ ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడును పింఛన్లు, రేషన్‌కార్డులు మంజూరు కాలేదంటూ స్థానికులు నిలదీశారు. కొత్తూరు మండలం హిరపాడు వంశధార పునరావాస కాలనీ గ్రామసభలో తిత్లీ తుపాను పరిహారం ఇవ్వలేదని, పునరావాస కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించలేదంటూ స్థానికులు ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలిపారు. టెక్కలి మండలం తిర్లంగిలో మంత్రి అచ్చెన్నాయుడు పాల్గొనగా.. ఆదివారం సెలవురోజు అయినప్పటికీ స్థానిక మండల పరిషత్ పాఠశాల విద్యార్థులను సభకు తరలించి జన్మభూమి ప్రతిజ్ఞలు చేయించారు. చిన్నారులను ఉదయం 9 గంటలనుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కూర్చోబెట్టడంతో ఆకలితో అలమటించారు.

మంత్రి గంటాకు నిరసన సెగ

విశాఖలోని 4వ వార్డు మధురవాడ సాయిరాం కాలనీలో జరిగిన గ్రామసభకు హాజరైన మంత్రి గంటా శ్రీనివాసరావుకు నిరసన సెగ తగిలింది. తాగునీటి సమస్యతోసహా పలు సమస్యలపై కనీసం వినతులు స్వీకరించకుండా గ్రామసభను ముగించడంపై వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పలువురు మంత్రిని ప్రశ్నించారు. అయినా మంత్రి పట్టించుకోకుండా వెళ్లిపోయేందుకు ప్రయత్నించగా ఆయన కాన్వాయ్‌ని అడ్డగించారు. దీంతో ఉద్రిక్తత నెలకొంది. అడ్డువచ్చిన వారిపై పోలీసులు, మంత్రి రక్షణ సిబ్బంది లాఠీలు ఝుళిపించారు. ఈ సందర్భంగా భీమిలి నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సియాద్రికి స్వల్ప గాయమైంది. నిరసనల మధ్యే మంత్రి కాన్వాయ్ ఆగకుండా వెళ్లిపోయింది. ఈ నేపథ్యంలో 13 మంది వైఎస్సార్‌సీపీ నాయకులను పోలీసులు అదుపులోకి వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు.



ప్రతిపక్షంపై వివక్ష చూపొద్దంటూ మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

జై జగన్ అన్నందుకు.. మంత్రి మండిపడ్డారు

- పోలీస్ స్టేషన్‌లో వైఎస్సార్‌సీపీ కార్యకర్త మూడు గంటల పాటు నిర్బంధం
- బాధితుడి కుటుంబసభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు స్టేషన్ వద్ద ఆందోళన

యడ్లపాడు (చిలకలూరిపేట): తాను కారులో వెళుతుంటే ఓ వ్యక్తి జై జగన్ అన్నాడని మంత్రి పత్తిపాటి పుల్లారావుకు తీవ్రస్థాయిలో కోపమొచ్చింది. అలా అన్నదెవరో తెలుసుకోవాలంటూ అధికారులను ఆదేశించారు. నినాదాలు చేసిన వ్యక్తిని బెదిరించడానికి పోలీసులను పురిగొల్పారు. వారు ఓ వ్యక్తిని తీసుకొచ్చి మూడు గంటల సేపు పోలీస్ స్టేషన్లో కూర్చోబెట్టారు. ఈ సంఘటన ఆదివారం గుంటూరు జిల్లా యడ్లపాడు మండలంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనడానికి మంత్రి పత్తిపాటి యడ్లపాడు మండలం బోయపాలెం గ్రామానికి వచ్చినపుడు ఆయన కారులో నుంచి రోడ్డు పక్కన దుకాణాల వద్ద ఉన్నప్రజలకు అభివాదం చేస్తున్న సమయంలో ఓ వ్యక్తి జై జగన్ అని నినాదం చేశాడు. దీంతో మంత్రి కారు దిగి పరుగున దుకాణాల వద్దకు వచ్చారు. ఆ నినాదం చేసిన వ్యక్తి ఎవరో చెప్పాలంటూ దుకాణదారులను అడిగారు. ఎవరూ తెలియదని చెప్పడంతో అతని గురించి తెలుసుకోవాలంటూ అధికారులను ఆదేశించారు. అప్పటికే అక్కడికొచ్చిన టీడీపీ నేతలు దుకాణాల వద్ద ఉన్న వారిపై బెదిరింపులకు దిగారు. కూరగాయల దుకాణంలో పనిచేస్తున్న ఉప్పరపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఆలకుంట ఆంజనేయులును పట్టుకుని దుర్భాషలాడారు. చెంపలపై కొట్టారు. అంతటితో ఆగకుండా స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న బాధితుడి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఆందోళనకు దిగారు. మంత్రి, టీడీపీ నాయకులు చెప్పినంత మాత్రాన ఎవరిని పడితే వారిని స్టేషన్‌కు తీసుకువస్తారా.. ఏం నేరం చేశాడని మూడు గంటలు స్టేషన్లో కూర్చుబెట్టారంటూ పోలీసులపై మండిపడ్డారు. అలా అన్నది తాను కాదన్నా బలవంతంగా కొట్టి ఆ వ్యక్తి చేత ఒప్పిస్తారా అంటూ ధ్వజమెత్తారు. ఈ విషయంపై ఏఎస్సై శ్యామ్ మాట్లాడుతూ.. బోయపాలెం రోడ్డుపై అడ్డంగా దుకాణాలు పెట్టొద్దని చెప్పేందుకే ఆంజనేయులును స్టేషన్‌కు తీసుకువచ్చామని చెప్పారు.

హోదా మరిచి.. వికృతరూపం

- అధికార పార్టీకి అనుకూలంగా నిర్ణయాలు
- సస్పెన్షన్‌కు దారితీసిన.. పింఛన్ సొమ్ము స్వాహా
- చివరికి లైంగిక వేధింపులకు పాల్పడుతూ జనానికి చిక్కిన వైనం
- మున్సిపల్ కమిషనర్‌గా బాలాజీనాథ్ వికృత చేష్టలు



బాలాజీనాథ్ యాదవ్

నగరి: ఆయన ప్రభుత్వ ఉద్యోగి. పేరు బాలాజీనాథ్. ఏకపక్షంగా వ్యవహరించడం ఆయన నైజం.. పనులు పూర్తికాకపోయినా కాంట్రాక్టర్ల రూపంలో ఉన్న తెలుగు తమ్ముళ్లకు బిల్లులు చెల్లించి మున్సిపల్ ఖజానాను దోచిపెట్టారు... ఆఖరికి సామాజిక భద్రతా పింఛన్లను సైతం తన అవసరాలకు వినియోగించుకున్నారు. దీంతో సస్పెన్షన్‌కు గురయ్యారు. పనిచేసింది కేవలం ఆరు నెలలైనా తన నిర్ణయాలతో అత్యంత వివాదాస్పద వ్యక్తిగా నిలిచారు. అయినా ఏమాత్రం మారని అతను తాజాగా అవివాహితను లైంగికంగా వేధిస్తూ జనం చేతిలో దెబ్బలు తిన్నాడు. దీంతో అతని చరిత్ర మరోసారి చర్చనీయాంశమైంది.

చైర్‌పర్సన్‌పై దాడి ..: 2014 డిసెంబరు 26వ తేదీన బాలాజీనాథ్ యాదవ్ నగరి మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించాక ఫక్తు టీడీపీ కార్యకర్తలా వ్యవహరించారనే విమర్శలను మూటగట్టుకున్నారు. ఆ సమయంలోనే మున్సిపల్ కార్యాలయంలో సీసీ కెమెరాలను టీడీపీకి చెందిన రౌడీమూకలు ధ్వంసం చేశాయి. వైస్సార్‌సీపీకి చెందిన మున్సిపల్ చైర్‌పర్సన్ కేజే శాంతి తన చాంబర్‌లో ఉండగానే దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారనే ఆరోపణలు ఉన్నాయి. ఆయన ఏకపక్ష నిర్ణయాలను ప్రశ్నించిన వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమ కేసుల పెట్టించారు. సమస్యలపై పలుమార్లు నిలదీసిన నగరి ఎమ్మెల్యే ఆర్‌కే రోజాతో సైతం గొడవలు పడిన సందర్భాలు ఉన్నాయి.

తాజాగా అవివాహితను లైంగికంగా వేధిస్తూ...

సస్పెన్షన్‌లో ఉన్న మున్సిపల్ కమిషనర్ బాలాజీనాథ్ శనివారం తిరుపతి బస్టాండ్‌లో ఓ అవివాహితను లైంగికంగా వేధిస్తూ అడ్డంగా దొరికిపోయాడు. పక్కనే ఉన్న ప్రయాణికులు అడ్డుకునే ప్రయత్నం చేస్తే వారిపై కూడా తిరగబడ్డాడు. దీంతో స్థానికులు అతనికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈయన భార్య గతంలో అనుమానాస్పద స్థితిలో మరణించింది. ఈ కేసులో జైలుకు వెళ్లినా విచారణలో కేసు కొట్టేయడంతో తిరిగి ఉద్యోగంలో చేరారు. టీడీపీ నేతలతో ఉన్న పరిచయాలతో రెచ్చిపోతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పింఛన్ సొమ్ము స్వాహా...

మున్సిపల్ పరిధిలో పింఛన్ల సొమ్ము పంపిణీలో సైతం భారీ అవకతవకలకు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. పంపిణీ సమయంలో అక్విటెన్స్‌ను ఉద్దేశపూర్వకంగా సక్రమంగా నమోదుచేయకుండా టీడీపీ కార్యకర్తలు, సానుభూతిపరులకు నెలసరి పింఛన్‌ను రూ.2 వేలు నుంచి 3 వేలు ఇచ్చారు. ఇదే విషయంలో అవినీతి నిర్ధరణ కావడంతో 2015 జూలైలో సస్పెన్షన్‌కు గురయ్యారు.


10వ పేజీ తరువాయి

ప్రశ్న: 2019లో మిమ్మల్ని చూసి ఓటెయ్యాలా? నియోజకవర్గంలో అభ్యర్థిని చూసి ఓటెయ్యాలా? ఎవరిని చూసి ఓటెయ్యాలి?

జగన్: వాస్తవం ఏదంటే డిబేట్ ఏదైనా చేయొచ్చు. మీరు అనుకూలంగాను మాట్లాడొచ్చు. వ్యతిరేకంగా మాట్లాడొచ్చు. ఎనీ రీజనల్ పార్టీ గురించి మీకు చెబుతున్నా.. ఎమ్మెల్యే చేయగలిగిన పనులు చాలా లిమిటెడ్. ఒక పెన్షన్ ఇప్పించలేడు.. ఒక ఇల్లు ఇప్పించలేడు ఎమ్మెల్యే. ముఖ్యమంత్రి అనే వ్యక్తి మంచి వాడైతే, మనసున్న వ్యక్తి అయితే ఎమ్మెల్యేలు కాలర్ ఎగేసుకొని వాళ్ల నియోజకవర్గంలో తిరగగలుగుతారు. నాన్న టైంలో సాచురేషన్ పద్ధతిలో పెన్షన్ కావాలన్నా.. ఇళ్లు కావాలన్నా.. రేషన్ కార్డులు కావాలన్నా.. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ ఇలా అన్నీ సాచురేషన్ పద్ధతిలో ఎవ్వరికి కష్టం వచ్చినా కూడా ఆ పార్టీ ఈ పార్టీ అని ఏమీ చూడ లేదు. అర్హుడై ఉంటే చాలు చేసేయమనేవారు. అప్పుడు ఎమ్మెల్యేలు నియోజకవర్గాలకు వెళ్లి కాలర్ ఎగరేసుకొని తిరిగే వారు.

ప్రశ్న: జగన్ మొండివాడు.. ఎవరి మాట వినడు.. అనే మాట ఎందుకు వచ్చింది?

జగన్: మొండోడు జగన్ అని మా పార్టీ వాళ్లు ఎవరూ అనరు. గిట్టని వారు, ప్రత్యర్థులు ప్రచారం చేస్తున్నారు. మా పార్టీ వాళ్లను అడిగితే ఒక నిర్ణయం తీసుకుంటే జగన్ గట్టిగా ఉంటాడు అంటారే తప్ప.. ఎవరినీ కలవడు, ఎవరితో మాట్లాడడు అని అనరు. నా అంత ఎక్కువగా అభిప్రాయాలు తీసుకునే వ్యక్తి ఎవరూ ఉండరన్నది మా పార్టీ వాళ్లకు తెలుసు.



ప్రశ్న: వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు నాయుడుకి జగన్‌కు మధ్య పోటీనా? మధ్యలో పవన్ కళ్యాణ్ రాడా..?

జగన్: అబ్జల్యూట్లీ కరెక్ట్. పవన్ కళ్యాణ్ గురించి చంద్రబాబు గారే ఈ మధ్య స్టేట్‌మెంట్ ఇచ్చారు. తెలంగాణలో తాను పోటీ చేస్తానన్నప్పుడు తెలంగాణలో జనసేన మద్దతు ఇచ్చిందని ఆయనంతకు ఆయనే ఓపెన్ డయాస్‌లో చెప్పుకున్నాడు. ఈ మధ్య కాలంలోనే స్టేట్ మెంట్ ఇచ్చాడు. నేను, పవన్ కలుస్తానంటే జగన్‌కు అంత బాధ ఎందుకని చంద్రబాబు నాయుడు గారే అన్నారు. సో చూస్తా ఉంటే ఇంతకుముందు కలిసి పోటీ చేసి ప్రజలను మోసం చేశారు. ఇప్పుడు విడిపోయినట్టుగా నటించి మోసం చేసే కార్యక్రమం జరుగుతోంది. ఇప్పుడు ఆ నటన కూడా కాస్త పక్కన పెట్టేసి ముగుసు తీసేసి మళ్లీ ఒక్కటయ్యే పరిస్థితి కన్పిస్తున్నట్టుగా చంద్రబాబు మాటలను బట్టి చూస్తే అర్థం అవుతోంది. మరి ఏం జరిగినా కాని నాకైతే భయం లేదు. బాధ లేదు. పవన్ కళ్యాణ్, చంద్రబాబు కలిసి పోటీ చేస్తే ఇంకా నేను సంతోష పడతా.

ప్రశ్న: పవన్ మీతో వస్తాడని బయట పెద్ద ప్రచారం జరుగుతోంది.. మీతో అండర్ స్టాండ్ అయిపోయిందని. మధ్యలో ఎక్కడ బ్రేక్ అయింది? అసలు ఉందా?

జగన్: అసలు పవన్ కళ్యాణ్ అనే వ్యక్తితో.. అక్కడ కూడా పాపం ఆయన మీతో వస్తాడంట అని అడగటం కూడా ధర్మం కాదు పాపం. ఎందుకంటే పవన్‌కళ్యాణ్ నాతో ఎప్పుడూ మాట్లాడింది లేదు. నేను ఆయనతో మాట్లాడింది లేదు. నేను ఆయన్ను చూసింది లేదు.. ఆయన నన్ను చూసింది లేదు. కాబట్టి అలా అనడం కరెక్టు కాదు.

ప్రశ్న: పొత్తులు ఈ సారి మీరు వద్దనుకుంటున్నారా? లేకపోతే ఎవ్వరూ రావట్లేదా?

జగన్: పొత్తుల గురించి మేము ఏరోజూ ఆరాట పడలేదు. నేను గట్టిగా నమ్మేది ఏంటి అంటే మనం మన కష్టాన్ని నమ్మాలి. ఎవ్వరి మీదో ఆధారపడకూడదనేది గట్టిగా నమ్ముతా. ఒక మనిషిగా నేను అదే పాలసీ పాటిస్తా. ఎప్పుడే విషయంలోనూ నేను ఎవ్వరిమీద ఆధారపడను. నా బలం మీదనే నేను ఆధారపడతాను. నేను గట్టిగా నమ్మేది ఏంటంటే ఓట్లు వేసే వాళ్లు ప్రజలు. ఆశీర్వదించాల్సింది దేవుడు. వీళ్లిద్దరినీ నమ్ముకోవాలి కానీ ఎవ్వరితో ఒకరితో పొత్తు పెట్టుకోవాలి.. వాళ్ల భుజాల మీద నేను నడవాలి అన్న ఆలోచన చేయడమే తప్పు అని నేను భావిస్తా. ఈ రోజు నాకు 175 నియోజకవర్గాల్లో ప్రతి చోటా మా పార్టీకి చెందిన అభ్యర్థి ఉన్నాడు. వాళ్లకు అన్యాయం చేసి పొత్తు పెట్టుకొని వేరే పార్టీకి టిక్కెట్లు ఇచ్చి మన జెండాను మోసిన వ్యక్తిని పక్కన పెట్టడం ధర్మం కాదని నేను భావిస్తా. కాబట్టి నేను ఎప్పుడూ ప్రజల్ని, దేవుణ్ని నమ్ముకున్నా కాబట్టి పొత్తు గురించి నేను ఎప్పుడూ ఆలోచన చేయలేదు. ఆలోచన చేయాల్సిన అవసరం కూడా ఏ రోజూ రాలేదు.

ప్రశ్న: మీరు అధికారంలోకి వస్తే వీటన్నిటి మీద ఏం చేస్తారు?

జగన్: చంద్రబాబు ప్రజలకు మ్యానిఫెస్టోలో ఎన్నో హామీలు ఇచ్చారు. ఎస్సీ, ఎస్టీ, బీసీల్లో చేరుస్తామన్నారు. రుణాలు మాఫీ, ఇంటింటికి ఉద్యోగాలని, రెండు వేలు నిరుద్యోగ భృతి అని, బ్యాంకులో పెట్టిన బంగారం తీసుకొచ్చి ఇస్తానని అన్ని రకాలుగా ప్రజలను మోసం చేసిన వ్యక్తి. అంతే కాకుండా ఇంత దారుణంగా రాష్ట్రాన్ని లూటీ చేసిన వ్యక్తి పాలనపై ఎన్నికలు జరగబోతున్నాయి. ఇటువంటి వ్యక్తికి తోడుగా ఎవరు వచ్చినా, ఎంత పెద్ద కూటమి ఏర్పాటైనా రాష్ట్ర ప్రజలు చంద్రబాబుకు, కూటమికి గట్టిగా బుద్ధి చెబుతారు.

ప్రశ్న: అవినీతిపై మీరు వేసిన పుస్తకంలో ఉన్నవి నిజమని నమ్ముతున్నారు కాబట్టి మీరు అధికారం లోకి వస్తే ఏమి చేస్తారు?

జగన్: పుస్తకంలో ఉన్న ప్రతి అంశం మీద వివరంగా విచారణ చేయిస్తా. మొదట క్యాబినెట్ సబ్ కమిటీ వస్తుంది. కోర్టుకు తీసుకుపోయి శిక్ష వేయించగలిగే ఆధారాలు ఉన్నాయనప్పుడు ఇవన్నీ కోర్టుకు తీసుకుపోతాము. రాష్ట్ర ప్రభుత్వం చేతిలో ఏజెన్సీలు బాగా ఉన్నాయి. నాకూ సీఐడీ ఉంది అంటూ అనర్గళమైన మాటలు చంద్రబాబు మాట్లాడారు. ఆ ఏజెన్సీలన్నీ యాక్టివేట్ అయి ప్రతి అంశంపైనా పూర్తి స్థాయిలో విచారించి ఆధారాలు పూర్తిగా వచ్చిన తర్వాత కోర్టు బోన్‌లో నిలబెట్టే కార్యక్రమం కచ్చితంగా చేస్తాం.

ప్రశ్న: మీ మీద కత్తి దాడి జరిగింది, బాధితుడు మీరు.. ప్రత్యక్షి సాక్షి మీరు. మీరు విచారణకు ఎందుకు సహకరించడం లేదు?

జగన్: దేశంలో అత్యంత సురక్షితంగా ఉన్న స్థలం ఏదని మిమ్మల్ని ఎవరైనా అడిగితే ఉజ్జాయింపుగా కొన్ని పేర్లు చెబుతారు. అటువంటి పేర్లలో ఎయిర్‌పోర్టులో వీఐపీ లాంజ్ కూడా ఉంటుంది. అత్యంత సురక్షిత స్థలం అని మనం అనుకునే ఏరియా అది. అటువంటి సురక్షిత ప్రాంతంలోని వీఐపీ లాంజ్‌లోకి కత్తి ఎలా వచ్చింది? ఇది ప్రాథమికమైన ప్రశ్న. ఆ కత్తి ఎలా వచ్చిందంటే, హత్యాయత్నం చేసిన వ్యక్తి ఎయిర్‌పోర్టులోని ఒక రెస్టారెంట్‌లో పని చేస్తున్నాడు. ఆ రెస్టారెంట్ యజమాని హర్షవర్ధన్ చౌదరి తెలుగుదేశం పార్టీ మద్దతుదారుడు. 2014లో తెలుగుదేశం పార్టీ టికెట్ కోసం రేసులో ఉన్న వ్యక్తి. విశాఖపట్నం తూర్పు నియోజకవర్గానికి సంబంధించిన ఎమ్మెల్యేకి అత్యంత సన్నిహితుడు. ఆ ఎమ్మెల్యే గత చరిత్ర ఎలా ఉందంటే, వంగవీటి రంగా గారి హత్య కేసులో అతను నిందితుడుగా ఉన్నాడు. ఆ తర్వాత ఆయన విజయవాడ వదిలిపెట్టి విశాఖపట్నం వచ్చి ఎమ్మెల్యే అయ్యాడు. అటువంటి చరిత్ర ఉన్న వ్యక్తికి ఈయన (హర్షవర్ధన్) అత్యంత సన్నిహితుడు. హర్షవర్ధన్ చౌదరి... చంద్రబాబు, లోకేశ్‌తోనూ అత్యంత సన్నిహితంగా ఉన్నాడు. రెస్టారెంట్ ఆయనది కాబట్టి, ఈ మనిషి (హత్యాయత్నం చేసిన వ్యక్తి) అక్కడ పని చేస్తున్నాడు కాబట్టి ఆ కత్తి వీఐపీ లాంజ్‌లోకి రాగలిగింది. అక్కడ పని చేస్తున్న ఈ వ్యక్తి, హత్యాయత్నం చేసిన ఈ వ్యక్తిపై ఇదివరకే హత్యాయత్నం చేసిన ఆరోపణ ఒకటి ఉంది. అటువంటి వ్యక్తికి పోలీసులు ఎన్‌ఓసీ (నో అబ్జక్షన్ సర్టిఫికెట్) ఎలా ఇచ్చారు? ఎన్‌ఓసీ ఉంటేనే ఎయిర్ పోర్టులో సీఐఎస్‌గానీ ఇంకెవరైనా ఉద్యోగాలు ఇచ్చే పరిస్థితి ఉండాలి. నేను విశాఖపట్నంలోకి ప్రవేశించింది ఆగస్టు 14న. ఐదు నెలల నుంచి ఉత్తరాంధ్ర జిల్లాల్లోనే తిరుగుతున్నా. హత్యాయత్నం మధ్యలో మూడు నెలల తర్వాత జరిగింది. నేను విశాఖపట్నంలోకి ప్రవేశించడంతోనే ఎయిర్‌పోర్టులో సీసీ కెమెరాలు పని చేయడం ఆగిపోయాయి. ఆ తర్వాత నామీద హత్యాయత్నం జరిగేదాకా అవి పని చేయలేదు. నేను విశాఖపట్నం జిల్లాలోకి ప్రవేశించిన తర్వాతే అవి పని చేయకుండా పోయాయి. హైకోర్టులో జడ్జి కూడా ఈ ప్రస్తావన చేశారు. ఇటువంటి దారుణమైన పరిస్థితుల్లో హత్యాయత్నం జరిగితే ఒక గంట లోపే డీజీపీ, మంత్రులు, చంద్రబాబునాయుడు ముందుకు వచ్చి కేసును తప్పుదోవ పట్టించేలా ప్రకటనలు ఇచ్చారు. ఒక మార్ఫ్‌డ్ ఫ్లెక్సీని విడుదల చేశారు. ఫ్లెక్సీ వేసే అభిమాని ఎవరైనా గరుడ పక్షి ఫొటో పెడతారా? నువ్వే చెప్పు.. పెడితే మా అమ్మ ఫొటో లేకపోతే మా నాన్న రాజశేఖరరెడ్డి ఫొటో పెడతారు. ఇంకా ఎక్కువ అభిమానస్తుడైతే నా చెల్లెలు ఫొటో కూడా పెడతారు. అంతేగాని గరుడ పక్షి ఫొటో ఎవరు పెడతారు? వైసీపీ ఫ్లెక్సీ బ్లూ కలర్‌లో ఉంటుంది. సాధారణంగా పసుపు కలర్‌లో తెలుగుదేశం ఫ్లెక్సీలు, బ్లూ కలర్‌లో వైసీపీ ఫ్లెక్సీలుంటాయి. ఈ ఫ్లెక్సీ పసుపు కలర్‌లో ఉంది. గంటలో మార్ఫ్‌డ్ ఫ్లెక్సీని విడుదల చేశారు. చేసిన తర్వాత ఈ మనిషి (హత్యాయత్నం చేసిన వ్యక్తి) నా అభిమాని అని తప్పుడు ప్రచారం చేశారు. నేను నిన్నే అడుగుతున్నా.. నిన్ను ప్రేమించేవాళ్లు ఎవరైనా నిన్ను చంపాలని ప్రయత్నిస్తారా? నన్ను ప్రేమిస్తున్నాను, అభిమానిస్తున్నాడంటూనే చంపడానికి ప్రయత్నించాడని వాళ్లే మళ్లీ అంటారు.

ప్రశ్న: అందుకే మీరు మాట్లాడలేదా?

జగన్: కాదు. ఘటన జరిగిన వెంటనే నేను జెంటిల్‌మెన్‌గా వ్యవహరించా. ఎలా జరిగింది.. ఎవరు చేశారు.. ఎందుకు చేశారో సడన్‌గా తెలియని పరిస్థితి ఉంది. అటువంటి పరిస్థితిలో నా నోటి నుంచి ఆవేశపూరితమైన ప్రకటనలు (వైల్డ్ స్టేట్‌మెంట్స్) వస్తే రాష్ట్రం అల్లకల్లోలం అవుతుంది. ప్రతిపక్ష నాయకుడి మీద హత్యాయత్నం, ఫలానా వాళ్లు చేయించారని తెలిసీ తెలియని మాటలు మాట్లాడితే దాని పర్యవసానంతో రాష్ట్రం అల్లకల్లోలం అవుతుంది. అది తెలిసి జెంటిల్‌మెన్‌గా వ్యవహరించా. హత్యాయత్నం జరిగిన తర్వాత చొక్కా మార్చుకున్నా. హత్యాయత్నం జరిగిన చోట నేను ఒక్కడినే కాదు.. 30 మంది ఉన్నారక్కడ వీఐపీ లాంజ్‌లో. సీఎస్‌ఐ సిబ్బంది, ఇండిగో సిబ్బంది, ఇతర వీఐపీలు కూర్చున్నారు. వారి ముందు ఘటన జరిగింది. ఘటన జరిగాక రక్తం కారుతుంటే చొక్కా విప్పి ప్రాథమిక చికిత్స చేసిన వాళ్లే ఎయిర్‌పోర్టులో కట్టుకట్టారు. మళ్లీ ఇంకో చొక్కా వేసుకుని హైదరాబాద్‌కు వచ్చి, ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్నా. ఆ తర్వాత ఇంటికి వచ్చి రెండు వారాలు విశ్రాంతిలో ఉన్నా. విశ్రాంతి పూర్తయిన తర్వాత మళ్లీ పాదయాత్ర మొదలుపెట్టా. మొదలుపెట్టిన మొదటి మీటింగ్‌లోనే ఇవన్నీ అడిగాను. ఎక్కడా నేను మాట్లాడలేదు.

ప్రశ్న: మరి విచారణ?

జగన్: నువ్వే చెప్పు రజనీ.. హత్యారోపణ ఎదుర్కొంటున్నది రాష్ట్ర ప్రభుత్వం. రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు హత్యాయత్నం ఆరోపణలు ఎదుర్కొంటున్నప్పుడు అదే రాష్ట్ర ప్రభుత్వం చేతిలో ఉన్న పోలీసులతో విచారణ చేస్తే న్యాయం జరుగుతుందా? హత్యాయత్నం చేయించింది రాష్ట్ర ప్రభుత్వమని మేము అనుకుంటున్నాం. అటువంటి రాష్ట్ర ప్రభుత్వం చేతిలో ఉన్న పోలీసులతో, డీజీపీ గంటకే తప్పుదోవ పట్టించే స్టేట్‌మెంట్ ఇచ్చిన పరిస్థితులు చూసిన నేపథ్యంలో, డీజీపీ ఇంత దారుణంగా ఉన్న పరిస్థితుల నేపథ్యంలో అదే పోలీసులచేత విచారణ జరిగితే న్యాయం జరుగుతుందని ఎవరైనా అనుకుంటారా? కాబట్టి మేము థర్డ్ పార్టీ విచారణ అడిగాం. థర్డ్ పార్టీ ఎవరని మేం చెప్పలేదు. మీ ఇష్టం.. రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధం లేని థర్డ్ పార్టీ ఎవరితోనైనా విచారణ చేయించమని అడిగాం. తప్పేం ఉంది?

ప్రశ్న: ఇప్పుడు ఎన్ఐఏ వచ్చింది.. సహకరిస్తారా?

జగన్: తప్పకుండా సహకరిస్తాం. మేం సహకరించేది ఏంటి.. వాళ్లు విచారణ చేయాలి. విచారణ తర్వాత దోషులను పట్టించాలి. నేను బాధితుణ్ణి. ఏం జరిగిందనేది వాళ్లు నాకు చెప్పాలి.. రాష్ట్ర ప్రజలకు చెప్పాలి.

ప్రశ్న: పాదయాత్రలు చేసిన వాళ్లందరూ సీఎంలయ్యారు.. మీరు కూడా అవుతున్నారా?

జగన్: దేవుని దయ, ప్రజల దీవెనలు.

జగన్ అనే వ్యక్తి ఫిబ్రవరిలో ఇక్కడే కొత్త ఇంట్లో చేరనున్నాడు



ప్రశ్న: మీరు రాజధానిని మారుస్తారని, లేదంటే కుదిస్తారని, మరేమేమో చేస్తారని ప్రజలకు అనుమానం ఉంది?

జగన్: ఇదే మాట చంద్రబాబునాయుడును ఎందుకు అడగటం లేదు. ఇంతవరకు రాజధాని ప్రాంతంలో ఒక్క పర్మినెంట్ బిల్డింగ్ లేదు. ఏదైనా తాత్కాలికమే. సెక్రటేరియట్, అసెంబ్లీ, హైకోర్టు అన్నీ తాత్కాలికమే. పర్మనెంట్ అనే పేరుతో ఇంతవరకు ఒక్క ఇటుక వేయలేదు. ఎందుకు వేయడం లేదు? ఎందుకు మీరు అడగటం లేదు? ఇదే రాజధాని ప్రాంతంలో చంద్రబాబు ఇల్లు కట్టాడా? హైదరాబాద్‌లో వంద కోట్లపైన ఖర్చుపెట్టి ఇల్లు కట్టుకున్నాడు. ఇంట్లో వేసిన మార్బుల్ గురించి, ఫ్లోరింగ్ గురించి కథలు కథలుగా సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. అడుగుకు వేలల్లో ఖర్చు పెట్టారంట.. ఎందుకు రాజధానిలో ఇల్లు కట్టలేదు? ముఖ్యమంత్రిగా ఉన్నాడు.. ఇక్కడ ఉండాలనుకుంటే ఇల్లు కట్టాలి. అదే రాజధాని ప్రాంతంలో జగన్ అనే వ్యక్తి ఇల్లు కడుతున్నాడు.. ఫిబ్రవరిలో కొత్త ఇంట్లోకి చేరబోతున్నాడు. ఆఫీసు కడుతున్నాం అక్కడ. ఇన్ని కనిపిస్తున్నా రకరకాలుగా తిమ్మిని బమ్మిని చేసే మాటలు మాట్లాడుతున్నారు. ఏదో ఒక ఆరోపణ ఏదో రూపంలో చేస్తున్నారు. ఎందుకంటే ఆయన చేసిన అవినీతి రాజధానిలో ఆ స్థాయిలో ఉంది. ఆ అవినీతిపై ఏ స్థాయిలో విచారణ జరుగుతుందో తెలియదు. బహుశా నాస్టేజీ దాటిపోయి, కోర్టు స్టేజీ దాటిపోయి, కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వుల నుంచి ఏ స్టేజీలోకి పోతుందో నాకు తెలియదు. రాజధాని భూముల్లో జరిగిన అవినీతి మామూలు అవినీతి కాదు. ల్యాండ్ పూలింగ్‌లో తీసుకున్న ఈ భూములను ఇష్టం వచ్చిన రేటుకు, ఇష్టం వచ్చిన వ్యక్తికి లంచాలు తీసుకుని ఇచ్చారు. సింగపూర్ కంపెనీ అంట.. 16 నుంచి 17 వందల ఎకరాలు ఎందుకిస్తున్నాడండీ? వాళ్లు అక్కడ చేసేది ఏంటి? రాష్ట్ర ప్రభుత్వానికి దమ్మిడీ మేలు జరగదు. వాళ్లు అక్కడ రియల్ ఎస్టేట్ చేస్తారంట. ప్లాట్లు వేసి అమ్ముతారంట. వచ్చే లాభాలు తీసుకునేది వాళ్లే. ఇంతటి దారుణంగా స్కాములు జరుగుతుంటే వీటిపై విచారణలు జరగకుండా ఉంటాయా? జరిగితే తర్వాత జరిగే పరిణామాలకు బాధ్యుడు ఎవరు? చంద్రబాబు కాదా?

బాబుకు దేవుడు మొట్టికాయలు వేసే రోజొస్తుంది

ప్రశ్న: జైలుకు పంపించే పరిస్థితి కూడా ఉంటుందా?

జగన్: జైలుకు పోతాడా, పోడా అన్నది ఆధారాలు, సాక్ష్యాలను బట్టి ఉంటుంది. నేను చిన్న ఉదాహరణ చెబుతా. రాజధాని పలానా చోట వస్తుందని చంద్రబాబునాయుడుకు తెలుసు. ప్రజలను మిస్లీడ్ చేస్తాడు. నూజివీడు దగ్గర వస్తుంది, ఇంకోచోట వస్తుందని మిస్లీడ్ చేశాడు. అధికారం చేపట్టాక డిసెంబరు దాకా ఎక్కడ అనేది చెప్పలేదు. మధ్య ఆరు నెలల కాలంలో ఆయన, ఆయన బినామీలు రాజధాని ఎక్కడ వస్తుందో అక్కడ రైతుల వద్ద నుంచి భూములు కొన్నారు. సాక్షాత్తు హెరిటేజ్ అనే ఆయన సొంత సంస్థ పేరిట కూడా 14 ఎకరాలు రాజధాని ప్రాంతంలో కొనుగోలు చేశాడు. ఆ తర్వాత రాజధాని అక్కడే ఏర్పాటు చేశారు. దీనిని స్టాక్ మార్కెట్లో అయితే ఇన్‌సైడర్ ట్రేడింగ్ అంటారు. ఇందుకు శిక్ష మూడు నుంచి నాలుగేళ్లు జైలులో ఉండాల్సి వస్తుంది. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసే వ్యక్తి రాజ్యాంగ రహస్యాలను వ్యక్తిగత అవసరాల కోసం వాడుకోనని ప్రమాణ స్వీకారం చేస్తాడు. ఇక్కడ తాను, తన బినామీలు బాగుపడేదాని కోసం రాజ్యాంగ రహస్యాన్ని తన వ్యక్తిగత అవసరం కోసం వాడుకున్న పరిస్థితి. దీనికి శిక్ష ఏమిటి? ఆధారాలతో సహా ఉన్నాయి. ఇటువంటివి అనేకం అక్కడ ఉన్నాయి. ఎప్పుడో ఒకసారి దేవుడికి కూడా కోపం వస్తుంది. శిశుపాలుడికి కూడా 100 తప్పులు నిండిన తరువాత 101వ తప్పు చేస్తే దేవుడు మొట్టికాయలు వేశాడు. ఈయన చేసిన అన్యాయాలకు, అవినీతికి, అప్రజాస్వామిక పాలనకు కచ్చితంగా ఏదో ఒక రోజు, ఎప్పుడో ఒకసారి దేవుడు మొట్టికాయలు వేసి బుద్ధిచెప్పే పరిస్థితి వస్తుంది.

విమానాశ్రయాల తరహాలో..

రైల్వేస్టేషన్‌లోకి 15–20 నిమిషాల ముందుగానే ప్రయాణికులు



న్యూఢిల్లీ: విమానాశ్రయాల తరహాలో రైల్వేస్టేషన్లలో భద్రతను కట్టుదిట్టం చేసేందుకు రైల్వేశాఖ సిద్ధమవుతోంది. ఇందులోభాగంగా ప్రయాణికులు రైలు బయలుదేరేందుకు 15–20 నిమిషాల ముందుగా స్టేషన్లకు చేరుకోవాల్సి ఉంటుంది. ఆ తర్వాత రైల్వేస్టేషన్ల ప్రవేశమార్గాలను మూసివేస్తారు. ఉత్తరప్రదేశ్‌లోని అలహాబాద్, కర్ణాటకలోని హుబ్లీ రైల్వే స్టేషన్లలో దీన్ని ఇప్పటికే ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నారు. ఈ విషయమై రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్పీఎఫ్) డైరెక్టర్ జనరల్ అరుణ్ కుమార్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా 202 రైల్వే స్టేషన్లలో ఈ ఏకీకృత భద్రతా వ్యవస్థ(ఐఎస్ఎస్)ను అమలు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టులో భాగంగా ప్రయాణికులు ఓసారి లోపలకు వచ్చాక ఎన్ని రైల్వేస్టేషన్లలో ప్రవేశమార్గాలను మూసివేయగలమో పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. వీటిలో కొన్నిచోట్ల గోడలు నిర్మించడం, మరికొన్ని చోట్ల ఆర్పీఎఫ్ సిబ్బందిని మోహరించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఏకీకృత భద్రతా వ్యవస్థలో భాగంగా ఈ 202 రైల్వేస్టేషన్లలో సీసీటీవీ కెమెరాలు, యాక్సస్ కంట్రోల్, బ్యాగేజీ–ప్రయాణికుల స్క్రీనింగ్ వ్యవస్థ, బాంబులను గుర్తించి నిర్వీర్యం చేసే పరికరాలను అమరుస్తామని కుమార్ తెలిపారు. సాధారణంగా విమాన ప్రయాణికులు కొన్ని గంటల ముందుగా ఎయిర్ పోర్టుకు చేరుకుంటారనీ, కానీ తాజా విధానంలో రైల్వే ప్రయాణికులు కేవలం 15–20 నిమిషాల ముందు స్టేషన్‌కు వస్తే సరిపోతుందని వెల్లడించారు. స్టేషన్‌లోకి వచ్చే ప్రయాణికుల్లో కొందరిని మాత్రమే ర్యాండమ్‌గా తనిఖీ చేస్తామని స్పష్టం చేశారు. రద్దీ ఎక్కువగా ఉండే సమయాల్లో ప్రయాణికుల్ని స్టేషన్ ప్రాంగణం బయటే తనిఖీ చేసి లోపలకు అనుమతిస్తామన్నారు. ఈ ప్రాజెక్టు కోసం రూ.385.06 కోట్లు అవసరమవుతాయని అంచనా వేసినట్లు పేర్కొన్నారు.

లైసెన్స్‌కూ ‘ఆధార’మే!

ఆధార్– డ్రైవింగ్ లైసెన్స్ అనుసంధానం తప్పనిసరి



జలంధర్: దేశంలో డ్రైవింగ్ లైసెన్సులు పొందేందుకు త్వరలోనే ఆధార్‌ను తప్పనిసరి చేస్తామని కేంద్ర న్యాయ, ఐటీ శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ తెలిపారు. దీనివల్ల నకిలీ, డూప్లికేట్ లైసెన్సుల జారీకి అడ్డుకట్ట పడుతుందన్నారు. పంజాబ్‌లోని జలంధర్‌లో ఉన్న లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీలో జరిగిన 106వ ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌లో ఆయన మాట్లాడారు. డ్రైవింగ్ లైసెన్సులను ఆధార్‌తో అనుసంధానం చేసేందుకు ఉద్దేశించిన బిల్లు ప్రస్తుతం పార్లమెంటులో పెండింగ్‌లో ఉందని ప్రసాద్ వెల్లడించారు. ‘పార్లమెంటులో పెండింగ్‌లో ఉన్న మోటార్ వాహనాల చట్టంలో మరో కీలక సవరణ చేయబోతున్నాం. త్వరలోనే మోటార్ వాహనాల లైసెన్సులకు ఆధార్‌ను అనుసంధానం చేయడం తప్పనిసరి కానుంది. వ్యక్తుల గుర్తింపును ధ్రువీకరించడంలో ఆధార్ అన్నది గొప్ప పరిణామం’ అని పేర్కొన్నారు. ఆధార్–డ్రైవింగ్ లైసెన్సు అనుసంధానంతో వచ్చే ప్రయోజనాలపై మాట్లాడుతూ..‘ఉదాహరణకు ఓ తాగుబోతు వాహనం నడుపుతూ నలుగురు వ్యక్తులను గుద్ది చంపేశాడనుకోండి. ప్రస్తుత పరిస్థితుల్లో అతను పంజాబ్ నుంచి మరో రాష్ట్రానికి పారిపోయి తప్పుడు డాక్యుమెంట్లతో కొత్త డ్రైవింగ్ లైసెన్సు పొందగలడు. కానీ ఆధార్‌తో డ్రైవింగ్ లైసెన్సును అనుసంధానిస్తే.. ఇలాంటి ఘటనలు నిలిచిపోతాయి. ఓ వ్యక్తి మహా అయితే తన పేరును మార్చుకోగలడు తప్ప చేతి వేలిముద్రలను మార్చుకోలేడు. ఎవరైనా వ్యక్తులు నకిలీ పేరుతో డ్రైవింగ్ లైసెన్సు పొందేందుకు యత్నిస్తే.. కొత్త వ్యవస్థ బయోమెట్రిక్ ఆధారంగా సదరు వ్యక్తికి ఇప్పటికే లైసెన్స్ ఉందని హెచ్చరిస్తుంది. అంతేకాకుండా వాహనదారుల ట్రాఫిక్ ఉల్లంఘనలు, జరిమానాలు ఆధార్‌తో అనుసంధానం అవుతాయి. దీనివల్ల జరిమానాలు కట్టకుండా వాహనాలు నడపడం కష్టమవుతుంది. ప్రస్తుతం దేశంలో 124 కోట్ల మందికి ఆధార్ కార్డులు ఉన్నాయి’ అని పేర్కొన్నారు.

పదవిని త్యజించిన మలేసియా రాజు




కౌలాలంపూర్: మలేసియా రాజు సుల్తాన్ ముహమ్మద్ 5(49) తన పదవిని త్యజించారు. అనారోగ్య కారణాలతో కొంతకాలంగా రాచరిక విధులకు దూరంగా ఉంటున్న ఆయన రష్యా మాజీ సుందరిని వివాహమాడినట్లు గతంలో వార్తలొచ్చాయి. ఈ నేపథ్యంలో ముహమ్మద్ భవిష్యత్తుపై వినిపిస్తున్న ఊహాగానాలకు రాజభవనం ఎట్టకేలకు తెరదించింది. ఆయన తన పదవికి రాజీనామా చేశారని, అది వెంటనే అమల్లోకి వస్తుందని తెలిపింది. పదవీకాలం ముగియకముందే రాచరికాన్ని త్యజించిన తొలి మలేసియా పాలకుడిగా ఆయన నిలిచారు. ఆయన నిష్క్రమణకు కారణమేంటో రాజభవనం చెప్పలేదు. రష్యా మాజీ సుందరిని ఆయన వివాహం చేసుకున్నారన్న వార్తలపై ఎలాంటి అధికారిక ప్రకటన కూడా చేయలేదు. మలేసియా రాజు పదవీకాలం ఐదేళ్లు కాగా, ముహమ్మద్ రెండేళ్ల క్రితమే బాధ్యతలు చేపట్టారు. 9 వంశాల మధ్య ఐదేళ్లకోసారి అధికార పీఠం మారుతూ ఉంటుంది.

ఆర్థిక జనగణనకు 15 లక్షల ఎన్యూమరేటర్లు

న్యూఢిల్లీ: ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ కింద పనిచేసే ఉమ్మడి సేవా కేంద్రాలు (సీఎస్‌సీ – కామన్ సర్వీస్ సెంటర్స్) సిబ్బందిని ఈ ఏడాది జరిపే ఆర్థిక జనగణనకు ఉపయోగించుకోనున్నామని ఓ ఉన్నతాధికారి వెల్లడించారు. ఇందుకోసం 15 లక్షల మంది ఎన్యూమరేటర్లను ఎంపిక చేసి, వారికి ప్రత్యేక శిక్షణనిస్తున్నామని సీఎస్‌సీ ఈ–గవర్నెన్స్ సర్వీసెస్ ఇండియా సీఈవో దినేశ్ త్యాగి చెప్పారు. ఈ 15 లక్షల ఎన్యూమరేటర్లను జనాభా లెక్కల సమయంలో కూడా ఉపయోగించుకోవచ్చన్నారు. ప్రస్తుతం వీరికి మొబైల్ అప్లికేషన్‌ను ఉపయోగించి సమాచారం సేకరించడంపై శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ సిబ్బంది, ఆధునిక సాంకేతికత సాయంతో సాధారణంగా పదేళ్లకు ఒకసారి జరిపే జనగణనను కూడా రెండేళ్లకు ఒకసారి నిర్వహించగలమన్నారు. ఆర్థిక జనగణనకు సాధారణంగా రెండేళ్ల సమయం పడుతుందని, అయితే, శిక్షణ పొందిన ఈ సిబ్బంది ఆ పనిని ఆరు నెలల్లోనే పూర్తి చేయగలరన్నారు. జనాభాను ప్రతి పదేళ్లకోసారి లెక్కిస్తుండగా, ఆర్థిక జనగణన మాత్రం 1977లో మొదలై ఇప్పటివరకు ఆరుసార్లే జరిగింది. ఈ ఎన్యూమరేటర్ల జీతభత్యాలపై ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదన్నారు.

కన్నడ దాడుల్లో 11 కోట్ల ఆస్తులు లభ్యం



బెంగళూరు: కన్నడ సినీ ప్రముఖుల నివాసాల్లో చేపట్టిన సోదాల్లో రూ. 11 కోట్ల విలువైన ఆస్తులు, నగదు లభ్యమైనట్లు ఆదాయ పన్ను అధికారులు వెల్లడించారు. అలాగే, లెక్కల్లో చూపని రూ.109 కోట్ల ఆదాయాన్ని కలిగి ఉన్నట్లు కూడా నిందితులు అంగీకరించినట్లు తెలిపారు. నటులు శివరాజ్ కుమార్, పునీత్ రాజ్‌కుమార్, సుదీప్, యశ్, నిర్మాతలు సీఆర్ మనోహర్, రాక్‌లైన్ వెంకటేశ్, విజయ్ కిరిగందూర్ ఇళ్లపై గురువారం నుంచి శనివారం వరకు దాడులు జరిగిన సంగతి తెలిసిందే. ఆ వివరాల్ని అధికారులు ఆదివారం మీడియాకు వెల్లడించారు. పట్టుబడిన రూ.11 కోట్ల ఆస్తుల్లో రూ.2.85 కోట్ల నగదు, 25.3 కిలోల బంగారు ఆభరణాలు ఉన్నట్లు చెప్పారు. తమకు దొరికిన ఆధారాల్ని రెవెన్యూ, ఇతర విచారణ సంస్థలకు అప్పగిస్తామని అధికారులు తెలిపారు. కర్ణాటక, గోవాలో పనిచేస్తున్న 180 మంది అధికారులు మొత్తం 26 చోట్ల ఏకకాలంలో తనిఖీలు నిర్వహించారు.

భారతీయ కరెన్సీని చట్టబద్ధం చేయండి

కఠ్మాండ్: నోట్ల రద్దు అనంతరం భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన పెద్ద నోట్లను నేపాల్‌లో చట్టబద్ధం చేయాలని కోరుతూ ఆ దేశ ప్రభుత్వం భారతీయ రిజర్వ్ బ్యాంకు (ఆర్‌బీఐ)కి లేఖ రాసింది. దేశంలో ప్రసుత్తం చలామణి అవుతున్న రూ. 200, రూ. 500, రూ. 2,000 కొత్త నోట్లకు సంబంధించిన బ్యాంకు బిల్లులకు చట్టబద్ధత కల్పించాలని కోరింది. ఈ మేరకు నేపాల్ రాష్ట్ర బ్యాంకు (ఎన్ఆర్బీ) శుక్రవారం ఆర్‌బీఐకు లేఖ రాసినట్లు స్థానిక మీడియా ఆదివారం వెల్లడించింది. నేపాలీల వద్ద ఉన్న పాత నోట్లను మార్చుకునే సౌలభ్యం కల్పించాలని కూడా లేఖలో విజ్ఞప్తి చేసింది. నోట్ల రద్దు అనంతరం నేపాల్‌లో రూ. 100, అంతకంటే తక్కువ విలువున్న నోట్ల చలామణికి మాత్రమే ఆర్‌బీఐ అనుమతిచ్చింది. భారత్ ప్రవేశపెట్టిన కొత్త నోట్లకు నేపాల్‌లో చట్టబద్ధత కల్పించకపోవడంతో పెద్ద నోట్లను రద్దు చేయాలని ఇటీవల నిర్ణయించినట్లు ఎన్ఆర్బీ అధికారి ఒకరు వెల్లడించారు. దీనిపై పలు రంగాల ప్రజల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తడంతో వెనక్కుతగ్గామని పేర్కొన్నారు.

‘కౌరవ’ వ్యాఖ్యలతో సంబంధం లేదు

న్యూఢిల్లీ: కౌరవులందరూ టెస్ట్‌ట్యూబ్ బేబీలని ఆంధ్రా విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్స్‌లర్ జి.నాగేశ్వరరావు చేసిన వ్యాఖ్యలు శాస్త్రీయంగా ఆమోదయోగ్యం కావని కేంద్ర ప్రభుత్వ ప్రధాన శాస్త్రీయ సలహాదారు కె విజయ్ రాఘవన్ తెలిపారు. పంజాబ్‌లోని జలంధర్‌లో జరిగిన 106వ ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌లో అంశాలను, వక్తలను నిర్ణయించడంలో ప్రభుత్వ పాత్ర లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ అసోసియేషన్(ఐఎస్‌సీఏ) వక్తల ప్రసంగాలను వడపోత చేయలేదన్నారు. ఓసారి వక్తను ఎంపిక చేసుకున్నాక, వాళ్లు మాట్లాడే అంశంపై ఎలాంటి తనిఖీలు, వడపోతలు జరగవని తేల్చిచెప్పారు. ‘శాస్త్రవేత్తలు ఏదైనా పిచ్చిమాటలు మాట్లాడినప్పుడు ఆ వర్గం నుంచి నిరసనలు ఎదుర్కొంటారు. ఓ రాష్ట్ర విశ్వవిద్యాలయానికి వీసీగా ఉండీ నాగేశ్వరరావు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరం’ అని రాఘవన్ వ్యాఖ్యానించారు. ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌లో పాల్గొన్న నాగేశ్వరరావు కౌరవులు టెస్ట్ ట్యూబ్ బేబీలనీ, డార్విన్ ప్రతిపాదించిన జీవ పరిణామ సిద్ధాంతం కంటే దశావతారం మరింత అర్థవంతంగా ఉందనీ, రావణుడికి 24 విమానాలు, విమానాశ్రయాలు ఉన్నాయని సెలవిచ్చిన సంగతి తెలిసిందే. అంతేకాకుండా ప్రస్తుతమున్న గైడెడ్ మిస్సైల్ టెక్నాలజీని శ్రీరాముడు, విష్ణువు వాడారన్నారు.

రికార్డు కిచిడీ @ 5 వేల కిలోలు



ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో జరుగుతున్న దళితుల మహాసభ సందర్భంగా ఆదివారం 5 వేల కిలోల కిచిడీ తయారీలో పాలుపంచుకున్న కేంద్ర మంత్రులు హర్షవర్ధన్, థావర్‌చంద్ గహ్లోట్. ఒకే పాత్రలో ఎక్కువ ఆహారం వండి ప్రపంచ రికార్డు నెలకొల్పేందుకు ఈ ప్రయత్నం చేస్తున్నారు. ఇందుకోసం స్థానిక దళితుల ఇళ్ల నుంచే 400 కిలోల బియ్యం, 100 కిలోల పప్పుధాన్యాలు, 350 కిలోల కూరగాయలు, 100 కిలోల దేశీయ నెయ్యి, 100 లీటర్ల నూనె, 250 కిలోల మసాలా దినుసులు సేకరించారు. గతంలో ఒకే పాత్రలో 3 వేల కిలోల ఆహారం వండి ప్రపంచ రికార్డు సృష్టించిన వంటగాడు విష్ణు మనోహర్ నేతృత్వంలోనే ఈ వంటకం కూడా సిద్ధమవుతోంది.

272-15 = ఎన్డీయే

- అధికారానికి 15 స్థానాల దూరంలో బీజేపీ కూటమి
- యూపీఏకు 146.. కీలకం కానున్న ‘ఇతరులు’
- లోక్‌సభ ఎన్నికలపై ఇండియా టీవీ–సీఎన్ఎక్స్ సర్వే



న్యూఢిల్లీ: మరో నాలుగు నెలల్లో లోక్‌సభ సాధారణ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఒకవైపు రాజకీయ పార్టీలు ఎన్నికల వ్యూహాల్లో తలమునకలవుతుంటే మరోవైపు ఢిల్లీ కోటలో పాగా వేసేదెవరనే అంశంపై చర్చోపచర్చలు, సర్వేలు, అంచనాలు ఊపందుకుంటున్నాయి. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే పరిస్థితి ఎలా ఉంటుందనే విషయమై ఇండియా టీవీ–సీఎన్ఎక్స్‌లు కలిసి గత నెల 15 నుంచి 25 వరకు అన్ని పార్లమెంటు నియోజకవర్గాల్లోనూ సర్వే నిర్వహించాయి. ఇటీవలి ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం ఈ సర్వే నిర్వహించడం గమనార్హం. దేశంలో మొత్తం 543 నియోజకవర్గాలుండగా, ప్రతీ నియోజకవర్గంలోనూ వంద మంది అభిప్రాయాలను తీసుకుని ఈ సర్వే చేశారు. ఉన్నఫళంగా ఎన్నికలు వస్తే కేంద్రంలో ఏ కూటమికీ సాధారణ ఆధిక్యం రాదని సర్వేలో తేలింది. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయేకు సాధారణ ఆధిక్యం (272 సీట్లు) కన్నా 15 సీట్లు తక్కువగా వస్తాయనీ, ఇరు కూటముల్లోనూ లేని ‘ఇతర’ పార్టీల మద్దతే కేంద్రంలో సర్కారు ఏర్పాటుకు కీలకమని ఈ సర్వే చెబుతోంది. కాగా, ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలకు ముందు, నవంబర్‌లో కూడా ఈ సంస్థలు సర్వే నిర్వహించగా, ఎన్డీఏకు 281, యూపీఏకు 124, ఇతరులకు 138 సీట్లు వస్తాయని వెల్లడైంది. ఆ అంచనాతో పోలిస్తే తాజా సర్వేలో ఎన్డీఏ 24 సీట్లు కోల్పోగా, యూపీఏకు 22 సీట్లు ఎక్కువగా రావడం గమనార్హం.

ఎన్డీయేకు 257 సీట్లు..

కేంద్రంలో అధికారం చేపట్టాలంటే కనీసం 272 సీట్లు గెలవాలి. 2014 ఎన్నికల్లో బీజేపీ ఒక్కటే 282 సీట్లు గెలిచింది. అయితే ఈసారి పరిస్థితి వేరుగా ఉండనుందనీ, బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే పార్టీలన్నింటికీ కలిపి 257 సీట్లు మాత్రమే వస్తాయని ఇండియా టీవీ–సీఎన్ఎక్స్ సర్వే అంటోంది. అంటే సాధారణ ఆధిక్యానికి 15 సీట్ల దూరంలో ఎన్డీయే ఆగిపోనుంది. అలాగే కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏకు (ఎస్పీ, బీఎస్పీలను కలపకుండా) 146 సీట్లు మాత్రమే వస్తాయని సర్వే పేర్కొంది.

‘ఇతరుల’ హవా..

ఇరు కూటముల్లో లేని పార్టీలు, స్వతంత్రులు కలిసి మొత్తంగా 140 సీట్లు గెలుస్తారనీ, ప్రభుత్వ ఏర్పాటుకు వీరే కీలకం కానున్నారని అంచనా వేసింది. ఈ ‘ఇతర’ పార్టీల్లో ఎస్పీ, బీఎస్పీ, అన్నాడీఎంకే, తృణమూల్ కాంగ్రెస్, టీఆర్ఎస్, బిజు జనతాదళ్, వైఎస్సార్‌సీపీ, లెఫ్ట్ ఫ్రంట్, పీడీపీ, ఏఐయూడీఎఫ్, ఎంఐఎం, ఐఎన్ఎల్‌డీ, ఆప్, జేవీఎం, ఏఎంఎంకే తదితరాలు ఉన్నాయి. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్‌సీపీ, తెలంగాణలో టీఆర్ఎస్ అత్యధిక స్థానాలు గెలుచుకోనున్నాయని సర్వే తేల్చింది. తెలంగాణలో టీఆర్ఎస్‌కు 16, ఏపీలో వైఎస్సార్‌సీపీకి 19 సీట్లు వస్తాయని అంచనావేసింది.

పార్టీల వారీగా సీట్లు ఇవీ..

ఈ సర్వే ప్రకారం ఎన్డీయే కూటమిలో బీజేపీకి మొత్తంగా 223 సీట్లు రానున్నాయి. మిత్రపక్షాలైన శివసేన 8 స్థానాల్లో, జేడీయూ 11, శిరోమణీ అకాలీదళ్ 5, ఎల్జేపీ 3 స్థానాలు గెలవనున్నాయి. ఎన్డీయేలో మిగిలిన పార్టీలకు తలో సీటు రావొచ్చని అంచనా వేసింది. యూపీఏ విషయానికి వస్తే కాంగ్రెస్ 85 స్థానాల్లో విజయం సాధించనుంది. 2014 ఎన్నికల కంటే ఇది రెట్టింపు. ఆ కూటమిలోని డీఎంకే 21, ఆర్జేడీ 10, ఎన్సీపీ 9, జేఎంఎం, జేడీఎస్‌లు చెరో 4 సీట్లు, టీడీపీ సహా కూటమిలోని మిగతా పార్టీలకు 13 సీట్లు వస్తాయని సర్వే పేర్కొంది.

యూపీలో బీజేపీకి 40 మాత్రమే

ఢిల్లీ గద్దెకు దారిచూపే ఉత్తరప్రదేశ్ (యూపీ)లో మొత్తం 80 లోక్‌సభ నియోజకవర్గాలున్నాయి. గత ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ ఏకంగా 71 నియోజకవర్గాల్లో గెలవగా, ఎన్డీయే భాగస్వామి అయిన అప్నాదళ్ రెండు చోట్ల గెలిచింది. మొత్తంగా 80లో 73 సీట్లు ఎన్డీయేకే వచ్చాయి. వచ్చే ఎన్నికల్లో మాత్రం బీజేపీకి యూపీలో 40 సీట్లు మాత్రమే వస్తాయనీ, ఎస్పీకి 20, బీఎస్పీకి 15, కాంగ్రెస్‌కు 2 స్థానాల్లో విజయం దక్కుతుందని సర్వే అంటోంది. బిహార్‌లోని మొత్తం 40 సీట్లలో బీజేపీకి 13, మిత్రపక్షం జేడీయూకు 11, ఆర్జేడీకి 10, కాంగ్రెస్‌కు 2 సీట్లు వస్తాయంది. మహారాష్ట్రలో బీజేపీకి 22, శివసేనకు 8, కాంగ్రెస్‌కు 9, ఎన్సీపీకి 9 స్థానాలు దక్కుతాయనీ, ఇక దక్షిణ భారతంలో అత్యధిక ఎంపీ నియోజకవర్గాలు కలిగిన తమిళనాడులో డీఎంకేకు 21, అన్నాడీఎంకేకు 10, కాంగ్రెస్‌కు 3 సీట్లు వస్తాయని సర్వే తెలిపింది.

ఇండియా టీవీ సీఎన్ఎక్స్ సర్వే ఫలితాలివీ

కూటమి	సీట్లు	ఓట్ల శాతం
ఎన్డీయే	257	37.15
యూపీఏ	146	29.92
ఇతరులు	140	32.93

పార్టీ	సీట్లు
మధ్యప్రదేశ్	
బీజేపీ	18
కాంగ్రెస్	11
పశ్చిమబెంగాల్	
తృణమూల్ కాంగ్రెస్	26
బీజేపీ	10
కాంగ్రెస్	2
వామపక్షాల కూటమి	4
మహారాష్ట్ర	
బీజేపీ	22
శివసేన	8
కాంగ్రెస్	9
ఎన్సీపీ	9
తమిళనాడు	
డీఎంకే	21
అన్నాడీఎంకే	10
ఏఎంఎంకే	4
కాంగ్రెస్	3
పీఎంకే	1

కూలిన బంగారు గని.. 30 మంది మృతి

అఫ్గానిస్తాన్‌లోని బదక్షన్ ప్రావిన్సులో ఘటన



కుందుజ్: అఫ్గానిస్తాన్ లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ఇక్కడి బదక్షన్ ప్రావిన్సులోని కోహిస్తాన్ జిల్లాలో ఉన్న ఓ బంగారు గనిలో కార్మికులు పనిచేస్తుండగా గోడ ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. ఈ దుర్ఘటనలో దాదాపు 30 మంది ప్రాణాలు కోల్పోగా, ఏడుగురికి గాయాలయ్యాయి. ఈ విషయమై కోహిస్తాన్ గవర్నర్ మొహమ్మద్ రుస్తమ్ రఫీ మాట్లాడుతూ.. ఇక్కడి గ్రామస్తులు నదీతీరంలో బంగారం కోసం 200 అడుగుల లోతైన గనిని తవ్వారని తెలిపారు. అనంతరం లోపలకు దిగి తవ్వకాలు జరుపుతుండగా పైనున్న గోడ ఒక్కసారిగా విరిగిపడిపోయిందని వెల్లడించారు. మరింత లోతుగా గనిని తవ్వేందుకు గ్రామస్తులు యంత్రాన్ని ఉపయోగిస్తున్న సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకుందన్నారు. వీరంతా సాధారణ గ్రామీణులనీ, నిపుణులు కారని వ్యాఖ్యానించారు. ఈ గ్రామాల ప్రజలు దశాబ్దాలుగా ఖనిజాలను తవ్వుతున్నారనీ, వీటిపై ప్రభుత్వ నియంత్రణ లేదని స్పష్టం చేశారు. ప్రమాదం గురించి తెలియగానే సహాయక బృందాలను పంపామన్నారు. క్షతగాత్రులను రక్షణశాఖ హెలికాప్టర్ల ద్వారా ఆసుపత్రులకు తరలించామని పేర్కొన్నారు. ఈ దుర్ఘటనలో మృతుల సంఖ్య మరింతగా పెరిగే అవకాశముందన్నారు. ఈ ప్రమాదంలో చనిపోయినవారి కుటుంబాలకు 50,000 అఫ్గానీలు, క్షతగాత్రుల కుటుంబాలకు 10,000 అఫ్గానీలు నష్టపరిహారంగా అందిస్తామని ప్రకటించారు. అఫ్గానిస్తాన్ లో అక్రమ మైనింగ్‌అన్నది సర్వసాధారణం. తాలిబన్ ఉగ్రవాదులు ఆదాయం కోసం ప్రధానంగా మైనింగ్‌పైనే ఆధారపడుతున్నారు.

కుంభమేళా కోసం ప్రత్యేక మొబైల్ యాప్

లక్నో: అలహాబాద్‌లో జనవరి 15 నుంచి జరగనున్న కుంభమేళా కోసం నార్త్ సెంట్రల్ రైల్వే(ఎన్‌సీఆర్) ప్రత్యేకంగా ’రైల్ కుంభ సేవా మొబైల్ యాప్’ ను ఆవిష్కరించింది. కుంభమేళాలో పాల్గొనేందుకు అలహాబాద్‌ను సందర్శించే భక్తులు, పర్యాటకులు, ఇతర ప్రయాణికులకు అవసరమైన సమాచారాన్ని అందించడానికి ఈ యాప్‌ను రూపొందించినట్టు ఎన్‌సీఆర్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ అమిత్ మాల్వియ తెలిపారు. ఈ యాప్ కుంభమేళా ప్రత్యేక రైళ్లకు సంబంధించిన సమాచారం, రిజర్వ్ సీట్లు, రిజర్వు కాని సీట్ల వివరాలను తెలియజేస్తుందని ఆయన చెప్పారు. ఏ సమయంలోనైనా, ఎక్కడినుంచైనా కుంభమేళా కు సంబంధించిన సమాచారం ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చన్నారు. భక్తులు తమ ప్రస్తుత స్థానంతో పాటు, అలహాబాద్‌లోని అన్ని రైల్వేస్టేషన్లు, మేళా ప్రాంతం, ప్రధాన హోటళ్ళు, బస్‌స్టేషన్లు, ఇతర సౌకర్యాలకు సంబంధించిన సమాచారం కూడా ఈ యాప్ ద్వారా పొందొచ్చని చెప్పారు. పార్కింగ్, అల్పాహార గదులు, వేచి ఉండు గదుల సమాచారం కూడా ఈ యాప్ అందిస్తుందన్నారు.

బీజేపీ మేనిఫెస్టో కమిటీ సారథిగా రాజ్‌నాథ్

- ప్రచార కమిటీకి జైట్లీ నేతృత్వం
- 17 కమిటీలను ప్రకటించిన షా





న్యూఢిల్లీ: రాబోయే లోక్‌సభ ఎన్నికల కోసం బీజేపీ ఏర్పాట్లను ముమ్మరం చేసింది. పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా ఆదివారం 17 సంస్థాగత కమిటీలను ఏర్పాటుచేశారు. కీలకమైన సంకల్పపత్ర (మేనిఫెస్టో) కమిటీకి సీనియర్ నాయకుడు, కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను సారథిగా నియమించారు. ఈ కమిటీలో కేంద్ర మంత్రులు అరుణ్ జైట్లీ, నిర్మలా సీతారామన్, థావర్‌చంద్ గెహ్లోట్, రవిశంకర్ ప్రసాద్, పీయూష్ గోయల్, ముక్తార్ అబ్బాస్ నక్వీ, కేజే అల్ఫోన్స్, కిరణ్ రిజిజు, మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సహా మొత్తం 20 మందికి చోటు కల్పించారు. అలాగే, మరో సీనియర్ నేత, ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీని ప్రచార కమిటీకి అధ్యక్షుడిగా నియమించారు. ఎనిమిది మంది సభ్యులుండే ఈ కమిటీలో మంత్రులు పీయూష్ గోయల్, రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్, అనిల్ జైన్, మహేశ్ శర్మ తదితరులున్నారు. సామాజిక, స్వచ్ఛంద సంస్థలకు చేరవయ్యేందుకు నియమించిన కమిటీకి నితిన్ గడ్కరీ, మీడియా కమిటీకి రవిశంకర్ ప్రసాద్ నేతృత్వం వహించనున్నారు. అలాగే మేధావులతో సమావేశాలు నిర్వహించే కమిటీకి ప్రకాశ్ జవడేకర్ నాయకత్వం వహిస్తారు. ఎన్నికల ప్రచార సాహిత్య రూపకల్పన కమిటీకి సుష్మా స్వరాజ్ నేతృత్వం వహించనున్నారు. ప్రభుత్వ పథకాలను ప్రచారం చేసే బాధ్యతను పార్టీ ప్రధాన కార్యదర్శి సరోజ్ పాండే నాయకత్వంలోని కమిటీకి అప్పగించారు. ఉపాధ్యక్షుడు శ్యామ్ జాజు, ఐటీ విభాగం ఇన్‌చార్జి అమిత్ మాలవీయ సహా 13 మందితో సోషల్ మీడియా కమిటీ ఏర్పాటుచేశారు. ప్రసాద్ నేతృత్వంలోని మీడియా కమిటీలో పార్టీ జాతీయ అధికార ప్రతినిధులందరికీ చోటు కల్పించారు. పార్టీ కార్యాలయ పనులు, రవాణా, సాహిత్య పంపిణీ, మోదీ మన్‌కీ బాత్, బైకు ర్యాలీల నిర్వహణకు కూడా కమిటీలు ప్రకటించారు.

పార్లమెంటుకు అబద్ధం చెప్పారు

- హెచ్‌ఏఎల్‌కు లక్ష కోట్ల ప్రాజెక్టులకు నిర్మల ఆధారాలు చూపాలి
- లేదంటే రక్షణ మంత్రి పదవికి ఆమె రాజీనామా చేయాలి
- కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ డిమాండ్
- రాహుల్ దేశాన్ని తప్పుదోవ పట్టిస్తుండటం సిగ్గుచేటు: నిర్మల



న్యూఢిల్లీ: హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్‌ఏఎల్)కు నిధుల కొరత ఏర్పడిందన్న అంశం అధికార, ప్రతిపక్షాల మధ్య మరో మాటల యుద్ధానికి దారితీసింది. హెచ్‌ఏఎల్‌కు రూ. లక్ష కోట్ల విలువైన ప్రాజెక్టులు ఇచ్చామని రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటుకు అబద్ధం చెప్పారని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ ప్రాజెక్టులకు సాక్ష్యాలు చూపలేకపోతే ఆమె మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మరోవైపు రాహుల్ వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలనీ, హెచ్‌ఏఎల్, ప్రభుత్వం మధ్య రూ. లక్ష కోట్ల విలువైన ఒప్పందాలు జరిగినట్లుగా తానెప్పుడూ చెప్పలేదని నిర్మల స్పష్టం చేశారు. బెంగళూరు కేంద్రంగా పనిచేస్తూ యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు, జెట్ ఇంజిన్లు తదితరాలను తయారు చేసే ప్రభుత్వ రంగ సంస్థ హెచ్‌ఏఎల్ ప్రస్తుతం తీవ్ర ఆర్థిక కష్టాల్లో ఉందంటూ శనివారం ఓ వార్తా కథనం రావడం తెలిసిందే. సిబ్బందికి వేతనాలు కూడా ఇవ్వలేని స్థితిలో రూ. వెయ్యి కోట్లు అప్పు చేయాల్సి వచ్చిందనీ, ప్రభుత్వం నుంచి తమకు ఒక్క ప్రాజెక్టు కూడా రాలేదని హెచ్‌ఏఎల్ ఉన్నతాధికారులు చెప్పినట్లుగా ఈ కథనం వెల్లడించింది. రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలు ప్రాజెక్టులో భారత్‌లో ఆఫ్‌సెట్ భాగస్వామిగా ప్రభుత్వరంగ, అనుభవం ఉన్న హెచ్‌ఏఎల్‌ను కాదనీ, కొత్తదైన ప్రైవేటు సంస్థ రిలయన్స్ డిఫెన్స్‌ను ఎంపిక చేయడంపై ఇప్పటికే కేంద్రంపై కాంగ్రెస్ తీవ్రంగా విమర్శలు చేస్తుండటం తెలిసిందే. అంబానీకి ప్రయోజనం చేకూర్చేందుకే ప్రధాని మోదీ రిలయన్స్‌ను ఈ ప్రాజెక్టుకు ఎంపిక చేసి, ప్రభుత్వ సంస్థల ఉసురు తీస్తున్నారని కాంగ్రెస్ ఆరోపిస్తోంది.

పార్లమెంటు ముందు దస్త్రాలు ఉంచండి

హెచ్‌ఏఎల్‌కు రూ. లక్ష కోట్ల విలువైన ప్రాజెక్టులు ఇచ్చిన దానికి సంబంధించిన దస్త్రాలను సోమవారం నిర్మల పార్లమెంటుకు సమర్పించాలనీ, లేని పక్షంలో ఆమె రాజీనామా చేయాలని రాహుల్ ఆదివారం డిమాండ్ చేశారు. ‘ఒక్క అబద్ధం చెబితే దాన్ని కప్పిపుచ్చడానికి మరెన్నో అబద్ధాలు చెబుతూ ఉండాలి. మోదీ రఫేల్ ‘అబద్ధం’ను కప్పిపుచ్చేందుకు ఇప్పుడు రక్షణ మంత్రి పార్లమెంటుకే అబద్ధం చెప్పారు’ అని రాహుల్ ట్వీట్ చేశారు. హెచ్‌ఏఎల్‌ను కాదని రిలయన్స్‌కు రఫేల్ ప్రాజెక్టు ఇచ్చినందుకు కాంగ్రెస్ మొదటి నుంచి కేంద్రంపై విమర్శలు చేస్తోంది. శనివారం కూడా మోదీ తన సూటు–బూటు స్నేహితుడి (అనిల్ అంబానీ)కి సాయం చేసేందుకు హెచ్‌ఏఎల్‌ను బలహీనపరుస్తున్నారని ఆరోపించారు.

హెచ్‌ఏఎల్ ఏమంటోంది..

హెచ్‌ఏఎల్ ఈ అంశంపై స్పందిస్తూ.. 83 తేలికపాటి యుద్ధవిమానాలు, 15 తేలికపాటి యుద్ధ హెలికాప్టర్ల ప్రాజెక్టులపై కీలక దశల్లో ఉన్నాయనీ, త్వరలో తమ ఆర్థిక పరిస్థితి మెరుగుపడే అవకాశం ఉందని తెలిపింది. మార్చి వరకు ఖర్చుల కోసం రూ. 962 కోట్లను ప్రస్తుతం అప్పుగా తీసుకున్నామంది.

పూర్తిగా చదివి మాట్లాడాలి: నిర్మల



వార్తా కథనాన్ని పూర్తిగా చదివిన తర్వాత రాహుల్ గాంధీ మాట్లాడాలని నిర్మల హితవు చెప్పారు. ఆ కథనంలోనే ఉన్న వివరాలను ఆమె ఉటంకిస్తూ ‘ఈ ఒప్పందాలు పూర్తయినట్లుగా నిర్మల పార్లమెంటుకు చెప్పలేదు. ఆ దిశగా పనులు జరుగుతున్నాయని మాత్రమే ఆమె వెల్లడించినట్లు లోక్‌సభ రికార్డులు చెబుతున్నాయి’ అని పేర్కొన్నారు. రాహుల్ దేశాన్ని తప్పుదారి పట్టిస్తుండటం సిగ్గుచేటని ఆమె అన్నారు. ఆ తర్వాత నిర్మల కార్యాలయం ఓ ట్వీట్ చేస్తూ ‘రాహుల్ గాంధీ, మీరు ఏబీసీల నుంచి అన్నీ నేర్చుకోవాలి. ప్రజలను తప్పుదారి పట్టించేందుకు ఉత్సాహం చూపుతున్న మీలాంటి వారే పూర్తిగా కథనాన్ని చదవకుండానే, అదే కథనం ఆధారంగా ఆరోపణలు చేస్తారు. అబద్ధం చెబుతున్నది మీరే రాహుల్. 2014–18 మధ్య హెచ్‌ఏఎల్, ప్రభుత్వం మధ్య రూ. 26,570.8 కోట్ల ఒప్పందాలు జరిగాయి. మరో రూ. 73 వేల కోట్ల విలువైన ప్రాజెక్టులను కూడా ఇచ్చేందుకు కసరత్తు జరుగుతోంది. ఇప్పుడు మీరు దేశ ప్రజలకు పార్లమెంటులో క్షమాపణ చెప్పి మీ పదవికి రాజీనామా చేస్తారా?’ అంటూ ఘాటుగా స్పందించింది.

కాంక్రీట్ వద్దు.. స్టీల్ గోడ కడదాం: ట్రంప్



వాషింగ్టన్: అమెరికా–మెక్సికో సరిహద్దులో గోడ నిర్మాణంపై మొండిగా వ్యవహరిస్తున్న అగ్రరాజ్యం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మెత్తబడ్డారు. అక్రమ వలసదారుల్ని అడ్డుకునేందుకు సరిహద్దులో కాంక్రీట్ గోడ కాకపోయినా స్టీల్‌తో గోడలాంటి నిర్మాణాన్ని చేపట్టాలని వ్యాఖ్యానించారు. అక్రమవలసదారుల కారణంగా దేశ ఆర్థిక వ్యవస్థకు తీవ్రంగా నష్టం జరుగుతోందని వాపోయారు. స్టీల్ గోడలాంటి నిర్మాణంపై చర్చించేందుకు అమెరికా ఉక్కు పరిశ్రమ సంఘం అధ్యక్షుడితో పాటు ముఖ్యులతో సమావేశమవుతానని తెలిపారు. గోడ కారణంగా అక్రమ వలసలతో పాటు మాదకద్రవ్యాల సరఫరాను అడ్డుకోవచ్చనీ, తద్వారా నేరాలు తగ్గుముఖం పడతాయని వెల్లడించారు. ఆదివారం వైట్‌హౌస్ నుంచి క్యాంప్ డేవిడ్‌కు బయలుదేరిన సందర్భంగా ట్రంప్ మీడియాతో మాట్లాడారు. దాదాపు 3 వారాలుగా కొనసాగుతున్న షట్‌డౌన్ సుదీర్ఘకాలం కొనసాగుతుందని ట్రంప్ పునరుద్ఘాటించారు. గోడ నిర్మాణం విషయమై ప్రతినిధుల సభ స్పీకర్ నాన్సీ పెలోసీ, మైనారిటీ నేతల చక్ కలిసివస్తే 20 నిమిషాల్లో సమస్య పరిష్కారమైపోతుందని స్పష్టం చేశారు. షట్‌డౌన్‌కు వీరిద్దరే కారణమని ఆరోపించారు.

31 స్వదేశంలో ఆస్ట్రేలియా జట్టు ఫాలోఆన్ ఆడటం 31 ఏళ్ల తర్వాత ఇదే తొలిసారి. 1988లో సిడ్నీలోనే ఇంగ్లండ్‌తో జరిగిన టెస్టులో చివరిసారి ఆస్ట్రేలియా ఫాలోఆన్ ఎదుర్కొంది.

2 కుల్దీప్ యాదవ్ (5/99) రూపంలో ఆస్ట్రేలియా గడ్డపై పర్యాటక జట్టుకు చెందిన ఎడంచేతి వాటం స్పిన్నర్ ఐదు వికెట్లు తీయడం ఇది రెండోసారి మాత్రమే. 1955లో సిడ్నీ టెస్టులో ఇంగ్లండ్ ఎడంచేతి వాటం స్పిన్నర్ జానీ వార్డ్లే (5/79) తొలిసారి ఈ ఘనత సాధించారు.

14 టెస్టుల్లో ఆస్ట్రేలియా ఫాలోఆన్ ఆడి 14 ఏళ్లు గడిచాయి. చివరిసారి ఆ జట్టు 2005లో ఇంగ్లండ్‌తో ట్రెంట్‌బ్రిడ్జ్ టెస్టులో ఇలా చేసింది.

322 ఆస్ట్రేలియా గడ్డపై భారత్‌కు దక్కిన అత్యధిక ఆధిక్యం ఇదే. ఓవరాల్‌గా ఆసీస్‌పై 1998లో కోల్‌కతా టెస్టులో భారత్‌కు 400 పరుగుల ఆధిక్యం లభించడం అత్యుత్తమం.

గెలుపు ఘడియ వచ్చేసింది


కుల్దీప్‌కు జట్టు సభ్యుల అభినందన

ఆస్ట్రేలియా గడ్డపై తొలిసారి టెస్టు సిరీస్ గెలవనున్న భారత్

సిడ్నీ టెస్టుకు నేడు చివరి రోజు ● 316 పరుగులు వెనుకంజలో ఆసీస్

'డ్రా' కోసం పోరాడనున్న ఆతిథ్య జట్టు ● 10 వికెట్లు పడగొట్టడంపై భారత్ దృష్టి

ఎప్పుడో స్వాతంత్ర్యం సాధించిన కొత్తలో 1947లో తొలిసారి ఆస్ట్రేలియాలో భారత్ పర్యటన... ఆ తర్వాత మరో పది సార్లు కంగారు గడ్డకు వెళ్లొచ్చాము... మొత్తంగా ఎనిమిది సార్లు ఓడితే, మరో మూడు సార్లు 'డ్రా' చేసుకొని రావడం తప్ప ఒక్కసారి కూడా సిరీస్ గెలుపు రుచి చూడలేదు. కానీ గత తరంలో దిగ్గజాలకు కూడా సాధ్యం కాని ఘనతను ఇప్పటి టీమిండియా చేసి చూపిస్తోంది. ఆస్ట్రేలియాను వారి వేదికపైనే చిత్తు చేసి తొలిసారి సిరీస్ తమ ఖాతాలో వేసుకోబోతోంది. చివరి టెస్టుకు నేడు చివరి రోజు కాగా ప్రత్యర్థిని ఆలౌట్ చేసి 3–1తో దర్జాగా పోరును ముగించాలని భారత్ లక్ష్యంగా పెట్టుకుంటే... ఆ 10 వికెట్లు కాపాడుకొని కనీసం 'డ్రా'తోనైనా పరువు నిలబెట్టుకోవాలనేది ఆసీస్ ఆశ. నాలుగో రోజు వర్షం, వెలుతురులేమి కారణంగా 25.2 ఓవర్ల ఆట మాత్రమే జరగడంతో ఆసీస్ పోరాటం చివరి రోజుకు చేరింది. చచ్చీ చెడి 300 పరుగుల మార్క్‌ను చేరిన ఆ జట్టు ఏకంగా 322 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యాన్ని కోల్పోయింది. 31 ఏళ్ల తర్వాత సొంతగడ్డపై ఫాలోఆన్ ఆడుతూ నాలుగు ఓవర్లే ఎదుర్కొన్న ఆ జట్టు ఆఖరి రోజు మొత్తం నిలబడి పరాజయం తప్పించుకుంటుందా లేక భారత బౌలర్లకు దాసోహమై తలవంచుతుందా చూడాలి. అయితే 'డ్రా' కోసం కూడా తమ ఆటతో పాటు నాలుగో రోజు తమను కాపాడిన వరుణుడి సహాయాన్ని కూడా కంగారూలు కోరుకుంటున్నారు.

భారత్ అసంతృప్తి

ఆసీస్ రెండో ఇన్నింగ్స్ నాలుగో ఓవర్లో బుమ్రా వేసిన షార్ట్ పిచ్ బంతి అనూహ్యంగా పైకి లేచింది. దానిని హారిస్ సరిగా ఆడలేకపోవడంతో బంతి అతని వేలికి బలంగా తాకింది. నిజానికి ఇక్కడ బ్యాట్స్‌మన్ వైఫల్యమే తప్ప బంతి సరిగా కనబడకపోవడం కాదు. ఆ సమయంలో మైదానంలోని ఎనిమిది ఫ్లడ్‌లైట్లు కూడా పని చేస్తున్నాయి. కానీ అంపైర్లు ఈ ఘటనను దృష్టిలో ఉంచుకొని వెలుతురు తగ్గిందంటూ టీ విరామానికి ముందు మైదానం వీడారు. నాలుగో రోజు భారత్ కెప్టెన్ కోహ్లి దృష్టంతా విజయంపైనే ఉంది. సిరీస్ సాధిస్తున్నా ఈ టెస్టు కూడా గెలవాలని అతను భావించాడు. అందుబాటులో ఉన్న సమయంలో 14 వికెట్లు పడగొట్టడమే టీమిండియా లక్ష్యం. అందుకే తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్ ఆలౌట్ కాగానే మరో ఆలోచన లేకుండా ఫాలోఆన్ ఇచ్చేశాడు. కానీ రెండో ఇన్నింగ్స్ అర్ధాంతరంగా ముగియడం భారత్‌కు అసంతృప్తిని మిగిల్చింది. ఆట రద్దును అంపైర్లు ప్రకటించడానికి గంట ముందు అంపైర్లతో కోహ్లి, రవిశాస్త్రి సుదీర్ఘంగా దీనిపై చర్చించారు. షెడ్యూల్ సమయం ప్రకారం అప్పటి నుంచి ఇంకా 31 ఓవర్లు మిగిలే ఉన్నాయి. ఆదివారం ఆట చూద్దామని వచ్చిన స్థానిక అభిమానులు కూడా తీవ్ర నిరాశ చెందారు. చిన్న చినుకు పడినా, లైట్లు అందుబాటులో ఉన్నా కూడా లైట్ మీటర్ రీడింగ్ కాస్త తక్కువ చూపించినా సరే ఆటను నిలిపివేయవచ్చనే ఐసీసీ నిబంధనపై కూడా వారు అసహనం వ్యక్తం చేశారు. మైదానంలో తమ మొబైల్ ఫోన్ లైట్‌లు ఆన్ చేసి తమ అసంతృప్తిని ప్రదర్శించారు.

సిడ్నీ: బోర్డర్–గావస్కర్ ట్రోఫీలో ఆద్యంతం ఆధిపత్యం కనబర్చిన భారత జట్టు సిరీస్‌కు ఘనమైన ముగింపు ఇచ్చేందుకు మరింత చేరువగా నిలిచింది. నాలుగో టెస్టులో కోహ్లి సేన చేతిలో ఓటమిని తప్పించుకునేందుకు పోరాడుతున్న ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌లో వికెట్ నష్టపోకుండా 6 పరుగులు చేసింది. చేతిలో 10 వికెట్లు ఉన్న ఆ జట్టు సోమవారం మొత్తం ఆడినా 316 పరుగుల లోటును అధిగమించి భారత్‌ను బ్యాటింగ్‌కు దించడం దాదాపుగా



అసాధ్యం. కాబట్టి భారత్ సిరీస్ విజయం 2–1తోనా లేక 3–1తోనే అనేదే ఇక తేలాల్సి ఉంది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 236/6తో ఆట కొనసాగించిన ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 300 పరుగులకు ఆలౌటైంది. కుల్దీప్ యాదవ్ (5/99) ఐదు వికెట్లతో చెలరేగాడు. 322 పరుగుల ఆధిక్యం దక్కడంతో కోహ్లి ఆసీస్‌కు 'ఫాలోఆన్' ఇచ్చాడు. వెలుతురులేమితో నాలుగు ఓవర్లకే ఆట నిలిచిపోయింది.

మరో 64 పరుగులు...

వర్షం ఆగి ఆట మొదలైన తర్వాత తొలి వికెట్ కోసం భారత్‌కు ఎక్కువ సమయం పట్టలేదు. నాలుగో రోజు ఆరో బంతికే కమిన్స్ (25)ను షమీ బౌల్డ్ చేశాడు. కుల్దీప్ బౌలింగ్‌కు రాగానే తొలి ఓవర్లో రెండు ఫోర్లు కొట్టి హ్యాండ్స్‌కోంబ్ (111 బంతుల్లో 37; 5 ఫోర్లు) ఆధిపత్యం ప్రదర్శించే ప్రయత్నం చేసినా అది ఎంతో సేపు నిలవలేదు. బుమ్రా వేసిన బంతిని అతను వికెట్లపైకి ఆడుకున్నాడు. ఆ వెంటనే లయన్ (0)ను కుల్దీప్ వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. ఇక మరో వికెట్ తీసేందుకు ఎంతో సేపు లేదనిపించింది. అయితే ఆసీస్ చివరి జోడీ స్టార్క్ (55 బంతుల్లో 29 నాటౌట్; 3 ఫోర్లు), హాజల్‌వుడ్ (45 బంతుల్లో 21; 2 ఫోర్లు) భారత్‌ను కొంత అసహనానికి గురి చేసింది. హాజల్‌వుడ్ 'సున్నా' వద్ద ఉన్నప్పుడు అతను ఇచ్చిన సునాయాస క్యాచ్‌ను మిడాన్‌లో విహారి వదిలేయడం కూడా ఆసీస్‌కు కలిసొచ్చింది. 14 ఓవర్ల పాటు క్రీజ్‌లో నిలిచిన వీరు పదో వికెట్‌కు 42 పరుగులు జోడించారు. ఎట్టకేలకు హాజల్‌వుడ్ ఎల్బీగా ఔట్ చేసి కంగారూ ఇన్నింగ్స్‌కు తెరదించిన కుల్దీప్ ఐదో వికెట్‌ను తన ఖాతాలో వేసుకున్నాడు. బ్యాట్స్‌మన్ రివ్యూ చేసినా లాభం లేకపోయింది. నాలుగో రోజు ఆటలో ఆసీస్ మరో 64 పరుగులు జోడించి చివరి 4 వికెట్లు కోల్పోయింది. రెండో ఇన్నింగ్స్‌లోనూ ఆసీస్ ఓపెనర్లు తడబడినా... నాలుగు ఓవర్లలో ఎలాంటి ప్రమాదం లేకుండా వారు ఆటను ముగించారు.

వాతావరణం ఆడుకుంది...

ఊహించినట్లుగానే సిడ్నీ మ్యాచ్‌కు నాలుగో రోజు వాన అడ్డంకిగా మారింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు వర్షం, వెలుతురు లేమి అంతరాయం కలిగించడంతో ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో కేవలం 21.2 ఓవర్లు, రెండో ఇన్నింగ్స్‌లో 4 ఓవర్ల ఆట మాత్రమే జరిగింది. వర్షం తగ్గకపోవడంతో మొదటి సెషన్ ఆట పూర్తిగా తుడిచి పెట్టుకుపోయింది. మూడు గంటల తర్వాత ఎట్టకేలకు రెండో సెషన్‌లో కూడా నిర్ణీత సమయంకంటే ఆలస్యంగా మొదలు కాగా... టీ విరామానికి ఎనిమిది నిమిషాల ముందే తగిన వెలుతురు లేక ఆటగాళ్లు మైదానం వీడారు. ఆ తర్వాత మరో బంతి పడలేదు. అంపైర్లు సుదీర్ఘ సమయం పాటు వేచి చూస్తూ పదే పదే తనిఖీలు చేసినా లాభం లేకపోయింది. మరోసారి చినుకులు పడటంతో ఆదివారం ఆట రద్దయింది.

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్ 622/7 డిక్లేర్డ్; ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: హారిస్ (బి) జడేజా 79; ఖాజా (సి) పుజారా (బి) కుల్దీప్ 27; లబ్‌షేన్ (సి) రహానే (బి) షమీ 38; మార్ష్ (సి) రహానే (బి) జడేజా 8; హెడ్ (సి అండ్ బి) కుల్దీప్ 20; హ్యాండ్స్‌కోంబ్ (బి) బుమ్రా 37; పైన్ (బి) కుల్దీప్ 5; కమిన్స్ (బి) షమీ 25; స్టార్క్ (నాటౌట్) 29; లయన్ (ఎల్బీ) (బి) కుల్దీప్ 0; హాజల్‌వుడ్ (ఎల్బీ) (బి) కుల్దీప్ 21; ఎక్స్‌ట్రాలు 11; మొత్తం (104.5 ఓవర్లలో ఆలౌట్) 300.
వికెట్ల పతనం: 1–72; 2–128; 3–144; 4–152; 5–192; 6–198; 7–236; 8–257; 9–258; 10–300. బౌలింగ్: షమీ 19–2–58–2; బుమ్రా 21–5–62–1; జడేజా 32–11–73–2; కుల్దీప్ 31.5–6–99–5; విహారి 1–0–2–0.
ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్: ఖాజా (బ్యాటింగ్) 4; హారిస్ (బ్యాటింగ్) 2; ఎక్స్‌ట్రాలు 0; మొత్తం (4 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా) 6.
బౌలింగ్: షమీ 2–1–4–0, బుమ్రా 2–1–2–0.

4 ఓవరాల్‌గా ఆస్ట్రేలియాను ఫాలోఆన్ ఆడించడం భారత్‌కిది నాలుగోసారి. 1986లో సిడ్నీ టెస్టులోనే చివరిసారి ఆసీస్‌ను భారత్ ఫాలోఆన్ ఆడాలని కోరింది. అంతకుముందు 1979–80 సిరీస్‌లో ఢిల్లీ, ముంబై టెస్టుల్లో ఆస్ట్రేలియాను భారత్ ఫాలోఆన్ ఆడించింది.



కళైవాణి, నిఖత్ జరీన్, సిమ్రన్‌జిత్‌లతో భారత మేటి బాక్సర్ మేరీకోమ్

నిఖత్‌కు రజతం

సాక్షి, హైదరాబాద్: జాతీయ సీనియర్ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్ (51 కేజీలు) రజత పతకం సాధించింది. కర్ణాటకలోని విజయనగరలో ఆదివారం ముగిసిన ఈ పోటీల ఫైనల్లో నిఖత్ 2–3తో పింకీ రాణి జాంగ్రా (హరియాణా) చేతిలో పోరాడి ఓడిపోయింది. నిఖత్ ప్రదర్శనకు గుర్తింపుగా ఆమెకు 'బెస్ట్ చాలెంజింగ్ బాక్సర్' పురస్కారం లభించింది. టోర్నీ 'బెస్ట్ బాక్సర్'గా సిమ్రన్‌జిత్ కౌర్... 'బెస్ట్ ప్రామిసింగ్ బాక్సర్'గా కళైవాణి (తమిళనాడు–48 కేజీలు) నిలిచారు. మొత్తం 10 విభాగాల్లో ఫైనల్స్ జరుగగా.. రైల్వేస్, హరియాణా బాక్సర్లు మూడు చొప్పున స్వర్ణాలు సాధించారు. పంజాబ్ ఖాతాలో రెండు పసిడి పతకాలు చేరాయి. ఆలిండియా పోలీస్, అస్సాం బాక్సర్లకు ఒక్కో బంగారు పతకం లభించింది. రైల్వేస్ తరఫున సోనియా లాథర్ (57 కేజీలు), నీతూ (75 కేజీలు), సీమా పూనియా (ప్లస్ 81 కేజీలు)... హరియాణా తరఫున పింకీ రాణి (51 కేజీలు), నీరజ్ (60 కేజీలు), పూజా రాణి (81 కేజీలు)... పంజాబ్ తరఫున మంజు రాణి (48 కేజీలు), సిమ్రన్‌జిత్ కౌర్ (64 కేజీలు) చాంపియన్‌లుగా నిలిచారు. ఆలిండియా పోలీస్ జట్టుకు మీనా కుమారి దేవి (54 కేజీలు), అస్సాం జట్టుకు లవ్లీనా బొర్గొహైన్ (69 కేజీలు) ఒక్కో స్వర్ణం అందించారు. ఆరుసార్లు ప్రపంచ చాంపియన్, భారత మేటి బాక్సర్ మేరీకోమ్ ముఖ్య అతిథిగా విచ్చేసి విజేతలకు బహుమతులు అందజేశారు.

దక్షిణాఫ్రికాదే సిరీస్

రెండో టెస్టులో పాకిస్తాన్ ఓటమి

కేప్‌టౌన్: పాకిస్తాన్‌తో జరుగుతోన్న మూడు టెస్టుల సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలుండగానే దక్షిణాఫ్రికా 2–0తో కైవసం చేసుకుంది. ఆ జట్టు రెండో టెస్టులో 9 వికెట్ల తేడాతో నెగ్గింది. 41 పరుగుల లక్ష్యంతో ఆదివారం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన సఫారీలు 9.5 ఓవర్లలో వికెట్ నష్టానికి 43 పరుగులు చేసి విజయం సాధించారు. డీన్ ఎల్గర్ (24 నాటౌట్; 4 ఫోర్లు), డు ప్లెసిస్ (3 నాటౌట్) లాంఛనం పూర్తి చేశారు. ఓపెనర్ డి బ్రుయెన్ (4)ను అబ్బాస్ ఔట్ చేయగా... ఆమ్లా రెండు పరుగులు చేసి రిటైర్డ్ హర్ట్ అయ్యాడు. సొంతగడ్డపై దక్షిణాఫ్రికాకిది వరుసగా ఏడో సిరీస్ విజయం కావడం విశేషం. మూడో టెస్టు శుక్రవారం నుంచి జొహన్నెస్‌బర్గ్‌లో ప్రారంభం కానుంది.


ఎల్గర్

డు ప్లెసిస్ సస్పెన్షన్...

ఈ మ్యాచ్‌లో 'స్లో ఓవర్ రేట్' కారణంగా దక్షిణాఫ్రికా కెప్టెన్ డు ప్లెసిస్‌పై ఐసీసీ ఓ టెస్టు మ్యాచ్ నిషేధం విధించింది. దీంతో పాటు సారథి మ్యాచ్ ఫీజులో 20 శాతం, జట్టు సభ్యుల ఫీజులో 10 శాతం కోత పెట్టింది.

సెమీస్‌లో హైదరాబాద్

అహ్మదాబాద్‌పై 4-3తో విజయం

అహ్మదాబాద్: ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్‌లో హైదరాబాద్ హంటర్స్ సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో 4–3తో అహ్మదాబాద్ స్మాష్‌మాస్టర్స్‌పై విజయం సాధించింది. దీంతో 21 పాయింట్లతో అగ్రస్థానంలోకి వెళ్లింది. మొదట మిక్స్‌డ్ డబుల్స్‌లో బొదిన్ ఇసారా–ఇయోమ్ హ్యే వోన్ జోడీ 15–14, 15–9తో సాత్విక్ సాయిరాజ్–సిక్కి రెడ్డి జంటపై గెలిచి శుభారంభం చేసింది. పురుషుల సింగిల్స్ తొలి మ్యాచ్ అహ్మదాబాద్‌కు ట్రంప్ మ్యాచ్ కాగా... ఇందులో డారెన్ ల్యూ 15–13, 15–9తో రాహుల్ యాదవ్ (హైదరాబాద్)పై గెలుపొందాడు. రెండో సింగిల్స్‌లో విక్టర్ అక్సెల్‌సన్ 15–11, 13–15,


సింధు

15–8తో మార్క్ కాల్జౌ (హైదరాబాద్)పై నెగ్గడంతో అహ్మదాబాద్ ఆధిక్యం 3–1కు చేరింది. తర్వాత మహిళల సింగిల్స్ బరిలో సింధు ఉండటంతో హైదరాబాద్ ట్రంప్‌గా ఎంచుకుంది. సింధు 15–14, 12–15, 15–14తో కిర్‌స్టీ గిల్మోర్ (అహ్మదాబాద్)పై చెమటోడ్చి నెగ్గడంతో స్కోరు 3–3తో సమమైంది. ఇక నిర్ణాయక పురుషుల డబుల్స్‌లో బొదిన్ ఇసారా–కిమ్ సా రంగ్ (హైదరాబాద్) జోడీ 15–10, 11–15, 15–14తో సాత్విక్–రెగినాల్డ్ ద్వయంపై నెగ్గడంతో హైదరాబాద్ విజయం ఖాయమైంది. మరోవైపు ఢిల్లీ డాషర్స్ పరాజయాల పరంపర కొనసాగుతోంది. ఐదో మ్యాచ్‌లోనూ ఢిల్లీ 0–6తో పుణే సెవెన్ ఏసెస్ చేతిలో చిత్తుగా ఓడింది. నేటి మ్యాచ్‌లో అవధ్ వారియర్స్‌తో చెన్నై స్మాషర్స్ తలపడుతుంది.

55 ఏళ్ల తర్వాత...

- ఆసియా కప్‌లో భారత్‌కు తొలి గెలుపు
- థాయ్‌లాండ్‌పై 4–1తో ఘనవిజయం
- రెండు గోల్స్‌తో విజృంభించిన సునీల్ ఛెత్రి

అబుదాబి: స్టార్ స్ట్రయికర్ సునీల్ ఛెత్రి (27వ, 46వ నిమిషాల్లో) రెండు గోల్స్‌తో చెలరేగడంతో ఆసియా కప్‌లో భారత ఫుట్‌బాల్ జట్టు శుభారంభం చేసింది. గ్రూప్ 'ఎ'లో భాగంగా ఆదివారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 4–1తో థాయ్‌లాండ్‌ను చిత్తు చేసింది. గోల్స్ పరంగా ఆసియా కప్ చరిత్రలో భారత్‌కిదే అతి పెద్ద విజయం. ఎనిమిదేళ్ల తర్వాత ఈ టోర్నీలో అడుగుపెట్టిన భారత్ 1964 తర్వాత తొలి విజయాన్ని నమోదు చేసింది. కెప్టెన్ ఛెత్రి రెండు గోల్స్ చేయగా... అనిరుధ్ థాపా (68వ ని.లో), జెజె లాల్‌పెఖులు (80వ ని.లో) చెరో గోల్ చేశారు. థాయ్‌లాండ్ తరఫున తీరాసిల్ దంగ్డా (33వ ని.లో) ఏకైక గోల్ చేశాడు. తొలి అర్ధభాగంలో లభించిన పెనాల్టీని ఛెత్రి గోల్‌గా మలచడంతో భారత్ 1–0తో ఆధిక్యంలోకి వెళ్లింది. అయితే ఈ సంబరం ఎక్కువ సేపు నిలవలేదు. మరో ఆరు నిమిషాల్లోనే థాయ్‌లాండ్ తరఫున తీరాసిల్ దంగ్డా గోల్ కొట్టడంతో స్కోరు 1–1తో సమం అయింది. రెండో అర్ధభాగం ప్రారంభ నిమిషంలోనే సునీల్ ఛెత్రి మెరుపు వేగంతో ఫీల్డ్ గోల్ చేసి భారత్‌కు 2–1తో ఆధిక్యం అందించాడు. ఆ తర్వాత అనిరుధ్, జెజె లాల్‌పెఖుల గోల్స్‌తో తిరుగులేని ఆధిక్యంతో భారత్ మ్యాచ్‌ను ముగించింది. ఈ మ్యాచ్‌లో రెండు గోల్స్ చేసిన సునీల్ ఛెత్రి (66 గోల్స్) అంతర్జాతీయస్థాయిలో అత్యధిక గోల్స్ చేసిన ప్రస్తుత క్రీడాకారుల జాబితాలో లియోనెల్ మెస్సీని (అర్జెంటీనా–65 గోల్స్) వెనక్కి నెట్టి రెండో స్థానానికి ఎగబాకాడు. క్రిస్టియానో రొనాల్డో (పోర్చుగల్–85 గోల్స్) అగ్రస్థానంలో ఉన్నాడు. తదుపరి మ్యాచ్‌ల్లో భారత్ 10న ఆతిథ్య యూఏఈతో... 14న బహ్రెయిన్‌తో ఆడనుంది. ఈ రెండింటిలో ఒక దానిని 'డ్రా' చేసుకున్నా భారత్ ప్రిక్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధిస్తుంది.

ఆసీస్‌కు షాక్...

మరోవైపు డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియాకు ఆసియా కప్‌లో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. గ్రూప్ 'బి' తొలి మ్యాచ్‌లో పటిష్ట ఆసీస్ 0–1తో అనామక జోర్డాన్ చేతిలో ఓటమి పాలైంది. మ్యాచ్‌లో నమోదైన ఏకైక గోల్‌ను అనస్ బనీ యాసీన్ (26వ ని.లో) చేశాడు.


గోల్ చేసిన సంబరంలో సునీల్ ఛెత్రి, అనిరుధ్ థాపా

సాక్షి ప్రాఫిట్ ప్లస్
సోమవారం
7-1-2019

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్	181 ▲	35,695
నిఫ్టీ	55 ▲	10,727

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం ముగింపు)		
నాస్‌డాక్	6,739	▲ 275
డోజోన్స్	23,433	▲ 747
ఎఫ్‌టీఎస్‌ఈ 100	6,837	▲ 144
డాక్స్	10,767	▲ 351
షాంఘై	2,515	▲ 51
నికాయ్	19,562	▼ 453

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			● కొనుగోలు	● అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	69.2	70.84
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	87.02	90.14
€	యూరో	ఎస్‌బీఐ	78.37	81.29
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	63.4	65.84
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	48.09	50.3
SS	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	50.51	52.28
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	17.3	20.3
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	--	--
¥	చైనా యువాన్	థామస్‌కుక్	9.15	10.8

ఏడాది మారింది... మరి మీరు?

కాలానికి అనుగుణంగా పెట్టుబడులు

- స్టాక్ మార్కెట్లలో పెరిగిన అస్థిరతలు
- సిప్ మార్గంలో ఇన్వెస్ట్ చేయడమే మెరుగు
- లార్జ్‌క్యాప్‌కు ప్రత్యామ్నాయం మల్టీక్యాప్ ఫండ్స్
- మూలధన లాభాల పన్ను పడకుండానూ మార్గం
- ఎఫ్ఎంపీ, ఎన్‌పీఎస్, షార్ట్‌టర్మ్ డెట్ ఫండ్స్... ఎన్నో ఆప్షన్లు

గతేడాది చాలా పెట్టుబడి సాధనాలు సగటు కంటే తక్కువ రాబడులే ఇచ్చాయి. ఇటీవలి కాలంలో ఎక్కువ అస్థిరతలు చూసింది గతేడాదిలోనే. అయితే, 2019లో పరిస్థితులు ఆశాజనకంగానే ఉంటాయన్నది ఎక్కువ మంది నిపుణుల అభిప్రాయం. ప్రతికూలతలను అధిగమించి, పెట్టుబడి అవకాశాలను అందుకోవాలంటే అందుకు ప్రతి ఒక్కరూ పాటించతగిన ఆర్థిక విధానాలు కొన్ని ఉన్నాయి. అవేంటన్నది నిపుణుల మాటల్లోనే...

- సాక్షి, పర్సనల్ ఫైనాన్స్ విభాగం





ఈ ఏడాది ఎన్నికలు ఉన్నందున మార్కెట్లలో అస్థిరతలు కొనసాగేందుకు అధిక అవకాశాలున్నాయి. ఈ అస్థిరతలను అధిగమించేందుకు సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) ఉపయోగపడుతుంది. ఎన్నికల వరకు స్టాక్స్ ధరలు పరిమిత పరిధిలోనే కదలాడే అవకాశం ఉంది. ఫలితాలు వెలువడ్డాక దిశను ఎటువైపు అయినా మార్చుకోవచ్చు. కాబట్టి ఈ సమయంలో ఇన్వెస్టర్లు సిప్ ద్వారా ప్రతి నెలా నిర్ణీత మొత్తం ఇన్వెస్ట్ చేయడమే సరైన మార్గం. మార్కెట్లు గరిష్టాల్లో ఉన్నప్పుడు ఎన్‌ఏవీ ధరలు పెరగడం వల్ల తక్కువ ఫండ్స్ యూనిట్లు, మార్కెట్లు కరెక్షన్ బాట పడితే ఎన్‌ఏవీ ధరల పతనంతో ఎక్కువ యూనిట్లు సొంతం చేసుకోవచ్చు. మార్కెట్లు కొంతమేర కరెక్షన్‌కు గురైన ఈ సమయంలో సిప్‌ను ఆపకూడదు. దీనివల్ల తక్కువ ధరలకు ఎన్‌ఏవీలను కొనుగోలు చేసుకునే అవకాశం కోల్పోతారు. ముఖ్యంగా 12–18 నెలల క్రితం సిప్ ఆరంభించిన వారు కచ్చితంగా ఈ సమయంలో ఆపకుండా కొనసాగించాలని నిపుణులు సూచిస్తున్నారు. ఎందుకంటే ఏడాది, ఏడాదిన్నర క్రితం మార్కెట్ల వ్యాల్యూషన్లు గరిష్ట స్థాయిల్లో ఉన్నాయి. కనుక గరిష్ట ధరల్లో పెట్టుబడి పెట్టిన వారు, ఇప్పుడు తక్కువ ధరకే కొనే అవకాశాన్ని కోల్పోకూడదు.

లార్జ్‌క్యాప్‌నకు ప్రత్యామ్నాయాలు

చాలా వరకు ప్రధాన లార్జ్‌క్యాప్ ఫండ్స్ గతేడాది మెరుగైన పనితీరు చూపించలేకపోయాయి. ఈ ఏడాది కూడా వీటి పనితీరు అంత బాగుండకపోవచ్చనే అంచనా ఉంది. అధిక రాబడులు కోరుకునే వారు అధిక రిస్క్ తీసుకోవాల్సి ఉంటుందని మరిచిపోవద్దు. ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ బ్లూచిప్ ఫండ్, హెచ్‌డీఎఫ్‌సీ టాప్ 100, రిలయన్స్ లార్జ్‌క్యాప్, యూటీఐ మాస్టర్‌షేర్ పథకాలన్నీ గతేడాది ఒక శాతం నుంచి రెండున్నర శాతం నష్టాలను మిగిల్చాయి. ఇదే కాలంలో నిఫ్టీ– 50 సూచీ 3 శాతం రాబడులను ఇచ్చింది. కనుక లార్జ్‌క్యాప్ ఫండ్స్‌కు బదులు ఈ సమయంలో మల్టీక్యాప్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవడం మంచి నిర్ణయంగా విశ్లేషకులు పేర్కొంటున్నారు. మల్టీక్యాప్ ఫండ్స్ భిన్న మార్కెట్ విలువతో కూడిన స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేస్తాయని వారు సూచిస్తున్నారు. దీంతో అధిక రాబడులిచ్చేందుకు అవకాశాలు ఉంటాయి. అదే సమయంలో మిడ్ క్యాప్, స్మాల్‌క్యాప్ ఫండ్స్‌తో పోలిస్తే రిస్క్ కాస్త తక్కువగానే ఉంటుంది. ముఖ్యమైన విషయం ఏమిటంటే... మల్టీక్యాప్ ఫండ్స్ అయినప్పటికీ క్రమానుగత పెట్టుబడుల విధానం (సిప్) ద్వారా కనీసం ఐదేళ్లు ఆపైన ఇన్వెస్ట్ చేయడం ద్వారానే మెరుగైన రాబడులను సొంతం చేసుకునే అవకాశం ఉంటుందని గుర్తుంచుకోవాలి.

పన్ను భారం తగ్గించుకోవచ్చు

ఈక్విటీలు, ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌పై దీర్ఘకాలిక మూలధన లాభాల పన్నును కేంద్ర ప్రభుత్వం తిరిగి ప్రవేశపెట్టడం తెలిసిందే. ఈ నిర్ణయం తర్వాత కూడా ఈక్విటీల్లోకి, మ్యూచువల్ ఫండ్స్‌లోకి రిటైల్ ఇన్వెస్టర్ల పెట్టుబడులు ఆగలేదు. పైగా పెరుగుతూ వస్తున్నాయి. సిప్ ద్వారా 2018లో వచ్చిన పెట్టుబడుల్లో 20 శాతం వృద్ధి నెలకొంది. ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.లక్షకు మించి దీర్ఘకాల మూలధన లాభం పొందితే దానిపై 10 శాతం పన్ను చెల్లించాలి. అయితే, ఈక్విటీ ఫండ్స్‌లో వచ్చే లాభాల్లో ఇది స్వల్ప మొత్తమేనని ఇన్వెస్టర్లు అర్థం చేసుకున్నట్టున్నారు. నిజానికి 10 శాతం పన్ను రాబడులను పెద్దగా ప్రభావం చేసేది కాదని నిపుణుల అభిప్రాయం కూడా. నెలకు సిప్ ద్వారా రూ.5,000– 10,000 మొత్తం ఇన్వెస్ట్ చేసే వారిపై ఇప్పటికిప్పుడు ఈ పన్ను ప్రభావం కూడా ఏమీ ఉండదు. ఎందుకంటే ఈ స్వల్ప మొత్తంపై ఏడాదిలో వచ్చే లాభాలు పన్ను పడే స్థాయిలో ఉండవు. అదే రూ.30,000– 50,000 మధ్య ఇన్వెస్ట్ చేసే వారయితే వార్షికంగా 12 శాతం రాబడులు వచ్చాయనుకుంటే రెండేళ్ల తర్వాత మూలధన లాభాల పన్ను పరిధిలోకి వస్తారు. రెండేళ్లలో వారు పొందే లాభం రూ.లక్ష దాటుతుంది. ఆ మొత్తాన్ని ఒకే ఆర్థిక సంవత్సరంలో తీసుకుంటేనే పన్ను చెల్లించాల్సి వస్తుంది. అయితే, ఈ పన్ను కూడా చెల్లించకుండా మార్గం ఉంది. ఏడాది దాటాక ప్రతీ నెలా అంతే మొత్తాన్ని విత్‌డ్రా చేసుకుంటూ తిరిగి అదే ఫండ్ లేదా మరో ఫండ్ పథకంలో ఇన్వెస్ట్ చేసుకోవడం మంచి ఆలోచన అవుతుంది. దీంతో పన్ను వర్తించేంత లాభాలు రాక ముందే తిరిగి ఇన్వెస్ట్ చేయడం జరుగుతుంది. ఉదాహరణకు 2018 ఏప్రిల్ నెలలో ఓ ఫండ్‌లో ఎన్‌ఏవీ రూ.25 వద్ద రూ.25,000 ఇన్వెస్ట్ చేశారనుకోండి. 1,000 యూనిట్లు వచ్చి ఉంటాయి. 2019 ఏప్రిల్ నెలతో ఏడాది పూర్తవుతుంది. ఆ మరుసటి నెలలోనే వెయ్యి యూనిట్లను రెడీమ్ చేసుకుని తిరిగి ఇన్వెస్ట్ చేయాలి. ఇలా ప్రతీ సిప్‌కు ఏడాది పూర్తయిన వెంటనే తిరిగి ఇన్వెస్ట్ చేస్తుంటే సరి.

మల్టీ ఇయర్ హెల్త్ ప్లాన్

వైద్య బీమాకు ఏటా ప్రీమియం చెల్లించాలి. లేదంటే కవరేజీ ఆగిపోతుంది. దీనికి బదులు ఒకేసారి రెండేళ్లకు ప్లాన్ తీసుకుని ప్రీమియం చెల్లించడం వల్ల తగ్గింపుతోపాటు... ఏడాదికే ప్రీమియం చెల్లించాల్సిన ఇబ్బందీ తప్పుతుంది. న్యూఇండియా అష్యూరెన్స్ కంపెనీ 2017లో వృద్ధుల వైద్య బీమా ప్రీమియంను ఒకేసారి రెట్టింపునకు పైగా పెంచింది. కనుక ఒకేసారి ఎక్కువ సంవత్సరాలకు పాలసీ తీసుకోవడం వల్ల తగ్గింపు ఒక్కటే కాదు, ప్రీమియం పెరిగే భారం కూడా కొంత వరకు తప్పించుకున్నట్టు అవుతుంది.

ఎన్‌పీఎస్ కూడా చూడొచ్చు..



జాతీయ పెన్షన్ స్కీమ్ (ఎన్‌పీఎస్) విశ్రాంత జీవనం కోసం ప్రణాళికలు వేసుకునే వారికి అనువైన సాధనాల్లో ఒకటి. ఇందులో చార్జీలు ఇతర సాధనాలతో పోలిస్తే తక్కువ. ఈక్విటీ, డెట్‌లోనూ ఇన్వెస్ట్ చేసుకునే అవకాశం ఉంటుంది. 60 ఏళ్లు వచ్చాక ఉపసంహరించుకునే 60 శాతం మొత్తంలో 20 శాతంపై పన్ను ఉండేది. ఇది నచ్చక చాలా మంది దీనికి దూరంగా ఉండిపోయారు. అయితే, ఎన్‌పీఎస్ పథకం నుంచి రిటైర్మెంట్ వయసులో ఉపసంహరించుకునే 60 శాతం మొత్తంపైనా పన్నును తొలగిస్తూ కేంద్ర ప్రభుత్వం ఇటీవలే నిర్ణయం తీసుకుంది. మిగిలిన 40 శాతాన్ని యాన్యుటీ ప్లాన్‌లో ఇన్వెస్ట్ చేయాలని తెలిసిందే. ఇక ఈక్విటీల్లో యాక్టివ్ చాయిస్ కింద 75 శాతం వరకు ఇన్వెస్ట్ చేసుకునేందుకు అనుమతిస్తూ ఎన్‌పీఎస్ నిర్వహణను చూసే పీఎఫ్ఆర్‌డీఏ గతేడాది అక్టోబర్‌లో మరో నిర్ణయం తీసుకుంది. 70 ఏళ్లు వచ్చే వరకూ కూడా ఇన్వెస్ట్ చేసుకునేందుకు అనుమతించింది. గత ఐదేళ్ల కాలంలో చూసుకుంటే వార్షికంగా రెండంకెల రాబడులు ఎన్‌పీఎస్‌లో ఉన్నాయి. ఈక్విటీలకు 50 శాతం వరకు కేటాయించుకునే వారికి 11.31 శాతం చొప్పున వార్షిక రాబడులు, పూర్తిగా డెట్‌కే పరిమితమైన వారికి వార్షికంగా 10.55 శాతం చొప్పున పెట్టుబడుల వృద్ధి ఉంది. ఇక పన్ను ప్రయోజనాలు అదనం. బేసిక్ వేతనంలో 10 శాతాన్ని సెక్షన్ 80సీసీడీ(2) కింద ఉద్యోగి తరఫున కంపెనీ ఎన్‌పీఎస్‌కు జమ చేస్తే పన్ను ఉండదు. అలాగే, సెక్షన్ 80సీసీడీ(1బీ) కింద ఎన్‌పీఎస్‌లో అదనంగా మరో రూ.50,000 పెట్టుబడిపైనా పన్ను ఉండదు. కనుక దీన్ని తప్పకుండా పరిశీలించాల్సిన పథకంగా ఫైనాన్షియల్ అడ్వైజర్ల సూచన.

షార్ట్‌టర్మ్ డెట్ ఫండ్స్

ప్రస్తుతం వడ్డీ రేట్ల పరంగా ఆటుపోట్లు ఉన్న పరిస్థితి కనిపిస్తోంది. కనుక ఈ సమయంలో దీర్ఘకాల డెట్ ఫండ్స్ కంటే షార్ట్ టర్మ్ డెట్ ఫండ్స్ అనుకూలమని నిపుణులు పేర్కొంటున్నారు. దీర్ఘకాల ఫండ్స్, దీర్ఘకాలంలో గడువు తీరే బాండ్లలో ఇన్వెస్ట్ చేస్తాయి. ఇంక్రిమెంటల్ రిస్క్ తీసుకున్నా గానీ దీర్ఘకాల డెట్ ఫండ్స్ తగినంత రాబడులను ఆఫర్ చేయడం లేదని, వీటికి బదులు మూడేళ్ల లోపు గడువు తీరే షార్ట్ టర్మ్ డెట్ ఫండ్స్‌ను ఎంచుకోవచ్చని ఎడెల్వీజ్ మ్యూచువల్ ఫండ్ సీఐవో ధావల్ దలాల్ సూచించారు. బలమైన క్రెడిట్ ప్రొఫైల్ (రుణ చరిత్ర) ఉన్న కార్పొరేట్ బాండ్ ఫండ్స్‌ను కూడా పరిశీలించొచ్చని కెనరా రొబెకో మ్యూచువల్ ఫండ్ ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ విభాగం హెడ్ అవనీష్ జెయిన్ సూచన. 2–5 ఏళ్ల కాలానికి ఇవి మంచి రాబడులను ఆఫర్ చేస్తున్నట్టు తెలిపారు.

ఫిక్స్‌డ్ మెచ్యూరిటీ ప్లాన్లు

డెట్ ఫండ్స్‌లో వడ్డీ రేట్ల రిస్క్ ఉంటుంది. వడ్డీ రేట్లు పెరిగితే డెట్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేసిన వారు ఆ ప్రయోజనం నష్టపోతారు. ఈ రకమైన రిస్క్ వద్దనుకునేవారు ఎఫ్ఎంపీలను పరిశీలించొచ్చు. ఇవి డెట్ సెక్యూరిటీల్లో ఇన్వెస్ట్ చేసి గడువు తీరే వరకు కొనసాగుతాయి. దాంతో బాండ్ ఈల్డ్స్‌కు అనుగుణంగానే రాబడులు ఉంటాయి.

విదేశీ ఫండ్స్‌లో కూడా...



అమెరికా స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేసే ఫండ్స్ ఎన్‌ఏవీల ధరలు కొంత కాలం క్రితం వరకూ బాగా పెరిగాయి. తాజాగా అమెరికా మార్కెట్ల పతనం నేపథ్యంలో వాటి ఎన్‌ఏవీలు తగ్గుముఖం పట్టాయి. అంతమాత్రాన అమెరికా ఫండ్స్‌లో పెట్టుబడులు ఆపేయాల్సిన అవసరం లేదన్నది నిపుణుల విశ్లేషణ. అమెరికన్ స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేసే ఫండ్స్ ఎన్నో అంశాలను అధ్యయనం చేశాకే పెట్టుబడి నిర్ణయాలు తీసుకుంటుంటాయి. బలమైన బ్రాండ్, మార్కెట్ వ్యాల్యూ, బలమైన నగదు ప్రవాహాలు వంటి అంశాలను చూస్తాయి. పైగా డాలర్‌తో రూపాయి మారకం విలువ క్షీణత కూడా పెట్టుబడుల విలువ పెరిగేందుకు దోహదపడుతుంది. కనుక తమ పిల్లలను విదేశీ విద్యకు పంపించాలనుకునే వారు ఈ తరహా ఫండ్స్‌లో ముందునుంచే ఇన్వెస్ట్ చేసుకోవచ్చు.

రుణాన్ని బదలాయించుకుంటే...?



రుణాలపై వడ్డీ రేట్లను నిర్ణయించే విషయంలో బ్యాంకులు వాటి అంతర్గత బెంచ్ మార్క్ రేటుకు అనుగుణంగా వ్యవహరిస్తున్నాయి. దీంతో పారదర్శకత తక్కువగా ఉంటోంది. దీనికి బదులు రెపో రేటు, 91, 182 రోజుల ట్రెజరీ బిల్లు ఈల్డ్ రేటు లేదా ఏదైనా ఇతర బెంచ్ మార్క్ మార్కెట్ రేటుకు అనుగుణంగా వడ్డీ రేట్లను అనుసరించాలని ఆర్‌బీఐ ఇటీవలే ఆదేశించింది. గృహ, ఆటోమొబైల్, వ్యక్తిగత రుణాలకూ ఇది అమలుకానుంది. బ్యాంకుల మధ్య పోటీ పెరిగి కస్టమర్లకు తక్కువ రేట్లకే రుణం లభించే పరిస్థితులకు ఇది దారితీస్తుంది. కనుక అధిక వడ్డీ రేటుకు రుణం తీసుకున్న వారు దాన్ని తక్కువ వడ్డీ రేటును ఆఫర్ చేసే బ్యాంకు లేదా ఆర్థిక సంస్థకు బదలాయించుకోవడం మంచి ఆలోచన అవుతుంది. రుణం తొలి నాళ్లలో ఈఎంఐలో ఎక్కువ మొత్తం వడ్డీకే వెళుతుంది. కనుక మొదట్లోనే రుణాన్ని బదలాయించుకోవడం వల్ల ప్రయోజనం ఎక్కువ.

పెద్దల పేరు మీద పెట్టుబడి



60 ఏళ్లు దాటిన వారు వార్షికంగా పొందే రూ.50వేల వడ్డీ ఆదాయానికి పన్నును మినహాయిస్తూ కేంద్రం గతేడాది నిర్ణయం తీసుకున్న విషయం గుర్తుండే ఉంటుంది. 60 ఏళ్ల లోపు వయసులో ఉన్న వారు ఏటా వడ్డీ ఆదాయం రూ.10,000 దాటితే పన్ను చెల్లించాల్సి ఉంటుంది. కనుక తమ తల్లిదండ్రులకు పన్ను వర్తించేంత ఆదాయం లేకపోతే, వారికి గిఫ్ట్‌గా ఇచ్చి, వారి పేరిట డిపాజిట్ చేయడం మంచి ఆలోచన. ఇది చట్టబద్ధం కూడా. పైగా బ్యాంకులు సీనియర్ సిటిజన్లకు అర శాతం వరకు అధిక వడ్డీ రేటును ఆఫర్ చేస్తున్న విషయం తెలిసిందే. భార్యా, పిల్లలకు గిఫ్ట్ ఇచ్చి వారి పేరిట ఇన్వెస్ట్ చేసినా, అది గిఫ్ట్ ఇచ్చిన వ్యక్తి ఆదాయం కిందే చట్టం పరిగణిస్తుంది. తల్లిదండ్రులకు గిఫ్ట్ ఇస్తే మోసపూరిత లావాదేవీగా చట్టం పరిగణించదని ట్యాక్స్‌స్పానర్ సంస్థ సహ వ్యవస్థాపకుడు సుధీర్‌కౌశిక్ తెలిపారు.

ఫండ్స్ ఆస్తుల వృద్ధి రూ.1.24 లక్షల కోట్లు

2018 గణాంకాలు... సిప్ పెట్టుబడుల్లో స్థిరమైన పెరుగుదల

మ్యూచువల్ ఫండ్స్ ఆస్తుల విలువ 2019లో నికరంగా రూ.1.24 లక్షల కోట్ల మేర పెరిగింది. ఇది 5.54 శాతం వృద్ధి. దీంతో అన్ని ఏఎంసీల నిర్వహణలోని ఆస్తుల విలువ 2018 డిసెంబర్ నాటికి రూ.23.61 లక్షల కోట్లుగా ఉంది. రిటైల్ ఇన్వెస్టర్ల ప్రాతినిధ్యం మంచిగా ఉండడం, సిప్ ద్వారా వచ్చే పెట్టుబడులు స్థిరంగా పెరుగుతూ వస్తుండడం ఏఎంసీల నిర్వహణలోని ఆస్తుల వృద్ధికి దోహదపడింది. 2017 డిసెంబర్ నాటికి ఏఎంసీల ఆస్తుల విలువ రూ.22.37 లక్షల కోట్లుగా ఉందని యాంఫి వెల్లడించింది. ఫండ్స్ ఆస్తుల విలువ వృద్ధి చెందడం వరుసగా ఆరో ఏడాది. అయితే, అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో ఉన్న వృద్ధి వేగంతో పోల్చుకుంటే తగ్గింది. ఐఎల్ఎఫ్ఎస్ సంక్షోభం తర్వాత డెట్‌ఫండ్స్‌పై ఒత్తిడి నెలకొనడం, ఈక్విటీ మార్కెట్లలో అస్థిరతలు ఇందుకు కారణాలు. రిటైల్ ఇన్వెస్టర్ల బలమైన ప్రాతినిధ్యంతోపాటు, సిప్ పెట్టుబడుల్లో నిలకడైన వృద్ధి, ఫండ్స్ ఆస్తులు పెరగడానికి కారణమని క్వాంటమ్ మ్యూచువల్ ఫండ్ ఎండీ, సీఈవో జిమ్మీ పటేల్ పేర్కొన్నారు.



1,300 డాలర్ల వద్ద తీవ్ర నిరోధం!

అంతర్జాతీయ ఫ్యూచర్స్ మార్కెట్– నైమెక్స్‌లో పసిడి ఔన్స్ (31.1గ్రా) ధర 4వ తేదీ శుక్రవారంతో ముగిసిన వారంలో కీలక నిరోధ స్థాయి 1,300 డాలర్లను తాకింది. ఆర్థిక అనిశ్చితి వార్తల నేపథ్యంలో వారం మొత్తంలో నైమెక్స్‌లో పెరుగుతూ వచ్చిన పసిడి, ఆఖరిరోజు శుక్రవారం ట్రేడింగ్ ప్రారంభంలో ఆరు నెలల గరిష్టస్థాయి 1,300.35 డాలర్లను తాకింది. అయితే అటు తర్వాత ఇంట్రాడే ట్రేడింగ్‌లో దాదాపు 21 డాలర్లు పతనమై, చివరకు కొంత కోలుకుని 1,286 డాలర్ల వద్ద ముగిసింది. దీనితో మొత్తంగా వారంలో పసిడి దాదాపు ఆరు డాలర్లు పెరిగినట్లయ్యింది. 1,300 డాలర్ల స్థాయిని తాకిన తర్వాత వెలువడిన అమెరికా డిసెంబర్ ఉపాధి అవకాశాల గణాంకాలు సానుకూలంగా ఉండడం, ఆర్థిక వ్యవస్థపై చిగురించిన ఆశలు పసిడి ఆరు నెలల

ఆ స్థాయిని తాకి 14 డాలర్ల పతనం

గరిష్ట స్థాయి నుంచి కిందకు జారడానికి కారణమని నిపుణుల విశ్లేషణ. ఇక టెక్నికల్‌గా చూస్తే, 1,300 కీలక నిరోధ స్థాయి కావడాన్నీ పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందన్న వాదనలూ వినిపిస్తున్నాయి.

ఈ వారం కీలక పరిణామాలు...

అమెరికా ఫెడ్ ఫండ్ రేటు పెంపు (ప్రస్తుతం 2.25–2.5 శాతం శ్రేణి) తుది దశకు చేరుకుందనీ, రేటు పెంపు స్పీడ్ ఇకపై ఉండబోదని వాదనలు వినిపిస్తున్న సంగతి తెలిసిందే. డాలర్ ఇండెక్స్ బలహీనతకూ దారితీస్తోంది. ఆయా అంశాల నేపథ్యంలో బుధవారం ఫెడ్ మినిట్స్ (డిసెంబర్‌లో జరిగిన ద్రవ్య పరపతి విధాన సమావేశాల వివరాలు) వెల్లడికానున్నాయి. ఆమరుసటి రోజు ఫెడ్ చైర్మన్ పావెల్ కీలక ప్రకటన వెలువడనుంది. శుక్రవారం అమెరికా ద్రవ్యోల్బణం గణాంకాలు వెల్లడవుతాయి. ఆర్థిక వ్యవస్థ పురోగతికి సంబంధించి ఈ సందర్భంగా వెల్లడికానున్న అంశాల ఆధారంగా పసిడి ధర తదుపరి కదలికలు ఉంటాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు.



దేశీయంగా రూపాయి కదలికలు ఆధారం...

ఇక దేశీయంగా పసిడి కదలికలు డాలర్ మారకంలో రూపాయి విలువ మార్పులకు అనుగుణంగా ఉంటుందని విశ్లేషణ. అక్టోబర్ 9వ తేదీన డాలర్ మారకంలో చరిత్రాత్మక కనిష్ట స్థాయి 74.39 వద్ద ముగిసిన రూపాయి ప్రస్తుతం 69పైకి (శుక్రవారం 69.72) కోలుకుంది. ఈ పరిణామం అంతర్జాతీయంగా పసిడి ధరలు భారీగా పెరిగినా దేశీయంగా ఈ మెటల్ ధరల కట్టడికి దోహదపడింది. ముంబై మార్కెట్‌లో శుక్రవారం 24, 22 క్యారెట్లు 10 గ్రాముల పసిడి ధరలు వరుసగా రూ.32,840, రూ.31,280 వద్ద ముగిశాయి. వెండి కేజీ ధర రూ. 42,600గా ఉంది. ఇక దేశీయ ఫ్యూచర్స్ మార్కెట్–ఎంసీఎక్స్‌లో పసిడి ధర శుక్రవారం 31,456 వద్ద ముగిసింది.

ఏ బ్యాంకులో ఎంత వడ్డీ?

రూ. కోటి వరకు డిపాజిట్లు, (జనవరి-4- 2019 అంకెలు శాతాల్లో)

బ్యాంకులు	6 నెలలు- ఏడాది	1–2 ఏళ్లు	3–5 ఏళ్లు
ఆంధ్రా బ్యాంక్	6.6	6.8	6.75
యాక్సిస్ బ్యాంక్	7.1	7.6	7.25
బ్యాంక్ ఆఫ్ బరోడా	6.5	6.85	6.7
బ్యాంక్ ఆఫ్ ఇండియా	6.25	6.7	6.5
కెనరా బ్యాంక్	6.4	7.1	6.2
సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	6.5	6.6	6.5
కార్పొరేషన్ బ్యాంక్	6.35	6.8	6.5
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	7.1	7.3	7.25
ఐసీఐసీఐ బ్యాంక్	6.75	7.1	7.5
ఐడీబీఐ బ్యాంక్	6.5	7.05	7.2
ఇండస్‌ఇండ్ బ్యాంక్	7.5	8	7.5
కోటక్ మహీంద్రా బ్యాంక్	6.5	7.5	7
ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్	6.5	6.75	6.75
ఎస్‌బీఐ	6.4	6.8	6.85
సిండికేట్ బ్యాంక్	6.35	6.8	6.6
పీఎన్‌బీ	6.35	6.85	6.25
యస్ బ్యాంక్	7	7.85	7.5

బ్యాంక్ బజార్.కామ్ అందించిన వివరాల ఆధారంగా...

పన్ను ఆదాతో అధిక రాబడులు

ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లాంగ్‌టర్మ్ ఈక్విటీ ఫండ్



పన్ను ఆదా కోసం ఎన్నో పెట్టుబడి సాధనాలు అందుబాటులో ఉన్నాయి. పీపీఎఫ్, ఎన్ఎస్‌సీ, ఎఫ్‌డీలు, ఈఎల్ఎస్ఎస్ తదితర పథకాలు ఇందుకు ఉపయోగపడతాయి. వీటిల్లో ఈక్విటీల్లో పెట్టుబడులకు అవకాశం కల్పించేవి ఈఎల్ఎస్ఎస్ మ్యూచువల్ ఫండ్స్ పథకాలు. సెక్షన్ 80సీ కింద వార్షికంగా రూ.1.5 లక్షల ఆదాయపన్ను మినహాయింపు అవకాశాన్ని ఈఎల్ఎస్ఎస్‌లో పెట్టుబడుల ద్వారా సొంతం చేసుకోవచ్చు. ఒకవైపు పన్ను ఆదా, మరోవైపు ఈక్విటీల్లో దీర్ఘకాలంలో అధిక రాబడులు... రెండు రకాల ప్రయోజనాలు ఈఎల్ఎస్ఎస్‌లో లభిస్తాయి. ఈఎల్ఎస్ఎస్ పథకాల్లో పనితీరు పరంగా మెరుగ్గా ఉన్న వాటిల్లో ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లాంగ్‌టర్మ్ ఈక్విటీ ఫండ్ కూడా ఒకటి.

పనితీరు

పన్ను ఆదాకు ఉపకరించే ఈఎల్ఎస్ఎస్ విభాగంలో ఎన్నో పథకాలు ఉన్నాయి. కానీ, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లాంగ్‌టర్మ్ ఈక్విటీ ఫండ్ పథకం పనితీరును గమనిస్తే... పదేళ్ల కాలంలో అత్యుత్తమ రాబడులతో ఈ విభాగంలో టాప్‌లో నిలిచింది. వార్షికంగా 19.53 శాతం చొప్పున లాభాలను పంచింది. ఈ పథకం ప్రారంభమైన దగ్గర్నుంచి చూస్తే వార్షికంగా రాబడులు 20.36 శాతంగా ఉన్నాయి. ప్రతీ నెలా రూ.10,000ను సిప్ రూపంలో ఇన్వెస్ట్ చేసి ఉంటే మూడేళ్లలో రూ.4.7 లక్షలు, ఏడేళ్లలో అయితే రూ.14.3 లక్షలు, పదేళ్లలో రూ.27.3 లక్షలు, 15 ఏళ్లలో రూ.67.3 లక్షలు సమకూరేవి. గత ఏడాది కాలంలో మార్కెట్లలో తీవ్ర అస్థిరతల నేపథ్యంలో రాబడులు ఫ్లాట్‌గా ఉన్నాయి. అంటే నష్ట, లాభాలేమీ లేవు. కానీ, ఈ పథకం పనితీరుకు ప్రామాణిక సూచీ అయిన నిఫ్టీ500 మాత్రం గత ఏడాది కాలంలో 3.52 శాతం నష్టాలను మిగిల్చింది.



ఇలా చూస్తే ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లాంగ్‌టర్మ్ ఈక్విటీ ఫండ్ నష్టాలను కట్టడి చేసినట్టు తెలుస్తోంది. మూడేళ్ల కాలంలో ఈ పథకం రాబడులు వార్షికంగా 10 శాతంగా ఉన్నాయి. ఐదేళ్లలో అయితే వార్షికంగా 15.71 శాతం రాబడులు ఇచ్చింది.

పెట్టుబడుల విధానం

ఈ పథకం డైవర్సిఫైడ్ పోర్ట్‌ఫోలియోను కలిగి ఉంది. పెట్టుబడులకు మల్టీక్యాప్ విధానాన్ని అనుసరిస్తుంది. ప్రస్తుతానికి 47 స్టాక్స్‌ను పోర్ట్‌ఫోలియోలో కలిగి ఉంది. 10 స్టాక్స్‌లోనే 44 శాతానికి పైగా ఇన్వెస్ట్ చేసి ఉంది. ఫార్మా, ఇంధనం, ఆటో, బ్యాంకింగ్, ఫైనాన్షియల్, ఎఫ్ఎంసీజీ, టెక్నాలజీ రంగాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చింది. మార్కెట్ విలువలో అగ్ర స్థాయిలో ఉండే కంపెనీల్లోనే 66 శాతానికి పైగా పెట్టుబడులు పెట్టింది. మిడ్‌క్యాప్‌కు 27 శాతం, స్మాల్‌క్యాప్‌నకు 6 శాతానికి పైగా కేటాయించింది. దీర్ఘకాలంలో మంచి వృద్ధికి అవకాశం ఉండే రంగాల్లో సరైన ధరల కంటే తక్కువకు లభించే వాటిని గుర్తించి ఇన్వెస్ట్ చేయడమనే విధానాన్ని అనుసరిస్తుంది.

టాప్ హోల్డింగ్స్

కంపెనీ	పెట్టుబడుల శాతం
ఐటీసీ	6.61
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు	5.67
ఎన్‌టీపీసీ	5.24
హెచ్‌డీఎఫ్‌సీ	4.41
ఎస్‌బీఐ	4.06
ఓఎన్‌జీసీ	3.79
హీరో మోటోకార్ప్	3.76
భారతీ ఎయిర్‌టెల్	3.71
ఇన్ఫోసిస్	3.65
ఇప్కా ల్యాబ్	3.26



“ఉత్పత్తిలో ప్రత్యేకత... వినియోగదారుపై అవగాహన... విజయానికి తపన!
ఒక వ్యాపారం ప్రారంభానికి నీకు కావాల్సినవి ఈ మూడే!
- డేవ్ థామస్, వెండీస్ వ్యవస్థాపకులు”

బొమ్మ-బొరుసు



ఎన్నికలతో గ్రామీణ ఆర్థికానికి ఊతం: కేకి మిస్త్రీ



న్యూఢిల్లీ: రానున్న సాధారణ ఎన్నికలు గ్రామీణ ఆర్థిక రంగానికి మంచి ఊతం ఇస్తాయని ప్రముఖ పారిశ్రామికవేత్త, హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్ వైస్ చైర్మన్, ఎండీ కేకి మిస్త్రీ అభిప్రాయపడ్డారు. గడిచిన దశాబ్దకాలంలో దేశంలో చేపట్టిన సంస్కరణలతో రానున్న సంవత్సరాల్లో సానుకూల ఫలితాలు కనిపించనున్నాయని పేర్కొన్నారు. ''చారిత్రకంగా చూస్తే... సార్వత్రిక ఎన్నికలు గ్రామీణ ఆర్థిక రంగానికి ఉత్తేజాన్ని ఇస్తాయని, స్థానిక వ్యాపారులకు మేలు చేస్తాయని తెలుస్తోంది. రానున్న ఎన్నికలు కూడా గ్రామీణ ప్రాంతాల్లో డిమాండ్‌ను పెంచుతాయని అంచనా'' అని కేకి మిస్త్రీ తెలిపారు. ఇళ్ల విషయంలో ప్రభుత్వ ప్రోత్సాహం, ఇంటి రుణాలకు డిమాండ్, సంస్కరణల ప్రయోజనాలు... రెరా వంటివి రియల్ ఎస్టేట్ రంగానికి మంచిదన్నారు.

చమురు ధరల పెరుగుదల మనకు షాకే: ఆర్‌బీఐ

ప్రతీ 10 డాలర్ల పెరుగుదలతో 0.43 శాతం ప్రభావం



ముంబై: ముడిచమురు ధరల్లో ఆకస్మిక పెరుగుదల దేశ స్థూల ఆర్థిక అంశాలను దెబ్బ తీస్తుందని ఆర్‌బీఐ అధ్యయన నివేదిక హెచ్చరించింది. కరెంటు ఖాతా లోటు, ద్రవ్యలోటు, ద్రవ్యోల్బణాన్ని గణనీయంగా పెంచడంతో పాటు, అధిక వృద్ధి తాలూకూ ప్రయోజనాలను తగ్గిస్తుందని పేర్కొంది. మన దేశ చమురు అవసరాల్లో 80 శాతాన్ని దిగుమతి చేసుకుంటున్న విషయం తెలిసిందే. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ మధ్య చమురు ధరలు అంతర్జాతీయ మార్కెట్లో 12 శాతం పెరిగిన విషయం తెలిసిందే. ఆ తర్వాతి పరిణామాలతో ధరలు తగ్గడం మొదలైంది. అయినప్పటికీ ధరల విషయంలో అస్థిరతే నెలకొంది. చమురు ధరలు బ్యారెల్‌కు 85 డాలర్లను చేరితే... దిగుమతుల రూపంలో లోటు 106.4 బిలియన్ డాలర్లుగా ఉంటుందని, ఇది జీడీపీలో 3.61 శాతానికి సమానమని ఆర్‌బీఐ నివేదిక పేర్కొంది. ''ప్రతి రోజూ బ్యారెల్ ధర 10 డాలర్లు పెరిగితే అది అదనంగా 12.5 బిలియన్ డాలర్ల లోటునకు దారితీస్తుంది. ఇది దేశ జీడీపీలో 43 బేసిస్ పాయింట్లకు సమానం. కనుక ముడిచమురు బ్యారెల్‌కు ప్రతీ 10 డాలర్లు పెరగడం వల్ల కరెంటు ఖాతా లోటు, జీడీపీ రేషియో 43 బేసిస్ పాయింట్లు (0.43శాతం) మేర పెరుగుతుంది'' అని ఆర్‌బీఐ నివేదిక తెలియజేసింది.

ఫలితాలు, గణాంకాలు కీలకం!

- గురువారం టీసీఎస్, శుక్రవారం ఇన్ఫోసిస్ క్యూ3 ఫలితాలు
- ఈవారంలోనే పారిశ్రామిక ఉత్పత్తి డేటా వెల్లడి
- జీఎస్‌టీ కౌన్సిల్ సమావేశంపైనా దృష్టి...



ముంబై: ఐటీ కంపెనీల బోణీతో ఈ ఏడాది క్యూ3(అక్టోబర్–డిసెంబర్) ఫలితాల సీజన్ ప్రారంభంకానుంది. టీసీఎల్, ఇన్ఫోసిస్, ఇండస్ ఇండ్ బ్యాంక్, బజాజ్ కార్పొరేషన్ వంటి ప్రధాన సంస్థల ఫలితాలకు తోడు.. పలు జాతీయ, అంతర్జాతీయ స్థూల ఆర్థిక అంశాలు ఈవారంలో దేశీ మార్కెట్‌కు దిశా నిర్దేశం చేయనున్నాయని దలాల్ స్ట్రీట్ వర్గాలు భావిస్తున్నాయి. ఈ గురువారం కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ అధ్యక్షతన జీఎస్టీ కౌన్సిల్ సమావేశం జరగనుండగా.. ఎస్‌ఎంఈలకు ప్రయోజనం చేకూర్చే విధంగా నిర్ణయాలు వెలువడే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. తాజాగా జరిగిన 31వ సమావేశంలో పలు వస్తు, సేవలపై జీఎస్‌టీ రేటును కౌన్సిల్ తగ్గించిన నేపథ్యంలో ఈసారి సమావేశంపై మార్కెట్ వర్గాలు దృష్టిసారించాయి. ఇక శుక్రవారం వెలువడే పారిశ్రామికోత్పత్తి, రిటైల్ ద్రవ్యోల్బణం గణాంకాలపై కూడా ఇన్వెస్టర్లు కన్నేసివుంచారు. వీటితో పాటు ముడిచమురు, రూపాయి కదలికలు మార్కెట్ ట్రెండ్‌ను ప్రభావితం చేయనున్నాయని భావిస్తున్నారు.

ఒడిదుడుకులకు అవకాశం..

'కార్పొరేట్ ఫలితాల అంశం కారణంగా మార్కెట్‌లో ఒడిదుడుకులు కొనసాగేందుకు అవకాశం ఉంది. సోమ, మంగళవారాల్లో పార్లమెంట్ శీతాకాల సమావేశాలు జరగనుండగా.. ఇక్కడ నుంచి అందే సంకేతాలు, క్రూడ్ ధరల కదలికలు, రూపాయి మార్కెట్ దిశను నిర్దేశించనున్నాయి.' అని ఎస్‌ఎమ్‌సీ ఇన్వెస్ట్‌మెంట్స్ అండ్ అడ్వైజర్స్ చైర్మన్ డీ కే అగర్వాల్ అన్నారు. 'ప్రీమియం వాల్యుయేషన్, దేశీయ ఆర్థిక వ్యవస్థలో మందగమనం.. పట్టణ, గ్రామీణ మార్కెట్లలో కొనసాగుతున్న ద్రవ్య లభ్యత కారణంగా వచ్చే త్రైమాసికాల్లో కంపెనీల ఆదాయంలో వృద్ధి నెమ్మదించే అవకాశం ఉంది. ఇక సాధారణ ఎన్నికలు సమీపిస్తున్నాయి. ఈ అంశాలను బేరీజు వేసుకుని చూస్తే ఇంకొంతకాలం మార్కెట్‌లో ఒడిదుడుకులు కొనసాగుతాయని అంచనావేస్తున్నాం.' అని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ పరిశోధనా విభాగం చీఫ్ వినోద్ నాయర్ విశ్లేషించారు. ఎపిక్ రీసెర్చ్ సీఈవో ముస్తఫా నదీమ్ సైతం ఒడిదుడుకులు కొనసాగేందుకే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. పారిశ్రామిక ఉత్పత్తి (ఐఐపీ) సమాచారం అనంతరం ఇందుకు ఆస్కారం అధికంగా ఉండగా.. ఈ డేటా వెల్లడి తరువాత మార్కెట్‌కు ఒక దిశా నిర్దేశం కానుందన్నారు. దేశీ ఆర్థిక అంశాల్లో ఐఐపీ ఈవారంలో కీలకంగా ఉందని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ విశ్లేషకులు వీ కే శర్మ అన్నారు.

అమెరికా–చైనాల చర్చ..

ఈనెల 7–8 తేదీల్లో ఇరు దేశాల ప్రతినిధులు బీజింగ్‌లో సమావేశంకానున్నారు. గతేడాదిలో చైనా ఉత్పత్తులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పన్నులు పెంచడం వల్ల ఆర్థిక వ్యవస్థలో వాణిజ్య యుద్ధం మొదలుకాగా, ఆ తరువాత ఇరు దేశాలు రాజీ ధోరణి ప్రదర్శించినప్పటికీ.. ఏ క్షణంలో ఎటువంటి వార్తలు వెలువడుతాయో అనే ఆందోళన మార్కెట్ వర్గాల్లో కొనసాగుతోంది. ఈ నేపథ్యంలోనే యూఎస్–చైనా ప్రతినిధుల చర్చ అంశం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇక ఈవారంలో మార్కెట్‌ను ప్రభావితం చేయదగిన అంతర్జాతీయ అంశాల్లో.. డిసెంబర్ అమెరికా పేరోల్ రిపోర్ట్, ఆ దేశం ద్రవ్యోల్బణం, తయారీయేతర పీఎంఐ డేటాలు ఉన్నాయి.

ఎఫ్‌పీఐల అమ్మకాలు రూ.83,000 కోట్లు

గతేడాదిలో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐ) దేశీ మార్కెట్ నుంచి రూ.83,000 కోట్లు ఉపసంహరించుకున్నారు. రూ.33,553 కోట్లను ఈక్విటీ మార్కెట్ నుంచి.. రూ.49,593 కోట్లను డెట్ మార్కెట్ నుంచి వెనక్కు తీసుకున్నట్లు డిపాజిటరీ డేటా ద్వారా వెల్లడయింది. వడ్డీ రేట్ల పెంపు, క్రూడ్ ధరల పెరుగుదల, రూపాయి పతనంతో 2018లో ఈస్థాయి పెట్టుబడుల ఉపసంహరణ జరిగిందని ఫండ్స్‌ఇండియా డాట్ కామ్ మ్యూచువల్ ఫండ్ రీసెర్చ్ హెడ్ విద్యా బాల అన్నారు.

మరోసారి ప్రభుత్వరంగ బ్యాంకు ఉద్యోగుల సమ్మె



న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఉద్యోగుల వ్యతిరేక విధానాలకు నిరసనగా పది కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపునకు మద్దతుగా... ప్రభుత్వ రంగ బ్యాంకుల ఉద్యోగులు మరోసారి సమ్మెకు దిగనున్నారు. ఈ నెల 8, 9 తేదీల్లో సమ్మె నిర్వహిస్తున్నట్టు ఆల్ ఇండియా బ్యాంకు ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏఐబీఈఏ), బ్యాంకు ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఈ మేరకు ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్‌కు తెలిపాయి. ఈ వివరాలను ఐడీబీఐ బ్యాంకు బీఎస్‌ఈకి తెలియజేసింది. సమ్మె జరిగితే బ్యాంకు కార్యకలాపాలకు అవరోధం ఏర్పడుతుందని అలహాబాద్ బ్యాంకు ప్రకటించింది. అయితే కార్యకలాపాలు సజావుగా జరిగేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపింది. బీవోబీ కూడా ఇదే విధమైన సమాచారం ఇచ్చింది. ప్రైవేటు రంగ కరూర్ వైశ్యా బ్యాంకు సైతం ఉద్యోగుల సమ్మె కారణంగా తమ కార్యకలాపాలకు విఘాతం కలగొచ్చని పేర్కొంది. బ్యాంకు ఉద్యోగులు గత నెల రోజుల వ్యవధిలో రెండు సార్లు సమ్మె చేపట్టారు.

తెలుగు రాష్ట్రాల్లో 1,600 మంది బిజినెస్ కరస్పాండెంట్లు

ఆంధ్రా బ్యాంకు ప్రణాళిక



న్యూఢిల్లీ: అందరికీ ఆర్థిక సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు ఉద్దేశించిన ప్రాజెక్టులో భాగంగా ప్రభుత్వ రంగ ఆంధ్రా బ్యాంకు.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో కొత్తగా 1,600 మంది బిజినెస్ కరస్పాండెంట్స్ (బీసీ)ను నియమించుకోనుంది. బ్యాంక్ ఖాతాలు తెరవడం, ఇంటి వద్దకే బ్యాంకింగ్, ఏటీఎంల ఏర్పాటు, మొండిబాకీల రికవరీ మొదలైన వాటికి వీరి సేవలను వినియోగించుకోనుంది. 2019 జనవరి 31 నాటికల్లా బీసీల నియామకాలు జరిపే ప్రక్రియ పర్యవేక్షణ కోసం కార్పొరేట్ బిజినెస్ కరస్పాండెంట్స్ (సీబీసీ) నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తూ ఆంధ్రా బ్యాంక్ రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ (ఆర్‌ఎఫ్‌పీ) ప్రచురించింది. దీని ప్రకారం 2019 మార్చి ఆఖరు నాటికి ఆంధ్రప్రదేశ్‌లో 922 మంది, తెలంగాణలో 695 మంది బీసీలను నియమించుకోనుంది. బ్యాంకులకు అనుసంధానమైన స్వయం సహాయక బృందాలు (ఎస్‌హెచ్‌జీ) మొదలైన వాటికి బీసీ ఏజెంట్లుగా నియామకంలో ప్రాధాన్యం ఉంటుందని బ్యాంకు వివరించింది.

బ్యాంకు ఆమోదించిన.. రిటైర్డ్ బ్యాంక్ ఉద్యోగులు, రిటైర్డ్ ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, కిరాణా షాప్ ఓనర్లు, ప్రజా పంపిణీ వ్యవస్థలో పని చేస్తున్న డీలర్లు, రిటైర్డ్ ప్రభుత్వోద్యోగులు, ఎక్స్ సర్వీస్‌మెన్ మొదలైన వారు కూడా దీనికి అర్హులు. ప్రస్తుతం సీబీసీ విధానంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశాతో పాటు మహారాష్ట్ర, తమిళనాడు, ఛత్తీస్‌గఢ్, బిహార్ రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాల్లో ఆంధ్రా బ్యాంకు సుమారు 2,200 మంది బిజినెస్ కరస్పాండెంట్స్‌ను నియమించుకుంది.

ఆధార్‌తో రూ. 90వేల కోట్ల ఆదా..

- మిగులుతో మూడు భారీ పథకాలు అమలు చేయొచ్చు
- ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ వెల్లడి



న్యూఢిల్లీ: అర్హులైన లబ్ధిదారులకే ప్రభుత్వ పథకాల సబ్సిడీలను అందించేందుకు తోడ్పడుతున్న ఆధార్‌తో గణనీయంగా ఆదా అవుతోందని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ చెప్పారు. నకిలీ లబ్ధిదారులు, అనర్హులను ఏరివేయడం ద్వారా గతేడాది మార్చి ఆఖరు దాకా చూస్తే సుమారు రూ. 90,000 కోట్లు ఆదా అయినట్లు ఆయన వివరించారు. 'ఆధార్ ప్రయోజనాలు' అంశంపై సోషల్ నెట్‌వర్కింగ్ సైట్ ఫేస్‌బుక్‌లో చేసిన ఒక పోస్టులో ఈ విషయాలు పేర్కొన్నారు. ఆధార్ వినియోగం ద్వారా భారత్ ఏటా రూ. 77,000 కోట్లు ఆదా చేసుకోగలదంటూ ప్రపంచ బ్యాంకు ఒక నివేదికలో పేర్కొన్నట్లు ఆయన వివరించారు. 'ఆధార్‌తో ఆదా అయ్యే నిధులతో ఆయుష్మాన్ భారత్ స్థాయిలో మూడు పథకాలను అమలు చేయొచ్చు' అని జైట్లీ తెలిపారు. కుటుంబానికి ఏటా రూ. 5 లక్షల హెల్త్ ఇన్సూరెన్స్ కవరేజీనిచ్చే ఆయుష్మాన్ భారత్ – ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన కింద.. దాదాపు 10.74 కోట్ల పైగా పేద కుటుంబాలకు లబ్ధి చేకూర్చాలని కేంద్రం లక్ష్యంగా నిర్దేశించుకుంది. గతేడాది సెప్టెంబర్‌లో ప్రవేశపెట్టినప్పట్నుంచి ఇప్పటిదాకా 7 లక్షల మంది పేద పేషెంట్లు.. ఉచిత వైద్య చికిత్స పొందినట్లు జైట్లీ పేర్కొన్నారు.

122 కోట్ల ఆధార్ నంబర్ల జారీ..


2016లో ఆధార్ బిల్లును జారీ చేసినప్పట్నుంచీ 28 నెలల వ్యవధిలో 122 కోట్ల ఆధార్ నంబర్లను జారీ చేయడం జరిగిందని జైట్లీ తెలిపారు. 18 ఏళ్ల పైబడిన వయోజనుల్లో 99 శాతం మందికి ఆధార్ జారీ అయ్యిందని పేర్కొన్నారు. 'ఆధార్ ఆధారంగా ఇప్పటిదాకా లబ్ధిదారులకు బదలాయించిన సబ్సిడీల విలువ దాదాపు రూ. 1,69,868 కోట్ల మేర ఉంటుంది. మధ్యవర్తుల ప్రమేయం తగ్గిపోవడం వల్ల ప్రయోజనాలు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి చేరతాయి. ఇది భారత్‌లో మాత్రమే అమలవుతున్న ప్రత్యేక టెక్నాలజీ' అని వివరించారు.

బ్యాంక్ ఆఫ్ బరోడా | బ్రోకరేజ్ సంస్థ: మోతీలాల్ ఓస్వాల్ | కొనొచ్చు

సాక్షి సుఖో

ప్రస్తుత ధర: రూ.122 టార్గెట్ ధర: రూ.140

ఎందుకంటే..?: దేనా, విజయా బ్యాంక్‌లను బ్యాంక్ ఆఫ్ బరోడాలో విలీనం చేయడానికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ విలీనానికి సంబంధించి షేర్ల మార్పిడి నిష్పత్తి దేనా, విజయా బ్యాంక్‌ల కంటే బ్యాంక్ ఆఫ్ బరోడా వాటాదారులకే లాభదాయకంగా ఉంది. ప్రతి వెయ్యి విజయా బ్యాంక్ షేర్లకు 402 బ్యాంక్ ఆఫ్ బరోడా షేర్లు, ప్రతి వెయ్యి దేనా బ్యాంక్ షేర్లకు 110 బ్యాంక్ ఆఫ్ బరోడా షేర్లు లభిస్తాయి. ఈ విలీనం కారణంగా బ్యాంక్ ఆఫ్ బరోడా.. దేశంలోనే అతి పెద్ద మూడో బ్యాంక్‌గా అవతరిస్తుంది. మొత్తం దేశవ్యాప్త బ్యాంక్ రుణాల్లో 7 శాతం, డిపాజిట్లలో 7.4 శాతం బ్యాంక్ ఆఫ్ బరోడా వాటాయే ఉంటుంది. సమీప భవిష్యత్తులో విలీన సమస్యలున్నా, దీర్ఘకాలంలో ఈ విలీనం బీఓబీ మంచికే. బ్యాంక్ ఆఫ్ బరోడా పుస్తక విలువ 8 శాతం వృద్ధితో రూ.184కు పెరగనుంది. టైర్ వన్ మూలధనం 10.1 శాతానికి పెరుగుతుంది. ప్రభుత్వం నుంచి మరిన్ని మూలధన నిధులు వచ్చే అవకాశాలుండటంతో మూలధన సంబంధిత సమస్యలు ఈ బ్యాంక్‌కు ఉండవు. దాంతో విలీన సంబంధిత సమస్యలను (నెట్‌వర్క్, బ్రాంచ్‌ల పునర్వ్యవస్థీకరణ, వ్యాపారాల, ఉద్యోగుల సమన్వయం మొదలైనవి) ఈ బ్యాంక్ సులభంగా అధిగమించగలదు. బ్రాంచ్‌ల సంఖ్య 9,511కు పెరుగుతుంది. అత్యధిక సంఖ్యలో బ్యాంక్ శాఖలున్న రెండో అతి పెద్ద బ్యాంక్ ఇదే అవుతుంది. మార్జిన్లు అధికంగా ఉండే రిటైల్ రుణాలు 20 శాతం పెరుగుతాయి. ఇటీవలి క్వార్టర్ల పనితీరు ఈ బ్యాంక్ టర్న్ అరౌండ్‌ను సూచిస్తోంది. రుణాల రికవరీ ప్రయత్నాలు జోరుగా సాగుతున్నాయి. కేటాయింపులు మెరుగుపడుతున్నాయి. నిలకడగా వృద్ధిని సాధిస్తోంది.



కోల్ ఇండియా | బ్రోకరేజ్ సంస్థ: ఎడెల్‌వీజ్ ఫైనాన్షియల్స్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ.236 టార్గెట్ ధర: రూ.325

ఎందుకంటే...?: ప్రపంచంలోనే అతి పెద్ద బొగ్గు నిల్వల కంపెనీ ఇది. భారత బొగ్గు మార్కెట్లో 80 శాతం వాటాను ఈ కంపెనీయే నియంత్రిస్తోంది. అతి తక్కువ వ్యయంతో బొగ్గు ఉత్పత్తి చేస్తున్న ప్రపంచ కంపెనీల్లో ఇది కూడా ఒకటి. ఈ మహారత్న కంపెనీ... టర్నోవర్ పరంగా చూస్తే, భారత్‌లో ప్రభుత్వ రంగంలో అతిపెద్దది. దేశవ్యాప్తంగా 471 గనుల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. అంతర్జాతీయంగా విస్తరించడానికి ప్రయత్నాలు చేస్తోంది. కోల్ ఇండియా అతి పెద్ద అనుబంధ కంపెనీ సౌత్ ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ (ఎస్‌ఈసీఎల్) ఉత్పత్తి 13 శాతం తగ్గింది. దీంతో గత నెలలో కోల్ ఇండియా ఎగుమతులు 1 శాతం తగ్గాయి. వరుసగా రెండో నెలలోనూ నిల్వలు పెరిగాయి. అయితే నిర్వహణ సంబంధిత సమస్యలు తొలగిపోవడంతో ఎస్‌ఈసీఎల్‌లో ఉత్పత్తి పెరగగలదని భావిస్తున్నాం. దీంతో ఈ ఆర్థిక సంవత్సరంలో ఉత్పత్తిలో 5.5 శాతం వృద్ధి సాధించగలదని అంచనా వేస్తున్నాం. బొగ్గు దిగుమతులను నియంత్రించడానికి దేశీయంగా ఉత్పత్తిపై ప్రభుత్వం దృష్టి పెడుతోంది. దిగుమతి బొగ్గు ధరల కన్నా ఈ కంపెనీ ధరలను తక్కువగా నిర్ణయిస్తే, కోల్ ఇండియాకే ప్రయోజనం. అయితే సమీప భవిష్యత్తులో బొగ్గు ధరలను పెంచకుంటే కంపెనీ లాభదాయకతపై ప్రతికూల ప్రభావం పడుతుంది. డివిడెండ్ ఈల్డ్ 6–7 శాతం శ్రేణిలో ఉండటం సానుకూల అంశం. నగదు నిల్వలు వేగంగా తరిగిపోతున్నాయి. అమ్మకాల వృద్ధి అంచనాల కంటే తక్కువగా ఉండే అవకాశాలు, వ్యయాలు పెరగడం... ప్రతికూలాంశాలు.



గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే.

ఏటీఎంలు పనిచేసేలా చూడండి..

- నగదు కొరత సమస్య లేకుండా చేయండి
- ఆర్‌బీఐ, బ్యాంకులకు పార్లమెంటరీ కమిటీ సూచన



న్యూఢిల్లీ: ఏదో ఒక కారణంతో ఎప్పుడు చూసినా మూతబడి ఉండే ఏటీఎంలను సరిచేసి .. వినియోగంలోకి తేవాలని, నగదు కొరత సమస్య తలెత్తకుండా చూడాలని రిజర్వ్ బ్యాంక్‌కు పార్లమెంటరీ కమిటీ సూచించింది. అలాగే బ్యాంకులకు కూడా తగు స్థాయిలో ఏటీఎంలను ఏర్పాటు చేయాలంటూ పేర్కొంది. ఆర్థిక అంశాలపై కాంగ్రెస్ ఎంపీ ఎం వీరప్ప మొయిలీ సారథ్యంలో ఏర్పాటైన స్థాయీ సంఘం గత వారం పార్లమెంటుకు ఈ మేరకు నివేదిక సమర్పించింది. డిజిటల్ లావాదేవీలు పూర్తి స్థాయిలో ఇంకా ఊపందుకోని నేపథ్యంలో.. ఏటీఎంలు సరిగ్గా పనిచేయకపోవడం, తగు స్థాయిలో ఏటీఎంలు లేకపోవడం వంటి సమస్యలను బ్యాంకులతో కలిసి పరిష్కరించడంపై ఆర్‌బీఐ దృష్టి సారించాలని కమిటీ పేర్కొంది. ఆర్‌బీఐ గణాంకాల ప్రకారం గతేడాది సెప్టెంబర్ ఆఖరు నాటికి దేశవ్యాప్తంగా 2,21,492 ఏటీఎంలు ఉన్నాయి. వీటిల్లో 1,43,844 ప్రభుత్వ బ్యాంకులవి కాగా, ప్రైవేట్ బ్యాంకులవి 59,645. మిగతా 18,003 ఏటీఎంలు.. వైట్ లేబుల్, విదేశీ బ్యాంకులు, పేమెంట్స్ బ్యాంకులు, స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులకి చెందినవి.

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 6-1-2019

విశాఖ	458-00
చిత్తూరు	448-00
వరంగల్	449-00
చెన్నై	455-00
ముంబై	502-00
విజయవాడ	453-00
నమక్కల్	440-00
గోదావరి	453-00
5-1-2019 ఫామ్ ధర..	
హైదరాబాద్	447-00
రిటైల్ (ఒక గుడ్డుకు)	5.05
బెంగళూరు	445-00
కోల్‌కతా	492-00
ఢిల్లీ	485-00

9 శాతం రాబడినిచ్చే డెట్ ఫండ్లు ఉన్నాయా?



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

నేను ఏడాది క్రితం ఫ్రాంక్లిన్ ఇండియా స్మాలర్ కంపెనీస్ ఫండ్‌లో పెద్ద మొత్తం ఇన్వెస్ట్ చేశాను. అప్పటి నుంచి ఈ ఫండ్ పనితీరు ఏ మాత్రం బాగులేదు. నా ఇన్వెస్ట్‌మెంట్ 20 శాతం వరకూ తరిగిపోయింది. ఇప్పుడు నన్ను ఏం చేయమంటారు?

–సత్యం, విజయవాడ

సాధారణంగా చాలా మంది ఇన్వెస్టర్లు చేసే తప్పునే మీరూ చేశారు. సదరు ఫండ్ గతంలో పనితీరును చూసి ఒకేసారి పెద్ద మొత్తంలో ఇన్వెస్ట్ చేశారు. ఇలాంటి ఈక్విటీ ఇన్వెస్ట్‌మెంట్స్‌లో ఇలా ఒకేసారి ఎప్పుడూ ఇన్వెస్ట్ చేయకూడదు. అయితే ఫ్రాంక్లిన్ ఇండియా స్మాలర్ కంపెనీస్ ఫండ్ మంచి ఫండ్ అనే చెప్పవచ్చు. ఇలాంటి స్మాల్ క్యాప్ ఫండ్స్‌లో మంచి రాబడులు పొందాలంటే కనీసం ఐదు నుంచి ఏడేళ్ల పాటు ఎదురు చూడాల్సి ఉంటుంది. అప్పుడు గానీ ఒక పూర్తి మార్కెట్ సైకిల్ కాలం పూర్తి కాదు. మీరు మరింతగా పొదుపు చేయగలిగితే ఈ ఫండ్‌లో సిస్టమేటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) విధానంలో మరికొన్నాళ్లు ఇన్వెస్ట్ చేయండి. ఇలాచేస్తే మీకు యావరేజింగ్ ప్రయోజనాలు లభిస్తాయి.

నేను డెట్ మ్యూచువల్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేయాలనుకుంటున్నాను. ఏడాదికి 9 శాతం రాబడినిచ్చే డెట్ మ్యూచువల్ ఫండ్స్ ఉన్నాయా ? ఉంటే వాటి వివరాలు తెలపండి.

–కార్తీక్, విశాఖపట్టణం

ఏడాదికి 9 శాతం రాబడినిచ్చే కొన్ని ఓపెన్ ఎండెడ్ డెట్ మ్యూచువల్ ఫండ్స్ ఉన్నాయి. అయితే ఫిక్స్‌డ్ డిపాజిట్లలా మ్యూచువల్ ఫండ్స్ ఇంత రాబడినిస్తాయని గ్యారంటీగా చెప్పలేం. గత ఏడాది కొన్ని అల్ట్రా–షార్ట్ బాండ్ ఫండ్స్ 9 శాతం రాబడినిచ్చాయి. ఈ ఫండ్స్ ఐదేళ్ల సగటు రాబడి కూడా 9 శాతంగా ఉంది. అయితే భవిష్యత్తులో ఇవి ఈ రేంజ్ రాబడులను ఇస్తాయా అనే విషయంలో ఎలాంటి గ్యారంటీ ఉండదు. మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా ఏడాదికి 9 శాతం రాబడిని పొందాలనుకుంటే మీరు ఫిక్స్‌డ్ మెచ్యూరిటీ ప్లాన్లను (ఎఫ్‌ఎమ్‌పీ) పరిశీలించవచ్చు. ఇవి ఓపెన్ ఎండెడ్ ఫండ్స్ కావు. కానీ వీటికి లాక్ ఇన్ పీరియడ్ ఉంటుంది. మీరు ఏదైనా ఒక ఎఫ్‌ఎమ్‌పీలో గానీ, కార్పొరేట్ బాండ్ ఫండ్‌లో గానీ ఇన్వెస్ట్ చేశారనుకుందాం. మూడేళ్ల తర్వాత ఏడాదికి 9 శాతానికి మించే రాబడి వస్తుంది. మీకు 8.50 శాతం గానీ, 8.75 శాతం గానీ రాబడి వచ్చినా, అవి మంచి రాబడులే అని చెప్పవచ్చు. మీరు ఏ బ్యాంక్‌లో ఇన్వెస్ట్ చేసినా మీకు గరిష్టంగా ఏడాదికి 8 శాతానికి మించి రాబడులు రావు. పైగా ఈ వడ్డీ ఆదాయంపై పన్ను చెల్లించాల్సి ఉంటుంది. మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసినా పన్ను చెల్లించాల్సి ఉంటుంది. కానీ ఆ పన్ను భారం తక్కువగా ఉంటుంది. మ్యూచువల్ ఫండ్స్‌పై వచ్చే రాబడులను మూలధన లాభాలుగా పరిగణిస్తారు. పైగా మూడేళ్ల తర్వాత వచ్చే రాబడులపై ఇండెక్సేషన్ ప్రయోజనాన్ని కూడా పరిగణనలోకి తీసుకొని పన్ను లెక్కిస్తారు. కాబట్టి పన్ను భారం తక్కువగా ఉంటుందని చెప్పవచ్చు. 9 శాతానికి అర శాతం అటూ ఇటూగా రాబడి వస్తే పరవాలేదు అనుకుంటే మీరు కార్పొరేట్ బాండ్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేయవచ్చు. కార్పొరేట్ బాండ్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేయాలనుకుంటే రెండు ముఖ్యమైన విషయాలను పరిగణనలోకి తీసుకోవాలి. మొదటిది.. ఈ బాండ్ ఫండ్.. మంచి రేటింగ్ ఉన్న బాండ్స్‌లో ఇన్వెస్ట్ చేసిందీ లేనిదీ చెక్ చేసుకోవాలి. ఇక రెండోది. గత ఐదు నుంచి ఏడేళ్ల ట్రాక్ రికార్డ్‌ను పరిశీలించడం. ఈ ట్రాక్ రికార్డ్ సంతృప్తికరంగా ఉన్న ఫండ్‌నే ఎంచుకోండి.

నేను కొన్నాళ్లుగా ఒక మ్యూచువల్ ఫండ్‌లో నెలకు రూ.3,000 చొప్పున సిస్టమేటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) విధానంలో ఇన్వెస్ట్ చేస్తున్నాను. అయితే ఈ ఫండ్ పనితీరు నేను ఆశించిన స్థాయిలో లేదు. సిప్‌లను ఆపేద్దామనుకుంటున్నాను. తగిన సలహా ఇవ్వండి.

–సుగుణ, హైదరాబాద్

మీరు ఎన్నాళ్ల నుంచి ఇన్వెస్ట్ చేస్తున్నదీ వెల్లడించలేదు. ఒక ఫండ్ పనితీరును అంచనా వేయడానికి కనీసం రెండున్నరేళ్ల సమయాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. ఈ రెండున్నరేళ్ల కాలంలో మీరు ఇన్వెస్ట్ చేస్తున్న ఫండ్ పనితీరు సంతృప్తికరంగా లేకపోతే సిప్‌లు ఆపేయవచ్చు. ఇక సిప్‌లు ఆపేయాలా? కొనసాగించాలా అనే విషయమై నిర్ణయం తీసుకోవడానికి రెండు ముఖ్యమైన విషయాలను పరిగణనలోకి తీసుకోవాలి. మొదటిది స్టాక్ మార్కెట్ స్థితిగతులు ఎలా ఉన్నాయనేది. మార్కెట్ పతన బాటలో ఉండి మీ ఫండ్ మంచి పనితీరు కనబరచలేదనుకోండి. మీరు ఎలాంటి ఆందోళన పడక్కర్లేదు. నిరభ్యంతరంగా మీ సిప్‌లను కొనసాగించండి. అలా కాకుండా మార్కెట్ బాగున్నా మీ ఫండ్ పనితీరు బాగా లేదనుకోండి. అప్పుడు సిప్‌లను ఆపేయవచ్చు. ఇక రెండో అంశం ఇతర మ్యూచువల్ ఫండ్స్‌తో పోల్చి చూడడం.. ఇదే కేటగిరీ ఇతర ఫండ్స్‌తో పోల్చితే మీరు ఇన్వెస్ట్ చేస్తున్న ఫండ్ పనితీరు మెరుగ్గా ఉంటే మంచిదే. అలా కాకుండా అధ్వానంగా ఉంటే, ఈ ఫండ్ నుంచి వైదొలగవచ్చు.

కీలక అవరోధశ్రేణి 36,285-36,560

మార్కెట్ పంచాంగం

ప్రపంచ ఈక్విటీ మార్కెట్లకు ఉత్సాహాన్నిచ్చే ప్రకటన గత శుక్రవారం వెలువడింది. ఆర్థిక ఉద్దీపన ఉపసంహరణ, వడ్డీ రేట్ల పెంపు అంశాల్లో మార్కెట్ల భయాందోళనలను పరిగణనలోకి తీసుకుంటామని, తమ పాలసీ ఫైనాన్షియల్ మార్కెట్లకు ఇబ్బందిగా పరిణమిస్తున్నదని భావిస్తే పాలసీని సమీక్షిస్తామంటూ అమెరికా కేంద్ర బ్యాంక్ ఫెడరల్ రిజర్వ్ చైర్మన్ జెరోమ్ పావెల్ చేసిన ప్రకటనతో అమెరికా, యూరప్ మార్కెట్లు పెద్ద ర్యాలీ జరిపాయి. ఈ బాటలోనే ఆసియా ఇండెక్స్ ఫ్యూచర్లు భారీగా పెరిగాయి. సంవత్సరాంతపు సెలవుల తర్వాత సాధారణంగా జనవరి రెండోవారం నుంచి మన మార్కెట్లో చురుగ్గా కార్యకలాపాలు నిర్వహించే విదేశీ ఇన్వెస్టర్లు, ఫెడ్ తాజా ప్రకటనతో భారత్ మార్కెట్‌లో పెట్టుబడుల్ని పునర్‌ప్రారంభిస్తారా, అమ్మకాలకు తెరతీస్తారా అనే అంశం సమీప భవిష్యత్తులో మన మార్కెట్ ట్రెండ్‌ను నిర్దేశించగలదు. ఇక సూచీల సాంకేతిక అంశాల విషయానికొస్తే...

సెన్సెక్స్ సాంకేతికాలు...



జనవరి 4తో ముగిసిన నాలుగురోజుల ట్రేడింగ్ వారం ప్రథమార్థంలో 36,285 పాయింట్ల గరిష్టస్థాయివరకూ పెరిగిన బీఎస్‌ఈ సెన్సెక్స్ ద్వితీయార్థంలో వేగంగా 35,382 పాయింట్ల కనిష్టస్థాయికి పడిపోయింది. చివరకు అంతక్రితంవారంతో పోలిస్తే 382 పాయింట్ల నష్టంతో 35,695 పాయింట్ల వద్ద ముగిసింది. గత శుక్రవారం అమెరికా మార్కెట్ భారీ ర్యాలీ ఫలితంగా ఈ వారం గ్యాప్‌అప్‌తో మార్కెట్ మొదలైతే సెన్సెక్స్‌కు 36,235 పాయింట్ల వద్ద తక్షణఅవరోధం కలగవచ్చు. ఈ స్థాయిపైన ముగిస్తే 36,285–36,560 పాయింట్ల నిరోధశ్రేణిని అధిగమించడం సెన్సెక్స్ భవిష్యత్ ట్రెండ్‌కు కీలకం. ఈ స్థాయిపైన ముగిస్తే క్రమేపీ 36,800–37,050 పాయింట్ల శ్రేణిని అందుకోవొచ్చు. ఈ వారం పైన ప్రస్తావించిన కీలక నిరోధశ్రేణిని దాటలేకపోయినా, సోమవారం మార్కెట్ నిస్తేజంగా ప్రారంభమైనా 35,380 పాయింట్ల వద్ద సెన్సెక్స్‌కు తొలి మద్దతు లభిస్తున్నది. ఈ లోపున ముగిస్తే తిరిగి 35000 పాయింట్ల స్థాయిని పరీక్షించవచ్చు. ఈ స్థాయిని సైతం కోల్పోతే క్రమేపీ 34,400 పాయింట్ల వరకూ పతనం కొనసాగవచ్చు.

నిఫ్టీ కీలక నిరోధశ్రేణి 10925-10,985



గతవారం 10,924 పాయింట్ల గరిష్టస్థాయి నుంచి 10,629 పాయింట్ల కనిష్టస్థాయికి తగ్గిన ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ చివరకు అంతక్రితంవారంతో పోలిస్తే 133 పాయింట్ల నష్టంతో 10,727 వద్ద ముగిసింది. ఈ వారం నిఫ్టీ గ్యాప్‌అప్‌తో మొదలైతే 10,895 పాయింట్ల వద్ద తక్షణ అవరోధం కలగవచ్చు. అటుపైన కీలక నిరోధ శ్రేణి 10925–10,985 పాయింట్లు. గత మూడువారాలుగా పలుదఫాలు ఈ శ్రేణి అవరోధాన్ని కల్గించినందున, ఈ శ్రేణిని దాటితేనే తదుపరి అప్‌ట్రెండ్ సాధ్యపడుతుంది. ఈ స్థాయిపైన స్థిరపడితే క్రమేపీ 11,035–11,150 శ్రేణి వరకూ ర్యాలీ కొనసాగవచ్చు. ఈ వారం పైన సూచించిన కీలక నిరోధశ్రేణిని దాటలేకపోయినా, ఈ సోమవారం నిఫ్టీ బలహీనంగా ప్రారంభమైనా 10,630 వద్ద తక్షణ మద్దతు లభిస్తున్నది. ఈ మద్దతు దిగువన ముగిస్తే 10,535 స్థాయిని తిరిగి పరీక్షించవచ్చు. అటుపై కొద్దిరోజుల్లో 10,330 పాయింట్ల వరకూ క్షీణత కొనసాగే ప్రమాదం ఉంటుంది.

– పి. సత్యప్రసాద్



ప్రజాకంటక పాలనకు

ఇక ఫుల్‌స్టాప్



ప్రకాశం జిల్లా పుల్లలచెరువు మండలం ఐటీవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలపు సురేష్, పార్టీ కార్యకర్తలు

- రాష్ట్ర వ్యాప్తంగా పలు నియోజకవర్గాల్లో 'నిన్ను నమ్మం బాబు' కార్యక్రమం
- పెద్ద ఎత్తున పాల్గొన్న ప్రజలు, పార్టీ శ్రేణులు
- నేతల ఆధ్వర్యంలో పాదయాత్ర, బైక్ ర్యాలీలు
- చంద్రబాబు అవినీతి పాలనపై కరపత్రాలు పంపిణీ

సాక్షి, నెట్‌వర్క్: వచ్చే ఎన్నికలతో చంద్రబాబు ప్రజాకంటక పాలనకు ఫుల్‌స్టాప్ పడుతుందని వైఎస్సార్‌సీపీ నేతలు పేర్కొన్నారు. ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా 'నిన్ను నమ్మం బాబు' కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ సర్కార్ పని తీరుకు వ్యతిరేకంగా ర్యాలీలు చేశారు. అర్హులకు పింఛన్లు ఇవ్వలేని సర్కార్‌కు ప్రజలు త్వరలో గుణపాఠం చెబుతారన్నారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచిపెట్టారు. కృష్ణా జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు చేపట్టిన 'నిన్ను నమ్మం బాబు' కార్యక్రమానికి విశేష స్పందన వచ్చింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో పాటు ప్రజలు కూడా స్వచ్ఛందంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లాలో గుడివాడ, తిరువూరు, విజయవాడ తూర్పు, సెంట్రల్, పశ్చిమ నియోజకవర్గాలు, కైకలూరులో కార్యక్రమంలో జరిగింది. తిరువూరులో ఎమ్మెల్యే రక్షణనిధి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ప్రకాశం జిల్లాలో నిన్ను నమ్మం బాబు కార్యక్రమం ఐదు నియోజకవర్గాల్లో నిర్వహించారు. మార్కాపురం నియోజకవర్గం కొనకనమిట్ల మండలం ఎదుర్రాళ్లపాడులో ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి పాల్గొన్నారు. యర్రగొండపాలెం నియోజకవర్గం ఐటీవరంలో ఎమ్మెల్యే ఆదిమూలపు సురేష్ నిర్వహించారు. కొండపి నియోజకవర్గం చాటువారిపాలెం, కనిగిరి మండలం బల్లిపల్లిలో పార్టీ నేతలు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో పలు నియోజకవర్గాల్లో నిన్ను నమ్మం బాబూ కార్యక్రమాలు జరిగాయి. తాడేపల్లిగూడెం నియోజకవర్గంలోని పెంటపాడు మండలం, బుట్టాయగూడెం, ద్వారకాతిరుమల, పాలకోడేరు మండలం విస్సాకోడేరు, జంగారెడ్డిగూడెం, అత్తిలి మండలం కె.సముద్రగట్టులో, మొగల్తూరు మండలం కేపీపాలెం నార్త్ పంచాయతీలో, పాలకొల్లు మండలం కాపవరంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తాళ్లపూడి, పోచవరం వరకూ ర్యాలీ నిర్వహించారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం నగరం, కాకినాడ సిటీ, కాకినాడ రూరల్ నియోజకవర్గాలతోపాటు పిఠాపురం, గొల్లప్రోలు, రామచంద్రపురం, రాజోలు మండలాలు, అనపర్తి నియోజకవర్గం జి.మామిడాడల్లో 'నిన్ను నమ్మం బాబూ' ర్యాలీలు నిర్వహించారు. మోసపూరిత హామీలిచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనను అంతం చేయడానికి ప్రజలంతా సిద్ధం కావాలని తిరుపతి మాజీ ఎంపీ వెలగపల్లి వరప్రసాద్‌రావు పిలుపునిచ్చారు. నెల్లూరు జిల్లాలోని గూడూరు నియోజకవర్గంలో జరిగిన నిన్ను నమ్మం బాబు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉదయగిరి నియోజకవర్గంలో పార్టీ నేతలు ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు.

టీడీపీవి హత్యా రాజకీయాలు

రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వచ్చేందుకు హత్యా రాజకీయాలకు తెరతీసిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు బొత్స సత్యనారాయణ ఆరోపించారు. ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర ఈ నెల 9న ఇచ్ఛాపురంలో ముగియనున్న నేపథ్యంలో చీపురుపల్లి మండలంలోని పెదనడిపల్లి, పీకే పాలవలస, పత్తికాయవలస, కర్లాం గ్రామాల్లో సంఘీభావ పాదయాత్రతో పాటు 'నిన్ను నమ్మం బాబు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు నేతలు పాల్గొన్నారు. సాలూరు నియోజకవర్గం గురువునాయుడుపేట గ్రామంలో ఎమ్మెల్యే పీడిక రాజన్నదొర ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. బొబ్బిలి మున్సిపాలిటీ పరిధిలోని ఐటీఐ కాలనీ, ప్రేమ్‌నగర్ కాలనీల్లో, పార్వతీపురం మండలం తాళ్లబురిడి గ్రామంలో, గజపతినగరం నియోజకవర్గంలో పార్టీ నేతలు నిన్ను నమ్మం బాబూ కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీకాకుళం జిల్లాలో మూడు నియోజకవర్గాల్లో కార్యక్రమం జరిగింది సంతకవిటి మండలం చిన్నయ్యపేటలో రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం..

ఆచరణ సాధ్యం కాని హామీలిచ్చిన టీడీపీ అధినేత చంద్రబాబుకు వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని వైఎస్సార్‌సీపీ నేతలు పిలుపునిచ్చారు. పత్తికొండ నియోజకవర్గ సమన్వయకర్త కంగాటి శ్రీదేవి.. ప్రజా సంకల్ప యాత్రకు సంఘీభావంగా కర్నూలు జిల్లా తుగ్గలి మండలం రాంపల్లి నుంచి పత్తికొండ మండలం చందోలి వరకు పాదయాత్ర నిర్వహించారు. బ్రాహ్మణపల్లె, ఓర్వకల్లు గ్రామాల్లో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి 'నిన్ను నమ్మం బాబు' కార్యక్రమం నిర్వహించారు. చిత్తూరు జిల్లాలో ఆదివారం మూడు నియోజకవర్గాల్లో నిన్ను నమ్మం బాబు కార్యక్రమం నిర్వహించారు. చంద్రగిరి నియోజకవర్గం దుర్గసముద్రం, గుడిపాల మండలం బండ్లపల్లెలో పార్టీ నేతలు నిన్ను నమ్మం బాబు కార్యక్రమం నిర్వహించారు. సత్యవేడు నియోజకవర్గం వరదయ్యపాళెం మండలంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ నేతలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

కాపునాడుతో సంబంధం లేదు

కాపునాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శినని చెప్పుకుంటూ అవినీతికి పాల్పడుతున్న బేతు రామ్మోహన్‌ను సంఘం నుంచి తొలగించినట్లు కాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు పిళ్లా వెంకటేశ్వరరావు తెలిపారు. విజయవాడలో ఆదివారం జరిగిన కాపునాడు సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇకపై కాపునాడు పేరిటగానీ, పిళ్లా వెంకటేశ్వరరావు పేరిట గానీ రామ్మోహన్ ఎలాంటి కార్యకలాపాలు నిర్వహించినా కాపునాడుకు సంబంధం లేదని స్పష్టం చేశారు.





నిబద్ధతతో సాహిత్య రచన చేయాలి

కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత ఓల్గా



విజయవాడ కల్చరల్: నిబద్ధతతో కూడిన సాహిత్య రచనలు చేయాలని ప్రముఖ స్త్రీవాద రచయిత్రి, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత ఓల్గా మహిళలకు సూచించారు. ఆంధ్రప్రదేశ్ రచయిత్రుల ప్రథమ మహాసభలను ఆదివారం ఆమె ప్రారంభించారు. సిద్ధార్థ కళాశాలలోని యద్దనపూడి సులోచనారాణి సభా ప్రాంగణంలోని తెన్నేటి హేమలత సాహిత్య వేదికపై జరుగనున్న ఈ కార్యక్రమాన్ని కృష్ణాజిల్లా రచయితల సంఘం రెండు రోజులపాటు నిర్వహించనుంది. ఓల్గా మాట్లాడుతూ దశాబ్దకాలంగా సాహిత్యంలో విప్లవాత్మకమైన మార్పులు సంభవిస్తున్నాయన్నారు. స్త్రీలు పురుషాధిక్యతను ఎదుర్కొంటూ తమ వాదనను బలంగా వినిపిస్తున్నారని తెలిపారు.

మహిళలకూ అవకాశమివ్వాలి..

కేంద్ర సాహిత్య అకాడమీ ప్రారంభమైన నాటినుంచి అకాడమీకి అధ్యక్షులుగా పురుషులే ఉంటున్నారని, ఎన్నిక లేకుండా స్త్రీలను కేంద్ర సాహిత్య అకాడమీ అధ్యక్షులుగా నియమించాలని కోరారు. నవ్యాంధ్రప్రదేశ్‌లో తొలిసారి రచయిత్రుల మహాసభలను నిర్వహించడం అభినందనీయమన్నారు. కేంద్రీయ హిందీ సమితి అధ్యక్షుడు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ మహిళలు ప్రశ్నించడం అలవాటు చేసుకోవాలన్నారు. ప్రభుత్వం మాతృభాష వినియోగంలో వివక్ష చూపుతోందన్నారు. ఏపీ సృజనాత్మక సమితి సీఈవో డాక్టర్ దీర్ఘాసి విజయభాస్కర్ మాట్లాడుతూ మహిళలు రచించిన పుస్తకాలను భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ప్రచురిస్తామని తెలిపారు. సభకు కృష్ణాజిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ జీవీ పూర్ణచంద్ అధ్యక్షత వహించారు. కృష్ణాజిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి ప్రసంగించారు. జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు సభను నిర్వహించారు.

గిరిజనులను మోసం చేసే పార్టీలకు బుద్ధి చెప్పాలి: జీపీఎస్

కొరిటెపాడు (గుంటూరు): గిరిజనులను రాజకీయంగా మోసం చేసే పార్టీలకు ఓటుతో తగిన బుద్ధి చెప్పాలని గిరిజన ప్రజా సమాఖ్య (జీపీఎస్) జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు వడిత్యా శంకర్‌నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. గిరిజనుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం గిరిజనులను పూర్తిగా విస్మరించిందని మండిపడ్డారు. ప్రతి ఏడాది రాష్ట్ర వార్షిక బడ్జెట్‌లో కేటాయిస్తున్న వేల కోట్ల రూపాయల నిధులను గిరిజన తండాలు, గూడేలలో అభివృద్ధికి ఖర్చు పెట్టకుండా ప్రభుత్వ హంగు, ఆర్భాటాల కోసం దుర్వినియోగం చేయడం దుర్మార్గమన్నారు. తమను అన్ని విధాలుగా మోసం చేసిన చంద్రబాబుకు వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పడానికి గిరిజనులంతా సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.

కానిస్టేబుల్ పరీక్షకు 3,46,284 మంది హాజరు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కానిస్టేబుల్ పోస్టులకు ఆదివారం నిర్వహించిన రాత పరీక్షకు 3,46,284 మంది (88.16 శాతం) అభ్యర్థులు హాజరయ్యారు. మొత్తం 3,92,785 మందికి హాల్‌టిక్కెట్లు జారీ చేయగా, వారిలో 46,501 మంది గైర్హాజరయ్యారు. సివిల్, ఏఆర్, ఏపీఎస్‌పీ, జైలు వార్డెన్స్ పోస్టులకు రాష్ట్రంలోని 28 ప్రాంతాల్లో 704 కేంద్రాల్లో ఈ పరీక్ష నిర్వహించారు. పలుచోట్ల పరీక్షా కేంద్రాలు తెలియక అవస్థలు పడిన అభ్యర్థులను ఆయా ప్రాంతాల్లోని పోలీసులే తమ వాహనాల్లో తీసుకెళ్లడం విశేషం. పరీక్షా కేంద్రాల వద్ద 3,045 బయోమెట్రిక్ (ఫింగర్ ప్రింట్ స్కానర్లు) మిషన్లు ఏర్పాటు చేశారు. 704 మంది సాంకేతిక నిపుణులు, 118 బయోమెట్రిక్ ఇన్‌చార్జిలు, 28 మంది నోడల్ అధికారులు, 140 మంది ఇన్‌చార్జిలు విధులు నిర్వహించారు. ఈ పరీక్షలకు సంబంధించిన ఏ, బీ, సీ, డీ జవాబు పత్రాలను ('కీ'లను) ఈ నెల 8న slprb. ap. gov. in వెబ్‌సైట్‌లో డౌన్లోడు చేసుకోవచ్చని ఏపీ స్టేట్ లెవెల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్ కుమార్ విశ్వజిత్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యంతరాలను ఈ నెల 10వ తేదీ రాత్రి 8 గంటలలోపు వెబ్‌సైట్‌లో తెలపాలన్నారు.

మూత దిశగా రేడియో శిక్షణా కేంద్రాలు

సాక్షి, అమరావతి: హైదరాబాద్, తిరువనంతపురం, షిల్లాంగ్, అహ్మదాబాద్, లక్నోలోని ఆకాశవాణి ప్రాంతీయ శిక్షణ కేంద్రాలను.. ఖర్చులు సాకుగా చూపి మూసివేయాలని ప్రసారభారతి నిర్ణయం తీసుకోవడాన్ని ఆకాశవాణి ప్రోగ్రాం కోఆర్డినేటర్ల సంఘం తీవ్రంగా ఆక్షేపించింది. ప్రాంతీయ శిక్షణా కేంద్రాలు లేకుంటే రేడియో కేంద్రాల పనితీరు, కార్యక్రమాల రూపకల్పన, ఎలా పని చేయాలో వంటి విషయాలను ఉద్యోగులకు ఎవరు తెలియజేస్తారని ప్రశ్నించారు. ఈ వ్యవహారాల్లో శిక్షణ కేంద్రాలు చాలా కీలకమని సంఘం జాతీయ నాయకుడు వి.గోపీచంద్ అన్నారు. విలువలతో పనిచేస్తూ ఉత్తమ కార్యక్రమాలను అందిస్తోన్న ఆకాశవాణిని లాభనష్టాలతో బేరీజు వేయడాన్ని తప్పుబట్టారు. ఆకాశవాణికి వెలకట్టడం తగదన్నారు. ఖర్చును సాకుగా చూపి మూసేయాల్సి వస్తే త్వరలో రేడియో స్టేషన్లు కూడా మూసివేస్తారా? అని ప్రశ్నించారు.

175 నియోజకవర్గాల్లో జనసేన పోటీ: పవన్

సాక్షి, అమరావతి: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో జనసేన పార్టీ 175 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేస్తుందని ఆ పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ అన్నారు. జిల్లాల వారీ సమీక్షా సమావేశాల్లో భాగంగా ఆదివారం విజయవాడలోని జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయంలో విజయనగరం, అనంతపురం జిల్లాల కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన తరపున మాట్లాడేప్పుడు పార్టీ నియమావళికి అనుగుణంగా ఒక ఫ్రేమ్ వర్క్‌లో మాత్రమే మాట్లాడాలని సూచించారు. స్థానిక సంస్థల బలోపేతానికి చొరవ తీసుకోవాలంటూ లోకల్ గవర్నమెంట్స్ ఛాంబర్ సభ్యులు ఆదివారం పవన్‌ను కలిశారు. 73వ రాజ్యాంగ సవరణని అమలుపరిచే అంశాన్ని అన్ని పార్టీలు మేనిఫెస్టోలో చేర్చాలన్న డిమాండ్‌తో ఏర్పాటు చేయనున్న సదస్సుకి పవన్‌కళ్యాణ్‌ను ఆహ్వానించారు.



కొత్త ఆవిష్కరణలకు ఎస్‌ఆర్‌ఎం వేదిక కావాలి: సతీష్‌రెడ్డి

సాక్షి, అమరావతి బ్యూరో: దేశం కోసం విస్తృత పరిశోధనలు అవసరమని, కొత్త ఆవిష్కరణలకు ఎస్‌ఆర్‌ఎం విశ్వవిద్యాలయం వేదిక కావాలని డిఫెన్స్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజషన్ (డీఆర్‌డీవో) చైర్మన్ డాక్టర్ జి.సతీష్‌రెడ్డి ఆకాంక్షించారు. భావితరాల ఉజ్వల భవిష్యత్‌కు దోహదపడే నూతన పరిశోధనల వైపు శాస్త్రవేత్తలు, ప్రొఫెసర్లు దృష్టి పెట్టాలని సూచించారు. అమరావతిలోని ఎస్‌ఆర్‌ఎం వర్సిటీని ఆదివారం ఆయన సందర్శించి ప్రొఫెసర్లతో సమావేశమయ్యారు. సతీష్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశ, విదేశాల్లో శాస్త్ర, సాంకేతిక రంగం వేగంగా అభివృద్ధి చెందుతుందని, భారత్‌లో ఈ మార్పు స్పష్టంగా కనిపిస్తోందని చెప్పారు.

ఎస్సీ,ఎస్టీ ఉద్యోగులకు సమానత్వం సాధించేందుకు కృషి

సూర్యారావుపేట (విజయవాడ సెంట్రల్): రాజ్యాంగ పరంగా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు కల్పించిన అన్ని సౌకర్యాలను అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్ని విభాగాల్లో సమానత్వం సాధించేందుకు కృషి జరుగుతుందని ఏపీ సర్కిల్ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ కె.బాలసుబ్రమణియన్ అన్నారు. విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఆల్ ఇండియా పీ అండ్ టీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఫస్ట్ సర్కిల్ కాన్ఫరెన్స్ జరిగింది. ఇందులో పాల్గొన్న బాలసుబ్రమణియన్ అణగారిన వార్గాల కోసం పోరాటాలు చేసిన వివిధ నాయకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director, on behalf of Jagati Publications Limited, Published at Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP), and D. No. 5- 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503. Editor: V. Murali, Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23794.